
# మన మంగళగిరి



రచన: మాదిరాజు గోవర్ధనరావు

# మన మంగళగిరి

రచయిత :

**మాదిరాజు గోవర్ధనరావు**

**పట్టణ వికాస మండలి, మంగళగిరి**

# **మన మంగళగిరి**

రచయిత :

**మాదిరాజు గోవర్ధనరావు**

ప్రచురణకర్తలు :

**పట్టణ వికాస మండలి,** మంగళగిరి

మొదటి ముద్రణ : **విజయదశమి, 2004**

కాపీలు : 1,000

ప్రచురణహక్కులు **అందరివి**

వెల : రూ. 100-00

ప్రతులకు :

**పట్టణ వికాస మండలి,** మంగళగిరి
1-1404, పెదకోనేటి వీధి
మంగళగిరి - 522 503 (ఆం॥ ప్ర॥)
ఫోన్స్ : 9440263131 / 9440264336

**ప్రింటింగ్ :** భావన ఆఫ్‌సెట్ ప్రింటర్స్, విజయవాడ.

**లే అవుట్ & కవర్ పేజి :** శ్రీ గాయత్రిదేవి గ్రాఫిక్స్, విజయవాడ.
**డిజిటల్ స్టూడియో :** లక్ష్మి స్టూడియో, మంగళగిరి



రచయిత గోవర్ధన్ గారికి

## అభినందనలు

**మల్లాది విష్ణు**
**ఛైర్మన్, వి.జి.టి.యం. ఉడా**
**విజయవాడ.**



**SIVA PRASAD ATTALURI**
Research Scientist
State University of New York
Stony Brook
NEW YORK, **USA**

---

గోవర్ధన్ గారికి,

మీరు విశేషంగా శ్రమించి మంగళగిరి చరిత్రకు

పుస్తక రూపమిచ్చిన సందర్భంగా

నా హృదయపూర్వక శుభాకాంక్షలు.

జన్మతః మంగళగిరికి చెందిన వారంతా

పట్టణాభివృద్ధికి చేయూతనిస్తే బాగుంటుందనే

మీ ఆకాంక్ష నెరవేరాలని ఆశిస్తున్నాను.

**శివప్రసాద్ అత్తలూరి**
460, Old Town Road,
Apartment 5-J,
Port Jafferson Station
NY 11776, U.S.A.



రచయిత గోవర్ధన్ గారికి

# అభినందనలు

**కాంద్రు కమల**
**మునిసిపల్ ఛైర్‌పర్సన్,**
**మంగళగిరి.**

## కృతజ్ఞతలు

ఈ పుస్తకం వ్రాయమని సలహా యిచ్చిన మిత్రులు పడవల బాలాజీరావు,
శిందె లక్ష్మోజిరావులకు, సూచనలిచ్చిన గాలి ఉదయకుమార్‌కు

మనస్పూర్తిగా ప్రోత్సహించిన నా భార్య అత్తలూరి సావిత్రికి

సహాయసహకారాలు అందించిన మంగళగిరి పురపాలక సంఘం వారికి
మరియు విజిటియం ఉడా వారికి

ఎడిటింగ్ చేయడంలో ఓర్పుగా, నేర్పుగా సహకరించిన ఆకురాతి శేషాచలంకు

కంప్యూటర్స్ అందుబాటులో వుంచిన మూర్తి టైపు ఇన్‌స్టిట్యూట్ మరియు
వంశీ కంప్యూటర్స్ అధినేతలు మూర్తి , లలిత గార్లకు

డిజిటల్ స్టూడియో సహకారాన్ని అందించిన లక్ష్మీ స్టూడియో
సుబ్బారావు గారి కుమారుడు విజయకుమార్‌కు

ముఖచిత్రం డిజైన్ చేసి, లేఅవుట్ చేసిన శ్రీ మొవ్వ మల్లిఖార్జునరావు, విజయవాడ
వారికి

ఈ పుస్తక రచనకు అవసరమైన సమాచారాన్ని అందించిన వారందరికి

ప్రచురణ బాధ్యత చేపట్టిన మంగళగిరి పట్టణ వికాస మండలి వారికి

మిత్రులకు, శ్రేయోభిలాషులకు

## అంకితం

మంగళగిరి అభివృద్ధిలో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను
పాలు పంచుకుని కర్తవ్య పరాయణతను
చాటుకున్న వారందరికీ

వినమ్రతతో....

**మాదిరాజు గోవర్ధనరావు**
నవరాత్రులు, 2004

# నా మాట

నాకు మంగళగిరిలోని వివిధ రంగాలతో వున్న అనుబంధాన్ని పురస్కరించుకుని యీ రచన చేశాను. నేనీ రచన చేసేందుకు నాకున్న అర్హత - మంగళగిరి గడ్డపై పుట్టి, గత ఏభయేళ్ళుగా యీ ఊరి గాలిని పీల్చడమే. మూడేళ్ళపాటు శ్రమించి ఎందరో వ్యక్తుల జ్ఞాపకాలను, ఎన్నో గ్రంధాల సారాన్ని క్రోడీకరించాను.

మంగళగిరి విభిన్న దశలలో రూపాంతరం చెందుతూ వచ్చి, ప్రస్తుత రూపాన్ని సంతరించుకుంది. ఈ పరిణామ క్రమం వెనుక ఎందరో వ్యక్తుల, సంస్థల కృషి దాగొని వుంది. వారందరి కృషి ఫలాలను యిక్కడ అనుభవిస్తున్న వారిలో నేనొకడిని. వారి సేవలను కీర్తిస్తూ యీ పుస్తకాన్ని రూపొందించాను. స్థలాభావం వల్ల అందరిని యిందుదహరించలేక పోయిన నా నిస్సహాయతకు క్షమార్హుడిని. భావితరాలకు కూడ యీ పుస్తకం ఉపయుక్తంగా వుండగలదని భావిస్తున్నాను. లోటుపాట్లు వుంటే మలి ముద్రణలో సరిదిద్దుకోగలనని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.


- మాదిరాజు గోవర్ధనరావు

## విషయ సూచిక


| వ.నెం. | విషయము | పేజి నెం. |
|---|---|---|
| 01. | పట్టణం | 01 |
| 02. | చరిత్ర | 02-19 |
| 03. | పుణ్యక్షేత్రం | 20-28 |
| 04. | స్వాతంత్ర్య సమరం | 29-33 |
| 05. | రాజకీయాలు | 34-50 |
| 06. | స్థానిక పాలన | 51-63 |
| 07. | ఉడా | 64-70 |
| 08. | ప్రభుత్వ పాలన | 71-76 |
| 09. | చేనేత | 77-85 |
| 10. | పరిశ్రమలు | 86-88 |
| 11. | కార్మిక రంగం | 89-91 |
| 12. | వ్యాపారం | 92-94 |
| 13. | సహకారం | 95-96 |
| 14. | న్యాయం | 97-98 |
| 15. | విద్య | 99-105 |
| 16. | వైద్యం | 106-112 |
| 17. | రవాణా | 113-117 |
| 18. | వ్యవసాయం | 118-120 |
| 19. | కృష్ణాజలాలు | 121-124 |
| 20. | యోగ | 125-126 |
| 21. | మతం | 127-134 |
| 22. | నాస్తికోద్యమం | 135-137 |
| 23. | దళితులు | 138-140 |
| 24. | పత్రికలు | 141-142 |
| 25. | సాహిత్యం | 143-148 |
| 26. | చిత్రకారులు | 149-150 |
| 27. | నాటకం | 151-153 |
| 28. | సినిమా | 154-158 |
| 29. | మాజీ సైనికులు | 159-160 |
| 30. | సామాజిక సేవ | 161-167 |
| 31. | క్రీడలు | 168-172 |

# పట్టణం

గుంటూరు జిల్లాలో మద్రాసు–కలకత్తా ఐదవ నెంబరు జాతీయ రహదారి గుంటూరు, విజయవాడ నగరాల మధ్య మంగళగిరి మున్సిపల్ పట్టణం నెలకొని వుంది. ఈ పట్టణం నుండి గుంటూరు 19 కి.మీ. విజయవాడ 12 కి.మీ. దూరంలో వున్నాయి. సముద్రమట్టానికి 30 మీటర్ల ఎత్తులోనున్న యీ పట్టణాన్ని అట్లాసుపై చూచినట్లయితే ఉత్తర అక్షాంశాన 16.44 డిగ్రీలలోను, తూర్పు రేఖాంశంపై 80.56 డిగ్రీలలోను వుంది.



మంగళగిరిని నిలువుగా విభజిస్తే ముఖ్యంగా – బైపాస్ రోడ్డు, మెయిన్‌బజారు, పాతట్రంకురోడ్డు, రైలుకట్ట అనే నాలుగు భాగాలవుతుంది. అదే అడ్డముగా విభజిస్తే – పాతమంగళగిరి, క్రొత్త మంగళగిరి, కొత్తపేట అనే మూడు భాగాలవుతుంది. తూర్పున ఆత్మకూరు, ఉత్తరాన కొండ, ఓవర్ బ్రిడ్జి, పడమర నవులూరు, బాపూజీనగరు, దక్షిణాన చినకాకాని సరిహద్దులుగా వున్నాయి.

2001 సం॥నాటికి జనాభా 63,246గా వుండి, వచ్చిపోయే వారితో కలిపి సమారు లక్ష వుంటుంది. ఈ పట్టణం 10.49 చ॥కి॥మీ॥ విస్తీర్ణం కలిగివుండి, 28 మున్సిపల్ వార్డులుగా

విభజించబడివుంది. 43,724 మంది ఓటర్లు వున్నారు.

విజయవాడ-గుంటూరు-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలోని యీ పట్టణంలోని ముఖ్య పరిశ్రమ చేనేత. తరతరాలుగా యీ పరిశ్రమ యిక్కడ వర్ధిల్లుతోంది. సుమారు 50 శాతం ప్రజలకు యిదే జీవనోపాధి. డ్రెస్ మెటీరియల్ వల్ల ప్రపంచ చేనేత పటములో మంగళగిరి చేరింది.

పుణ్యక్షేత్రం కావటం మరొక ముఖ్య అంశం. కొండపైన శ్రీ పానకాల నరసింహస్వామి, దిగువన శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవాలయాలు పురాణకాలం నుండి ప్రసిద్ధి చెందాయి. దేశం నలుమూలల నుండి భక్తులు వస్తుంటారు. ఇక్కడి దేవాలయపు 11 అంతస్తుల గాలిగోపురం దేశ-విదేశ యాత్రికులను ఆకట్టుకునే ఒక పురాతన శిల్ప కౌశలం.

మంగళగిరి పట్టణంలోని చాలా వీధులలో మగ్గాల చప్పుళ్ళు వినసొంపుగా వినిపిస్తుంటాయి. ఆ వీధుల్లో రోడ్లపైన చేనేత కార్మికుల శ్రమ కనిపిస్తుంటుంది. ఏ యింట్లో అడుగుపెట్టినా పిల్లా పెద్దా భేదం లేకుండా రాట్నం త్రిప్పుతూ కనిపిస్తారు.

చేనేత తరువాత ఎక్కువ మంది ప్రజలు బంగారు వస్తువుల తయారీ మీద ఉపాధి పొందటం 1990 దశకంలో ప్రారంభమైనది.

మంగళగిరి చుట్టుప్రక్కల పర్యాటకులను ఆకర్షించే - ఉండవల్లి గుహలు, భవానీద్వీపం, విదేశీపక్షుల కేంద్రంతోపాటు సీతానగరంలో చినజియ్యరుస్వామి ఆశ్రమం, యూనివర్శిటీ వద్ద జైన దేవాలయం-హ్రీంకారతీర్థం వున్నాయి. ❋

## జనాభా వివరాలు

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1881 | ...... | 5,617 | 1971 | ...... | 32,850 |
| 1893 | ...... | 6,426 | 1991 | ...... | 58,289 |
| 1967 | ...... | 22,182 | 1994 | ...... | 59,152 |
| 1969 | ...... | 29,000 | 2001 | ...... | 63,246 |

# చరిత్ర

మంగళగిరికి సంబంధం వుంటూ వచ్చిన పురాతన కాలగమనాన్ని వివిధ మూలాల నుండి సేకరించి ఇక్కడ పొందుపరచటం జరిగింది.

క్రీ॥పూ॥ 10 వేల సంవత్సరముల ప్రాంతాలలో 'నీగ్రిటో' జాతికి చెందిన పాతరాతియుగపు మానవుడు గుంటూరు జిల్లాలో సంచరించి, నివశించినట్లు చరిత్ర చెబుతోంది. నవీన శిలాయుగపు పనిముట్లు కూడా యీ జిల్లాలో లభించాయి.

మంగళగిరి సమీపాన గల "యిప్పటం" గ్రామంలో పాతయుగపు ఆధారాలను 1884 ప్రాంతంలో బ్రిటీషు పురావస్తు శాఖ నిపుణుడు "రాబర్టు బ్రూస్ ఫూటే" కనుగొన్నారు. క్రీస్తు పూర్వం 4వ శతాబ్ధిలో 'అమరావతి'లో ఆంధ్రులకు బలిష్టమైన కోట వున్నట్లు 'మెగస్తనీసు' తెలిపారు.

ఆంధ్ర శాతవాహన పరిపాలన (క్రీ॥పూ॥ 225 నుండి క్రీ॥శ. 225) లో 'ధాన్య కటకం' వారి రాజధానిగా వుండేది. క్రీ॥శ॥ 225 నుండి 300 సం॥వరకు ఇక్ష్వాకులు, క్రీ॥శ 300 నుండి పల్లవులు, వారి తర్వాత ఆనంద గోత్రజులు, విష్ణుకుండీనులు (క్రీ.శ.420-620) యీ ప్రాంతాల్ని పరిపాలించారు. విష్ణు కుండీనులలో ఒకరైన రెండవ మాధవవర్మ విజయవాడను రాజధానిగా చేసుకొని పాలించాడు. ఆనంద గోత్రజుల నాలుగు తరాల రాజులు మంగళగిరికి సమీపములోని 'కంతేరు' ముఖ్య పట్టణంగా పరిపాలించారు. తర్వాత క్రీ॥శ॥ 630 నుండి చాళుక్య రాజులు పరిపాలించారు.

క్రీ॥శ॥ 1180 సం॥లో జరిగిన చారిత్రాత్మక 'పల్నాటి యుద్ధం' ఫలితంగా యీ ప్రాంతం కాకతీయుల పాలనలోకి వెళ్ళింది. క్రీ॥శ॥ 1323లో కాకతీయ సామ్రాజ్యాన్ని డిల్లీ సుల్తానులు ఆక్రమించటంతో ముస్లిం రాజుల పాలనలోకి వచ్చింది. క్రీ॥శ॥ 1353లో రెడ్డి రాజులు 'కొండవీడు'ను రాజధానిగా చేసుకొని పాలించారు.

క్రీ॥శ॥ 1424లో కొండవీటి రాజ్యం పతనమయి ఒరిస్సా రాజులైన గజపతులు యీ ప్రాంతాన్ని పరిపాలించారు. క్రీ॥శ॥ 1515లో విజయనగర పాలకుడు శ్రీకృష్ణదేవరాయులు కొండవీడును గజపతుల నుండి హస్తగతం చేసుకొనగా - విజయనగర రాజుల పాలనలోకి యీ ప్రాంతం వచ్చింది. విజయనగర సామ్రాజ్య పరిధిలోని సుమారు 200 పట్టణాలలో మంగళగిరి కూడా చేరి వుంది. క్రీ॥శ॥ 1565లో జరిగిన తళ్ళికోట యుద్ధం ఫలితంగా విజయనగర సామ్రాజ్యం పతనమై యీ ప్రాంతం గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలోనికి వచ్చింది.

గోల్కొండ సుల్తానుల పాలనలో - కొండవీటి రాజ్యాన్ని 14 సమతులుగా విభజించి పరిపాలించారు, మంగళగిరి కూడా ఒక సమతిగా వుండేది, దీని పరిధిలో 33 గ్రామాలుండేవి.

క్రీ॥శ॥ 1750-58 మధ్య గుంటూరు ప్రాంతం సర్కారు ఫ్రెంచి వారి అధీనంలోకి వెళ్ళి, తిరిగి 1758 నుండి 1788 వరకు నిజాం పాలనలో ఉంది.

18-9-1788 నాడు హైదరాబాద్ నవాబు నిజాం ఆలీఖాన్ గుంటూరు ప్రాంతాన్ని ఆంగ్లేయుల పరం చేశాడు. అనంతరం ఆంగ్లేయులు వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడిని యీ ప్రాంత జమిందారుగా నియమించారు.

1788-94 సం॥ల మధ్యకాలంలో ఈస్టిండియా కంపెనీ వారి 'సలహా సంఘం' (సర్క్యూట్ కమిటీ) మచిలీపట్నం కేంద్రంగా యీ ప్రాంతాన్ని పరిపాలించింది. 1794లో ఈస్టిండియా కంపెనీవారి సలహాసంఘం రద్దయింది. మంగళగిరితో సహా 14 తాలూకాలతో గుంటూరు జిల్లా ఏర్పడింది.

1859లో గుంటూరు జిల్లాను కృష్ణాజిల్లాలో విలీనం చేశారు. మరలా 1-10-1904న గుంటూరు జిల్లా ఏర్పడింది. అప్పటి నుండి గుంటూరు జిల్లాలో మంగళగిరి అంతర్భాగంగా కొనసాగుతోంది.

## పురాతన కాలంలో దర్శించిన ప్రముఖులు

పురాతన కాలం నుండే చేనేతకు, వైష్ణవ మతానికి కేంద్రంగానుండి ఒక పట్టణంగా వుంటూ వచ్చిన మంగళగిరిని ఎందరో ప్రముఖులు సందర్శించారు. వారిలో అద్వైతమత స్థాపకులైన ఆది శంకరాచార్యులు, విశిష్ట అద్వైత మతస్థాపకులు రామానుజాచార్యులు, ద్వైత మతస్థాపకులు మధ్వాచార్యులు మంగళగిరి నరసింహస్వామిని దర్శించారు. హిందూ ప్రవక్త వల్లభాచార్యులు యిక్కడి ఆశ్రమంలో స్థిరనివాసముండి తపస్సిద్ధి పొంది తన మత ప్రచారాన్ని యిక్కడి నుండే ప్రారంభించారు. చైతన్య ప్రభువు యిక్కడి స్వామి వారిని దర్శించిన గుర్తుగా కొండ మెట్ల ప్రక్కన వారి పాద ముద్రలు వున్నాయి. బాలాంబగారు నిరతాన్నదాన కార్యక్రమాలు నిర్వహించిన కాలంలో నృసింహ భారతి స్వామి కూడ మంగళగిరిని దర్శించారు. ప్రముఖ వాగ్గేయకారుడైన అన్నమాచార్యుని మనుమడు తాళ్లపాక చిన తిరుమలయ్య యిక్కడి రామానుజ కూటానికి భూములను దానం చేశారు. శ్రీమన్నారాయణ జియ్యర్ (పెద్ద జియ్యర్) స్వామి 16-2-1962న దేవాలయంలో శ్రీరామ నామ క్రతువు స్థంభాన్ని ప్రతిష్టించారు.

అలాగే గోల్కొండ సుల్తాను సేనాని "ఖుతుబ్ ఆలీ" 1594లో మంగళగిరిని సందర్శిం చారు. తంజావూరు మహారాజు రాజా సర్ ఫోజీ 20-11-1820న దేవస్థానమును దర్శించి "దక్షిణావృత శంఖా"న్ని బహూకరించారు.

విజయనగర సామ్రాజ్య కాలంలో – శ్రీకృష్ణదేవరాయల మహా మంత్రి తిమ్మరసు మంగళగిరిని సందర్శించి కొండమెట్ల వద్ద ఒక విజయస్థూపాన్ని ప్రతిష్ఠించారు. కొండవీటి గవర్నరు సిద్ధిరాజు తిమ్మరాజు మంగళగిరి దేవాలయానికి భూములు దానంచేసి, దేవాలయాన్ని అభివృద్ధి చేసి ఒక శిలాశాసనాన్ని ప్రతిష్టించారు.

కవి అబ్బనామాత్యుడు యీ దేవాలయాన్ని పలుమార్లు దర్శించి తన "అనిరుద్ధ చరిత్ర" గ్రంథాన్ని నరసింహస్వామికి అంకితమిచ్చారు.

వాశిరెడ్డి వెంకటాద్రినాయుడు యీ ప్రాంత జమిందారు హోదాలో ఎన్నో సార్లు యిక్కడ పర్యటనలు చేసారు. మహ్మద్ కులీపాదుషా ప్రతినిధి ఖోజా అల్లీ యిక్కడకు వచ్చి యిక్కడి ప్రజలపై పన్నుభారాన్ని తగ్గిస్తూ "శాసన స్థంభాన్ని" ప్రతిష్ఠించారు. 22-3-1679న ఈస్టిండియా కంపెనీ ముఖ్య అధికారి స్ట్రెయిన్‌షామ్ మాస్టరు యిక్కడి దేవాలయాన్ని దర్శించారు. మదర్ థెరిసా 1982లో డిసెంబరు ఇక్కడకు వచ్చి డాన్‌బాస్కో అనాథ వికలాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు.

## [1]కరవులు

క్రీ॥శ॥ 1830 నాటి ముందు కొంతకాలం వ్యవసాయ పంటలు సరిగా పండలేదు. 1831లో "అతివృష్టి" వలన పంటలు పాడైనాయి. 1832 మే నెలలో వొక భయంకరమైన ఉప్పెన, పెనుగాలి వచ్చి పంటల్ని నాశనం చేశాయి. 1833 నుండి క్రమంగా దుర్భిక్షము వృద్ధి అయినది. ఈ కరవును 'నందన కరవు' లేక 'గుంటూరు కరవు' అంటారు. దీనినే "డొక్కల కరవు" లేక "పెద్ద కరవు" అని కూడ వ్యవహరిస్తారు. గుంటూరు జిల్లాలో ఒంగోలు నుండి మచిలీపట్నం వరకు మార్గమంతా పీనుగులతోను, ఎముకల ప్రోగులతో నిండిపోయింది. గోదావరి జిల్లాల నుండి మద్రాసు వరకు గల రాజబాట కూడా శవాల మయమైనట్లు తెలుస్తోంది. ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం కరువు తీవ్రతను గుర్తించలేక పోవటంతో అసంఖ్యాకులు మరణించారు. గ్రామాలలోని వారు పట్టణాలకు చేరారు.

మనుషులకు, పశువులకు కూడా తినటానికి తిండి, త్రాగటానికి నీరు దొరకలేదు. వేలకొలది పశువులు గడ్డీ, నీరు లేక మరణించగా, లక్షలాది ప్రజలు కలరా వచ్చి చనిపోయారు.

ఈ కరువు ఫలితంగా - గుంటూరు జిల్లాలోని 5 లక్షల జనాభాలో 2 లక్షల మంది చనిపోయారు. ఈ లెక్కన మంగళగిరి ప్రాంతంలో కూడా వేలాదిమంది ఆనాటి కరవులో చనిపోయి వుండవచ్చు. ఆ తరువాత 20 సంవత్సరాల వరకు గుంటూరు జిల్లాలో వ్యవసాయం పూర్వ పరిస్థితికి రాలేకపోయింది. అన్ని జిల్లాల కంటే గుంటూరు ఎక్కువ దెబ్బతినటంతో దీనిని "గుంటూరు కరవు" అని కూడ పిలిచారు.

## [2]దోపిడీలు

క్రీ॥శ॥ 1780లో హైదర్ ఆలీ మైసూరు పాలకునిగా వుండేవారు. ఆయన దళాధిపతి 'నరసు' నాయకత్వంలో అశ్వక దళం తరలివచ్చి యీ ప్రాంతాన్ని చేజిక్కించు కునేందుకు ప్రయత్నించింది. కాని వీలుకాకపోవటంతో కడవలకుదురు, వేటపాలెం, నిజాంపట్నం గ్రామాలతో పాటు మంగళగిరిని కూడా ఆ సైనికులు దోచుకొన్నారు. అప్పుడు యీ ప్రాంతం నిజాం పాలనలో, నిజాం సోదరుడు బసాలత్‌జంగ్ ఏలుబడిలో వుండేది.

## [3]సీతానగరం సెటిల్మెంటు

బ్రిటీషు పాలకులు అటవీ సంపదపై పూర్తి అదుపు సాధించారు. దీంతో అడవులలో బ్రతికే అనేక తెగల ప్రజలు తమ జీవనోపాధి కోల్పోయారు. వీళ్ళు బ్రతకటం కోసం దొంగలుగా మారే పరిస్థితి ఏర్పడింది. ఆంగ్లేయులు అలాంటి కొన్ని జాతుల ప్రజలను "నేరము చేయు జాతులు"గా గుర్తించారు. 1913 సం॥లో బకింగ్‌హాం కెనాల్‌కు-కృష్ణానదికి మధ్య ప్రదేశములో క్రిమినల్ సెటిల్మెంటు ఏర్పాటు చేసి ఆయా జాతుల వారిని వుంచుట జరిగినది. ఈ సెటిల్మెంటును 1913లో శాల్వేషన్ ఆర్మి అనే మిషనరీ సంస్థ నిర్వహించింది.

పోలీసు శాఖ ఆ సెటిల్మెంటును 1932 నుండి 1956 వరకు నిర్వహించింది. 1956లో సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహణలోనికి మారింది. 1948 వరకు వీరిని నేరజాతులుగా ప్రభుత్వం పరిగణించింది. వీరిని సత్ప్రవర్తకులుగా గుర్తిస్తూ 1962లో చట్టం చేశారు. ఆ తర్వాత ఈ సెటిల్మెంటును ప్రభుత్వం వారు ఎత్తివేశారు. వారికి 156 ఎకరాల భూమిని ప్రభుత్వం వారు వ్యవసాయం కోసం పంచారు. డిస్పెన్సరి, స్కూలు, స్త్రీ సంక్షేమ కేంద్రం యీ సెటిల్మెంటులో ఏర్పరచబడినవి.

## [4]పిండారీలు[5]

పిండారీలు వేల సంఖ్యలో గల దోపిడి దొంగల గుంపు. వీరు మరాఠా ప్రాంతానికి చెందినవారు. వారు గుర్రాలపై మెరుపు వేగంతో జనంపై దాడి చేసి విలువైన, తేలికగా గుర్రాలపై తీసుకొని వెళ్ళదగిన వస్తువుల్ని దోచుకువెళ్ళేవారు. పంటల కాలంలో యీ దోపిడి చేసేవారు. క్రీ॥శ॥ 1814 సంవత్సరం నాటికి పిండారీల సంఖ్య సుమారు 25 వేలుగా వుండేది. వారి వద్ద దాదాపు 20 వేలు గుర్రాలు వుండేవి.

1816లో వారు సర్కారు జిల్లాలోని 339 గ్రామాలపై కేవలం 11 1/2 రోజుల వ్యవధిలోనే దాడులు చేసి దోచుకున్నారంటే వారి వేగాన్ని వూహించవచ్చు. మంగళగిరి కూడా వారి దాడికి గురైన ఒక గ్రామము. సుమారు రెండు వేల గుర్రాలపై 1816 సం॥ మార్చి నెలలో తొలుత మన జిల్లాలోని 40 గ్రామాలను దోచుకున్నారు. భర్తలముందే స్త్రీలను చెరచి, విలువైన వస్తువుల ఆచూకీ చెప్పమని ప్రజల్ని చిత్రహింసలు పెట్టారు. వ్యాపారులను, భాగ్యవంతులను కొల్లగొట్టి వేలకొలది ప్రజలను చంపి, గ్రామాలకు నిప్పంటించి ప్రచండమైన విధ్వంసకాండకు పూనుకున్నారు. ఈ పిండారులు ముగ్గురు, నలుగురు స్త్రీలను కలిపి కట్టగా కట్టి, గుర్రాలపై వేసుకొని వెళ్ళి, వారిని బానిసలుగా అమ్మివేశారట. శీలం పోయిన వేలాది స్త్రీలు అవమానంతో ఆత్మహత్యలు చేసికొన్నారు. ఆస్తులు పోయిన వారు కొందరు గుండె పగిలి చనిపోయారు. ఎక్కడ పడితే అక్కడ శవాల గుట్టలుండేవి.

## కంతేరు

మంగళగిరికి సమీపంలో వున్న 'కంతేరు' గ్రామము పూర్వకాలం రాజాదరణతో ఎంతో వెలుగొందిన ప్రదేశం. మూడవ శతాబ్దంలో దీనికి కన్యేరు, కండేరు, గండేరు, కందారపురము అని పేర్లు వున్నాయి.

5వ శతాబ్దిలో ఆనంద గోత్రజులకు చెందిన నాలుగు తరాల రాజవంశీకులు సుమారు 100 సంవత్సరములు పాటు 'కంతేరు'ను ముఖ్యపట్టణముగా చేసుకొని గుంటూరు ప్రాంతాన్ని పరిపాలించారు.

మంగళగిరికి అతి సమీపములోని కంతేరు ఒక ముఖ్యపట్టణముగా వెలుగొందిన ఆ కాలంలో యిక్కడి ప్రజలు నాగరికత రీత్యాను, యీ ప్రాంతం వ్యాపార వ్యవహారాల రీత్యాను ఎంతో ప్రాముఖ్యముగా వెలుగొందియుండవచ్చు!

## [6]గుడిలోని శాసనము



మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయములో వున్న యీ శాసనము ఎంతో ప్రాముఖ్యత కలిగి వున్నది. దీనిని క్రీ॥శ॥ 1558 సం॥లో విజయనగర సామ్రాజ్యమను 'సదాశివరాయలు' పరిపాలించుచున్నపుడు కొండవీటి గవర్నరు 'తిమ్మరాజయ్య' ప్రతిష్ఠించారు. ఆ సమయంలో శ్రీ తిరుమలరాజు ఈ మండల సామంతరాజుగా వ్యవహరిస్తున్నారు. 143 వరుసలలో లిఖితమయి వున్న యీ శాసనములో తిమ్మరాజయ్య ప్రకటించిన దానధర్మముల వివరములున్నవి. దాన ధర్మములు ముఖ్యాంశముగా వున్నందున ఇది "ధర్మశాసనము".

మంగళగిరి ప్రజలకు వివిధ పన్నులు లేకుండా చేసిన వివరమిందున్నది. విజయనగర సామంతరాజు 'తిరుమల రాజు'కు పుణ్యం కలిగేందుకు యీ దేవాలయానికి వివిధ దానములు చేసినట్లు ఆ శాసనములో పేర్కొన్నారు. 28 గ్రామాలలోని 200 కుచ్చెళ్ళ (10 కుచ్చెళ్ళు = 1 ఎకరము) భూమిని దానము చేసిన వివరములు కూడా ఇందు ఉన్నవి. మంగళగిరి పట్టణ అధికారిగా 'పాపిశెట్టి'ని నియమిస్తున్నట్లు శాసనములో తెలిపారు.

ఈ శాసనమును పరిశీలించినప్పుడు సదాశివరాయలు, తిరుమలరాజు, తిమ్మరాజయ్య అను ముగ్గురి రాజవంశీకుల పేర్లు, పాపిశెట్టి అనే అధికారి పేరు తెలియవచ్చాయి. అప్పట్లో తొలగించిన వివిధ పన్నుల వివరాలు, పుణ్యక్షేత్ర అభివృద్ధికి చేసిన నిర్మాణాలు, నిర్వహించిన ఉత్సవాలు వెలుగులోకి వచ్చాయి. అంతేగాక అప్పటికే వుండి ఇప్పటికి కూడా కొనసాగుతున్న గ్రామాల పేర్లు కూడా తెలుస్తున్నాయి. ఆ వివరాలను క్లుప్తంగా తెలియజేయటం జరుగుతోంది.

## విజయనగర సామ్రాజ్యము - మంగళగిరి



ఆనాడు విజయనగర సామ్రాజ్యములో 17 రాజ్యములుండేవి. 'రాజ్యము' అంటే 'రాష్ట్రము'. కొండవీడు రాజ్యము క్రింద మంగళగిరి వుండేది. ఆనాటి సామ్రాజ్యములో అతి చిన్న పరిపాలనా విభాగము 'గ్రామము'. కొన్ని గ్రామములను కలిపి 'స్థలము' అనేవారు. మన తాలూకా / మండలము వంటిది. ఆనాడు మంగళగిరి ఒక 'స్థలము'.

## సదాశివ రాయలు

విజయనగర సామ్రాజ్య చక్రవర్తి సదాశివరాయులు క్రీ॥శ॥ 1542-69ల మధ్య రాజ్యమేలాడు.

## తిరుమలరాయలు

ఈ శాసన కాలము నాటికి విజయనగర సామ్రాజ్యంలో ఈయన ఒక సామంత రాజుగా వుండేవారు. శాసనమును ప్రతిష్ఠించిన తిమ్మరాజుకు ఈయన స్వయాన మేనమామ.

శ్రీకృష్ణదేవరాయలకు అల్లుడయిన తిరుమల రాయలు తళ్ళికోట యుద్ధానంతరము వందలాది ఏనుగులపై సంపదను, మహారాజు అయిన సదాశివరాయలును తొడ్కని పెనుకొండ తరలివెళ్ళాడు. రాజుకు బదులుగా కొన్ని సంవత్సరాలు పరిపాలన సాగించాడు. 1569లో సదాశివరాయలను హత్యచేసి రాజుగా మారారు. పంచకావ్యాలలో ఒకటైన వసుచరిత్రను ఈయన అంకితం పొందారు. తిరుమల రాయలు యుద్ధములో ఆరితేరారు. రాజనీతిజ్ఞులు, పండితునిగా కూడా పేరుమోసారు.

## తిమ్మరాజు

ఈయన తిరుమల రాయలుకు మేనల్లుడు. ఈ శాసన కాలము నాటికి కొండవీడు ప్రాంతానికి గవర్నరుగా వుండేవారు. వీరు మంగళగిరి నృసింహస్వామి భక్తులు. తన మేనమామ అయిన తిరుమలరాయలుకు పుణ్యం కలిగేందుకు ఈ శాసనములో పేర్కొన్న దానదర్మాలు చేశారు. 'పరమయోగి విలాసము' అనే గ్రంథాన్ని రచించి నృసింహస్వామికి అంకితం ఇచ్చారు.

## పాపిశెట్టి

విజయనగర రాజుల కాలంలో పేరు పొందిన వర్తక ప్రముఖులను శెట్టి అని వ్యవహరించేవారు. వారిని పన్నులు వసూలు చేసే అధికారులుగా నియమించేవారు. మంగళగిరి పట్టణానికి పాపిశెట్టిని అధికారిగా నియమించినట్లు శాసనములో విశదీకరించారు.

## పన్నులు

గ్రామాన్ని కాపలాకాసే 'గ్రామవెట్టి' పోషణకోసం 'వెటివేములు, భూమి పన్ను 'సిధాయము', అమ్మకం పన్ను 'సిధాయము, గ్రామ సమిష్టి ప్రయోజనం కోసం (గ్రామ) కట్నం, మహారాజ, దేవాలయ ఉపయోగాల కోసం 'కానికె' మొ॥ 'చత్రిస్సా వేదనలు అనగా 36 రకాల పన్నులు ఆనాడు అమలులో వున్నట్లు తెలుస్తోంది.

## ఆలయ అభివృద్ధి

5 రకాల విగ్రహాలు, పదిరకాల వాహనాలు, రధాలు, కోనేరు, చెరువులు, వనాలు ఏర్పాటు చేశారు.

## గ్రామాలు

నంబూరు, తాళ్లూరు, నల్లపాడు, మేడుకొండూరు, వీరంభట్ల పాలెం, తాడికొండ, పెదకొండూరు, గొడెవర్తి, దుగ్గిరాల, ఉప్పలపాడు, వడ్లమాను, కుంచెనపల్లి, కొలనుకొండ, ఆత్మకూరు, లాం, గోరంట్ల, గోళ్లమూడి, నిడమర్రు, కురగల్లు, ఐనవోలు, శాఖమూరు మొదలగు గ్రామాలలోని భూములు దానము ఇచ్చిన వివరము శాసనములో వుంది.

# వెలుగులోకి వచ్చిన క్రొత్త విషయములు

## [7]పెద్దకోనేరు త్రవ్వించినది 'తిమ్మరాజయ్య' (1558 సం॥)

దేవస్థానమునకు చెందిన యీ 'కల్యాణ పుష్కరిణి' ఏ కాలమునాటిదో యింతవరకు ఎవరు ధృవపరచలేదు శాసనములోని 39, 40వ వరుసలలో **(39. రాజయ్యదేవ మహారాజులుంగారికి పుణ్యము;/ 40. గాను సేయించి (న శే) వలు [12]కోనేరు దేవుళాము;)** కోనేరు త్రవ్వించిన విషయము ప్రస్తావన వుంది.

మంగళగిరిలో వున్న రెండు కోనేరులలో ఒకటైన 'చీకటి కోనేరు' 1807-09 సం॥లలో గాలిగోపుర నిర్మాణ సమయంలో త్రవ్వించబడింది.

'ఈ పెద్ద కోనేరు గురించి 22-3-1679వ తేదీన మంగళగిరి దర్శించిన సెయింట్ జార్జిఫోర్టు గవర్నరైన 'స్ట్రెయిన్ షామ్ మాస్టరు' తన దినచర్య పుస్తకంలో వ్రాసినాడు. మంగళగిరిలోని పెద్ద కోనేరును 1558లో ఆనాటి కొండవీటి గవర్నరు, గుడిలోని శాసన కర్త 'తిమ్మరాజయ్య' త్రవ్వించారని చెప్పవచ్చు.

## దేవాలయ ఉత్సవ విగ్రహాలు

మంగళగిరి దేవాలయ ఉత్సవ విగ్రహాలు  ఏ కాలము నాటివో నిర్ధారణ కాలేదు. శాసనములోని 41, 137, 138, 139 వరుసలలో

**41. మండవ ప్రాకారాలు గోపురాలు పంచ్చభేర విగ్ర;**

**42. హాలు దివ్యాభరణాలు తేరులు మొదలైన  దశవా;**

**137. స్తానంవారికి వు;**

**138. త్సవవిగ్రహాల ప్ర;**

**139. తిష్టకాలాననూ;**

విగ్రహాల ప్రస్తావన వుంది. 41వ వరుసలో పేర్కొన పంచభేర విగ్రహాలలో ఉత్సవ విగ్రహము ఒకటి. 137, 138 వరుసలలో ఉత్సవ విగ్రహాలు ప్రతిష్ఠించినట్లు కూడా చెప్పబడినందున యీ దేవాలయ ఉత్సవ విగ్రహములను ఈ శాసనసకర్త తిమ్మరాజు క్రీ॥శ॥ 1558లో చేయించినాడని చెప్పవచ్చు.

## తాళ్ళపాక చిన తిరుమలయ్య

తాళ్ళపాక అన్నమాచార్యుని మనుమడు చినతిరుమలయ్య. క్రీ॥శ॥ 1561లో మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవలకు గాను శ్రీ రామానుజునకు కూటానికి తాళ్ళపాక చినతిరుమలయ్యగారు భూములను సమర్పించినారు. దేవుని ప్రసాదములు ఎవరెవరికి ఎంత పంచవలసిన వివరములు ఆ శాసనములో వ్రాసినారు. ఈ శాసనము దేవుని సేవలకు దానమిచ్చిన విషయం ఉన్నందున 'పొలివూటు' శాసనము.

ఈ శాసనము విజయనగర మహారాజుల పరిపాలన కాలమైన 1558 సం॥లో ప్రతిష్ఠించిన గుడిలోని శాసనములో భాగంగా లిఖితమయి వున్నది.

## గుడి గంట

నరసింహస్వామి దేవాలయంలో కంచు దిమ్మె ఒకటి వ్రేలాడదీయబడి అక్కడ ఒక చెక్క సుత్తి వుండేది. ఇరవై నాలుగు గంటలపాటు ప్రతి గంటకు గుడి జమాను సమయం ఎన్నిగంటలమైతే అన్ని సార్లు ఆ దిమ్మెను చెక్క సుత్తితో కొట్టేవారు. ఇప్పటిలాగా శబ్ధ కాలుష్యం అప్పట్లో లేకపోవటంతో దాదాపు వూరు మొత్తానికి ఆ గంటలు స్పష్టంగా వినపడుతుండేవి. దానిని బట్టే ప్రజలు తమ కార్యక్రమాలు చేసుకుంటుండేవారు.

## [8]శాసనస్తంభం[9]



మెయిన్ బజారులోని రామాలయం వద్ద 'శాసన స్తంభం వీధి'లో ఒక పురాతన అష్టముఖ శాసనం వున్నది. అందువలనే ఆ వీధికి ఆ పేరు వచ్చింది. ఆ శాసనములో 46 వరుసలు తెలుగులోను, 4 పంక్తులు పర్షియన్ భాషలోను లిఖితమయి వున్నాయి.

క్రీ॥శ॥ 1565లో యీ ప్రాంతం గోల్కొండ కుతుబ్‌షాహీల పాలనలోకి వెళ్ళింది. క్రీ॥శ॥ 1593లో గోల్కొండ కుతుబ్‌షా వృత్తి పన్నులను విపరీతంగా పెంచటం జరిగింది. మంగళగిరిలోని పేద చేనేత పారిశ్రామికులు పెరిగిన వృత్తి పన్నులు మోయలేని భారమై యితర చేనేత కేంద్రాలైన బందరు వంటి ప్రాంతాలకు వలస వెళ్ళారు.

పరిస్థితులు దుర్భరం కావటం చేత మంగళగిరి ప్రాంత గ్రామాల ప్రజలు ఊళ్ళు వదిలి వలసపోయారు. మరలా వారికి నచ్చజెప్పి గ్రామాలకు తీసుకురమ్మని "సుల్తాను" తన సేనాధిపతి "ఖోజా ఆలీ"ని మంగళగిరికి పంపాడు. ప్రజలు తాము చెల్లించవలసిన లెవీలను నాలుగు దఫాలుగా యిచ్చేటట్టు, పుల్లరి పన్ను రద్దు చేస్తున్నట్టు, ఖోజా ఆలీ గ్రామస్తులకు చెప్పిన విషయం శాసనములో వ్రాయబడి ఉంది". ప్రజలకు వచ్చిన కష్టనష్టములను తీర్చుచు రాజుగారు హామీ యిచ్చిన విషయము ఈ శాసనములో యిమిడి వున్నందున దీనిని 'నమ్మిక శాసనము' అంటారు.

## [10]పెద్దకొనేరు

మంగళగిరి నడిబొడ్డున సుమారు అరఎకరం విస్తీర్ణంగల చతురస్రాకారపు కోనేరు వుంది. దీని పేరు 'కల్యాణ పుష్కరిణి'. వాడుకలో పెద్దకోనేరు అంటారు. ఇది విజయనగర రాజుల కాలంలో క్రీ॥శ॥ 1558 ప్రాంతంలో త్రవ్వబడినట్లు చారిత్రక అధారాల వల్ల తెలుస్తున్నది. ఇది ఎంతో లోతు కలిగి నాలుగు వైపులా రాతిమెట్లు, ప్రవేశ ద్వారాలు వున్నాయి. ఇది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి చెందినది. దీని అడుగున రెండు బావులు వున్నాయని ప్రతీతి కోనేటికి తూర్పు వైపున మెట్లపై 'పిడుగు' పడి కొంత భాగం కుంగిపోయింది. కోనేటిలో ఈశాన్య దిక్కున శివలింగం ఒకటి ప్రతిష్ఠితమయి వుంది.



కోనేటి గర్భాన ఒక బంగారు గుడి వుందని ప్రజలు చెప్పుకొంటున్నట్లు 1883లో గార్డన్ మెకంజీ కృష్ణాజిల్లా మాన్యువల్‌లో వ్రాశారు. [1]1832 సంవత్సరపు కరువు కాలంలో ఈ కోనేరు పూర్తిగా ఎండిపోయి దానిలో 9,840 కర్ణాటక తుపాకులు, 44 యినుపగుండ్లు

దొరికినవి. 19వ శతాబ్ధములో మారెళ్ళ శీనయ్య దాసు అనే భక్తులు కోనేరులోని ఆంజనేయస్వామి గుడిని పునరుద్ధరించి నివేదన, దీపారాధన నిమిత్తం రెండు ఎకరాల భూమిని దానమిచ్చారు.

ఎన్నో శతాబ్దాల పాటు లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవాలకు కోనేరులోని నీటిని స్వామివారి అభిషేకం నిమిత్తం వాడేవారు.

1996 సంవత్సరంలో మేజర్ చారి, ఆంధ్రబ్యాంకు మేనేజరు శ్రీ కేశవ రెడ్డి మొదలగు వారి నాయకత్వంలో మంగళగిరి ఆఫీసర్స్ క్లబ్ వారు దీనిని పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు.

2004 కృష్ణా పుష్కరాల సందర్భంగా ఈ కోనేరు ప్రహరీగోడను పునర్నిర్మించారు.

## మంగళగిరి సంత

పురాతన కాలం నుండి మంగళగిరిలో ప్రతి గురువారం 'సంత' జరిగేది. పాతమంగళగిరి ఆంజనేయస్వామి మిద్దె వద్ద సంత నిర్వహించేవారు. సరైన మార్కెటింగ్ సౌకర్యాలు, రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందని రోజులలో యీ 'సంత'కు ఎంతో ప్రాధాన్యం వుంది. గురువారం రోజుల్లో వందలాది గ్రామీణ ప్రజలతో ఎంతో సందడిగా వుండేది. రాను రాను సౌకర్యాలు పెరిగి, ప్రజల అవసరాలు మారి, ప్రాముఖ్యత తగ్గి, యీ నాటికి 'సంత' మాయమైంది.

మంగళగిరి సంతలో "మట్టి కుండలు" ఒక ముఖ్యమైన అమ్మకపు వస్తువు.

## [11]రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు



రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు 1761 ఏప్రిల్ 20వ తేదీన జగ్గన్న, అచ్చమ్మల పుత్రునిగా జన్మించారు. మంగళగిరి వున్న ప్రాంతానికి వాశిరెడ్డి వెంకటాద్రినాయుడు జమిందారయి 1788 నుండి 1817 వరకు పాలించారు. ఈయన పాలన క్రింద 551 గ్రామాలుండేవి.

ఈయన పరిపాలనలోని గ్రామాలలోనికి "చెంచులు" వచ్చి దోపిడీలు చేస్తుండేవారట. ఆ సందర్భంగా వారిని అరికట్టేందుకు ఉపాయమాలోచించి 150 మంది "చెంచుల" పెద్దలను మంచి

మాటలతో విందుకు ఆహ్వానించి వారిని చంపి, ప్రజలను దోపిడీల నుండి విముక్తి కలిగించారు. కాని మోసపూరితంగా చేసిన ఆ పనికి ఆయన పాపభీతితో మానసిక వేదనకు గురైనారు. పెద్దలను సంప్రదించగా పాపపరిహారం కోసం గుడులు-గోపురాలు కట్టించి, దానాలిమ్మని వారు సలహాయిచ్చారు. దీనితో ఆయన చాలా గ్రామాలలో దేవాలయాలను పునరుద్ధరించారని చెప్పటం జరుగుతోంది.

వాశిరెడ్డి వెంకటాద్రినాయుడు తన పరిపాలనలో గల మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ గోపురాన్ని 11 అంతస్థుల గోపురంగా ఎంతో సుందరంగా పునర్నిర్మించారు. ఎంతో దైవభక్తి కల వెంకటాద్రినాయుడు పేరును మంగళగిరి గాలిగోపురం చిరస్థాయిగా నిలబెట్టింది.

వెంకటాద్రినాయుడు పాలన కాలంలోనే మంగళగిరి పై 1816లో 'పిండారీలు' దాడిచేసి దోచుకుపోయారు. ఈయన ది. 17-8-1817న కన్నుమూశారు.

## [12]జయ స్థంభము - శ్రీ కృష్ణదేవరాయ శాసనం[13]



ఈ శాసనము పానకాల స్వామి మెట్లకు ప్రారంభములో పడమర వైపునున్నది. ఇది శ్రీకృష్ణదేవరాయలు వేసిన శాసనముగా చెప్పబడుచున్నప్పటికీ, వాస్తవమునకు 'తిమ్మరసు'గా పేరొందిన దేవరాయల ప్రధాన మంత్రి 'నాదెండ్ల తిమ్మ' క్రీ॥శ॥ 1516లో ఆ శాసనాన్ని ప్రతిష్ఠించారు. తిమ్మరసు ఆధ్వర్యములో క్రీ॥శ॥ 1515 జూన్ 23న విజయనగర మహారాజు శ్రీకృష్ణదేవరాయలు 'కొండవీటి'ని జయించిన విషయము ఈ శాసనములో పేర్కొన్నారు. అందువలన దీనిని 'జయ స్థంభము' అంటారు.

అంతేగాకుండా తిమ్మరసు చేసిన ముఖ్యమైన 19 దానధర్మాదుల గురించి వ్రాసుకున్నారు. మంగళగిరికి సంబంధించి మూడు చారిత్రాత్మక విషయాలు ఈ శాసనంలోని 198 నుండి 208 వరుసలలో ఉన్న సమాచారం ద్వారా నిర్ధారణ అవుతున్నాయి.

**198.** గతి మిథునక్రోడఖేలామనోజ్ఞం పా
**199.** రా వారాంకకారం తటపుట ఘటితోత్తా
**200.** లతాలం తటాకం కృత్వా నాదిండ్లయప్ప ప్ర
**201.** భు రకృతతరాం విప్రసాదాతుకూరౌ:
**202.** శాకాబ్దే గజరామ వార్ధిమహిగే దాత్రా
**203.** ఖ్యవర్షే ఘనం ప్రాసాదం నవహేమకుం
**204.** భకలితం రమ్యం మహామంటపం కమన్మం
**205.** గళశైలనాథ హరయే నాదిండ్లయప్ప ప్రభు,
**206.** గ్రామం మంగళశైలవామకమపి ప్రాదాత్,
**207.** నృసింహాయచ శాకాబ్దే బ్రహ్మావహ్ని శృ -
**208.** తిశశిగణితే చేశ్వరాఖ్యే వర్షే రేటూరి గ్రామ,

1) క్రీ॥శ॥ 1516లో పెద్ద ప్రాసాదము (మండపము), 9 కుంభములు ఏర్పరచిన దేవాలయము నిర్మించినట్లు వ్రాసినారు.
   నేటి 11 అంతస్థుల గాలిగోపురము 1807-09 సం॥లలో నిర్మించబడేనాటికి మూడంతస్థుల గాలిగోపురమున్నట్లు తెలుస్తోంది. 3 అంతస్థులు, 9 కలశములు గల గాలిగోపురము తిమ్మరసు కట్టించినదని చెప్పవచ్చు.

2) దేవాలయానికి పెద్ద మంటపాన్ని నిర్మించినట్లు వ్రాసియున్నారు. నేటికి వున్న దేవాలయ ముఖమంటపము తిమ్మరసు నిర్మించినదే. ఆ మంటపము విజయనగర శిల్పకళా వైభవానికి అద్దము పడుతూ అత్యంత రమణీయంగాను, సువిశాలంగాను అలరారుతోంది.

3) మంగళగిరి గ్రామాన్ని నరసింహస్వామి దేవాలయానికి దానం చేసినట్లు ఆ శాసనములో చెప్పినారు. దేవాలయములకు దానమివ్వబడిన గ్రామాలను 'దేవభూమి'గాను, 'దేవస్థాన గ్రామం'గాను పిలుస్తారు. విజయనగర పాలనలో మంగళగిరి ఒక 'దేవస్థాన గ్రామ'మని తెలుస్తున్నది.

## [14] స్ట్రెయిన్‌షామ్ మాస్టర్

ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన సెయింట్ జార్జి ఫోర్ట్ గవర్నర్ అయిన స్ట్రెయిన్‌షామ్ మాస్టరు సెంట్ జార్జి కోట నుంచి మచిలీపట్నం వరకు అనేక కేంద్రాలు పర్యటించారు. మద్రాసుకు తిరుగు ప్రయాణంలో ఆయన 1679 సం॥ మార్చి 22 వ తేదీన మంగళగిరి పానకాల స్వామిని దర్శించి, ఆ రాత్రి యిక్కడ విడిది చేశాడు. కొండపైన వేంచేసియున్న పానకాలస్వామి వారు భక్తులు సమర్పించిన పానకములో సగం మాత్రమే సేవించి మిగతా సగాన్ని భక్తులకు విడిచిపెడుతున్న సంగతి తనకు నమ్మశక్యంగా లేదని ఆయన పేర్కొన్నారు.

## రాజధానులు

మంగళగిరికి దగ్గరలో పూర్వకాలంలో రాజధాని నగరాలు కొన్ని వుండేవి. క్రీ॥పూ॥ 4వ శతాబ్దం నుండి క్రీ॥శ॥ 16వ శతాబ్దం వరకు మౌర్య, శాతావహన, ఇక్ష్వాకు, పల్లవ, చాణక్య, చోళ, కాకతీయ, రెడ్డి, విజయనగర సామ్రాజ్యాలు తమ అధికారాన్ని నెరకునాయి. అమరావతి, కంతేరు, విజయపురి (నాగార్జున కొండ), కొండపల్లి యీ ప్రాంతంలో రాజధానులుగా వర్ధిల్లిన కొన్ని రాజధాని నగరాలు.

## [18] విజయనగర సామ్రాజ్య స్థాపకులు మంగళగిరి వారే!

1323లో వరంగల్లును ఢిల్లీ సుల్తానులు ఆక్రమించటంతో కాకతీయులు పతనం చెంది ఆంధ్రదేశం ముస్లిం రాజుల పాలనలోకి వచ్చింది. వారి పాలనలో ప్రజానీకం అష్టకష్టాలు పడ్డారు. ఆంధ్రదేశ స్థితిగతులు పూర్తిగా దిగజారినాయి. ఆ పరిస్థితులలో ప్రజలలో ధైర్య సాహసాలను, దేశభక్తిని పెంపొందించి తమ సంస్కృతిని పరిరక్షించటం ఒక ఉద్యమంగా సాగింది.

ముస్లిం పాలకులను ప్రతి ఘటించే ఉద్యమంలో భాగంగానే 1336లో సంగమ వంశీకులైన హరిహరరాయలు, బుక్క రాయలు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. దక్షిణాదికి ముస్లిం పాలకుల విస్తరణను నిరోధించి, స్థానిక సంస్కృతిని పరిరక్షించింది యీ విజయనగర రాజ్యమే! విజయనగర రాజ్య స్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు 'మంగళ నిలయ' వాస్తవ్యులు. ఈ మంగళ నిలయమే "మంగళగిరి" అని చరిత్రకారుల అభిప్రాయం.

ఈ మహానాయకులు మంగళగిరి చెందిన వారవటం మనకు గర్వకారణమే! రాబోయే తరాల నుండి వీరి స్ఫూర్తితో దేశ పాలకులు ఉద్భవించాలి!

## పారువేట శాసనం

ఫారెస్టు స్థలములో నుండి నరసింహస్వామి, సీతారామస్వామి దేవస్థానముల పారువేట ఉత్సవము వెళ్లుటకు బ్రిటీష్ ప్రభుత్వం వారు అనుమతి యిచ్చుచూ, ఆ విషయమును శిలాఫలకముపై చెక్కినారు. ఆ శిలాఫలకము బంగ్లా వెనుక భాగమున గల పారువేట రోడ్డులో వున్నది. 2001 సం॥లో పారువేట రోడ్డును సిమెంటు రోడ్డుగా మార్చినపుడు నేలలో దిగిపోయి వున్న ఆ శిలాఫలాకాన్ని మున్సిపల్ కౌన్సిలర్ శ్రీ మునగాల మల్లేశ్వరరావు, శ్రీ నవత బాబు (వెంకటేశ్వరరావు) జాగ్రత్తగా తీసి రోడ్డుపై పునప్రతిష్ఠించారు.

**శిలాఫలకముపై ఉన్న ఉత్తర్వు పాఠం**

Hindu General Public Right of way

Hindu Temples

శ్రీ లక్ష్మీ నరసింహ్వా స్వామి వారు

శ్రీ సీతారామ స్వామి వార్ల

పార్వేట మార్గము

Sett. No. 655/15.8.90

Conse. No. 5243/21-11-11

Rc. No. GIS/DFO of 8-12-11

M.4/F.6 FT.100/W 30 Ft.

J.S. SCOT, D.F.O.



## మిద్దె సెంటరు

పాత మంగళగిరి–క్రొత్త మంగళగిరి మధ్య వారధిగా ఆంజనేయస్వామి గుడి వుంది. దానినే 'ఆంజనేయస్వామి మిద్దె' అని అంటుండటంతో ఆ ప్రాంతం "మిద్దె సెంటరు" అని పేరుబడింది.

పూర్వం – ఏదన్నా బహిరంగ సభ జరుపుకొనేందుకు వసతి వుండేది కాదు. పాత, క్రొత్త మంగళగిరి ప్రాంతాల ప్రజలందరికి అందుబాటులో వుండటంతో ఈ మిద్దను వేదికగా చేసుకొని వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల వారు సభలను నిర్వహించేవారు. అలా కొన్ని దశాబ్దాలు యీ వేదిక ఉపయోగపడింది. ఆ గుడి ఆవరణలో వున్న మంటపం సభావేదికగా వుండేది. గుడిముందున్న రోడ్డుకు రెండు ప్రక్కల ప్రజలు క్రింద కూర్చొండేవారు.

తెనాలి రోడ్డు ట్రాఫిక్ పెరగటం, ఆ ప్రాంతం గందరగోళంగా తయారవటమే కాకుండా ఉపన్యాసాలపై ప్రజలకు ఆసక్తి తగ్గటంతో ఇపుడు అక్కడ బహిరంగ సభలు జరపటంలేదు.

## [16] మంగళగిరి ఆనంద కవి[17]

మంగళగిరికి చెందిన ఆనందరాయరు, నియోగి బ్రాహ్మణ కులస్తుడు. ఆత్రేయ గోత్రుడైన తిమ్మయామాత్యుని పుత్రుడు. ఇతనిని మంగళగిరి ఆనందకవి అని కూడ పిలుస్తారు. టిప్పుసుల్తాను సైన్యంలో గుమాస్తాగా పనిచేస్తూ, టిప్పు మరణానంతరం ఒక ఇంగ్లీషు అధికారి వద్ద గుమస్తాగా పనిచేశాడు. ఒక మత గురువు అతనికి క్రైస్తవ 'మతం' యిచ్చారు. ఆ మత గురువు ఆనందరాయరును పాండిచ్చేరికి పంపారు. అక్కడ ఆయనకు వివాహమయింది. అక్కడ నుండి ట్రాంక్విబార్ చేరారు. అక్కడ క్రైస్తవ మత గ్రంథాలు చదివి తమిళం నుండి తెలుగులోకి అనువాదాలు చేశాడు. ఆయన తెలుగులోను, మరాఠిలోను సిద్ధ హస్తుడు. తాను విశాఖ పట్నంలోనైతే తెలుగువారికి మరింత ఉపయోగపడతానని భావించి "బాప్టిజం" తీసికొని ప్రొటెస్టెంటుగా విశాఖపట్టణం చేరి "సువార్త"ను బోధించాడు. ఆయన ప్రసంగ ధోరణి అందరినీ ఎంతగానో ఆకర్షించింది. లండన్ మిషన్ సొసైటీ తరఫున విశాఖపట్నంలో క్రైస్తవ మత ప్రచారం ప్రారంభించిన మిషనరీ దేగ్రాంజన్‌కు ఆనందరాయరు తెలుగు నేర్పగా, ఆయన బైబిల్ అనువాదం ప్రారంభించాడు.

విశాఖపట్నంలో అక్కడి బడిలో ప్రారంభ, ముగింపు సమయాలలో చేసే ప్రార్థనలను ఆనంద రాయరు కూర్పు చేశారు. క్రైస్తవ మత గ్రంథ సారాన్ని, "వేదాంత రసాయన"మనే ప్రబంధం రచించారు.

గ్రీకు భాషనుండి మత్తయి, లూకా సువార్తలను అనువదించుటలో క్రైస్తవ విధ్వాంసులకు చాలా తోడ్పడెను. ఆనందకవి ఆనందశతకమును విజయనందన విలాపము అనే పద్యకావ్యాన్ని కూడ రచించారు. ❋

## <u>సూచికలు :</u>


1. P.No. 88 "**A Manual of the Kistna District** in the Presidency of Madras" (1883) - Gordon Mackenzie, Asia Educational Services, Madras (1990)
2. ""**A Manual of the Kistna District**
3. "A.P. Dist. Gazetteers - Guntur, Govt. Publications, A.P.,
4. 1. Pages 73, 141, History of Guntur Dist., Sri Vishnubhotla Suryanarayana
5. Page 85, "**A Manual of the Kistna District".**
6. Page 228, 230, "**South Indian Inscriptions (SII) ( Vol-IV (1923), A.R. No. 258/1892)". Archaeological Survey of India (ASI).**

7. Page 149, "**A Manual of the Kistna District".**

8. Page Nos. 231-233, South Indian Inscriptions Vol.IV (1923) No. 711, 711-A.

9. పేజి 226, ఆంధ్రుల సంస్కృతి-చరిత్ర-2, శ్రీ కంభంపాటి సత్యనారాయణ, హైదరాబాద్ బుక్ ట్రస్ట్ (1998).

10. P.Nos. 179, 180. **A Manual of Kistna District**

11. పేజి నెం.149-153, గుంటూరు మండల సర్వస్వము-శ్రీ దరువూరి వీరయ్య, (1996)

12. Pages 117-127 Epigraphia Indica & Record of the A.S.I., Vol. VI (1900-01)

13. Page No. 228.South Indian Inscriptions Vol. IV (1923) No. 708,

14. Page No. 96, 97, 149 "**A manual of the Kistna District**

15 పేజి నెం. 6 స్వర్ణ భారతాంధ్రలో గుంటూరు జిల్లా నాడు-నేడు, జిల్లా సాంస్కృతిక మండలి, గుంటూరు.

16. పేజి నెం. 303 సమగ్ర ఆంధ్ర సాహిత్యం (వాల్యూం-10) శ్రీఆరుద్ర.

17. పేజి నెం. 613 విజ్ఞాన సర్వస్వము (వాల్యూం-1) తెలుగు భాషా సమితి, హైదరాబాద్


## పట్టణ ప్రగతిలో మైలురాళ్ళు

| | |
|---|---|
| 1. రైలు సౌకర్యం ప్రారంభం | 1890 |
| 2. విద్యుత్ సరఫరా ప్రారంభం | 1939 |
| 3. హైస్కూలు ప్రారంభం | 1944 |
| 4. మునిసిపాలిటి ఆవిర్భావం | 1969 |
| 5. స్పెషల్ పోలీసు బెటాలియన్ స్థాపన | 1972 |
| 6. పైలట్ వాటర్ స్కీము ప్రారంభం | 1975 |
| 7. డిగ్రీ కాలేజీ ప్రారభం | 1977 |
| 8. ఓవర్ బ్రిడ్జి ప్రారంభం | 1980 |
| 9. బైపాస్ రోడ్డు ప్రారంభం | 1985 |
| 10. కృష్ణా జలాల సరఫరా ప్రారంభం | 2003 |
| 11. పానకాలస్వామి ఘాట్ రోడ్ | 2004 |

# పుణ్యక్షేత్రం

"శ్రీమత్పయోనిధి నికేతన చక్రపాణే
భోగీన్ద్ర భోగమణి రాజిత పుణ్యమూర్తే
యోగీశశాశ్వత శరణ్య భవాబ్ధిపోత
లక్ష్మీనృసింహ మమదేహికరావలమ్బమ్"

మంగళగిరి ఎన్నో శతాబ్దాలుగా పేరొందిన పుణ్యక్షేత్రం.

మంగళగిరి పుణ్యక్షేత్రంలో ముగ్గురు నరసింహస్వాములు భక్తుల పూజలందు కుంటున్నారు. ఒకరు ఎగువ సన్నిధి 'పానకాల నరసింహస్వామి', రెండవ వారు దిగువ సన్నిధి 'లక్ష్మీనరసింహస్వామి' కాగా, కొండ శిఖరాగ్రాన 'గండాల నరసింహస్వామి' మూడవ వారు.

కృష్ణానదికి అతి దగ్గరలో యీ వైష్ణవ క్షేత్రం నెలకొని వుంది. లక్ష్మీదేవి యీ పర్వతంపైన తపస్సు చేసినందున యీ క్షేత్రాన్ని 'మంగళగిరి'గా పిలువబడుతున్నదని చెబుతారు. ఈ క్షేత్రంలో పానకాల నరసింహ స్వామి ముఖ్య దైవం. పానకాన్ని భక్తుల నుండి స్వీకరిస్తూ పానకాల రాయుడుగా యీ దైవం పేరొందారు. ఈ స్వామి వెలిసారని పురాణాలలో ప్రస్తావించారు.

కొండకు దిగువన శ్రీ లక్ష్మీ నరసింహస్వామిని "దర్మరాజు" ప్రతిష్టించారని ప్రతీతి. విజయనగర రాజ్యంలో యీ దేవాలయం అభివృద్ధి చెందినట్లు చారిత్రకాధారాల వల్ల తెలుస్తోంది. అంబరాన్ని తాకుతున్నట్లుండే 11 అంతస్థుల గాలిగోపురం, దక్షిణావృత శంఖం యిక్కడ ప్రత్యేకాకర్షణలు.

ఎందరో కవులు యీ స్వామిపైన శతకాలు రచించగా, మరి కొందరు తమ కావ్యాలనంకితమిచ్చారు.

విజయవాడ-గుంటూరు నగరాల మధ్య జాతీయ రహదారిపై అందరికీ అందుబాటులో నున్న యీ పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతోంది. కొండపైకి మెట్ల మార్గమే కాక ఘాట్‌రోడ్ సౌకర్యం కూడా వుంది.

## [18]పానకాలస్వామి కొండ[19]



మంగళగిరిలోని కొండ ఆదియుగపు కాలం నాటి ఖోండలైట్స్‌గా పిలువబడే రాతి సమూహానికి చెందినది. ఈ కొండ తూర్పు కనుమల లోనిది. ఈ కొండ కూర్చుని ఉన్న ఏనుగును పోలి ఉండి, పడమర దిక్కున తల వెనుక భాగం తూర్పుకు ఉంది. ఈ కొండ ఎత్తు 875 అడుగులు.

పట్టణానికి ఉత్తర దిక్కున ఉన్న ఈ కొండ వల్లనే మంగళగిరికి ఆ పేరు వచ్చింది.

ఈ కొండ పైకి 480 మెట్లను కోవెలమూడి గ్రామస్తులు శ్రీ చన్నాప్రగడ బలరామదాసు 1890లో నిర్మించారు. [2]ఈ కొండపై అమ్మవారి ఆలయానికి పక్కన ఒక గుహ ఉంది. ఇది ఆది కాలపు స్ఫుటమయ (క్రిస్టలైన్) శిలల లోనిది. ఈ గుహ కృష్ణా నదీ తీరాన ఉండవల్లి వరకు ఉందనీ, పూర్వం ఈ కొండపైన తపస్సు చేసిన మునులు ఈ దారి గుండానే వెళ్లి కృష్ణా నదిలో స్నానం చేస్తుండేవారని ప్రతీతి. ప్రస్తుతం ఈ గుహ లోపలి భాగం అంతా చీకటిమయంగా ఉండి దారి ఉన్నట్లు కనపడదు.

### కొండ అగ్ని పర్వతమా?

తూర్పు కనుమలలోని ఈ కొండ పురాణేతిహాసిక ప్రాధాన్యత కలిగివుండటమే కాక భౌగోళికపరంగా కూడా ప్రాధాన్యతను కలిగివుంది. మంగళగిరి కొండ అగ్ని పర్వతమనీ, దానిలో గంధకం ఉందనీ, అది పేలి పోకుండా ఉండేందుకే ఆ కొండలో బెల్లపు పానకం పోసి తడుపుతున్నారనీ ప్రతీతి. అగ్ని పర్వతాల పరిసరాలలో కనీసం 1200 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత పుడుతుంది. ఈ కొండ అగ్ని పర్వతాల కోవకు చెందివుంటే ఈ ప్రాంత భూమిలో ప్రవహిస్తుండే ద్రవాల వేడికి ఈ ఊరిలోని బోరుల్లో నీరువేడెక్కాలి. కాని ఈ ప్రాంతం లోని నీరు కనీసం స్థాయిలో కూడా వేడెక్కటం లేదు. దీనిని బట్టి ఈ కొండ అగ్ని పర్వతం కాదని చెప్పవచ్చు. ప్రజల నమ్మకాలు ఏ విధంగా ఉన్నప్పటికీ, ఈ కొండ అగ్ని పర్వతమా, కాదా అనే విషయంపై ప్రత్యేక పరిశోధనలు జరిపి తేల్చటం జరగలేదు.

## పానకాల నరసింహ స్వామి



మంగళగిరి కొండ మీద పానకాల నరసింహ స్వామి ఆలయం ఉంది. ఈ గుడి క్రీ॥పూ॥ 300 సం॥ల నుండి వుందని చెబుతారు. ఈ దేవుని పానకాల స్వామి అని కూడా పిలుస్తారు. కొండను తొలిచి ఈ ఆలయాన్ని నిర్మించారు. పురాణాల ప్రకారం పానకాల స్వామి స్వయం వ్యక్త రూపుడు. ఈ ఆలయాన్ని ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే తెరిచి ఉంచుతారు. రాత్రులు దేవతలు పూజకై వస్తారని భక్తుల నమ్మకం. పానకాల స్వామికి బెల్లం, మిరియాలు, యాలకులు కలిపిన నీటితో పానకం తయారు చేసి భక్తులు సమర్పిస్తారు. నివేదించిన పానకంలో స్వామి వారు సగం త్రాగి మిగిలినది భక్తులకు వదిలి వేస్తారని నమ్మకం. కృతయుగంలో అమృతాన్ని, త్రేతాయుగంలో ఆవు నెయ్యినీ, ద్వాపర యుగంలో ఆవు పాలనూ నివేదనగా స్వీకరించిన స్వామి వారు కలియుగంలో పానకాన్ని సేవిస్తున్నారని చెపుతుంటారు. పానకం చేయటానికి అవసరమైన నీటిని కొందరు కొండ పైకి మోసి కుటుంబ వృత్తిగా ఆచరించేవారు. కాని 24 డిసెంబరు 1990న శ్రీ జగన్నాధ స్వామి రామగోపాల్ ట్రస్టు సహాయంలో కొండపైకి మంచినీటి సరపరా ప్రారంభించారు. 2004 కృష్ణా పుష్కరాల నుండి కృష్ణా జలాలను పైకి సరఫరా చేస్తున్నారు.

ఈ గుడిలో బెల్లపు పానకం ఉన్నా చీమలు ఏవీ లోపల ఉండవు. లోపలికి పోసిన పానకం ఎక్కడకు పోతుందో ఇంతవరకు ఎవరికీ తెలియదు.

పానకాల స్వామికి నోరు మాత్రమే ఉండి, పానకం పోయు ముఖద్వారం రాతిలో 15 సెంటిమీటర్లు వెడల్పు ఉంటుంది. కోపంతో ఉన్న ఇత్తడి ముఖపు తొడుగు ఉంటుంది. ఒకవైపు చక్రం, రెండవ వైపు శంఖం రాతిలోనే స్వయంగా ఉన్నాయి.

పానకాల నరసింహస్వామి పానకాన్ని నివేదనగా స్వీకరించటం గురించి వివిధ కథలు, వాదనలు, ఊహలు వాడుకలో ఉన్నాయి.

# లక్ష్మీనరసింహస్వామి



మంగళగిరి దిగువ క్షేత్రములో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయమువున్నది. దేవతలు ప్రతిష్ఠించినమూర్తులు"దైవీయాలు". ఈ దేవాలయములోని మూల విరాట్‌ను ద్వాపర యుగంలో పాండవుల అరణ్యవాస కాలమందు ధర్మరాజు ప్రతిష్ఠించారని చెప్తుంటారు. కాబట్టి ఈ మూర్తి దైవీయము. అరుదైన ఆలయాలలో ఇది ఒకటి. దేవాలయ శైలికి సంబంధించి ఈ దేవాలయం ద్రావిడ శైలికి చెందినది. ఈ దేవాలయానికి ముఖ్య ఆకర్షణ 11 అంతస్తుల గాలిగోపురం. ఈ దేవాలయ ప్రాంగణంలోని ప్రశాంత వాతావరణం భక్తులను మరింతగా ఆకర్షిస్తుంది.

ఈ గుడి విజయనగర సామ్రాజ్య కాలంలో అన్ని విధాల అభివృద్ధి చెందినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. ఆ కాలంలో నిర్మించిన దేవాలయపు 24 స్తంభాల ముఖమండపం ఎంతో అందమైన చెక్కడాలతో వుంది.

ప్రతి సంవత్సరం ఫాల్గుణమాసం (మార్చి/ఏప్రిల్)లో యిక్కడ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. దేశం నలుమూలల నుండి యాత్రికులు వేలాదిగా వస్తుంటారు.

ఈ దేవాలయానికి మెట్టభూమి 251 ఎకరములు, మాగాణిభూమి 120 ఎకరములు ఉంది.

## గండదీపం

కొండశిఖరాన వున్న గండాల స్వామికి రూపం లేదు. అక్కడ దీపం వెలిగించేందుకు ఏర్పాటు మాత్రమే ఉంటుంది గాని ప్రత్యేక విగ్రహం వుండదు. భక్తులు తమకు గండాలు (కష్టాలు) వచ్చినప్పుడు గండం నుండి గట్టెక్కించమని, గండం తీరిన తరువాత గండదీపం వెలిగిస్తామని మొక్కుకుని ఆ ప్రకారం వెలిగిస్తారు. అక్కడ వుండే భాండీలో ఆవు నెయ్యిగాని నువ్వుల నూనెగాని పోసి, పెద్ద వత్తి పెట్టి సాయంత్రాలలో వెలిగించి వస్తారు. ఆ గండ దీపం చుట్టుప్రక్కల చాలా గ్రామాల ప్రజలకు కన్పిస్తుంటుంది.

## దక్షిణావృత శంఖం



మంగళగిరి లక్ష్మీ నరసింహ దేవాలయంలో వున్న విశిష్ఠ సంపదలో దక్షిణావృత శంఖం ఒకటి. దీనిని తంజావూరు మహారాజు 20-11-1820న యీ దేవాలయానికి కానుకగా సమర్పించినట్లు చెబుతారు. దీనిలో నుండి సర్వదా, సర్వవేళలా ప్రణవనాదం (ఓంకారం) వినిపిస్తుంటుంది. బంగారు తొడుగు యీ శంఖానికి వుంది. ముక్కోటి ఏకాదశినాడు యీ శంఖంతో భక్తులకు తీర్థమందిస్తారు.

## బ్రహ్మోత్సవములు

మంగళగిరి దేవస్థాన బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ మాసం (మార్చి/ఏప్రిల్)లో 12 రోజులపాటు జరుగుతాయి. ఆ సందర్భంగా స్వామిని వివిధ వాహనాలపై అలంకరించి గ్రామోత్సవం జరుపుతారు.

## శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణము

ఆగమ శాస్త్ర విధిని శ్రీ శాంత నృసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారలకు యిక్కడ కళ్యాణం జరుపుతారు. ఫాల్గుణ శుద్ధ పూర్ణిమ ముందు రోజైన చతుర్ధశినాటి రాత్రి నరసింహస్వామి కళ్యాణం జరగటం క్షేత్ర ఆనవాయితీగా వస్తోంది. కళ్యాణానికి ముందు 'చెంచులు' తమ ఆడపడుచు చెంచులక్ష్మిని నరసింహస్వామి వివాహం చేసుకున్న గుర్తుగా గుడి ఆవరణలో ఉత్సవం నిర్వహిస్తారు.

ఆ రాత్రి శ్రీవారు శేషవాహనంపై గ్రామోత్సవంలో పాల్గొని, 'ఎదురుకోల' ఉత్సవాన్ని నిర్వర్తిస్తారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం వారు తమ ఆచారం ప్రకారం మధుపర్కాలు, మంగళ ద్రవ్యాలను సమర్పిస్తారు. వేలాది మంది భక్తులు యీ కళ్యాణ మహోత్సవములో పాల్గొని పారవశ్యం చెందుతారు.

## రథోత్సవం - సాంస్కృతిక మహోత్సవం



శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కళ్యాణము తరువాతి రోజు పూర్ణిమ. ఆ రోజున మంగళగిరి తిరుణాల జరుగుతుంది. అది శివరాత్రి తరువాత వచ్చు పూర్ణిమ. అదే రోజు దేశంలో హోళీపండుగ కూడ జరుగుతుంది. ఈ దేవాలయానికి 11 అంతస్థుల గాలి గోపురం తరువాత చెప్పుకోదగిన నిర్మాణము "పెద్ద రథము". ఇది ఆరు చక్రాలతో ఎంతో సుందరంగా గంభీరంగా వుంటుంది. దీనిని ఎంతో బరువైన, పొడవైన త్రాడుతో ప్రజలు ఉత్సాహంగా, అలుపెరుగకుండా లాగుతారు. రథాన్ని లాగే వారికి ఉత్సాహం కలిగేలా రథంపై నుండి గంట మ్రోగిస్తూ అర్చకస్వాములు నరసింహస్తుతి చేస్తుంటారు. ఆ రథాన్ని లాగేందుకు వందలాది యువకులు పోటీ పడుతుంటారు. వేలాది మంది భక్తులు ఆ రథం తాడుని తాకితే చాలు పుణ్యమొస్తుందని ఆరాటపడతారు. ఆ రోజున వచ్చే వేలాది మంది కిక్కిరిసిన జనం మధ్య జరిగే రథోత్సవంలో కులమతాలకు అతీతంగా ప్రజలు పాల్గొంటారు. ఈ తరతరాల సంస్కృతి ప్రతిఏటా కొనసాగుతూ వస్తోంది.

ఈ రథ గమనాన్ని నిర్దేశించేలా రథ చక్రాలకు 'చప్టా'లను వేస్తుంటారు. 'చప్టా'లు వేసేందుకు ప్రత్యేక నిపుణత గల భక్త బృందాలున్నాయి. వారు ప్రమాదాలకు భయపడకుండా రథోత్సవంలో ఎంతో నైపుణ్యంతో, సమయస్ఫూర్తితో రథవేగాన్ని నిరోధిస్తుంటారు. లోపలివైపు చక్రాలకు యీ బృందంలోని వారు చప్టాలు వేయటం చూస్తుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. కొన్ని సందర్భాలలో వారి చేతివ్రేళ్లు రథం క్రింద నలిగిపోతుంటాయి. అయినప్పటికి వారు రెట్టింపు ఉత్సాహంతో తమ విధినిర్వహణలో ముందుకు సాగుతారు. ఈ చప్టాలు వేసే బృందం ఆ మహోత్సవంలో ఒక కీలక పాత్రను నిర్వహించే అవకాశం తమకొచ్చిందన్న గర్వంతో ఆ కార్యాన్ని నిర్వర్తిస్తారు. ఈ తిరునాళ్ళు, రథోత్సవం మంగళగిరికి ఒక సాంస్కృతిక మహోత్సవం.

## ఆస్థాన అలంకారములు

బ్రహ్మోత్సవాల అనంతరం 13 ఆస్థాన అలంకారోత్సవాలు యీ క్షేత్రంలో జరుగుతాయి. ఆస్థాన అలంకారాల్లో అత్యంత ముఖ్యమైనది వైభవముగా జరుపబడేది స్థంబోద్భవ నరసింహ అవతారం. అర్చక స్వాములు ఎంతో శ్రమకోర్చి సాంకేతిక నైపుణ్యమును ఉపయోగించి ఈ అవతారాన్ని తీర్చిదిద్దుతారు. స్థంభం నుంచి నరసింహస్వామి ఉద్భవించే సన్నివేశాన్ని ప్రత్యేక ధ్వని, కాంతులను సమ్మిళితం చేసి ప్రదర్శించటం ద్వారా భక్తులను అలరిస్తారు.

## గాలిగోపురాలు



[20] గగన పంక్తులతోటి కోరి ముచ్చటలాడు
గాలిగోపుర మిదియె  శిరమెత్తి నిలిచినది

## తూర్పు గాలిగోపురం :

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి ముఖ్య ఆకర్షణగా తూర్పు గాలిగోపురం, మంగళగిరి పట్టణానికే మణిమకుటంలా నిలిచిపోయింది. విజయనగర రాజులు ఈ దేవాలయానికి మూడు అంతస్థుల గాలిగోపురాన్ని నిర్మించగా, దాని స్థానంలో యీ ప్రాంత జమిందారుగా నున్న వాశిరెడ్డి వెంకటాద్రి నాయుడు 11 అంతస్తుల గాలిగోపురాన్ని నిర్మించారు. 1807లో ప్రారంభమైన గోపుర నిర్మాణం 1809లో పూర్తయింది. ఈ గోపురం ఎత్తు 153 అడుగులు కాగా, వెడల్పు 49 అడుగులు. ఎత్తైన గోపురాలను అంత తక్కువ వెడల్పులో నిర్మించటం అరుదు. ఆ గోపురంపై గల శిల్ప సంపద, కట్టుబడిలోనే వచ్చిన ఆ రంగు కళాప్రియుటకు ముచ్చట గొల్పుతుంది.

నిర్మాణం పూర్తి అయిన తరువాత గాలిగోపురం వేరే వైపునకు ఒరిగినదట. దానిపై కాంచీపురంలోని శిల్పుల సలహా మేరకు గోపురానికి తూర్పువైపున కోనేరును త్రవ్వారు. ఒరిగిన ఆ గోపురం తిన్నగ నిలబడింది. ఆ సందర్భంలో త్రవ్వబడిన ఆ కోనేరును "చీకటి కోనేరు"గా పిలుస్తున్నారు. ఈ గాలిగోపురంపై కలశాలను మల్లాది సుబ్బదాసుగారు ప్రతిష్ఠించారు.

## ఉత్తర గాలిగోపురం :

వైకుంఠ ఏకాదశి రోజున యీ ద్వారంలో ఉత్సవాన్ని నిర్వహించేందుకు తెరుస్తారు. ఈ ద్వారాన్ని 1-11-1911 సం॥లో రంగాపురం జమీందారు మాడపాటి వెంకటేశ్వరరావు పంతులు, నూజివీడు వారు నిర్మించినట్లు తెలుస్తున్నది.

## పడమటి గోపురం :

ఈ గోపుర నిర్మాణము సమయములో పైకి ఎత్తబడుచున్న రాళ్ళు క్రిందకు జారిపడి పనివారు మరణించారట. ఈ నిర్మాణ బాధ్యతను సంధ్యాల నరసింహాచార్యులు గారు నిర్వహించారని తెలుస్తున్నది. ఆ విషాధ సంఘటన వల్ల ఆగిపోయిన పడమటి గోపుర నిర్మాణం యీనాటి వరకు పూర్తికాలేదు.

## దక్షిణ గోపురం :

కొందరు భక్తుల విరాళంతో నిర్మించిన యీ గోపురాన్ని 1992 కృష్ణా పుష్కరాల సంద ర్భంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు శ్రీ నూతక్కి కోటయ్య చొరవతో సుందరంగా తీర్చిదిద్దారు.

**ఘాట్ రోడ్ :** యుగయుగాల దేవునిగాను, భక్తులర్పించిన నైవేద్యాన్ని (పానకం) స్వయంగా ఆరగించే ఏకైక దైవంగాను పేరొందిన పానకాల స్వామిని దర్శించుకునేం దుకు ప్రతినిత్యం భక్తులు వస్తుంటారు. కొండపైకి మెట్ల ద్వారా చేరుకోవడం కొంతశ్రమతో కూడినప్పటికి ఎంతో సరదానిస్తుంది. కాని వృద్ధులు, పిల్లలు దేవుని దర్శించుకోవటం సంక్లిష్టంగా ఉంటూ

వస్తోంది. అలాంటి భక్తులకు సౌకర్యంగా వుండేందుకై ఎంతో కాలంగా కొండపైకి రోడ్డు నిర్మాణం జరగాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ వచ్చారు. మాజీ గవర్నర్ డాక్టర్ రంగరాజన్ సతీమణి శ్రీమతి హరిప్రియ చొరవతో అవి ఫలించి రూ. 1.25



కోట్ల అంచనాతో 1.3 కి.మీ.ల పొడవైన ఘాట్ రోడ్ రూపుదిద్దుకున్నది. ఆ ఖర్చులో 1/3వ వంతుగా రూ. 42 లక్షలు దేవస్థానం భరించవలసి వచ్చింది. ఆ సొమ్మును ప్రజల విరాళాల ద్వారా సేకరించేందుకు ప్రజా సంఘాలు, ప్రజా ప్రతినిధులతో పాటు దేవస్థాన కార్యనిర్వాహక అధికారి శ్రీ నూతక్కి కోటయ్య అలుపెరగని ప్రయత్నాలు చేశారు. ఆ ఫలితంగా విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ వారు రూ. 25 లక్షలు, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, దుగ్గిరాల వారు రూ. 5,55,555/-లు విరాళాలతోపాటు వందలాది ప్రజలు / సంస్థలు నుండి లక్షలాది రూపాయలు వసూలు చేసి నిర్మాణం పూర్తిచేశారు. ఘాట్ రోడ్ నిర్మాణానికి 28-7-2001న ప్రాథమిక సర్వే జరిగింది. 4-5-2002న అప్పటి రోడ్లు భవనాల శాఖామాత్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు శంఖుస్థాపన చేశారు. 10-5-2003న పనులు ప్రారంభమై శరవేగంతో పూర్తయ్యాయి. శాసనసభ్యులు శ్రీ మురుగుడు హనుమంత రావు నేతృత్వాన దేవాదాయ మంత్రి శ్రీ ఎం. సత్యనారాయణరావు కృష్ణా పుష్కరాల కానుకగా 2004, ఆగస్టు 29న ఘాట్ రోడ్‌ను ప్రారంభించారు. ఇది మంగళగిరిలో టూరిజం ప్రగతికి దోహదకారి అయింది. ఘాట్ రోడ్ ముఖద్వారాన్ని 'ఉడా' రూ. 5 లక్షల ఖర్చుతో నిర్మించింది.

## డోలీలు

కొండ మీదకు నడిచి వెళ్ళలేని భక్తులను "డోలీ" (ఊయల)లో కూర్చొండబెట్టి మోసుకుని వెళ్ళే సౌకర్యం వుంది. తరతరాలుగా దేవాలయపు సేవలో స్థిరపడిన, ఒక సామాజిక వర్గానికి చెందిన యువకులు యీ డోలీలను మోస్తుంటారు. పైకి వెళ్ళేటప్పుడు నిట్టనిలువుగా వుండే మెట్లపై వాలుగా డోలీని మోసుకొని వెళ్ళటానికి ఎంత నేర్పరితనం అవసరమో, క్రిందికి దిగేటప్పుడు ఆ డోలీ ముందుకు పడకుండా చూడటానికి కూడా అంతే నేర్పరితనం అవసరం. వారి నేర్పు చూసే వారికి సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఎన్నో దశాబ్దాలుగా వందలాది మంది భక్తులు యీ డోలీల ద్వారా కొండపైకి వెళ్ళి వస్తుండగా ఎవరూ ప్రమాదానికి గురైన సందర్భం లేకపోవటం యీ డోలీలు మోసే వారికి గర్వకారణం. ఘాట్‌రోడ్ నిర్మాణంతో యీ డోలీలు కనుమరుగై చరిత్రలో మిగిలిపోయే అవకాశం వుంది ❋

18. P.Nos. 179 **A Manual of Kistna District**
19. ఆంధ్రప్రదేశ్ భూ విజ్ఞానం - ఖనిజ పరిశ్రమలు, తెలుగు అకాడమీ (1996)
20. పేజి నెం. 976, ఆంధ్రప్రదేశ్ దర్శిని (1976), విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

# స్వాతంత్ర్య సమరం

బ్రిటీష్ వారి పాలన నుండి భరతమాతకు స్వేచ్ఛ కల్పించేందుకు కోట్లాది ప్రజలు వివిధ ఉద్యమాల ద్వారా ప్రాణాలకొడ్డి పోరాడారు. ఈ నేపథ్యంలో మంగళగిరి పరిసరాలలో కూడా గుర్తుంచుకోదగిన సంఘటనలు, సందర్భాలు చోటుచేసుకున్నాయి.

## విజయవాడ కాంగ్రెస్ మహా సభ

మంగళగిరికి 12 కిలో మీటర్ల దూరాన ఉన్న విజయవాడలో 1921వ సంవత్సరం మార్చి 31, ఏప్రెల్ 1వ తేదీలలో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరిగాయి. గొప్ప బహిరంగ సభ కూడా నిర్వహించారు.

ఈ సమావేశాల లోనే పింగళి వెంకయ్య గారు రూపొందించిన జాతీయ జెండా నమూనాను మహాత్మగాంధీ స్థిరపరిచారు. మంగళగిరికి అతి దగ్గరలో జరిగిన ఆ సభలు ఈ ప్రాంతంలో ఎంతో సంచలనాన్ని సృష్టించాయి. ప్రజలలో ఉత్సాహాన్ని నింపాయి. స్వాతంత్ర్య పిపాసను రగిలించాయి.

## [21]మహాత్మా గాంధీ ఆగమనం



23.01.1937వ తేదీన గుంటూరులో బహిరంగసభ జరిగింది. అనంతరం మధ్యాహ్నం సుమారు 3-4 గంటల మధ్య మహాత్మా గాంధీ ఓపెన్ టాప్ కారులో బెజవాడ బయలుదేరారు. మార్గమధ్యంలో మంగళగిరి ప్రాంత ప్రజలు ఆయనను వీక్షించి, జేజేలు పలికారు. ఆయన ఉపన్యాసం చేయకుండానే ముందుకు సాగారు. కృష్ణా నది ఆనకట్ట మీదుగా బెజవాడ చేరుకున్నారు.

## [22] సైమన్ కమీషన్ [23]

మన దేశ పరిస్థితులను అధ్యయనం చేయటానికి బ్రిటిష్ ప్రభుత్వం నియమించిన 'సైమన్ కమిషన్' వివిధ పట్టణాలలో పర్యటిస్తూ 25.02.1928న మంగళగిరి విచ్చేసింది. ఆ సందర్భంలో పట్టణంలో హర్తాళ్ పాటించారు. సైమన్ కమిషన్ వారికి నల్లజెండాలతో నిరసన తెలిపారు. యువకులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య స్మారక శిలాశాసనం

1948 ఫిబ్రవరి 13న అప్పటి పంచాయతీ అధ్యక్షులు శ్రీ చింతక్రింది కనకయ్య ఆధ్వర్యములో మన దేశ స్వాతంత్ర్యానికి గుర్తుగా ఒక శిలాశాసనాన్ని ప్రతిష్టించారు. 2004 జులై నెల వరకు దేవస్థానం ఎదురుగా వున్న ఈ శాసనాన్ని పట్టణ వికాసమండలి వారు ఆగస్టు నెలలో కారుమంచి వెంకటసుబ్బయ్య కళావేదిక వద్ద పునఃప్రతిష్ఠించారు. ఆ శాసన పాఠం ఇలా వుంది.



"బౌద్ధ వాఙ్మయ బ్రహ్మ శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య గారిచే 13-2-1948న ప్రతిష్ఠించబడిన శిలాశాసనము.

శ్రీ సర్వజన్మామ సం॥ అధిక శ్రావణ బహుళ త్రయోదశి క్రీ॥శ 1947 ఆగస్టు 14 గురువారం రాత్రి 12 గం॥ 9ని॥ 7 సెకండ్లకు రాహుయుత వృషభలగ్నమున బ్రిటీష్ ప్రభుత్వం నుండి భారత స్వాతంత్ర్యాధికార స్వీకారణ పుణ్యకాలమున - మహాత్మగాంధి గారి నాయకత్వమున కాంగ్రెసు ఆదేశములనను సరించి స్వాతంత్ర్య సాధన ఉద్యమంలో పాల్గొని జాతీయ స్వాతంత్ర్య గౌరవ ప్రతిష్టలకు సర్వ సమర్పణం చేసిన వీరులకు జేజేలొనర్చి వారికి స్మారక చిహ్నముగా ప్రతిష్ఠించబడిన శిలాశాసనము.

పంచాయతి బోర్డు

చింతక్రింది కనకయ్య, ప్రెసిడెంటు

జి. నారాయణరావు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు"

## [24]బాబూ రాజేంద్ర ప్రసాద్ సందర్శన

ఆంధ్రలో స్వాతంత్ర్య సంగ్రామ స్థితిగతుల్ని స్వయంగా పరిశీలించేందుకు మాజీ రాష్ట్రపతి శ్రీ బాబూ రాజేంద్ర ప్రసాద్ 1935వ సంవత్సరం నవంబరులో వివిధ పట్టణాలు, గ్రామాలను సందర్శించారు. మంగళగిరి కూడా విచ్చేశారు.

## క్విట్ ఇండియా ఉద్యమం

క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా తెనాలి, గుంటూరు పట్టణాలలో తొమ్మిది మంది ఉద్యమకారులు మృతి చెందారు. దానితో రెచ్చి పోయిన ఉద్యమకారులు 1942 ఆగస్ట్ 14వ తేదీన వివిధ రైల్వే లైనులను ధ్వంసం చేశారు. దానిలో భాగంగా గుంటూరు, విజయవాడల మధ్య రైల్వే లైను కూడా దెబ్బతింది.

## స్వాతంత్ర్య రజతోత్సవ స్థూపం



1972లో 25వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భముగా మండల పరిషత్ కార్యాలయంలో రజతోత్సవ స్థూపాన్ని నెలకొల్పారు. మంగళగిరి ప్రాంతానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లను శిలాఫలకములో పొందుపరచారు.

# [25]సమరయోధులు[26]

మంగళగిరి ప్రాంతంలో జరిగిన వివిధ స్వాతంత్ర్య పోరాట ఉద్యమాలలో స్థానికులే గాక, వివిధ ప్రాంతాల వారు కూడా పాల్గొన్నారు. అందుబాటులోనికి వచ్చిన సమాచారం మేరకు కొందరి వివరాలు తెలియపరుస్తున్నాము.

**శ్రీ వూరే కోటేశ్వరరావు :** వీరు స్థానికులు, తండ్రి సుబ్బారావు. విద్యార్థి దశలో 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని 2-10-1942 నుండి ఆరు నెలలపాటు 'ఆలిపురం' క్యాంపు జైలులో కఠిన కారాగారవాసం అనుభవించారు. మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు.

**శ్రీ వూరే సుబ్బారావు :** వీరు "భరతమాత భజన" చేసినందున కర్నూలు స్టేషనరి సబ్-మెజిస్ట్రేటు ఆదేశానుసారం ఆరునెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. అంతేకాకుండా 144వ సెక్షను ధిక్కరించినందున 5-1-1922న నాలుగు నెలల శిక్షకు గురైనారు. వీరు వృత్తి రీత్యా ఉపాధ్యాయులు, కమ్యూనిస్టు పార్టీకి పునాది వేసినవారిలో ఒకరు.

**శ్రీ చెఋవు లక్ష్మీనరశింహం :** వీరు ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 24-5-1930 నుండి ఒక సంవత్సరం పాటు కఠిన కారాగార శిక్ష, రూ. 100/- జరిమానాకు గురై రాజమండ్రి, కోయంబత్తూరు, ఆలిపురం జైళ్ళలో శిక్షలను అనుభవించారు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం వల్ల 13-3-1931న విడుదలయ్యారు.

**శ్రీ రామనాథం సుబ్బారావు :** వీరు స్థానికులు, తండ్రి వెంకయ్య. శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొని 1-2-1932 నుండి రాజమండ్రి జైలులో 9 నెలలు కఠిన కారాగార శిక్షను అనుభవించారు. వంద రూపాయలు జరిమానా కూడా చెల్లించారు. వీరు చేనేత రంగంలోను, పద్మశాలీయ సంఘంలోను ముఖ్య పాత్ర వహించారు.

**శ్రీ వెనిగళ్ళ నరసింహస్వామి :** వీరు కూడా స్థానికులే. 17-1-1911న జన్మించారు. తండ్రి రత్తయ్య. 1930లో పాఠశాలను బహిష్కరించడంతో అరెస్ట్ చేసి రేపల్లె జైలులో వుంచారు. జాతీయ జెండాను ఎగురవేసినందువల్ల 26-1-1932న మరో మారు జైలు పాలయ్యారు.

**శ్రీ నాళం వెంకటరత్నం :** వీరిది మంగళగిరి. ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నందున 7-7-1930న ఆరు నెలల జైలుశిక్ష విధించి ఆలిపురం క్యాంపు జైలుకు పంపారు.

**శ్రీ జంజనం నరశింహ్వం :** వీరు స్థానిక చేనేత కుటుంబానికి చెందినవారు. తండ్రి కోటయ్య. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 3-12-1942 నుండి ఆలిపురం క్యాంపు జైలులో ఒక సంవత్సరం కఠినకారాగార శిక్ష అనుభవించారు.



**శ్రీ కాళంగి వెంకటరత్నం :** 4-1-1907న జన్మించిన వీరు మంగళగిరి వాస్తవ్యులు, తండ్రి చెంచుపున్నయ్య. 23ఏళ్ళ వయసులో "శాసనోల్లంఘన ఉద్యమం"లో పాల్గొని 5-7-1930 నుండి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష అనుభవించారు. నలుబది రూపాయల జరిమానా కూడా చెల్లించారు. తిరిగి అదే ఉద్యమంలో పాల్గొని 12-4-1932న ఆరునెలల కఠిన కారాగార శిక్షకు గురై రాజమండ్రి, కడలూరు జైళ్ళలో శిక్షను అనుభవించారు.

వీరు వృత్తిరీత్యా పత్రికా విలేఖరి. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. మంగళగిరి పంచాయతి ప్రెసిడెంటుగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు.

**శ్రీ నిడమర్తి లక్ష్మీకాంతారావు :** వీరు స్థానికులు, తండ్రి సుబ్బారావు. "క్విట్ ఇండియా" ఉద్యమంలో పాల్గొనినందున "2-10-1942"న ఆరునెలలు కఠిన కారాగార శిక్ష విధింపబడి ఆలిపురం క్యాంపు జైలులో వున్నారు.

**శ్రీ దామర్ల నాగభూషణం :** వీరు మంగళగిరి వాస్తవ్యులు. వీరిపై నిర్బంద ఉత్తర్వులు జారీ కావటంతో 19-9-1942 నుండి 7 నెలల పాటు అజ్ఞాతంలో వున్నారు. 20-12-1919న జన్మించిన శ్రీ నాగభూషణం 18-12-2000న మరణించారు.

**శ్రీమతి ఎస్. సుభద్రమ్మ :** వీరు కాంగ్రెసు పార్టీలో "ఆంధ్ర నియంత" పదవిని అలంకరించారు. ఆమెను 1932 ఏప్రిల్ 2న పెనుమాక గ్రామంలో అరెస్ట్ చేశారు. దీనితో ఆమె సంవత్సరం కఠిన కారాగార శిక్ష అనుభవించ వలసి వచ్చింది.

**శ్రీ కావూరు రామకోటయ్య :** 1912లో జన్మించిన వీరిది పెనుమాక గ్రామం. తండ్రి కొండయ్య. "శాసనోల్లంఘన ఉద్యమం"లో పాల్గొన్న వీరికి 27-1-1932 నుండి ఆరునెలలు కఠిన కారాగారశిక్షను ఏబది రూపాయల జరిమానా విధించి రాజమండ్రి జైలుకు పంపారు. ఆ జరిమానా వసూలు నిమిత్తం వీరి తండ్రికి చెందిన ఆవును, గేదెలను ప్రభుత్వము వారు జప్తుచేసి తరువాత హామీపై వదిలారు.

**శ్రీ మేకా కోటిరెడ్డి :** వీరు పెనుమాక గ్రామ వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. తండ్రి వెంకటరెడ్డి. "శాసనోల్లంఘనఉద్యమం"లో పాల్గొన్నందుకు వీరికి 15-3-1932న రెండు సంవత్సరములు కఠిన కారాగారశిక్ష విధించారు. రాజమండ్రి, కన్నూరు జైళ్ళలో శిక్షననుభవించారు. శ్రీ కోటిరెడ్డి 1955 ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తరపున మంగళగిరి నియోజక వర్గ శాసన సభ్యునిగా ఎన్నికయ్యారు. ❋

---

21. పేజి నెం. 817, ఆంధ్రప్రదేశ్‌లో గాంధీజీ, తెలుగు అకాడమీ 1978

22. History of Freedom movement in Guntur Dist., Dr. B. Seshagiri Rao

23. A.P. Dist., Gazetteers, Guntur (1977) Govt. Publications, A.P.

24. గుంటూరు జిల్లా స్వరాజ్య ఉద్యమం (1974), శ్రీ మాదల వీరభద్రరావు.

25. Role of women in Freedom struggle in A.P., Dr. K. Janaki, Neelkamal Publications, Hyd.,

26. Who's who of Freedom Struggle in A.P. Vol-I (1978), Govt. of A.P.

# రాజకీయాలు

మంగళగిరి పట్టణం రాజకీయంగా రాష్ట్రంలోనే విలక్షణమైన ప్రాంతాలలో ఒకటి. ఇక్కడి ప్రజలకు రాజకీయ స్పృహ ఎక్కువ. కులాల వారీగా పద్మశాలి ఓటర్లు ఎక్కువకాగా, భావాల రీత్యా వామపక్ష ఓటర్లు ప్రత్యేకంగా కన్పిస్తారు. రాజకీయ చైతన్యం ఎక్కువవున్న యీ పట్టణంలో అన్ని రకాల రాజకీయ సిద్ధాంతాలను ప్రచారం చేసుకునేందుకు, వ్యక్తిగత రాజకీయ అభిప్రాయాలను వెల్లడించటానికి స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యాలు మెండుగా వున్నాయి. అన్ని రాజకీయ పక్షాలు తమ ఉనికిని యిక్కడ చాటుకుంటుంటాయి. ఒకరి రాజకీయ సిద్ధాంతానికి మరొకరు అడ్డురారు. రాజకీయంగా ఘర్షణ పూరిత వాతావరణం కాగడా పెట్టి వెతికినా కనపడదు.

దేశంలో వున్న రాజకీయ గ్రూపులన్నిటికి ఇక్కడ నాయకులున్నారు కాని, కార్యకర్తలు మాత్రం లేరు. ఇక్కడ ఉన్నంత రాజకీయం ఢిల్లీలో కూడ వుండదనేది ఒక నానుడి. ఈ ప్రాంతం ఏ పార్టీకిగాని, వ్యక్తికిగాని సొంతంకాదు. ఎన్నికలలో వ్యక్తులనేగాక, రాజకీయ ఎజెండాను కూడ చూచి ఓట్లు వేస్తారు. ఎన్నికల సమయంలో యిక్కడి రాజకీయ పరిస్థితి అనిశ్చితం.

రాజకీయ సమీకరణాలు సహజ సిద్ధంగా జరుగుతుంటాయి. ప్రతి ఎన్నికలలోను ఎవరు గెలుస్తారనే విషయాన్ని ఖచ్చితంగా చెప్పటం కుదరదు. ఒకరే రాజకీయ అధికారాన్ని యిక్కడ కొనసాగించటం తక్కువ. రాష్ట్రస్థాయి రాజకీయ విశ్లేషకులకు కూడ యిక్కడి ఓటర్ల నాడి అందదు. ఇక్కడ వ్యక్తిగత కక్షలు, రౌడీయిజం, హత్యా రాజకీయాలు లేవు. చేనేతతోపాటు పుణ్యక్షేత్రంగా ప్రాముఖ్యత వున్న యీ పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దటంలో యిక్కడి రాజకీయ నాయకులు పూర్తి స్థాయి శ్రద్ధను చూపలేదని చెప్పవచ్చు. 1985 శాసనసభ ఎన్నికలలో సినీనటి జమున మంగళగిరి నుండి పోటీచేసిన సందర్భంలో యీ ప్రాంతం రాష్ట్రస్థాయిలో ప్రజల దృష్టిని ఆకర్షించింది. మరో సినీనటి శారద పార్లమెంటుకు ఒకసారి ప్రాతినిధ్యం వహించి, మరోసారి ఓటమిని చవిచూచారు.

1972లో యిక్కడి నుండి ప్రాతనిధ్యం వహించిన శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ శాసనసభలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించగా, 1985లో డా॥ కోటేశ్వరరావు రాష్ట్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం పొందారు.

2004 నాటికి పట్టణంలో 43,724 మంది, నియోజకవర్గంలో 1,57,780 మంది ఓటర్లు ఉన్నారు.

## మంగళగిరి నియోజకవర్గ భౌగోళిక స్వరూపం

మంగళగిరి గుంటూరు-విజయవాడ నగరాల మధ్య వుంది. ఉత్తర వాయువ్యంగా తుళ్లూరు మండలంలోని వెలగపూడి నుండి కృష్ణానది కరకట్ట వెంబడి, తూర్పున రామచంద్రాపురం వరకు, దక్షిణాన కాజ వెంబడి యూనివర్శిటీ కొంత భాగం వరకు, నైరుతి దిశగా కంతేరు, పడమర భాగాన నీరుకొండ వరకు విస్తరించి వుంది. మొత్తం 32 గ్రామాలు, ఒక మున్సిపాలిటి, 4 మండలాలు వున్నాయి.

1955, 1962, 1967, 1972, 1978, 1985, 1989, 1994, 1999, 2004 సం॥లలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి.

మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గము నెంబరు 102.

# శాసనసభ్యులు

## శ్రీదర్శి లక్ష్మయ్య



శ్రీ దర్శి లక్ష్మయ్య మొదటితరం కమ్యూనిస్టు నాయకులు, "పెదకూరపాడు" గ్రామానికి చెందినవారు. 1952 నాటికి ఆ గ్రామం మంగళగిరి శాసనసభ నియోజకవర్గ పరిధిలో వుండేది. 1952లో జరిగిన మొదటి శాసనసభ ఎన్నికలలో ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీచేసి కృషికార్ లోక్ పార్టీ అభ్యర్థి శ్రీ ఐ. గోవిందరావుపై 17235 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

మంగళగిరి శాసనసభా నియోజకవర్గానికి మొదటి శాసనసభ్యునిగా, మొదటి కమ్యూనిస్టు శాసన సభ్యునిగానే గాక ఇప్పటివరకు ఎక్కువ మెజారిటీ పొందిన ఎం.ఎల్.ఏ.గా మంగళగిరి రాజకీయ చరిత్రలో నమోదయినారు. వీరు 16-3-1966న మరణించారు.

## శ్రీ మేకా కోటిరెడ్డి



మంగళగిరి శాసనసభా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి కాంగ్రెస్ వాది శ్రీ కోటిరెడ్డి. వీరిది పెనుమాక గ్రామం. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని రెండు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష అనుభవించిన వీరు 1955 ఎన్నికలలో

కమ్యూనిస్టు అభ్యర్థి శ్రీ నూతక్కి వెంకట రంగారావుపై 5,086 ఓట్ల ఆధిక్యతతో మంగళగిరి శాసనసభ్యులుగా గెలుపొందారు. వీరు యీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన కాలంలో సుమారు రూ. 25 లక్షలతో కృష్ణానదికి కరకట్ట వేయించి, 18 గ్రామాలు నది నీటి ముంపునకు గురికాకుండా చేశారు. మంగళగిరిలో ఆనాటి టి.బి. శానిటోరియం ఏర్పాటుకు కృషిచేశారు. 23-10-1903న జన్మించిన శ్రీ కోటిరెడ్డి 26-5-1962న మరణించారు.

## శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ



మంగళగిరి అభివృద్ధిలో తనదంటూ శాశ్వత ముద్రవేసుకున్న ధన్యజీవి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ. "చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా, గతమెంతో ఘన కీర్తి గలవోడా"-- అంటూ తెలుగు గౌరవాన్ని పాటగా మలచిన కవిగాను, 1968-72 మధ్యకాలంలో విశాలాంధ్ర దినపత్రికా సంపాదకుని గాను, ప్రముఖ కమ్యూనిస్టు నాయకునిగాను, కార్మిక సంఘాల ప్రతినిధి గాను పేరు పొందారు.

1962 అసెంబ్లీ ఎన్నికలలో మంగళగిరి నియోజకవర్గం నుండి పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ తమ్మారంగారెడ్డిపై 5146 ఓట్ల మెజారిటీతో గెలుపొంది శాసనసభలో అడుగుపెట్టారు. 1972 ఎన్నికలలో సిపిఐ అభ్యర్థిగా పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి శ్రీ గుజ్జుల గంగాధరరెడ్డిపై 5369 ఓట్ల మెజారిటీతో శాసనసభ్యునిగా గెలుపొందారు. అదే సమయంలో శాసనసభలో ప్రతిపక్ష నాయకుని పదవిని వీరు చేపట్టటంతో - మంగళగిరి రాష్ట్రస్థాయిలో ప్రాముఖ్యత పొందింది. ఇక్కడి శాసనసభ్యులలో ప్రతిపక్షనాయకుని హోదాపొందినది వీరే కావటం విశేషం.

1972లో రాష్ట్రాన్ని కుదిపివేసిన "జై ఆంధ్ర" ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో మొదటి ప్రదర్శన యిక్కడి నుండే ప్రారంభించారు. 1975లో "పట్టణ పైలట్ వాటర్ స్కీం" ఫలించటానికి వీరి కృషే కారణం. మంగళగిరిలో డిగ్రీ స్థాయి విద్య అందు బాటులోలేని రోజుల్లో 1977లో విటిజెయం డిగ్రీ కాలేజి వీరి కృషివల్లనే ప్రారంభమైనది. దాదాపు అన్ని రంగాల ప్రగతికి ఆయన పాటు పడ్డారు. 1917లో జన్మించిన శ్రీ వేములపల్లి 8-4-2000 నాడు దివంగతులైనారు.

## శ్రీ తులాబందుల నాగేశ్వరరావు



మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వెనుకబడిన తరగతుల నేతలలో శ్రీ తులాబందుల నాగేశ్వరరావు అగ్రగణ్యుడు. వీరు వడ్డేశ్వరం గ్రామానికి చెందినవారు. 1954-59 కాలంలో ఆంధ్ర, ఒరిస్సా ప్రాంతాలకు యస్.సి. / యస్.టి.ల అసిస్టెంటు కమిషనర్‌గా ఉన్నత ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహించారు. వెనుకబడిన కులాల కమిషన్ సభ్యత్వ పదవిని చేపట్టి రాష్ట్రంలో వెనుకబడిన కులాల అభివృద్ధికి పాటుపడినారు. న్యాయవాద వృత్తి చేసి, నిరాడంబర జీవితం గడిపిన వీరు బలహీన వర్గాల అభివృద్ధికి రేయింబవళ్ళు శ్రమించారు.

1967లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ అభ్యర్ధిగా పోటీచేసి, అప్పటి వరకు శాసనసభ్యులుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీ అభ్యర్ధి శ్రీ వేములపల్లి శ్రీకృష్ణపై 1874 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆనాటికి శాసనసభకు ప్రాతినిధ్యం వహించిన స్థానికులలో వీరు రెండవవారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ నుండి యీ నియోజకవర్గంకు ప్రాతినిధ్యం వహించినవారిలో కూడ రెండవవారు. 21-5-1917న జన్మించిన శ్రీతులాబందుల 8-5-1986న దివంగతులైనారు.

### మంగళగిరికి 'ఇద్దరు' ఎమ్.ఎల్.ఎ.లు



శ్రీ ప్రసాద్

1994నుండి 1999వరకు మంగళగిరిలో యిద్దరు శాననసభ్యులుండే వారు. వారిలోఒకరు శ్రీ నిమ్మగడ్డ రామమోహన రావు ఐతే మరొకరు శ్రీ జి.యం.యన్.వి. ప్రసాద్.



శ్రీ రామమోహనరావు

శ్రీ రామమోహనరావు సిపిఎం పార్టీ తరపున మంగళగిరి నియోజకవర్గానికి శాసనసభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు. కాగా శ్రీ ప్రసాద్ సిపిఐ పార్టీ తరపున మంగళగిరి ప్రక్కనున్న తాడికొండ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

వీరిరువురు వామపక్షాలకు చెందిన వారవటం ఒక విశేషమైతే - యిద్దరూ మంగళగిరి పట్టణంలోనే కాపురం వుండడం మరో విశేషం. ఈ పట్టణంలో ఏ సభ జరిగినా ఆ యిద్దరిని ఆహ్వానించటం పరిపాటిగా వుండేది. నివాసం దృష్ట్యా ఆ ఐదు సంవత్సరాలు మంగళగిరిలో యిద్దరు శాసనసభ్యులుండటం జరిగింది.

# మంత్రిగా ఎదిగిన శాసన సభ్యుడు

## డా॥ యం.యస్.యస్. కోటేశ్వరరావు

డా॥ యంయస్‌యస్ గా పేరుపొందిన వీరు మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని "నీరుకొండ" గ్రామానికి చెందినవారు. వీరి పూర్తిపేరు మాదల సాంబశివ కోటేశ్వరరావు. వీరిని "డాక్టర్ గారు" అని కూడా పిలుస్తుంటారు.

వృత్తిరీత్యా వైద్యులైన వీరు 1968లో మంగళగిరిలో ప్రైవేట్ ప్రాక్టీసు ప్రారంభించి ఉత్తమ వైద్యులుగా పేరుపొందారు. 1983 అసెంబ్లీ ఎన్నికలలో యీ నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీచేసి, కాంగ్రెసు అభ్యర్థి శ్రీ రాయపాటి శ్రీనివాస్‌పై గెలుపొంది మంగళగిరి నుండి తొలి తెలుగుదేశం శాసనసభ్యునిగా నమోదయ్యారు.



1985 ఎన్నికలలో మరలా తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీమతి జమునపై గెలుపొందారు. రాష్ట్ర వ్యాప్తంగా యీ పోటీఅందరిని ఆకర్షించింది. డా॥ కోటేశ్వరరావు గెలుపును తన గెలుపుగా భావించిన శ్రీ ఎన్‌టిఆర్ ఆయనకు అమాత్య పదవి అప్పగించారు. 1985-87ల మధ్య వీరు "వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా" పనిచేశారు. మంత్రి పదవి నధిరోహించిన మొదటి శాసనసభ్యునిగా మంగళగిరి చరిత్రకెక్కారు.

1984లో విజయవాడ-గుంటూరు-తెనాలి పట్టణాభివృద్ధి సంస్థకు చైర్మన్‌గా, పనిచేసి - మంగళగిరిలో 'ఉడా' వారి "అమరావతి టౌన్‌షిప్" ఏర్పాటుకు, పట్టణంలో రోడ్ల అభివృద్ధికి తోడ్పడినారు. ఆర్టీసి బస్‌స్టేషను, బస్‌డిపో, ఫైర్‌స్టేషన్, టిటిడి కల్యాణమండపం వీరి ఆధ్వర్యంలో నూతనంగా రూపుదిద్దుకున్నాయి. అప్పటి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి జరిగింది. టి.బి. శానిటోరియం స్థానంలో - యూనివర్శిటీ జనరల్ ఆసుపత్రి ఆవిర్భావం వీరి కృషి ఫలితమే. పట్టణంలో ప్రస్తుతం అమలులోనికి వచ్చిన 'కృష్ణాజలాల పథకం'లోను, శ్రీపానకాల స్వామి ఘాట్‌రోడ్ నిర్మాణంలోను వీరి కృషి అనంతం. 12-10-1943న జన్మించిన వీరు 22-11-2001న కన్నుమూశారు. మంగళగిరి ప్రజలు కలకాలం గుర్తుంచుకొనే విధంగా వీరి కాంస్య విగ్రహానికి బస్టాండు వద్ద ప్రతిష్ఠించబడింది.

## శ్రీగద్దె వెంకటరత్తయ్య



మంగళగిరి నియోజకవర్గ పరిధిలో వున్న '' ప్రారంభం కాలేదు.మల్కాపురం'' గ్రామానికి చెందిన శ్రీ గద్దె వెంకటరత్తయ్య 1959-62 మధ్య మంగళగిరి సమితి అధ్యక్ష పదవిని నిర్వహించారు. 1978లో జరిగిన శాసనసభ ఎన్నికలలో ''జనతాపార్టీ'' తరపున సిపిఎం పార్టీ మద్దతుతో యిక్కడ పోటీ చేసిన వీరు తమ సమీప ప్రత్యర్ధి కాంగ్రెసుకు చెందిన శ్రీ తులాబందుల నాగేశ్వరరావుపై 4033 ఓట్ల మెజారిటితో గెలుపొందారు. వీరు ప్రస్తుతం రాజకీయాలకు దూరమయ్యారు. హైదరాబాదులో నివసిస్తున్నారు.

## శ్రీగోలి వీరాంజనేయులు



మంగళగిరి శాసనసభా నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన వారిలో 9వ వారైన శ్రీ గోలి వీరాంజనేయులు విలక్షణమైన వ్యక్తి. మంగళగిరి పట్టణంలో పుట్టి పెరిగి శాసనసభ్యుని స్థాయికి ఎదిగిన వారిలో మొదటి వారు. చేనేత కేంద్రమైన మంగళగిరి నుండి శాసనసభ్యుని హోదా పొందిన మొదటి చేనేత కార్మికుడు శ్రీ గోలి. పార్టీ జెండాను భుజాన మోసినవారు సాధారణ కార్యకర్తగానే వుండి పోనక్కర్లేదని, యం.యల్.ఏ. లాంటి ఉన్నత పదవులు పొందవచ్చునని నిరూపించారు. 1989లో జరిగిన ఎన్నికలలో శ్రీ 'గోలి' కాంగ్రెస్ పార్టీ అభ్యర్ధిగా పోటీచేసి, సిపిఎంకు చెందిన శ్రీ సింహాద్రి శివారెడ్డిపై 9564 ఓట్ల మెజారిటీతో గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. 1989-1994ల మధ్య శాసనసభ్యునిగా వుంటూ - స్టేట్ టెక్స్టైల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్‌గాను, వెనుకబడిన తరగతుల శాసనసభా సంఘం ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ ప్రాంతంలో చేనేత అభివృద్ధికి కృషిచేసిన శ్రీ గోలి వీరాంజనేయులు తన పదవీకాలం పూర్తిగాకుండానే 17-6-1994న దివంగతులయ్యారు.

## శ్రీ నిమ్మగడ్డ రామ్మోహనరావు

ఇంజనీరింగ్ పట్టభద్రులైన శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావు మంగళగిరి నియోజకవర్గ పరిధిలో గల 'కృష్ణాయపాలెం' గ్రామానికి చెందిన వారు. వ్యవసాయ, రాజకీయ కుటుంబం

నుండి వచ్చారు. 1981లో మంగళగిరి సమితి అధ్యక్షులుగా రాజకీయ ప్రవేశం చేసి 1992 వరకు మండల పరిషత్ అధ్యక్షునిగా పని చేశారు.



1994లో జరిగిన శాసనసభ ఎన్నికలలో యీ నియోజకవర్గం నుండి మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ దామర్ల ఉమామహేశ్వరరావు పై 14899 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో 1978 తర్వాత మరలా వామపక్షాలకు శాసనసభకు ప్రాతినిధ్యం రావటంతోపాటు, సిపిఎం పార్టీ మొదటి శాసనసభ్యునిగా చరిత్రలో నమోదయ్యారు. వడ్డేశ్వరం, కృష్ణాయపాలెం, పెనుమాక వంతెన కేటాయింపులు చేయించి ఫైర్‌స్టేషన్, ఎలక్ట్రిసిటి ఆఫీసు, కోర్టు కాంప్లెక్స్ ఏర్పడేలా కృషి చేశారు. ఏ విషయం మీదనైనా – నిర్మొహమాటంగా అభిప్రాయం వెల్లడిస్తూ అనర్గళంగా ఉపన్యసించటంలో శ్రీరామమోహనరావు దిట్ట.



## శ్రీ మురుగుడు హనుమంతరావు

11-3-1947న సామాన్య చేనేత కుటుంబంలో జన్మించి, చిన్న గుమాస్తాగా జీవితాన్ని ప్రారంభించి శాసనసభ్యునిగా ఎదిగిన శ్రీమురుగుడు హనుమంతరావు 11వ శాసనసభలో మంగళగిరి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. 12వ శాసనసభకు కూడ ఎన్నికై ప్రజా సేవలో కొనసాగుతున్నారు. మంగళగిరిలో పుట్టి శాసన సభ్యుని స్థాయిని పొందినవారుగాను, యిక్కడి చేనేత కుటుంబం నుండి ఎం.ఎల్.ఏ.గా ఎదిగినవారిలోను రెండవ వ్యక్తిగా శ్రీ మురుగుడు హనుమంతరావు మంగళగిరి చరిత్రలో నమోదయ్యారు. 1999లో జరిగిన శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి సిపియం అభ్యర్థి శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావుపై 12024 ఓట్ల మెజారిటీతో మొదటిసారిగా గెలుపొందారు. 2004 ఎన్నికలలో బి.జె.పి. అభ్యర్థిని శ్రీమతి తమ్మిశెట్టి జానకిపై 5381 మెజారిటీతో వరుసగా రెండవసారి విజయం సాధించారు. 'కృష్ణాజలాల పథకాన్ని' అన్ని పార్టీల సహకారంతో అమలు జరగడంలో వీరి చొరవ,కృషి వున్నాయి. పానకాల స్వామి ఘాట్‌రోడ్‌ను పట్టుదలతో పూర్తిచేయించారు. పెదవడ్లపూడి రైలు ఓవర్ బ్రిడ్జి పూర్తి కావస్తోంది. నియోజకవర్గంలోని నిడమర్రు, కృష్ణనగర్, యర్రబాలెం, చినకాకాని గ్రామాలలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నీటి సమస్య తీరటానికి కృషిచేశారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి పాటుపడుతున్నారు. పురాతన గాలిగోపురం మరమ్మతు పనులు, పెదకోనేరు జీర్ణోద్ధరణ కార్యక్రమాలను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారు. శ్రీ హనుమంతరావు రాజకీయ వ్యూహాలలో దిట్ట అవటం వల్లనే వరుసగా రెండవసారి శాసనసభకు ఎన్నికయి రికార్డు సృష్టించారని పరిశీలకులు చెపుతున్నారు. వీరి చాకచక్యం కారణంగానే మండల పరిషత్, మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పాగా వేయగలిగింది. శాసనసభ్యుని హోదాలో

విదేశాలు చుట్టివచ్చారు.

## సినిమా - రాజకీయాలు



సినిమా రంగాన్ని, రాజకీయాలను మమేకం చేసిన శ్రీ యన్.టి. రామారావు 1947లో మంగళగిరిలో సబ్-రిజిస్ట్రారుగా పనిచేశారు. ఆ తరువాత సినీరంగ ప్రవేశం చేశారు. ఈ ప్రాంత ప్రముఖులలో ఒకరైన శ్రీ కారుమంచి వెంకట సుబ్బయ్య సహనిర్మాతగా కలిసి 'పిచ్చిపుల్లయ్య' సినిమాను నిర్మించారు. 1968లో ఉత్తమ నటునిగా ఫిలింఫాన్స్ అసోసియేషన్ అవార్డును మంగళగిరిలో జరిగిన ఉత్సవంలో అందుకున్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీ గోలి గోపాలరావు, శ్రీ రామారావులు విద్యార్థి దశలోను, రాజకీయాలలోను కొంతకాలం కలసిమెలసి పనిచేశారు. తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుని హోదాలోను, ముఖ్యమంత్రి హోదాలోను శ్రీ యన్.టి.ఆర్. చాలాసార్లు పట్టణాన్ని సందర్శించి ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశారు.



మంగళగిరికి సమీపాన గల దుగ్గిరాలకు చెందిన సినీనటి జమునకు పట్టణంతో విడదీయలేని అనుబంధం వుంది. తన ఏడవ ఏటనుండే ఆమె పానకాల స్వామి దర్శనానికి యిక్కడకు వస్తుండేవారు. సినిమా కథానాయికగా ఎదిగిన తరువాత 1968లో ఆంధ్రప్రదేశ్ ఫిలిం ఫాన్స్ అసోసియేషన్ నిర్వహించిన బ్యాలట్‌లో ఉత్తమ నటిగా ఎన్నికయ్యారు. స్థానిక శ్రీనివాస మహల్ జరిగిన రాష్ట్రస్థాయిఉత్సవంలో పాల్గొని ఉత్తమనటునిగా ఎన్నికైన శ్రీ యన్.టి.రామారావుతో పాటుగా అవార్డు స్వీకరించారు. ఆ తరువాత రాజకీయాలపై మక్కువ పెంచుకొని 1985 అసెంబ్లీ ఎన్నికలలో మంగళగిరి నియోజకవర్గం నుండి కాంగ్రెసు తరపున పోటీచేసి ఓడిపోయారు.



తెనాలి పట్టణానికి చెందిన సినీనటి శ్రీమతి తాడిపర్తి శారద చేనేత వర్గాలకు చెందినవారు. సినీగ్లామర్ ప్రాతిపదికగా 1996 లోక్‌సభ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తెనాలి నియోజకవర్గం నుండి పోటీచేసి విజయమందుకున్నారు. అయితే 1998లో జరిగిన లోక్‌సభ మధ్యంతర ఎన్నికలలో ఆమె అదే స్థానం నుండి తిరిగి పోటీచేసి పరాజితులయ్యారు. శారద రాజకీయ ఎదుగుదలకు కీలకమైన మంగళగిరి చేనేత వర్గాలు ఆ తరువాతి పరిణామాలలో ఆమెకు దూరమయ్యాయి. దీనితో ఆమె చేదు అనుభవం చవిచూచారు.

# ఏకైక శాసనమండలి సభ్యుడు

## శ్రీ దామర్ల రమాకాంతరావు



మంగళగిరి నుండి శాసన మండలిలో అడుగుపెట్టిన వారిగా శ్రీ దామర్ల రమాకాంత రావు చరిత్రకెక్కారు. 1913 జూన్‌లో జన్మించిన వీరు మాజీ రాష్ట్రపతి శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ ఆంధ్రా యూనివర్శిటి వైస్-ఛాన్సలర్‌గా వుండగా వారి ముఖ్య శిష్యునిగా పరిగణన పొందారు. 1935లో యం.ఏ. పట్టా అందుకున్నారు.

చేనేత రంగ అభివృద్ధికై రాష్ట్ర స్థాయిలో జరిగిన వివిధ ఉద్యమాలలో ప్రముఖ పాత్ర వహించి, వివిధ పదవులను చేపట్టారు.

రాష్ట్ర చేనేత సహకార సంఘ అధ్యక్షునిగా, రాష్ట్ర సలహా సంఘ సభ్యునిగా, చేనేత జీత నిర్ణయ సంఘ సభ్యునిగా, కేంద్ర హ్యాండ్‌లూం బోర్డు సభ్యునిగా, రాజమండ్రి, చీరాల, గుంతకల్లు, నెల్లూరు సహకార నూలు మిల్లులకు వివిధ హోదాలలో పనిచేసి చేనేత రంగానికి ఎనలేని సేవచేశారు. తిరుపతి దేవస్థాన ట్రస్టీగా కూడా పనిచేశారు.

వీరి కృషికిగాను మొదటి శాసనమండలిలో శాసనసభ్యులచే ఎన్నుకొనబడు కోటాలో ఎన్నికై యం.యల్.సి.గా సేవలందించారు. శాసనమండలి సభ్యునిగా చేనేత కార్మికుల అభివృద్ధికి, పరిశ్రమాభివృద్ధికి అహర్నిశలు పనిచేశారు.


ఆంధ్రపత్రిక, జనవాణి పత్రికలకు సబ్-ఎడిటర్ గాను, చేనేత, భారత్ పత్రికలకు ఎడిటర్‌గాను పనిచేసిన వీరు పట్టణంలో విద్యాభివృద్ధికై విశేషంగా కృషిచేశారు.

చేనేత ఉద్యమంలో మంగళగిరికి రాష్ట్రస్థాయి ప్రాచుర్యం కల్పించిన వ్యక్తిగా ఆయన పేరుపొందారు. మంగళగిరి మణిరత్నాలలో ఒకరైన శ్రీ రమాకాంతరావు 28-6-1969న


మరణించారు.

# పార్లమెంటు సభ్యులు

## శ్రీ ఎస్.వి.ఎల్. నరసింహం



వీరు గుంటూరుకు చెందిన వారు. ప్రముఖ సీనియర్ న్యాయవాది 1930వదశకంలో కిష్టా సిమెంటు కంపెనీ యూనియన్ అధ్యక్షులుగా సేవలనందించారు. 1952లో జరిగిన మొదటి పార్లమెంటు ఎన్నికలలో స్వతంత్రఅభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1,03,126 ఓట్లు పొందారు. మంగళగిరి సిగ్మెంటుగాగల గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ మొదటి పార్ల మెంటు సభ్యునిగా చరిత్రకెక్కిన శ్రీ నరసింహం తమ శేష జీవితాన్ని గుంటూరులో గడుపుచున్నారు.



## శ్రీ కొత్త రఘురామయ్య

1912 జులై 6న సంగం జాగర్లమూడిలో జన్మించిన శ్రీ కొత్త రఘురామయ్య స్వాతంత్ర్య సంగ్రామంలో కూడా పాల్గొన్నారు. లండన్‌లో బార్-ఎట్-లా పూర్తిచేసి 1937-41ల మధ్య మద్రాసులో న్యాయవాదిగా వృత్తిని చేశారు. 1941లో జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్‌గా చేరి, 1949లో న్యాయశాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. 1952లో తెనాలి పార్లమెంటరీ నియోజకవర్గము నుండి మొదటిసారిగా పార్లమెంటు సభ్యులయ్యారు. 1957, 1962, 1967, 1971లలో జరిగిన ఎన్నికలలో మంగళగిరి సెగ్మెంటుతో కలసివున్న గుంటూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి పార్లమెంటు సభ్యునిగా ప్రాతినిధ్యం వహించారు. వివిధ సందర్భాలలో కేంద్రమంత్రిగా వివిధ శాఖలకు ప్రాతినిధ్యం వహించారు. మంగళగిరి పరిధిలోని నాగార్జున యూనివర్శిటీ ఏర్పాటు, గుంటూరు ఛానల్, బైపాస్‌రోడ్ వీరి కృషికి ఫలితాలు.

మంగళగిరి సెగ్మెంటు అంతర్భాగంగా గల పార్లమెంటు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మొదటి కేంద్రమంత్రిగా చరిత్రకెక్కిన శ్రీ కొత్త రఘురామయ్య 5-6-1979న


దివంగతులైనారు.

## శ్రీ మేడూరి నాగేశ్వరరావు



గుంటూరు దగ్గరలోని "ఏటుకూరు" గ్రామానికి చెందిన శ్రీ మేడూరు నాగేశ్వరరావు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. జిల్లా పరిషత్ చైర్మన్‌గాను, తనకంటూ సొంత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించిన వ్యక్తిగాను అందరికీ తెల్సిన వ్యక్తి.

1977, 1980లలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో మంగళగిరి సెగ్మెంటు కూడా ఒక భాగమైన తెనాలి నుండి పార్లమెంటు సభ్యునిగా కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచారు. 31-3-1910లో జన్మించిన వీరు 13-1-1998న తనువుచాలించారు.



## శ్రీ నిశ్శంకరరావు వెంకటరత్నం

గుంటూరు సమీపంలోని 'ఏటుకూరు' గ్రామానికి చెందిన శ్రీ నిశ్శంకరరావు వెంకటరత్నం వృత్తిరీత్యా న్యాయవాది. శాసనసభ స్పీకరు పదవి నిర్వహించారు. 1984లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో తెలుగుదేశం తరపున మంగళగిరి సెగ్మెంటు కూడా అంతర్భాగంగా వున్న తెనాలి నుండి పార్లమెంటు సభ్యులుగా గెలుపొందారు. విజయవాడ నుండి మంగళగిరికి కృష్ణాజలాల సరఫరా కోసం వీరు చేసిన ఆలోచన కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ వైద్యశాల నూతన భవనాల నిర్మాణానికి వీరి కృషి ఎంతైనా వుంది. 10-5-1927న జన్మించిన శ్రీ వెంకటరత్నం 6-8-2004న మరణించారు.

## శ్రీ సింగం బసవపున్నయ్య



కృష్ణాజిల్లా 'వెూదుమూడి' గ్రామంలో 14-10-1932న జన్మించిన శ్రీ సింగం బసవపున్నయ్య వృత్తిరీత్యా న్యాయవాది. 1989 పార్లమెంటు ఎన్నికలలో వీరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి, తెలుగుదేశం అభ్యర్థి శ్రీ ఉమ్మారెడ్డి

వెంకటేశ్వర్లుపై గెలుపొంది తెనాలి నుండి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించారు.



## శ్రీమతి తాడిపర్తి శారద

ఊర్వశి అవార్డు గ్రహీత, మహానటి శ్రీమతి తాడిపర్తి శారద తెనాలిలో 25-6-1945న జన్మించారు. మంగళగిరి చుట్టు ప్రక్కలా బంధువర్గం సంబంధ బాంధవ్యాలు కలిగి వున్న శ్రీమతి శారద, తెనాలి పార్లమెంటు నియోజకవర్గం నుండి 1996 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ తరపున గెలుపొందారు. సిమెంటు ఫ్యాక్టరీ మూసివేత విషయం, పెదవడ్లపూడి ఓవర్‌బ్రిడ్జి విషయాలలో చేసిన ప్రయత్నాలు ఒక కొలిక్కి రాకముందే వీరి పదవీ కాలం ముగిసింది.

## శ్రీ పి. శివశంకర్



జాతీయ రాజకీయాలలో పేరొపొందిన శ్రీ పి. శివశంకర్ 1998లో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో తెనాలి పార్లమెంటరీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలిచారు. అయితే 12వ లోక్‌సభ అతితక్కువ కాలంలోనే రద్దయింది.

## డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు



బాపట్ల మండలం 'కొండుభొట్ల వారి పాలెం'లో 1937లో జన్మించిన డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు 'వ్యవసాయ శాస్త్రం'లో డాక్టరేట్ తీసికొని 27 ఏళ్ళపాటు బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. 1991, 1999 పార్లమెంటు ఎన్నికలలో తెనాలి లోక్‌సభ స్థానానికి ప్రాతినిధ్యం వహించారు. 13వ లోక్‌సభలో "పార్లమెంటు అంచనాల కమిటీ" ఛైర్మన్‌గా బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించారు. 1996లో కేంద్రమంత్రి వర్గంలో పట్టణాభివృద్ధి, వ్యవసాయం, పార్లమెంటు వ్యవహారాల శాఖల మంత్రిగా పనిచేశారు.

తెలుగుదేశ విధాన నిర్ణయాలలో కీలకపాత్ర వహించే డా॥ ఉమ్మారెడ్డి వ్యవసాయం, పరిశ్రమలు, అంతర్జాతీయ వ్యవహారాలపై మంచి అవగాహన ఉన్న రాష్ట్ర రాజకీయ నాయకులలో ఒకరు. 1999 నుండి పార్లమెంటు సభ్యుల నిధుల నుండి మంగళగిరి

నియోజకవర్గానికి సుమారుగా 1.3 కోట్లరూపాయలు వారు మంజూరు చేయగా సుమారు 80 లక్షల రూపాయలు మంగళగిరి పట్టణానికి వచ్చినవి. రోడ్లు, కరెంటు, త్రాగునీరు మొ॥ ప్రాథమిక సౌకర్యాల రూపకల్పనకు వీరు ప్రాధాన్యతనిచ్చారు.

మంగళగిరి కృష్ణాజలాలు, పానకాల స్వామి ఫూట్‌రోడ్, పెదవడ్లపూడి రైలు వంతెన కార్యరూపం దాల్చటానికి వీరు చేసిన కృషి యీ ప్రాంతంలో చిరస్థాయిగా నిల్చిపోతుంది.



## శ్రీ వల్లభనేని బాలశౌరి

శ్రీ వల్లభనేని బాలశౌరి పెదవడ్లపూడిలో హైస్కూలు విద్యను పూర్తి చేశారు. 1979-83ల మధ్య పెదవడ్లపూడి ఏ.టి.పి.యం. హైస్కూలు హాస్టల్‌లో వుంటూ 10వ తరగతి పూర్తిచేశారు. వీరు ప్రస్తుతం సత్తెనపల్లిలోని 'లయోల ఇంజనీరింగ్' కాలేజి డైరక్టరుగా వుంటూ, పరిశ్రమలు కూడా నడుపుతున్నారు. 2004 సం॥లో జరిగిన ఎన్నికలలో తెనాలి పార్లమెంటు నియోజకవర్గం నుండి 78,556 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. యువకులైన శ్రీ బాలశౌరి మంగళగిరి ప్రాంత అభివద్ధికి దోహదపడతారనే ఆశాభావం ప్రజలు వెలిబుచ్చుతున్నారు.

## అమరావతి ఏలిక మన ఆడపడుచే



మంగళగిరిలో పుట్టి పెరిగి యితర ప్రాంతంలో రాజకీయ పదవిని చేపట్టిన మొదటి మహిళ శ్రీమతి కొల్లి పద్మావతి. శాసనసభ్యులు శ్రీ మురుగుడు హనుమంత రావుకు యీమె సోదరి. వివాహరీత్యా అమరావతికి వెళ్ళిన వీరి భర్త ఉపాధ్యాయులు.

2001 ఆగస్టు నెలలో జరిగిన ఎన్నికలలో స్థానికుల వత్తి డికి తలొగ్గి అమరావతి పంచాయతి అధ్యక్ష పదవికి పోటీచేసి, గెలుపొందారు. ఎంతో ప్రశాంతంగా, వినయంగా, చురుకుగా కన్పించే శ్రీమతి పద్మావతి ఆ పదవిలో రాణిస్తున్నారు.

# రాజకీయ పార్టీలు

## కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ పార్టీకి, చేనేత పరిశ్రమకు మొదటి నుండి యిక్కడ విడదీయలేని అనుబంధం వుంది. మాస్టర్ వీవర్లు యీ పార్టీకి నాయకత్వం వహిస్తుండటం, వీవర్లు ఆ పార్టీ కార్యకర్తలు కావటం స్వాతంత్ర్యం రాక ముందునుండీ యిక్కడ జరుగుతూ వస్తోంది.

పంచాయతి ప్రెసిడెంట్లుగా యీ పార్టీ ప్రతినిధులు పరిపాలన చేసిన చరిత్ర వుంది. ప్రగడ కోటయ్యగారి నాయకత్వ ప్రభావం యిక్కడి పాతతరం కాంగ్రెసు నాయకులపై ఎంతో వుండేది. శ్రీ దామర్ల రమాకాంతారావు ఈ పార్టీ నుండి రాష్ట్ర శాసన మండలిలో ప్రాతినిధ్యం వహించారు. 1962, 1967లోను యీ పార్టీ అభ్యర్థులు శాసనసభలో మంగళగిరి నుండి ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత జరిగిన 4 ఎన్నికలలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఆ తర్వాత 1989లోను తిరిగి 1999, 2004 సం॥ల ఎన్నికలలో ఈ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. మంగళగిరి మున్సిపాలిటీకి 1971, 1987, 2000 సం॥లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఛైర్‌పర్సన్‌గా ఎన్నిక కాగా, 1987–92 కాలంలో వీరి అభ్యర్థి శ్రీ షేక్ సలీం వైస్–ఛైర్మన్ పదవిని నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్‌లో యీ పార్టీ కౌన్సిలర్లు గణనీయంగా వుంటూ వస్తున్నారు. పట్టణంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలలో కాంగ్రెస్ ప్రమేయం లేని సందర్భాలు మచ్చుకైన కానరావు. ఈ పార్టీ పట్టణ అధ్యక్షులుగా శ్రీ కొల్లి గురునాధం, రూరల్ మండల అధ్యక్షులుగా శ్రీ సుంకర రఘుపతిరావు బాధ్యతలు వహిస్తున్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ (సి.పి.ఐ.)

1942 సం॥లో శ్రీ నూతక్కి వెంకట రంగారావు కమ్యూనిస్టు పార్టీకి పునాదులు వేశారు. ఈ పార్టీ 1952 శాసనసభ ఎన్నికలలో శ్రీ దర్శి లక్ష్మయ్యను పోటీకి నిలిపి గెలిపించి మంగళగిరిలో వామపక్షాలకు కోటకట్టింది. ఆ తరువాత 1962, 1972 ఎన్నికలలో శ్రీ శ్రీకృష్ణ యిక్కడ నుండి శాసనసభకు ఎన్నికై, మంగళగిరి ప్రాంత అభివృద్ధికి కృషి చేయటంతో, మంగళగిరి పార్టీ వటవృక్షంలా విస్తరించింది. మంగళగిరి గ్రామ పంచాయతికి వీరి అభ్యర్థులు శ్రీయుతులు బిట్రా లక్ష్మీనారాయణ, రాఘవరపు కోటేశ్వరరావులు ప్రెసిడెంట్లుగా ఎన్నికైనారు.

మంగళగిరి మున్సిపాలిటీ రెండవ కౌన్సిల్ (1981–86)కు యీ పార్టీకి చెందిన శ్రీ సుఖమంచి వెంకట కోటేశ్వరరావు ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించారు.

1971 నుండి మున్సిపల్ కౌన్సిల్‌లో 1971–76లో శ్రీ షేక్ అహ్మదాలి, 1995–98లో శ్రీ చిన్ని పిచ్చయ్య, 1998–2000లో శ్రీ కోట శ్రీరామమూర్తి, 2000 నుండి యీనాటి వరకు శ్రీ అందె నరసింహారావు సి.పి.ఐ. తరఫున వైస్‌-ఛైర్మన్ పదవులు పొందారు. ఇంతవరకు మున్సిపల్ కౌన్సిల్‌కు జరిగిన 5 ఎన్నికలలోనూ, గణనీయమైన సంఖ్యలో యీ పార్టీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా గెలుపొందుతూ వచ్చారు.

వివిధ ప్రజా ఉద్యమాలకు, కార్మిక సంఘాలకు నాయకత్వం వహిస్తూ వస్తున్న సి.పి.ఐ. పార్టీకి పట్టణంలో సొంత భవనం, గణనీయమైన సంఖ్యలో కార్యకర్తలు, విశేషంగా ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం కౌన్సిలర్ శ్రీ మునగాల మల్లేశ్వరరావు పట్టణ కార్యదర్శిగా, శ్రీ రావూరి శివారెడ్డి ఏరియా కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

## మార్క్సిస్టు, కమ్యూనిస్టు పార్టీ (సిపిఎం)

మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీకి 1942లోనే పునాదులు పడ్డాయి. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ 1969లో చీలి క్రొత్తగా సిపిఎం పార్టీ ఏర్పడింది. ఈ ప్రాంతంలో ఆనాటికి పార్టీ తరఫున వున్న వారిలో చెప్పుకోదగ్గ ప్రధాన నాయకులు 'కాజ'కు చెందిన శ్రీ సింహాద్రి శివారెడ్డి.

ఈ పార్టీవారు కరవు కాలంలో సొంతగా ధాన్యం ఆడించి కిలో బియ్యం ఒక రూపాయికి విక్రయించారు. 1975లో దేశంలో "అత్యవసర పరిస్థితి" ప్రకటించినపుడు కొంత మంది కార్యకర్తలు అరెస్ట్‌కాగా, మరి కొందరు అజ్ఞాత జీవితం గడిపారు. సిపిఎం పార్టీ తరఫున 1994 అసెంబ్లీ ఎన్నికలలో శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావు పోటీచేసి గెలిచి, శాసనసభలో ప్రాతినిధ్యం వహించారు.

ప్రస్తుత కౌన్సిల్ మినహా వీరి ప్రతినిధులు గతకాలపు అన్ని మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రాతినిధ్యం వహించుతూ వచ్చారు. ఎన్నో ఉద్యమాలు, కార్మిక సంఘాల నిర్వహణలో యీ పార్టీ ముందుంటూ వస్తోంది. ప్రస్తుతం పట్టణ కార్యదర్శిగా శ్రీ జె.వి. రాఘవులు మండల స్థాయిలో శ్రీ ఏటుకూరి గంగాధరరావు, డివిజన్ స్థాయిలో శ్రీ భీమిరెడ్డి సాంబిరెడ్డి పార్టీ బాధ్యతలు వహిస్తున్నారు.

## తెలుగుదేశం

రాష్ట్రంలో 1982లో తెలుగుదేశం పార్టీ అవతరించినపుడు మంగళగిరిలో విశేష ఆదరణ లభించి, వివిధ రాజకీయ పక్షాల నుండి ఎందరో యువకులు యీ పార్టీలోకి మారారు. మొదట శ్రీ గోలి గోపాలరావు ముఖ్య నాయకులుగా యీ పార్టీని అభివృద్ధి చేయగా, డా॥ యం.యస్.యస్. కోటేశ్వరరావు 1983 సం॥లో అసెంబ్లీకి ఎన్నిక కావటంతో యిక్కడ యీ పార్టీ ఎంతగానో బలపడింది. 1985లో డా॥ యం.యస్.యస్. రెండోసారి శాసనసభకు ఎన్నికై, మంత్రి పదవి చేపట్టటంతో తెలుగుదేశంకు గణనీయంగా కార్యకర్తలు, నాయకులు ఏర్పడ్డారు. ఈ కాలంలో మంగళగిరి ప్రాంతం అభివృద్ధి చెందింది.

1995-2000 సం॥లలో నాల్గవ మున్సిపల్ కౌన్సిల్‌కు యీ పార్టీ అభ్యర్ధి శ్రీ గోలి వీరాంజనేయులు ఛైర్మన్‌గా ఎన్నికైనారు. మున్సిపల్ కౌన్సిల్‌లో తెలుగుదేశం కౌన్సిలర్లు గణనీయమైన సంఖ్యలో ప్రాతినిధ్యం వహిస్తూ వస్తున్నారు.

తెలుగుదేశం విశేష సంఖ్యలో కార్యకర్తలను కలిగి వున్నప్పటికి 1989, 1994, 1999, 2004 సం॥లలో జరిగిన శాసనసభ ఎన్నికలలో యిక్కడ పోటీ చేయలేదు సీట్ల సర్దుబాటులో మిత్రపక్షాలకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం శ్రీ మాదల రాజేంద్ర నియోజక వర్గ కన్వీనరుగాను, శ్రీ వూట్ల శ్రీమన్నారాయణ పట్టణ అధ్యక్షునిగాను, శ్రీ మన్నెం మార్కండేయులు రూరల్ మండల అధ్యక్షులుగాను బాధ్యతలు వహిస్తున్నారు.

## భారతీయ జనతా పార్టీ (బి.జె.పి.)

1962లో జరిగిన శాసనసభ ఎన్నికలలో పోటీ చేయటం ద్వారా "జనసంఘ్ పార్టీ" యిక్కడ తన ఉనికిని చాటుకున్నది. జనతాపార్టీ చీలి ఏర్పడిన భారతీయ జనతాపార్టీకి ముఖ్యంగా పాత మంగళగరిలోని చేనేత వర్గాలలో బలం వుంది. శ్రీ తమ్మిశెట్టి రామకృష్ణ ఈ పార్టీ అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన నాయకులు. మున్సిపల్ కౌన్సిల్‌లో బి.జె.పి. వరుసగా ప్రాతినిధ్యం కలిగి వుంది. 1999, 2004 శాసనసభ ఎన్నికలలో తెలుగుదేశం మిత్రపక్షంగా యీ పార్టీ అభ్యర్ధులు పోటీ చేసినా వారిని విజయం వరించలేదు. పట్టణ అధ్యక్షులుగా శ్రీ తమిశెట్టి కమలాకరరావు, మండల అధ్యక్షులుగా శ్రీ తోట సాంబశివరావు పదువులు నిర్వహిస్తున్నారు.

# అన్ని రాజకీయ గ్రూపుల నిలయం

దేశంలో, ముఖ్యంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలకు, గ్రూపులకు యిక్కడ ఒక వర్గం వుంటూ, అన్ని భిన్న రాజకీయ సిద్ధాంతాలు మంగళగిరిలో వర్ధిల్లుతుంటాయి.

రాష్ట్రంలో ఏ రాజకీయ పక్షంలో చీలిక వచ్చినా, ఆ చీలిక వర్గ ముఖ్యనాయకుడి సొంత వూరిలో ఆ వర్గానికి మనుషులు ఉంటారో వుండరో గాని, ఆ చీలిక వచ్చీరాగానే కనీసం ఒక్క వ్యక్తి అయినా యిక్కడ ఆ చీలికకు మద్దతునిస్తూ, మరునాడే పేపర్ స్టేట్‌మెంటు యిస్తుంటారు. పాత కాలంలో నుండి అన్ని వర్గాలకు మద్దతునిచ్చే వ్యక్తులు, గ్రూపులు వుంటూ వుండటం యిక్కడ ఆనవాయితీ.

ఎన్.టి. రామారావును శ్రీయుతులు నాదెళ్ళ భాస్కరరావు, నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, చంద్రబాబు వ్యతిరేకించిన సందర్భాలలోను, శ్రీ చంద్రబాబును లక్ష్మీపార్వతి వ్యతిరేకించిన సందర్భాలలో కూడా ఇక్కడ చీలికవర్గం నేతలు పుట్టుకువచ్చారు. చంద్రబాబును అప్పటి డిప్యూటి స్పీకర్ కె. చంద్రశేఖర్ రావు వ్యతిరేకిస్తే మాత్రం యిక్కడ ఆయన గ్రూపు ఏర్పాటు కాలేదు. ఎందుకంటే యీ పట్టణం తెలంగాణాలో ఒక భాగం కాక పోవటమే.

కమ్యూనిస్టు పార్టీలలోని అన్ని చీలిక వర్గాలకు, కాంగ్రెసు పార్టీలోని అన్ని గ్రూపులకు దళిత వర్గాలలోని అన్ని గ్రూపులకు యిక్కడ అనూయాయులున్నారు. ఆ గ్రూపుల తరపున మున్సిపల్ ఎన్నికల దగ్గర నుండి అన్ని ఎన్నికలకు పోటీ చేసేందుకు అభ్యర్థులు పోటీ పడతారు. ఇక్కడ రాజకీయాలలో ఎన్ని వ్యతిరేకతలు ఆయా గ్రూపుల మధ్య వున్నా హింసకు దిగరు. ఆకాశరామన్న ఉత్తరాల ద్వారా తమ ప్రత్యర్థుల అవకాశాలను దెబ్బతీస్తూ సంతృప్తిపడి కొందరు రాజకీయాలలో కొనసాగుతుంటారు. ❋

## మొదటివారు

| | |
|---|---|
| రాష్ట్ర మంత్రి | శ్రీ యం.యస్.యస్. కోటేశ్వరరావు |
| శాసనసభ ప్రతిపక్షనాయకుడు | శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ |
| శాసనసభ్యుడు | శ్రీ దర్శి లక్ష్మయ్య |
| శాసన మండలి సభ్యుడు | శ్రీ దామర్ల రమాకాంతరావు |
| అత్యధిక మెజారిటీ పొందిన ఎమ్.ఎల్.ఏ. | శ్రీ దర్శి లక్ష్మయ్య |
| వరుసగా 2సార్లు ఎన్నికైన ఎమ్.ఎల్.ఏ. | శ్రీ మురుగుడు హనుమంతరావు |
| శాసనసభకు పోటీ చేసిన నటి | శ్రీమతి జె. జమున |

# స్థానిక పాలన

## గ్రామ పంచాయతీ

కాకతీయ, విజయనగర రాజుల కాలంలో కొన్ని గ్రామాల సమూహానికి మంగళగిరి కేంద్రంగా వుండేది. ఆ కాలంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి మంగళగిరిని దానం చేశారు. దాంతో యిది దేవస్థాన గ్రామము అయింది. ఆ కాలంలో గ్రామాధికారి, రెడ్డి, కరణము, ఆయగాండ్రు గ్రామ పరిపాలన చూసేవారు.

బ్రిటీషు వారి పరిపాలనలో 1802లో గ్రామ పంచాయతి విధానం ప్రారంభమైంది. 1930 నుండి గ్రామ కమిటీలను 'గ్రామ పంచాయతీ'లుగా మార్చి, తాలూకా బోర్డుల పరిధిలో నుంచారు. 1946లో గ్రామ పెద్ద మున్సబు పంచాయతీకి అధ్యక్ష పదవిని చేపట్టే వీలు లేకుండా చేసి, కేవలం ఎక్స్-అఫీషియో సభ్యునిగా పరిమితం చేశారు. ఆనాటికి మంగళగిరి మొదటి తరగతి పంచాయతిగా వుండేది.

మంగళగిరి పంచాయతి అధ్యక్షులకు సంబంధించిన పూర్తి వివరములు లభ్యము కాలేదు.

శ్రీయుతులు కోసూరు కోటయ్య (మున్సబు), చింతక్రింది కనకయ్య, కాళంగి వెంకటరత్నం, బిట్రా లక్ష్మీ నారాయణ, రాఘవరపు కోటేశ్వరరావు, వుడతా వీరాస్వామి, బుల్లా శ్రీనివాసరావు వివిధ కాలములలో పంచాయతి అధ్యక్షులుగా వున్నట్లు స్పష్టమయిందిగాని, వారి పదవీకాలములు యితమిద్ధముగా తెలియరాలేదు. వీరేగాక శ్రీయుతులు పోటికలపూడి హనుమంతరావు, పణిదపు శివన్నారాయణ, కాండ్రు శ్రీరాములు, దామర్ల భావనారాయణ కూడా పంచాయతి ప్రెసిడెంట్లుగా చేశారని తెలుస్తోంది. కాని, వారి పాలన వివరములు స్పష్టమగుటలేదు. పెద్దలు పై విషయములను తేటతెల్లం చేసినచో తరువాతి ఆ వివరములు ముద్రణలో చేర్చగలవాడను.

శ్రీ కోసూరి కోటయ్య గ్రామ పెద్దగా మున్సబు పదవిలోను, పంచాయతి అధ్యక్షులుగాను వుండేవారు. గ్రామ పెద్ద పంచాయతి అధ్యక్షునిగా ఎన్నికయ్యే వీలు లేకుండా 1946లో ఒక చట్టం చేసినందున అప్పటికి ముందు మాత్రమే శ్రీ కోటయ్య ఆ పదవిలో వుండి వుంటారు. శ్రీ కోసూరి కోటయ్య తరువాత శ్రీ దామర్ల భావనారాయణ ఆ పదవిలో వుండి వుంటారు. శ్రీ భావనారాయణ తరువాత శ్రీ చింతక్రింత కనకయ్య అధ్యక్ష పదవిని జిల్లా

చేపట్టారట. శ్రీ కనకయ్య 1948 నాటికి పంచాయతి అధ్యక్షునిగా కొనసాగుతూ వున్నట్లు వారు 13-2-1948న వేయించిన స్వాతంత్ర్య యోధుల స్మారక శిలాశాసనము వల్ల తెలుస్తున్నది. శ్రీ కనకయ్య మరణం వల్ల శ్రీ కాళంగి వెంకటరత్నం వారి స్థానంలో ఆ పదవిని చేపట్టారు. అలాగే శ్రీ వుడతా వీరాస్వామి ది. 6-11-1964 నాటికి అధ్యక్షునిగా వున్నట్లు గ్రామ పంచాయతి మంచినీటి పథకం శంఖుస్థాపన ఫలకం వల్ల తెలుస్తున్నది. వారి తర్వాత శ్రీ బుల్లా శ్రీనివాసరావు ఆ పదవిని చేపట్టి 1969లో మంగళగిరి మున్సిపాలిటీగా మారే వరకు కొనసాగారు.

శ్రీ చింతక్రింద కనకయ్య వారి కాలంలో పెద్ద వ్యాపారవేత్త, జిల్లాలో పలుకుబడిగల రాజకీయ వేత్తలలో నొకరు. వీరు మంగళగిరిలోని చింతక్రింద కనకయ్య విద్యాసంస్థలకు ముఖ్యదాత. శ్రీ కనకయ్య పొగాకు, రైసు మిల్లు మొ॥ ఎన్నో వ్యాపారాలు చేశారు.

శ్రీ కాళంగి వెంకటరత్నం నిరాడంబర రాజకీయ వేత్తే కాక ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు. వీరి హయాంలో కిరోసిన్ వీధి దీపాలను కరెంటు దిపాలుగా మార్చారని తెలుస్తోంది. జాతీయ రహదారిపై అప్పటి మంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళిపేరున పార్కు నిర్మించి, వారి చేతనే దానిని ప్రారంభింపజేశారు.

శ్రీ బిట్రా లక్ష్మీనారాయణ పాత మంగళగిరి హుస్సేను కట్టను నిర్మించుటేగాక, టంకురోడ్డు ప్రక్కన కల్వర్టులు కట్టించారని, బావులు త్రవ్వించారని చెబుతారు.

శ్రీ బుల్లా శ్రీనివాసరావు మంగళగిరి పంచాయతికి ఆఖరి అధ్యక్షులుగాను, ఆ పదవిని నిర్వహించిన ఏకైక దళితునిగాను చరిత్రకెక్కారు.

# జిల్లా బోర్డులు - తాలూకా బోర్డులు

బ్రిటీషు వారి పరిపాలనలో స్థానిక పాలన కోసం జిల్లా స్థాయిలో జిల్లా బోర్డులు, తాలూకా స్థాయిలో తాలూకా బోర్డులను ఏర్పాటు చేశారు. 1854లోనే వీటికి పునాదిపడింది. 1959లో జిల్లా పరిషత్‌లు, పంచాయతి సమితులు అవతరించేంతవరకు ఆ వ్యవస్థ కొనసాగింది.

1883-84లో మన జిల్లాలో లోకల్ ఫండు సర్కిల్సు క్రింద 24 పాఠశాలలు, 7 వైద్య కేంద్రాలు, 10 పబ్లిక్ బంగ్లాలు నిర్వహించారు. మంగళగిరిలో కూడా ఒక బంగ్లా ఉంది. దానిని 'కోడిగుడ్డు బంగ్లా" అంటారు.

1-4-1885న జిల్లా కలెక్టరు అధ్యక్షునిగాను, 36 మంది సభ్యులతో జిల్లా బోర్డును నెలకొల్పారు. రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షునిగాను, 12 మంది సభ్యులతో గుంటూరు తాలూకా బోర్డు ఏర్పడింది.

1930లో ఆదాయపన్ను చెల్లింపుదారులకు ఓటుహక్కు కల్పించి ప్రత్యక్ష ఎన్నికల విధానం ఏర్పరిచారు. ప్రతి తాలూకాకు బోర్డులనేర్పరిచారు. 1834లో తాలూకా బోర్డులు, విలేజి డెవలప్‌మెంటు ఫండు రద్దు, 1942లో జిల్లా బోర్డులు రద్దు జరిగాయి.

1944-49ల మధ్య కలెక్టరు ఆధ్వర్యములో జిల్లా బోర్డులు నడిచాయి. 1954లో ఎన్నికలు వాయిదా వేశారు. 1959లో జిల్లా పరిషత్‌లు ఏర్పడేదాక కలెక్టరు అజమాయిషిలోనే వున్నాయి. జిల్లాబోర్డు, తాలూకా బోర్డులలో శ్రీయుతులు పోసాని ప్రకాశరావు, దామర్ల వెంకటభావనారాయణ తదితరులు పదవులు నిర్వహించినట్లు తెలుస్తోంది.

# పంచాయతి సమితి, మండల పరిషత్

1952లో 'కమ్యూనిటీ అభివృద్ధి కార్యక్రమాలు', ఆ తర్వాత 1953లో 'జాతీయ విస్తరణ సేవా పథకం' సలహా సంఘాల ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నడిచాయి.

ఈ కార్యక్రమాలలో భాగంగా మంగళగిరి 'కమ్యూనిటీ డెవలప్‌మెంటు బ్లాక్' 2-10-1956న ప్రారంభమైంది. ఈ బ్లాకు క్రింద 77.19 చ॥మైళ్ళ విస్తీర్ణంలో 79,723 మంది జనాభాతో 25 గ్రామాలుండేవి. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరు వుండేవారు.

తరువాత 1959లో మూడంచెల పంచాయతిరాజ్ వ్యవస్థ అవతరించింది. దాంతో మంగళగిరి బ్లాకు "పంచాయతి సమితి" అయింది. 1987లో సమితి 'మండల ప్రజా పరిషత్'గా మారింది. 1994 నుండి 'మండల పరిషత్'గా మారి యీనాటికీ కొనసాగుతోంది. ఈ మండల విస్తీర్ణం 141.27 కి.మీ. మంగళగిరి మండలంలో 1,31,151 మంది జనాభా వుండగా - 66,295 మంది పురుషులు, 64,856 మంది స్త్రీలున్నారు. మండల పరిధిలో 14 పంచాయతీలు వున్నాయి.

ఆత్మకూరు, బేతపూడి, చినకాకాని, చినవడ్లపూడి, కాజ, కృష్ణాయపాలెం, కురగల్లు, నిడమర్రు, నీరుకొండ, నవులూరు, నూతక్కి, పెదవడ్లపూడి, రామచంద్రా పురం, యర్రబాలెం గ్రామ పంచాయితీలు యీ మండలములోనివి.

మండల పరిషత్‌కు ఎన్నుకొనబడిన 18 మంది సభ్యులుండగా, యీ మండలము నుండి

పరిషత్‌కు ప్రాదేశిక సభ్యునిగా శ్రీ బళ్ళా శ్రీనివాసబాబు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంగళగిరి మండల అభివృద్ధి అధికారిగా శ్రీ బత్తుల సుబ్బారావు ప్రస్తుతం పనిచేస్తున్నారు.

**పంచాయతి సమితి అధ్యక్షులు**

| | |
|---|---|
| శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య | 28-10-1959 - 21-08-1961 |
| శ్రీ గద్దె వెంకట రత్తయ్య | 22-08-1961 - 18-07-1963 |
| శ్రీ ఆకుల ధర్మలింగేశ్వరరావు | 19-07-1963 - 29-06-1964 |
| శ్రీ అన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి | 30-06-1964 - 16-07-1970 |
| శ్రీ గుజ్జుల గంగాధరరెడ్డి | జూలై 1970 - 16-01-1976 |
| శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావు | 09-05-1981 - 26-06-1986 |

**మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు**

| | |
|---|---|
| శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావు | 24-04-1987 - 20-05-1992 |

**మండల పరిషత్ అధ్యక్షులు**

| | |
|---|---|
| శ్రీ రుద్రు మోహన్‌బాబు | 19-03-1995 - 05-06-1997 |
| శ్రీ ఆకుల కోటేశ్వరరావు | 06-06-1997 - 15-04-1999 |
| శ్రీ రుద్రు మోహన్‌బాబు | 16-04-1999 - 17-04-2000 |
| శ్రీ మున్నంగి గోపిరెడ్డి | 22-07-2001 నుండి కొనసాగుతున్నారు |

**పంచాయతీలు - అధ్యక్షులు (2004 నాటికి)**

1. ఆత్మకూరు - శ్రీమతి తాతా శేషమ్మ, 2. బేతపూడి - శ్రీమతి మేకల రమాదేవి, 3. చినకాకాని - శ్రీ మర్రి వెంకయ్య, 4. చినవడ్లపూడి - శ్రీ వలివేటి వాసుదేవరావు 5. కాజ - శ్రీ ఈదా నాగేందర్ రెడ్డి, 6. కృష్ణాయపాలెం - శ్రీ పెద్ది వెంకటేశ్వరరావు, 7. కురగల్లు - శ్రీ ఆర్ధల శ్రీను, 8. నిడమర్రు - శ్రీమతి వుయ్యూరు ఉమ, 9. నీరుకొండ శ్రీమతి ముప్పవరపు సామ్రాజ్యం, 10. నవులూరు- శ్రీమతి శీలం స్వర్ణలత, 11. నూతక్కి- శ్రీమతి గోగుల భారతి, 12. పెదవడ్లపూడి - శ్రీ అన్నె చంద్రశేఖరరావు, 13. రామచంద్రాపురం - శ్రీ కుర్రే మల్లిఖార్జున రెడ్డి, 14. యర్రబాలెం - శ్రీ పలగాని తాతారావు.

### మండల పరిషత్ సభ్యులు (2004 నాటికి)

1. కాజ-1 శ్రీ పట్టెం అర్జున సారధి, 2. కాజ-2 శ్రీమతి ఆర్ల ధనలక్ష్మి, 3. చినకాకాని శ్రీ గండికోట శ్రీనివాసరావు, 4. నూతక్కి-1 శ్రీ మున్నంగి గోపిరెడ్డి, 5. నూతక్కి-2 శ్రీ భీమిరెడ్డి సాంబిరెడ్డి, 6. యర్రబాలెం-1 శ్రీమతి ఆకుల జయసత్య, 7. యర్రబాలెం-2 శ్రీ కొల్లి లక్ష్మయ్య , 8. పెదవడ్లపూడి-1 శ్రీ భావన శ్రీనివాసరావు, 9. పెదవడ్లపూడి-2 శ్రీ సూదనగుంట కోటేశ్వరరావు, 10. పెద వడ్లపూడి-3 శ్రీ చిట్టిబొమ్మ రామసుబ్బయ్య, 11. ఆత్మకూరు శ్రీమతి జొన్నకూటి శ్రీగౌరి, 12. నిడమర్రు శ్రీమతి కొమ్మారెడ్డి శీతారావమ్మ, 13. కురగల్లు శ్రీ మహంకాళి నారాయణ, 14. నీరుకొండ శ్రీమతి బొమ్మిన సుబ్బమ్మ, 15. బేతపూడి శ్రీ బేతపూడి పూర్ణచంద్రరావు, 16. కృష్ణాయపాలెం శ్రీమతి చిలువూరి శేషమ్మ, 17. నవులూరు-1 శ్రీమతి కొల్లి సుమతి, 18. నవులూరు-2 శ్రీ ఈపూరి రమేష్.

## శ్రీ పాతూరి నాగభూషణం (జడ్.పి. ఛైర్మన్)



మంగళగిరి మండలములోని పెదవడ్లపూడికి చెందిన శ్రీ పాతూరి నాగభూషణం వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. 1-7-1963న జన్మించిన వీరు 1995లో మంగళగిరి మండలము నుండి జెడ్.పి.టి.సి. సభ్యులైనారు. తన రాజకీయ చతురతనుపయోగించి 35వ ఏటనే 19-7-1998న గుంటూరు జిల్లా పరిషత్ అధ్యక్ష పదవిని చేపట్టి 19-3-2000 వరకు నిర్వహించారు. ఆ తరువాత జరిగిన జిల్లా పరిషత్ ఎన్నికలలో విజయం సాధించి 23-7-2001 నుండి జిల్లా పరిషత్ అధ్యక్ష పదవిని రెండవ సారి చేపట్టి యీనాటికీ కొనసాగుచున్నారు. మంగళగిరి ప్రాంతం నుండి జిల్లా పరిషత్ అధ్యక్ష స్థానానికి ఎదిగిన రాజకీయ వేత్త శ్రీ నాగభూషణం ఒక్కరే.

## శ్రీ మున్నంగి గోపిరెడ్డి (మండల అధ్యక్షులు)



శ్రీ మున్నంగి గోపిరెడ్డి కుంచనపల్లి గ్రామంలోని రైతు కుటుంబంలో 28-12-1957న జన్మించారు. 1985లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి కాంగ్రెసు పార్టీలో చేరి, రాజకీయాలలో చురుకుగా పాల్గొనటం ప్రారంభించారు. వీరు నూతక్కి నుండి మండల పరిషత్ సభ్యునిగా ఎన్నికై, 22-7-2001 నుండి మంగళగిరి మండల పరిషత్ అధ్యక్ష పదవిని చేపట్టి నేటికీ కొనసాగుతున్నారు.

రామచంద్రాపురం పరిధిలోని యిసుక సీనరేజిలో ఆ గ్రామ పంచాయతికి, మండల పరిషత్‌కు రావలసిన వాటాను శ్రీ గోపిరెడ్డి తన బుద్ధి కుశలతో స్థిరపరిచారు. దాంతో ఆ పంచాయతికి సంవత్సరానికి రూ. 7.5 లక్షలు, మండల పరిషత్ వాటాగా రూ. 15 లక్షలు నిరంతర స్థిరాదాయం వచ్చింది. రూ. 25 లక్షల వ్యయంతో మండల కార్యాలయ ఆవరణలో నూతనంగా షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణం చేసి ఆదాయం పెంచారు.

# గ్రామాధికారులు

విజయనగర కాలంలో గ్రామపాలన "గ్రామ సభల" ద్వారా జరిగి, రెడ్డి, కరణము మొ॥ వారు గ్రామాధికారులుగా వుండేవారు. వీరు గ్రామ రికార్డులు పరిరక్షించి, పన్నుల వసూలు, న్యాయ విచారణ చేసేవారు.

## కరణము :

వీరు గ్రామ ఆదాయ లెక్కలు వ్రాసేవారు. భూముల, పంటల వివరములు వీరి అధీనములో వుండేవి. విజయనగర సామ్రాజ్య కాలం నుండి 1985 వరకు యీ పదవి కొనసాగి, ఆ తరువాత గ్రామాధికారుల వ్యవస్థ రద్దయింది.మంగళగిరి గ్రామానికి 1940కు ముందు వరకు శ్రీ వున్నవ హనుమంతరావు 'కరణము'గా పనిచేసినారు. వారి తర్వాత 1980 వరకు శ్రీ మాదిరాజు వెంకటేశ్వరరావు (రచయిత తండ్రి) ఆ పదవిని నిర్వహించారు. 1985లో గ్రామాధికారుల వ్యవస్థ రద్దయేనాటికి శ్రీ మాదిరాజు రామలింగేశ్వరరావు గ్రామ కరణముగా వున్నారు.

## మున్సబు :

పూర్వకాలము 'రెడ్డి' అనబడే గ్రామాధికారి పదవి వుండేది. వారినే 'గ్రామ పెద్ద' అనికూడ అనేవారు. వీరు శిస్తు వసూలు, తగవుల పరిష్కారము ముఖ్య బాధ్యతలుగా కలిగియుండేవారు. 1940వ దశకంలో శ్రీ కోసూరు కోటయ్య మున్సబుగానే గాకుండా, పంచాయతీ అధ్యక్ష పదవిని కూడ నిర్వహించేవారు. ఆ తరువాత గ్రామ పెద్ద పంచాయతీకి అధ్యక్షునిగా కొనసాగరాదని చట్ట సవరణ జరిగింది. శ్రీ కోటయ్య తరువాత శ్రీ కోసూరు అంజయ్య, వారి తర్వాత శ్రీ అన్నం ఆదినారాయణ ఆ పదవిని నిర్వహించారు. తరువాత శ్రీ కోసూరు సుబ్బారావు ఆ బాధ్యతలు నిర్వహించారు. శ్రీ సుబ్బారావు తరువాత శ్రీ కుర్రా నాగేశ్వరరావు గ్రామాధికారుల వ్యవస్థరద్దయేంత వరకు ఆ పదవిని నిర్వహించారు. ❋

# మున్సిపాలిటీ

జనాభా లెక్కల ప్రకారం 1961 నాటికే పట్టణ స్థాయి పొందిన మంగళగిరి, 1969 అక్టోబరు 1వ తేదీన పురపాలక సంఘముగా అవతరించింది. ఆనాటికి పట్టణ విస్తీర్ణము 10.49 చ॥కి॥మీ॥ కాగా, 29 వేల జనాభా వుండేది. 35 సం॥ల యీ పురపాలక సంఘం నిర్వహణలో, మంగళగిరి ఎంతగానో అభివృద్ధి చెంది, తన రూపురేఖలను మార్చుకొంది. ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం 29 చ॥కి॥మీ॥ కాగా జనాభా 60,600. మున్సిపాలిటి గుర్తించిన ఇండ్ల సంఖ్య 13,500 కాగా, వాస్తవానికి సుమారు 15,000 యిండ్లు వున్నాయి. సాలీనా మున్సిపల్ పన్నుల లక్ష్యం 85 లక్షల రూపాయలు.

ప్రస్తుతం మూడవగ్రేడుగా వున్న యీ పురపాలక సంఘ ఆదాయం 2002-03 సం॥లో రు. 3.89 కోట్లుగా వుంది. రెండవ గ్రేడు మున్సిపాలిటీగా స్థాయిని పెంచేందుకు పాలనాపరమైన లాంఛనాలు పూర్తి చేయబడుతున్నాయి. ఛైర్‌పర్సన్‌గా శ్రీమతి కాంద్రు కమల, కమిషనర్‌గా శ్రీ కె.సహదేరావు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



**మొదటి మున్సిపల్ కౌన్సిల్** (1971-76)కు శ్రీ గోలి గోపాలరావు అధ్యక్షునిగా శ్రీ షేక్ అహ్మదాలి (సి.పి.ఐ.) ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ కౌన్సిల్‌లో యిద్దరు మహిళలతో కలిపి మొత్తం 20 మంది కౌన్సిలర్లు ఉండేవారు. ఈ కౌన్సిల్‌కు 'ఆల్డర్‌మెన్'గా శ్రీ అవ్వారు వైలారు సలహాలు, సూచనలిచ్చేవారు. కాంగ్రెసు పార్టీ అభ్యర్ధిగా పరోక్ష ఎన్నిక ద్వారా ఎన్నికైన శ్రీ గోపాలరావు హయాంలో "పైలట్ వాటర్ స్కీము' ప్రారంభమై మొట్టమొదటి సారిగా పంపులద్వారా మంచినీటి సౌకర్యం కలిగింది. మున్సిపల్ కాంప్లెక్సు / కూరగాయల మార్కెట్టు, కుప్పురావు కాలని, సాధారణ బల్బులు ఉన్న వీధిలైట్ల స్థానంలో ట్యూబులైట్లు ఏర్పాటు అయ్యాయి.

మొదటి కౌన్సిల్ అధికారం పూర్తి అయి రెండవ కౌన్సిల్ అధికారంలోకి రావటానికి మధ్య 5 ఏండ్లపాటు స్పెషల్ ఆఫీసరు పరిపాలన జరిగింది.



**రెండవ కౌన్సిల్** (1981-86)కు పరోక్ష పద్ధతిలో ఎన్నిక జరిగి సి.పి.ఐ.పార్టీ అభ్యర్థి శ్రీ సుఖమంచి వెంకట కోటేశ్వరరావు ఛైర్మన్‌గాను, స్వతంత్ర అభ్యర్థి శ్రీ మహబూబ్ బేగ్ ఉపాధ్యక్షులుగాను పదవులనలంకరించారు.

ఈ కౌన్సిల్‌లో నాలుగు రిజర్వుడ్ సీట్లతో కలిసి 24 మంది కౌన్సిలర్లుండేవారు. తాను "పట్టణ మొదటి పౌరుడినికాదని, మొదటి కావలాదారుడ"నని గర్వంగా చెప్పుకుని శ్రీ కోటేశ్వరరావు, ఉదయాన్నే స్కూటర్‌పై తిరుగుచూ వీధుల్లో పారిశుద్ధ్య పరిస్థితుల్ని స్వయంగా పరిశీలించేవారు. ఈ కౌన్సిల్ అధికారంలోకి వచ్చేనాటికి కేవలం రు. 5 వేల బ్యాంకు నిల్వ మాత్రమే వుండి, రూ. 16 లక్షల బకాయిలుండేవి. 15 రోజుల్లోనే రెండు లక్షల బకాయిలను వసూలుచేసి, అప్పటిదాక నెలవారీ సక్రమంగా జీతాలు రాని మున్సిపల్ ఉద్యోగులకు క్రమంగా జీతాలిప్పించారు. వినోదం పన్ను సంవత్సరానికి కేవలం రూ. 4.2 లక్షలుండగా దానిని రు. 16 లక్షలుగా పెంచారు. ఈ కౌన్సిల్ హయాంలోనే మురికి వాడల గుర్తింపు జరిగి వాటి అభివృద్ధికి గ్రాంటు వచ్చింది.

**మూడవ కౌన్సిల్** (1987-92)కు మొట్టమొదటిసారిగా ప్రత్యక్ష ఎన్నిక జరిగి, కాంగ్రెసు పార్టీ అభ్యర్థి శ్రీ మురుగుడు హనుమంతరావు ఛైర్మన్ పదవి చేపట్టారు. ఆ సమయంలో కాంగ్రెసు పార్టీకే చెందిన శ్రీ షేక్ సలీం ఉపాధ్యక్షులయ్యారు. ఈ కౌన్సిల్‌లో 20 మంది సభ్యులుండగా యిద్దరు మహిళలు పదవుల్లో వున్నారు. అంతవరకు పట్టణంలో గ్రావెల్ రోడ్లు మాత్రమే వుండగా, వీరు దూరదృష్టితో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆ తరువాత ప్రభుత్వ విధానమే మారి సిమెంటు రోడ్లు మాత్రమే అనుమతించటం జరిగింది. పట్టణ వ్యాప్తంగా ట్యూబ్‌లైట్లు ఏర్పాటుచేశారు. ముఖ్య కూడళ్లలో మెర్క్యురీ



లైట్లు నెలకొల్పటంతో పట్టణం కాంతివంతమైంది. నూతనంగా మరొక వాటర్ ట్యాంకు నిర్మాణం జరిగి యిండ్ల కనెక్షన్లు, పబ్లిక్ ట్యాప్‌ల సంఖ్య గణనీయంగా పెంచారు. కృష్ణాజలాల సరఫరా కోసం ఒక బృహత్ ప్రణాళిక రూపొందించి అప్పటి ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీకి సమర్పించారు కాని, అది కార్యరూపం దాల్చలేదు..



**నాలుగవ కౌన్సిల్** (1995-2000)కు శ్రీ గోలి వీరాంజనేయులు తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొంది ఛైర్మన్ పదవి చేపట్టారు. ఈ కౌన్సిల్ కాలంలో సి.పి.ఐ. అభ్యర్థులు శ్రీ చిన్ని పిచ్చయ్య (1995-98), శ్రీ కోట శ్రీరామమూర్తి (1998-2000) వైస్-ఛైర్మన్లుగా వ్యవహరించారు. 20 మంది సభ్యులున్న కౌన్సిల్‌లో 9 మంది మహిళలు ఉండేవారు. ఈ కౌన్సిల్ కాలంలో సుమారుగా రు. 7 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటిలో భాగంగా 197 సిమెంట్లు రోడ్లు, పాత మంగళగిరి నీటి సరఫరాను మెరుగు పరచిన "రైడర్ లైను", పైలట్ వాటర్ స్కీము వద్ద మోటర్లను మార్చటం చెప్పుకోదగినవి.

మరొక ముఖ్యమైన విషయం కృష్ణా జలాల పథకం పాలనాపరమైన ఆమోదం పొంది, జి.ఓ. విడుదల అయింది. ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడుచే కృష్ణా జలాల పథకానికి శంకుస్థాపన జరిగింది.

**ఐదవ కౌన్సిల్** పాలన 2000 సం॥లో ప్రారంభమైంది. కాంగ్రెసు పార్టీకి చెందిన శ్రీమతి కాండ్రు కమల మంగళగిరి మున్సిపల్ కౌన్సిల్‌కు మొదటి మహిళా ఛైర్-పర్సన్‌గా చరిత్రకెక్కారు. ఈ కౌన్సిల్‌కు 11 మంది మహిళలు ఎన్నికయ్యారు. కో-ఆప్టెడ్ మెంబరు, ఛైర్ పర్సన్‌లతో కలిసి 13 మ... శేషం. మొత్తం ఎన్నికైన సభ్యుల సంఖ్య 28. సి.పి.ఐ.కు చెంది... రావు వైస్-ఛైర్మన్‌గా వున్నారు. "మంగళ గిరి డ్రీం స్కీము" అ... కం" మొదటిదశ పూర్తి అయి, మంచినీరు విడుదలయింది. ఆ... ల్‌కు దక్కేందుకు శ్రీమతి కమల ఎంతో వ్యూహాత్మకంగా వ్యవహ... . పట్టణ పడమర ప్రాంతంలో నీటి సరఫరా కోసం ఎక్కువ ... ్ ట్యాంకు నిర్మాణం జరిగింది. మంగళగిరి పురపాలక సంఘ ... కు పచ్చినన్ని నిధులు యింత వరకు ఏ కౌన్సిల్ హయాం లోను విడుదల కాలేదు. ఇప్పటకే పట్టణంలోని రోడ్లలో 90 శాతం సిమెంటు రోడ్లుగా మారాయి. నూరు శాతం సిమెంటు రోడ్లుగా మార్చే దిశలో పనులు జరుగుతున్నాయి. 50 లక్షల రూపాయలతో కార్యాలయ భవన నిర్మాణం, రు. 4.5 కోట్ల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్సు మొ॥ పనులు ప్రారంభించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. 2004 కృష్ణా పుష్కరాల సందర్భముగా రూ. 2 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరిగాయి. మొదటిసారిగా 'హైమాస్టు' లైట్లు, రోడ్డుపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాట్లు జరిగి పట్టణ శోభ పెరిగింది. ❋



# ఉడా

"విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థ" పరిధిలో గుంటూరు, విజయవాడ కార్పోరేషన్లు, తెనాలి, మంగళగిరి మున్సిపాలిటీలు, 181 పంచాయతీలు వుండి సుమారు 50 లక్షల జనాభా, 2వేల చ॥ కి॥మీ॥ విస్తీర్ణం కలిగి వుంది. రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత యిది రెండవ పెద్ద పట్టణాభివృద్ధి సంస్థ.

1978 డిశంబరు 7వ తేదీన ఆవిర్భవించిన 'ఉడా' ప్రస్తుతం సగర్వంగా 'రజతోత్సవా'లను జరుపుకుంటోంది.

ఈ సంస్థ అభివృద్ధికి ఒకొక్క మెట్టువేస్తూ - శ్రీయుతులు వేములపల్లి నాగభూషణం, జి.యస్.రాజు, డా॥ యం.యస్.యస్. కోటేశ్వరరావు, యు.వి. పాండురంగారావు, నెల్లూరు గాంధి, తూమాటి ప్రేమనాథ్, కంచి రామారావు, డి.వి. బాలవర్ధనరావు, శ్రీమతి కొల్లి శారదలు అధ్యక్ష పదవులు నిర్వహించారు. 10-6-2004న శ్రీ మల్లాది విష్ణు అధ్యక్ష స్థానాన్ని అలంకరించారు. విజయవాడలో ఉడా ప్రారంభించిన కాళేశ్వరరావు మార్కెట్ ఫ్లై ఓవర్, గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్, ఏలూరు రోడ్ విస్తరణ, ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్ ప్రాజెక్టులు పూర్తి అయినాయి.

మంగళగిరికి చెందిన డా॥ యం.యస్. కోటేశ్వరరావు 'ఉడా' ఛైర్మన్‌గాను, శ్రీయుతులు గోలి గోపాలరావు, వేరుకొండ వెంకట రమణ, సంకా బాలాజి గుప్తా, ముశం శ్రీరాములు, దామర్ల నారాయణస్వామి డైరెక్టర్ పదవుల నలంకరించి యీ ప్రాంత అభివృద్ధికి యితోధికంగా కృషి చేశారు. శ్రీముశం శ్రీరాములు తమ హయాంలో - ఉడా పేరులో మంగళగిరిని కూడా చేర్పించటంతో విజయవాడ-గుంటూరు-తెనాలి-మంగళగిరి పట్టణాభివృద్ధి సంస్థగా పిలవబడుతోంది.

## అమరావతి టౌన్‌షిప్



మంగళగిరి ప్రాంతానికి, 'ఉడా'కు ముఖ్య బంధంగా పట్టణ రైల్వే లైనుకు అవతల ఏర్పడిన "అమరావతి టౌన్‌షిప్" యీ ప్రాంతానికి ముఖ్య ప్రాజెక్టు. ఈ టౌన్‌షిప్ కోసం 402 ఎకరాల భూమిని సేకరించి 390 ఎకరాలను లే అవుట్ చేసి 1327 ప్లాట్లుగా విభజించి, యిప్పటికి 1008 ప్లాట్లు అమ్మారు. ప్రస్తుతం ప్లాట్ల అమ్మకాలను నిలిపివేశారు. డా॥ యం.యస్.యస్. కోటేశ్వరరావు అధ్యక్షులుగా ఉన్నపుడు ఈ పథకానికి అంకురార్పణ జరిగినది.

## సింగపూర్ టౌన్‌షిప్

అమరావతి టౌన్‌షిప్‌ను ప్రతిష్టాకరమైన ప్రాజెక్టుగా అమలు చేసేందుకు నడుంకట్టిన 'ఉడా' సింగపూర్ తరహా టౌన్‌షిప్‌ను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. సింగపూర్ గృహనిర్మాణ సంస్థ, సర్బానా ఇంటర్‌నేషనల్ '(సెస్మా ఇంటర్నేషనల్)" భాగస్వామ్యంతో చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చుకొంది. 50 ఎకరాల విస్తీర్ణంలో 2,3 బెడ్‌రూం మరియు డూప్లెక్సు ప్లాట్లను నిర్మించ తలపెట్టారు. భూగర్భ డ్రైనేజి, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్లు, పైపుల ద్వారా గ్యాస్ సరఫరా, ఫైబర్ ఆప్టిక్ కమ్యూనికేషన్ లైన్ల వంటి అధునాతన సౌకర్యాలు యీ టౌన్‌షిప్‌లో వుంటాయి. వాస్తు అనుగుణంగా ప్లాట్ల నిర్మాణం చేయబోవడం కొనుగోలు దార్లను ఆకర్షించే అంశం. బ్యాంకులు యీ ప్లాట్ల కొనుగోలు దార్లకు సరసమైన షరతులతో అప్పులిచ్చేందుకు ముందుకు వస్తున్న యీ ప్రాజెక్టు విలువ సుమారు రూ. 100 కోట్లు.

## పానకాల స్వామి ఘాట్‌రోడ్

మంగళగిరి పానకాల స్వామి కొండపైకి రు. 1.20 కోట్ల ఖర్చుతో నిర్మించిన ఘాట్‌రోడ్‌కు 'ఉడా' రూ. 25 లక్షలను సమకూర్చింది. అంతే కాకుండా ఘాట్‌రోడ్ ప్రవేశద్వారానికి, ప్రక్కన పార్కుకు, ఘాట్‌రోడ్ విస్తరణకు, నరసింహస్వామి దేవస్థానం చుట్టూ రోడ్లు, గ్రీనరీ అభివృద్ధికి కలిపి మరో రూ. 25లక్షలు వెచ్చించింది.

## మంగళగిరి మాస్టర్ ప్లాన్

దేశంలోనే మొట్టమొదటి సారిగా అత్యంత నాణ్యతగల శాటిలైట్ చిత్రాలనుపయోగించి మాస్టర్ ప్లాన్, జోనల్ అభివృద్ధి ప్రణాళికలను సమీక్షించే ప్రాజెక్టును 'ఉడా' చేపట్టింది. హైదరాబాద్‌కు చెందిన స్పెక్ సిస్టమ్స్ వారి సహకారంతో అమలుచేస్తున్న యీ ప్రాజెక్టు విలువ సుమారు కోటి రూపాయలు. ఈ ప్రణాళికలో యీ ప్రాంతానికి సంబంధించి మంగళగిరి పట్టణ మాస్టర్ ప్లాను, కాజ, తాడేపల్లి జోనల్ డెవలప్‌మెంట్ ప్లానులను తయారుచేస్తున్నారు. గ్లోబల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్‌ల సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ప్రాజెక్టు అమలవుతోంది. ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న మాస్టర్ ప్లాన్ తయారై, అమలులోనికి వస్తే, మంగళగిరి పట్టణాభివృద్ధికి మరింతగా ఉపకరించగలదు.

## మంగళగిరి డివిజనల్ ఆఫీసు




ప్రజల, వ్యాపారస్తుల సౌకర్యార్థం మంగళగిరిలో డివిజనల్ ఆఫీసును ప్రారంభించారు. పూర్తి కంప్యూటర్ ఆన్-లైన్ సౌకర్యం కల్పించటంతో ఉడా సేవలు త్వరితంగాను, సమర్ధ వంతంగాను అందుతున్నాయి.

## వివిధ కార్యక్రమాలు

ఈ ప్రాంతంలోని అనేక గ్రామాలలో చెరువుల పూడిక, వంతెనలు, రోడ్ల నిర్మాణాన్ని 'ఉడా' చేపట్టి వ్యవసాయదారులకు చేయూత నిచ్చింది. పట్టణానికి సమీపంలోని ఆచార్య నాగార్జున యూనివర్శిటి క్యాంపస్ అభివృద్ధిలో పాలుపంచుకొంది. యన్నారై మెడికల్ కాలేజికి కృష్ణా జలాల సరఫరాకు సన్నాహం చేసి వైద్య రంగ సేవలకు చేయూత నిస్తోంది.

అమరావతి టౌన్‌షిప్‌లో సింగపూర్ టౌన్‌షిప్ ప్రాజెక్టు పూర్తి అయి, నిడమర్రు రైలుగేటుపై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తే, పట్టణ రియల్ ఎస్టేటు ముఖచిత్రం సుందరంగా మారటమే కాకుండా, యీ ప్రాంత గ్రామాల అభివృద్ధికి దోహదపడుతుంది.

ఉడా ఉపాధ్యక్షులు శ్రీ వి.యన్. విష్ణు ఇప్పటికే ఎన్నో ప్రతిష్ఠాకరమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేసి, అమలులో ప్రాధానపాత్ర పోషిస్తున్నారు. నూతనంగా అధ్యక్ష పదవిని చేపట్టిన శ్రీ మల్లాది విష్ణు రాష్ట్ర ప్రభుత్వం వద్ద తన పలుకుబడిని ఉపయోగించి 'ఉడా'ను విజయపథంలో నడిపి మరెన్నో నూతన ప్రాజెక్టులను అమలు చేయవలసి వుంది.

### నాలుగు వందల ఎకరాల్లో ఇల్లు

అమరావతి టౌన్‌షిప్ 402 ఎకరాల విస్తీర్ణం కలిగి వుంది. ఉడా వారు 390 ఎకరాలలో లే అవుట్‌చేసి రోడ్లు, కరెంటు, నీటిసౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఎంతో విస్తృతంగా ప్రచారం చేసినా అనుకున్న రీతిలో ప్లాట్లను 'ఉడా' అమ్మలేకపోయింది. జూ పార్కు, క్రికెట్ స్టేడియం మొ॥ ఎన్నో ప్రాజెక్టులు యీ టౌన్‌షిప్‌లో ఏర్పడేందుకు ప్రయత్నాలు చేసిన 'ఉడా', చివరకు 'సింగపూర్ టౌన్‌షిప్'ను నిర్మించేందుకు రంగం సిద్ధం చేసింది. ప్లాట్లు కొన్నవారు నిర్ణీత కాల పరిమితిలో గృహ నిర్మాణం చేపట్టవలసిన షరతు 'ఉడా' విధించినా, వివిధ కారణాల వల్ల ఆ టౌన్‌షిప్‌లో యిండ్లు నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. 'ఉడా' సంస్థ అధికారి శ్రీ మల్లిఖార్జునరావు సాహసం చేసి రెండేళ్ల క్రితం 'అమరావతి టౌన్‌షిప్'లో మొట్టమొదటిగా గృహాన్ని నిర్మించుకున్నారు. ఆ నాలుగు వందల ఎకరాల్లో ఏకైక నివాస గృహస్థులుగా శ్రీ మల్లిఖార్జునరావు చరిత్రకెక్కారు. వారు అభినందనీయులు.

# ప్రభుత్వ పాలన

మంగళగిరిపట్టణంలో ప్రభుత్వపాలనలో భాగంగా, వివిధ కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

మండల రెవిన్యూ అధికారి, మండల అభివృద్ధి అధికారి, అగ్రికల్చరల్ అసిస్టెంటు డైరక్టరు, ఛైల్డ్ డెవలప్‌మెంటు ప్రాజెక్ట్ ఆఫీసరు, పవర్ డిస్ట్రిబ్యూషన్ అసిస్టెంటు డివిజనల్ ఇంజనీరు, అసిస్టెంటు అకౌంట్సు ఆఫీసరు, సహాయ సాంఘిక సంక్షేమాధికారి, హౌసింగ్ అసిస్టెంటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, రోడ్లు-భవనాల శాఖ అసిస్టెంటు ఇంజనీరు, వాణిజ్య పన్నుల అధికారి సబ్-ట్రెజరి అధికారి, సబ్-రిజిస్ట్రారు, పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరు, సబ్-జైలు సూపరింటెండెంటు, లేబర్ ఇన్‌స్పెక్టరు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టరు, ఫైర్ ఆఫీసరు, పశుసంవర్ధక శాఖ అసిస్టెంటు డైరక్టరు, ప్రొహిబిషన్ - ఎక్సైజు ఇన్‌స్పెక్టరు, మున్సిపల్ కమీషనరు, రైతు బజారు ఎస్టేట్ ఆఫీసరు వున్నారు.

అంతే కాకుండా పట్టణాభివృద్ధి సంస్థ డివిజనల్ కార్యాలయం, సెంట్రల్ ఎక్సైజు సూపరింటెండెంటు కార్యాలయం, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డిపో, హెడ్‌పోస్టాఫీసు, భారత్ సంచార్ నిగం లిమిటెడ్ కార్యాలయము మొదలగునవి ప్రజలకు వివిధ సేవ లందిస్తున్నాయి. పాత మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇ-సేవాకేంద్రం వివిధ సేవలను అందిస్తున్నది.

ప్రభుత్వ సేవలందిస్తున్న కొన్ని సంస్థల గురించి, ప్రభుత్వ పాలనలో ముఖ్యపాత్ర వహించిన మన స్థానికుల గురించి యిక్కడ ప్రస్తావిస్తున్నాను.

## శ్రీ శిరందాసు లక్ష్మీ నారాయణ



కడు బీద చేనేత కుటుంబంలో 1-7-1930 వ తేదీన జన్మించి, ఎన్నో యిబ్బందులు ఎదుర్కొని గౌరవ ఐఏఎస్ హోదాకు ఎదిగిన మంగళగిరి నివాసులలో శ్రీ శిరందాసు లక్ష్మీ నారాయణ మొదటి వారు. శ్రీ వూరే సుబ్బారావు, చిల్లర ఆంజనేయులు గార్లు నిర్వహించిన వీధిబడులలో విద్యాభ్యాసం చేసిన లక్ష్మీనారాయణ, కొట్లలో గుమాస్తాగా పనిచేస్తూ విద్యను కొనసాగించారు. వూరే సుబ్బారావు గారు ఆయన్ని ప్రోత్సహించారు,

మంగళగిరి సి.కె. ఉన్నత పాఠశాలలో ఎస్ఎస్ఎల్సి పూర్తి చేసి, బి.ఎ. చదివారు.

ఆ తర్వాత 2 సం॥లు సికె హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేశారు. రాష్ట్ర సర్వీసు కమీషన్ పరీక్ష వ్రాసి 1955లో యుడిసిగా కర్నూలులో ఉద్యోగంలో చేరారు. 1962 సర్వీసు కమీషన్ గ్రూపు-1 పరీక్షలో ఉత్తీర్ణులై ఆర్‌డిఓ గా శ్రీకాకుళంలో చేరారు. 1978లో ఐఏయస్ కన్ఫర్ అయింది. అనంతపురం, పశ్చిమగోదావరి జిల్లాల్లో కలెక్టరు, ఒంగోలు డిఆర్ఓ, విజయవాడ మున్సిపల్ కమీషనర్, టిటిడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, డైరెక్టరు-ఎగ్రికల్చరు, రెవిన్యూ డిప్యూటి సెక్రటరీ, అప్పటి ముఖ్యమంత్రి నాదెళ్ళ భాస్కరరావుకు స్పెషల్ సెక్రటరీగా పని చేశారు.

మంగళగిరి జూనియర్ కాలేజి, డిగ్రీ కాలేజి, గరల్స్ హైస్కూల్, ఐటిఐ రావటానికి తోడ్పడినారు. 1988లో పదవీ విరమణ చేసిన వీరు 1999లో మరణించారు.

## శ్రీ బుల్లా సుబ్బారావు



మంగళగిరి స్థానికులు ఐ.ఏ.యస్. హోదాకు ఎదిగిన వారిలో శ్రీ బుల్లా సుబ్బారావు రెండవవారు. మంగళగిరి దళితులలో ఆ స్థాయికి ఎదిగిన వారిలో మొదటివారైన శ్రీ సుబ్బారావు 1-7-1945న రాఘవయ్య, శారమ్మ గార్లకు జన్మించారు. ప్రాథమిక విద్యను మంగళగిరి బాప్టిస్టు పేట స్కూలులోను, హైస్కూలు విద్యను చింతక్రింది కనకయ్య హైస్కూలులోను పూర్తి చేశారు.

1972లో సివిల్ సర్వీసులలో ఎంపికైన వీరు కర్ణాటక రాష్ట్ర కేడర్ ఐ.ఏ.యస్.కు కేటాయింపు పొందారు. బీదర్ జిల్లా కలెక్టరు హోదాలోను, కర్ణాటక ఎక్సైజు కమీషనరు, మైసూరు మినిరల్స్, కర్ణాటక ఆగ్రోకెమికల్స్, కర్ణాటక మార్క్‌ఫెడ్, హట్టి బంగారు గనులు వంటి సంస్థలకు మేనేజింగ్ డైరెక్టరు హోదాలోను సేవలందించారు.

కర్ణాటక ప్రభుత్వ కార్యదర్శిగా - పరిశ్రమలు, సహకారం, కార్మిక, హౌసింగ్ మొ॥ శాఖలలో పదవులను నిర్వహించారు.

వీరు 2004 సం॥లో స్వచ్ఛంద పదవీ విరమణ చేసి బెంగుళూరులో వుంటున్నారు.

## ఫైర్‌స్టేషన్

మంగళగిరి పట్టణంలో ఫైర్‌స్టేషన్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని సుమారు 30 సెంట్ల స్థలంలో శ్రీ నిమ్మగడ్డ రామమోహనరావు సమితి అధ్యక్షులుగాను, డా॥ ఎమ్ఎస్ఎస్ శాసనసభ్యులుగాను వున్నపుడు వారిద్దరి సమిష్టికృషితో ఏర్పాటైంది. 1988లో అప్పటి సాంస్కృతిక, క్రీడల మంత్రి శ్రీ జె.ఆర్. పుష్పరాజ్ శంకుస్థాపన చేయగా, 25-4-1989న అప్పటి రెవిన్యూ మంత్రి శ్రీ ధూళిపాళ్ళ వీరయ్యచౌదరి ప్రారంభించారు.

## పోస్టాఫీసులు

మంగళగిరిలో పోస్టాఫీసు 1883నాటికే పనిచేస్తున్నది. బ్యాంకులు లేనప్పుడు చుట్టు ప్రక్కల పంచాయతీల ఎక్కౌంట్స్, దేవస్థానం ఎక్కౌంట్సు మంగళగిరి పోస్టాఫీసులోనే ఉండేవి. 1962లో మంగళగిరి పోస్టాఫీసులో ముగ్గురు గుమాస్తాలు పని చేస్తుండగా, ఇద్దరు పోస్ట్‌మాన్‌లతో ఉత్తరాల బట్వాడా జరిగేది. 1965 సం॥ వరకు 'ఎ' క్లాసు పోస్టాఫీసుగా వుంది. 1965 ఆగస్టులో ఎల్.ఎస్.జి. ఆఫీసు హోదా పెంచినారు.

మంగళగిరి సబ్ డివిజన్ అనే పేరున మంగళగిరి హెడ్ క్వార్టర్‌గా గుంటూరు నుండి విడదీసి ది. 26-2-1980న శ్రీ వి.ఎస్. విఠల్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రారంభించినారు. జూన్ 1980లో ఈ ఇన్‌స్పెక్టర్ పోస్టును అసిస్టెంటు సూపరింటెండెంటుగా హోదాను పెంచుట జరిగినది. ది. 1-4-1980వ తేదీ నుండి హెడ్ పోస్టాఫీసు స్థాయికి పెరిగింది. డిసెంబరు 1980లో తాలూకా ఆఫీసు వద్ద సొంత భవనములోకి కార్యాలయాన్ని మార్చారు.

## విద్యుత్ రంగం

1946లో "గుంటూరు పవర్ అండ్ లైట్ లిమిటెడ్" వారు తాడేపల్లి కేంద్రం ద్వారా - మంగళగిరి, కాజ, చినకాకాని, కొలనుకొండ, ఆత్మకూరు మొ॥ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ప్రారంభించారు. 1956లో గుంటూరు పవర్ అండ్ లైట్ లిమిటెడ్ సంస్థను ప్రభుత్వం స్వాధీనం చేసుకొంది.

ఆం॥ప్ర॥ రాష్ట్ర ఎలక్ట్రిసిటి బోర్డు ది 1-4-1959న ఏర్పాటయింది. దీనిని వికేంద్రీకరిస్తూ, ఎపి ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపి జెనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు ఏర్పాటు చేశారు. మంగళగిరికి మొట్టమొదటగా విద్యుత్ సౌకర్యం 1939 అక్టోబరు 26న కలిగింది. మంగళగిరి పట్టణంలో మొదటి గృహసంబంధ, గృహేతర విద్యుత్ వినియోగదారునిగా శ్రీ చింతక్రింది కనకయ్య గారి పేరు రికార్డులలో నమోదయింది.

శ్రీ చింతక్రింది కనకయ్యగారి గృహ సర్వీసు నెంబరు 2 మరియు గృహేతర సర్వీసు నెంబరు 7.

1939వ సంవత్సరం నాటికి మంగళగిరి ఎలక్ట్రిసిటి సెక్షన్ ఆఫీసు ప్రారంభమై, 1984-85లలో సబ్-డివిజన్ స్థాయికి ఎదిగింది. సబ్-ఎలక్రిటిసిటీ రెవిన్యూ ఆఫీసు యిక్కడ ఏర్పాటయింది. ప్రస్తుతం పట్టణ పరిధిలో సుమారు 12 వేల ఎలక్ట్రిసిటి సర్వీసులుండగా రూ. 46 లక్షల నెలసరి ఆదాయం వస్తుంది.

## పోలీసు స్టేషను

మంగళగిరిలో పోలీసు స్టేషను 1883 నాటికే వున్నది. గ్రామీణ ప్రాంతానికి ప్రత్యేకంగా "రూరల్ పోలీసు స్టేషను" కూడా నెలకొని ఉన్నది. మంగళగిరి పోలీసు సర్కిల్ ప్రత్యేకంగా నెలకొల్పబడి ఉన్నది. ఈనాటికి పట్టణంలో ఒక సర్కిల్ ఆఫీసు, టౌన్ స్టేషను, రూరల్ స్టేషను సొంత భవనాలలో నిర్వహించబడుచున్నవి.

## రెవెన్యూ మండలము

ఈస్టిండియా కంపెనీ వారి పరిపాలనలో 1784లో గుంటూరు జిల్లాను 14 తాలూకాలతో ఏర్పరిచారు. మంగళగిరి కూడా ఒక తాలూగా వుండేది. 1859 నుండి 1904 వరకు క్రిష్ణాజిల్లాలో అంతర్భాగంగా వుంది. 1904 సం॥లో తిరిగి గుంటూరు జిల్లా ఏర్పరిచిరిగాని, మంగళగిరి మాత్రం గుంటూరు తాలూకా పరిధిలో సబ్-తాలూకాగా వుండేది. 1983 నాటికి మంగళగిరి తాలూకా హోదాలో వుంది.

1985 మే 25వ తేదీ నుండి "మండల వ్యవస్థ" అమలులోనికి వచ్చి, మంగళగిరికి మండల హోదా వచ్చింది. మండల పరిధిలో కాజ, చినకాకాని, కురగల్లు, బేతపూడి, నిడమర్రు, నీరుకొండ, నౌలూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, ఆత్మకూరు, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, నూతక్కి, రామచంద్రాపురం గ్రామాలున్నాయి.

## రిజిస్ట్రార్ ఆఫీసు

మంగళగిరిలో సబ్-రిజిస్ట్రార్ ఆఫీసును 1907లో ఏర్పాటు చేశారు. మంగళగిరి తాలూకా స్థాయిలో వుండగా యీ రిజిస్ట్రార్ ఆఫీసు సుమారు 60 గ్రామాల ప్రజలకు సేవచేస్తుండేది. మండల వ్యవస్థ అమలులోకి వచ్చిన తరువాత 30 గ్రామాలకు సేవలందిస్తోంది ఈ కార్యాలయం పూర్తి కంప్యూటర్ ఆన్-లైన్ వ్యవస్థ ద్వారా పనిచేస్తోంది. దివంగత ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు యన్.టి. రామారావు మంగళగిరి సబ్-రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఇక్కడ పనిచేస్తుండగా ఆయనకు సినిమాహీరోగా అవకాశం వచ్చి ఉద్యోగానికి రాజీనామా చేసి మద్రాసుకు వెళ్ళారని తెలుస్తోంది.

జిటల్ ల్యాండ్ రికార్డులు

రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొట్టమొదటగా గ్రామ రెవిన్యూ రికార్డులను, విలేజి మ్యాపులను డిజిటల్ విధానంలో తయారుచేసి భద్రపరిచే ప్రాజెక్టును చేపట్టింది. ఏరియల్ ఫొటోగ్రఫి, గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం మొ॥ అధునాతన సాంకేతిక పద్ధతులనుపయోగించి రాష్ట్రంలోని 27,981 రెవిన్యూ గ్రామాల రికార్డులను, మ్యాపులను తయారుచేస్తున్నారు. వాటిని సి.డి.లలో భద్రపరుస్తారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటిగా మంగళగిరి మండలములోని క్రిష్ణాయపాలెం, పెనుమాక గ్రామాల రికార్డులు, మ్యాపులను డిజిటల్ రూపంలోకి మార్చారు.

దేశంలోనే మొదటిసారిగా అమలవుతున్న ఈ ప్రాజెక్టులో మంగళగిరి మండలాన్ని ఎంచుకోవటం గర్వకారణం.

## గ్రంథాలయం

ఆరేడు దశాబ్దాల చరిత్ర కలిగిన గ్రంథాలయం నరసింహస్వామి కొండకు దగ్గరలో ప్రస్తుతం వుంది. 1950 ప్రాంతాలలో పంచాయతి వారి "చంద్రమౌళి పార్కు" ప్రాంగణంలో మంగళగిరి గ్రంథాలయం నడుపబడుతుండేది. 1959లో దీనిని జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధీనంలోనికి తీసుకు వెళ్ళారు. ఆ తరువాత మెయిన్ బజారు రామాలయం పైన ఎన్నో దశాబ్దాలుగా ఈ గ్రంథాలయం విజయవంతంగా నడిచింది.

28-10-1993న యీ శాఖా గ్రంథాలయాన్ని సొంత భవనాలులోకి మార్చారు. విద్యుత్ సౌకర్యం లేకుండా నూతన భవనంలో గత దశాబ్దంగా యీ గ్రంథాలయం నడుస్తుండటంతో పాఠకులు తీవ్ర యిబ్బందులకు గురవుతున్నారు.

గ్రేడు-1 లైబ్రేరియన్ పర్యవేక్షణలో నడుస్తున్న యీ గ్రంధాలయంలో సుమారు 20 వేలకు పైగా పుస్తకాలు వున్నాయి. సంవత్సరానికి రూ. 15 వేల బడ్జెట్‌తో పత్రికా విభాగం నడుస్తోంది.

ఎపియస్‌పి బెటాలియన్

మంగళగిరి పట్టణ అభివృద్ధికి, ముఖ్యంగా ఆర్థిక వ్యాపారాభివృద్ధికి దోహదపడిన పెద్ద మార్పు 1972లో జరిగింది. అది పట్టణానికి తూర్పున 140 ఎకరాల ప్రాంగణంలో ఆం॥ప్ర॥ స్పెషల్ పోలీసు 6వ బెటాలియన్ ఏర్పాటు.

తొలుత బెటాలియన్‌లో వసతులు లేక అక్కడి వందలాది సిబ్బంది యీ పట్టణంపై పూర్తిగా ఆధారపడేవారు. దాంతో అద్దె యిండ్లకు ప్రాముఖ్యత పెరిగింది. సినిమాహాళ్ళు, వ్యాపార సంస్థలు కళకళాలాడేవి. పట్టణ జీవన వ్యయం పెరిగింది.

అంచెలంచెలుగా అభివృద్ధి చేయబడిన యీ బెటాలియన్‌లో నేటికి 11 వందల మంది సిబ్బంది వున్నారు. 780 మందికి గృహవసతి కల్పించబడి ఓ టౌన్‌షిప్‌గా మారింది. అక్కడ పాఠశాల, వైద్యశాల, గ్యాసుడిపో, స్టోర్సు, ఓపెన్ ఎయిర్ థియేటరు ఏర్పాటై ఆ క్యాంపు స్వయం పోషకంగా మారింది. మంగళగిరి పట్టణానికంటే ముందుగా యీ బెటాలియన్‌కు కృష్ణా జలాల సరఫరా ప్రారంభమైంది.

ఈ బెటాలియన్‌కు మొదటి కమాండెంటు శ్రీ యస్.బి.వి. రాజు కాగా, ప్రస్తుతం శ్రీ కె. సుబ్బారావు ఆ పదవిలో వున్నారు. అధునాతన సాంకేతిక పద్ధతులలో యిక్కడి జవానులకు శిక్షణ ఇస్తున్నారు. ఉండవల్లి కొండల మధ్య 'ఫైరింగ్ రేంజి' ఏర్పాటు చేశారు. ఇక్కడి పోలీసు కుటుంబానికి చెందిన శ్రీమతి యం. కృష్ణవేణి యీ బెటాలియన్ వున్న 5వ వార్డుకు మున్సిపల్ కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ❋

మరణానంతరం కూడ నువ్వు గుర్తుండాలంటే
చదవ దగిన పుస్తకాలు రాయి
లేదా
రాయదగిన పనులు చెయ్యి.

– ఫ్రాంక్లిన్.

# చేనేత

"కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడిదాన!
గాలిలోన తేలిపోయే చీరకట్టిన చిన్నదాన!
జిలుగువెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా?
చిరుగు పాతల బరువు బతుకుల నేతగాళ్ళే నేసినారు".[1]

## పరిశ్రమ - అభివృద్ధి

క్రీస్తు పూర్వం 30వ సం॥ నాటికే రోమన్ దేశస్తులు గుంటూరు జిల్లాలో చేనేత వస్త్రాల వ్యాపారం చేసినట్లు తెలుస్తోంది. కుతుబ్ షాహీల పరిపాలనా కాలంలో క్రీ॥శ॥1611లో ఆంగ్లేయులు అనుమతి పొంది మంగళగిరిలో వ్యాపారం చేశారు.



1942 వరకు చేతితో వడికిన ముడి నూలుకు కచ్చా రంగులద్ది నేసే వారు. 1946 తరువాత జర్మనీదేశపు పక్కా రంగులు రావటంతో చీరలరంగులలో నాణ్యత పెరిగి "మంగళగిరి పట్టుబడి చీరలు"గా పేరొంది మార్కెట్‌లో నిలదొక్కుకున్నాయి.

1942 రెండో ప్రపంచ యుద్ధ సమయంలోను, 1951, 1962 ప్రాంతంలో నూలు దొరకక, పరిశ్రమ కష్టాలలో పడింది. 1973, 1983-95ల్లో కూడా యీ పరిశ్రమ ఎన్నో గడ్డు పరిస్థితులను ఎదుర్కొని తిరిగి ప్రాణం పోసుకుంది.

1985-86లో 60×40 కౌంట్ నూలును కలిపి 'పడుగు' ఒక రంగు, 'పేక' ఒక రంగు నూలు కలిపి నేసి వాటికి 'సిల్క్ ఎఫెక్టు' తెప్పించి డ్రెస్ మెటీరియల్ నేయించటం జరిగింది. దాంతో "మంగళగిరి డ్రెస్ మెటీరియల్"గా దేశాంతర ఖ్యాతి పొంది కొనసాగుతోంది. పడుగులు చేయడంలోను, నేత గట్టిగా నేయటంలోను దేశం మొత్తం మీద మంగళగిరికే ప్రాముఖ్యత.

## మాస్టర్ వీవర్లు

1900 కాలంలో నేత పనివారి నుండే పెట్టుబడిదారులు బయలుదేరి తమ కంటే చిన్న పారిశ్రామికుల వద్ద "అడ్డపచ్చాలు"(తన పని తాను చేసుకుంటూ వీలు వెంబడి వేరొకరి పని కూడ తమ మగ్గాలపై చేయటం) నేయించి, ఆ ఉత్పత్తులను కూడా అమ్మటంతో నేటి "మాస్టర్ వీవర్సు" వ్యవస్థకు బీజం పడింది.

1952-55 ప్రాంతాలలో చేనేత పరిశ్రమ తీవ్ర సంక్షోభానికి గురైనపుడు మంగళగిరిలో పరిస్థితి మెరుగుగా వుండటంతో యితర జిల్లాల నుండి చేనేత కార్మికులు యిక్కడకు వలస వచ్చారు. అడ్డపచ్చాలు నేయించటానికి అలవాటు పడిన వ్యక్తులు వీరికి పనికల్పించటంతో మాస్టర్ వీవర్స్ వ్యవస్థ యిక్కడ వేళ్ళూనింది.

1955-60ల మధ్య స్వంత మగ్గాలపై జీవిస్తున్న పారిశ్రామికులకు ఆర్థిక, మార్కెటింగ్ సంబంధ యిబ్బందులు ఎదురై - మజూరీకి యితరుల మగ్గం పై నేయటం మొదలు కావటంతో మాస్టర్ వీవర్స్ వ్యవస్థ యిక్కడ స్థిరపడింది.

పాత తరం మాష్టర్ వీవర్లలో బిట్రా వెంకటరత్నం గారు చెప్పుకోదగ్గ వ్యక్తని, ఆయన మంగళగిరిలోని చేనేత పరిశ్రమకు ఒక రూపం తెచ్చారని చెబుతుంటారు.

శ్రీయుతులు మునగాల మంగయ్య, చింతక్రింది యలమందయ్య, నీలి భద్రయ్య, జంజనం మంగళాద్రి, శిరందాసు సాంబయ్య, కాటాబత్తుల కృష్ణమ్మ, జొన్నాదుల రామారావు, కాండ్రు రామయ్య, జంజనం రామన్న, కొల్లి నరసింహస్వామి, వెనిగండ్ల నరసింహం, గోలిగోపాలరావు పాత తరాలలోని కొందరు మాస్టర్‌వీవర్లు. ఆ తరువాత శ్రీయుతులు వూట్ల ద్వారకా కృష్ణ,వూట్ల శ్రీరాములు, రావెల వెంకటేశ్వర్లు, అందె కోటేశ్వరరావు, బిట్రా సుబ్బారావు, చింతక్రింది చినవీరరాఘవులు కొందరు కాగా, నేడు శ్రీయుతులు చింతక్రింది రాధాకృష్ణ, అందే రామస్వామి, తమ్మిశెట్టి హరికృష్ణ-కమాలాకర్, అందె కనకలింగేశ్వరరావు, గంజి రవి, వెనిగండ్ల శంకరరావు, కాండ్రు శంకరరావు, నందం రాజా, పణిదపు సాంబశివరావు, కాండ్రు శివనాగేంద్రం మొ॥ వారు మరి కొందరు.

వీరు ఎంతో దీక్షతో, ఒక యజ్ఞంలాగా నేయించి సునిశితంగా వస్త్ర నాణ్యతను పరిశీలించి, తృప్తి చెందిన మీదటే బయటకు పంపుతారు. మంగళగిరి డ్రస్ మెటీరియల్‌కు రాష్ట్రాంతర, దేశాంతర ఖ్యాతి పెరగటానికి కారణం యిక్కడి మాస్టర్‌వీవర్ల వృత్తి నిబద్ధతే!

## పారిశ్రామిక సంబంధాలు

ఇక్కడి చేనేత పరిశ్రమలో ఎన్ని ఒడిదుడుకులున్నా మెచ్చుకోదగిన, అంశం పారిశ్రామిక సంబంధాలలో వుంది. అదేమంటే – చేనేత కార్మికులకు, మాస్టర్ వీవర్లకు మధ్య ప్రత్యక్ష సంబంధం యీ కేంద్రంలో కనిపిస్తుంది. మిగతా చేనేత కేంద్రాలలో చేనేత కార్మికునికి మాస్టర్ వీవర్‌కు మధ్యలో మధ్యవర్తిగా 'మూడవ వ్యక్తి' వుంటాడు. ఇక్కడ వీరిరువురి మధ్య ప్రత్యక్ష సంబంధం వుండటం వల్ల ఒకరి కష్టాలు రెండవవారు తెలుసుకొని పరిస్థితుల ప్రకారం సర్ధుకు పోతుంటారు. దాని వల్ల పారిశ్రామిక సంబంధాలు సజావుగా సాగి అందరికీ మేలు జరుగుతోంది.

## మంగళగిరిలో మజూరీలు ఎక్కువే!

మంగళగిరి చేనత వ్యాపారానికి 'చీరాల' చేనేత కేంద్రం గట్టిపోటీ యిస్తుంటుంది. చీరాలతో పోలిస్తే మంగళగిరిలో మజూరీలు ఎక్కువ యివ్వవలసి వస్తోందని, దాని వలన యిక్కడి ఉత్పత్తి ధర 10, 15రూ॥లు ఎక్కువగా వుండి మార్కెట్‌లో పోటీకి తట్టుకోలేక ఉక్కిరి బిక్కిరవుతుంటా మని మాస్టర్ వీవర్లు వాపోతుంటారు.



మంగళగిరి నేతకు నాణ్యత ఎక్కువని, దానిని నేయటానికి ఎక్కువ సమయం పడుతుందని, చీరాల నేతను తొందరగా నేయవచ్చని, అందునా అక్కడ 'పీస్–వర్కు' అవటం వల్ల వారికి మజూరి గిట్టుబాటవుతోందని చివరికి ఏది చూచినా ఒకటే తప్పు, యిక్కడి కార్మికులకు ఎక్కువ మజూరి ఏమి అందటం లేదని కార్మిక నాయకులు చెబుతారు.

ఏది ఏమైనా యిక్కడ మజూరి ఎక్కువ వుంటే, అది యిక్కడి కార్మిక సంఘాల సంఘటిత శక్తికి ప్రతిఫలమే! పార్టీల వారీగా కార్మిక సంఘాలు వున్నా, "చేనేత ఐక్య కార్యచరణ సమితి" పేరుతో మజూరి పెంపు కోరటం జరుగుతోంది.

మజూరి పెంపు విషయమై అన్ని కార్మిక సంఘాల మధ్య ఐక్యత యిక్కడ ఒక మంచి లక్షణం. అందువల్లే యితర చేనేత కేంద్రాలలో కంటే యిక్కడ కార్మికులు మెరుగైన మజూరీలు పొందగల్గుచున్నారు.

## చేనేత కార్మిక సంఘాలు - కార్మిక నేతలు

1942 ప్రాంతలో యిక్కడ రెండు కార్మిక సంఘాలుండగా ఇప్పుడు వివిధ రాజకీయ పక్షాలకు సంబంధించి 8 పనిచేస్తున్నాయి.

గంజి నారాయణ, బిట్రా రామకృష్ణ, జొన్నాదుల పరమేశు, చిమ్మన నాగభూషణం, దామర్ల రామస్వామి, గోలి హనుమంతరావు, దామర్ల పూర్ణయ్య, కాండ్రు ఆదిశేషు, రామనాధం శీతయ్య, చేబ్రోలు వెంకటేశ్వర్లు, శింగిరేసు కోటేశ్వరవు పాతతరం కార్మిక నాయకులు. శ్రీ గోలిహనుమంతరావు రచయితగా చేనేత ఉద్యమాలు, సమస్యలపై గ్రంధాలు, వ్యాసాలు ప్రచురించారు.

**ప్రస్తుతం :** అందే పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, కౌతరపు వెంకటేశ్వరరావు, గంజి సుబ్బారావు, రామనాధం పూర్ణచంద్రరావు, జగ్గారపు సుబ్బారావు, పట్టిం సాంబశివరావు, బిట్ర శ్రీనివాసరావు, జంజనం మల్లికార్జునరావు మొ॥వారు చేనేత కార్మికుల కోసం పనిచేస్తున్నారు. శ్రీ అందె నరసింహారావు రాష్ట్రస్థాయిలో ఆం॥ప్ర॥ చేనేత కార్మిక సంఘ అధ్యక్ష బాధ్యతలు వహిస్తున్నారు.

## నూలు వ్యాపారం

మంగళగిరిలో నూలు వ్యాపారం ఎందరో విజయవంతంగా నిర్వహించారు. వారిలో కొందరు మాస్టర్ వీవర్లు కాగా, మరికొందరు దీనిని ప్రత్యేకంగా నిర్వహించటం జరిగింది.



1942 ప్రాంతంలో ఖద్దరు నూలు, వడుపు నూలు అనబడే చేతితో వడికిన ముడినూలు వుండగా, 20వ నెంబరు మిల్లు నూలు వచ్చింది. 1946 ప్రాంతంలో 30,32,36,40 నెంబర్ల మిల్లునూలు వచ్చి ఆ తరువాత 60, 80 నెంబర్లు నూలు కూడా వచ్చింది.

1960 ప్రాంతాల్లో శ్రీయుతులు ప్రెగడ బాలనాగు, ప్రెగడ నరసింహం, వుదతా వీరాస్వామి, వెనిగంళ్ళ తాతయ్య, దామర్ల తాతయ్య, రోశిమ్మారావు, గోలి కోటయ్య మొ॥వారు నూలు వ్యాపారం చేసిన కొందరు. ఆ తరువాత కాలంలో నూలు వ్యాపారంలో శ్రీయుతులు దామర్ల ఉమామహేశ్వరరావు, మునగాల భావనారుషి, కూరపాటి సాంబశివరావు, నందం అబద్ధయ్య, నందం సాంబశివరావు, అందే కోటేశ్వరరావు మొ॥వారు కొందరు వున్నారు.

## అద్దకం

1930 ప్రాంతాలలో యిక్కడ మట్టి తొట్టెలలో కొద్ది కొద్దిగా నూలుకు రంగులు వేసుకునే వారు. ఈ పద్ధతి ఎంతో యిబ్బందికరంగా వుండేది. ఆ పరిస్థితులను అధిగమించేందుకు శ్రీ బిట్రా వెంకటరత్నం గారు ప్రప్రధమంగా మంగళగిరిలో "యారన్ డైయింగ్ యూనిట్"ను స్థాపించి ఒకేసారి ఎక్కువ నూలుకు రంగు వేసే పద్ధతి ప్రవేశపెట్టారు. దీంతో జిల్లాలోని వారు నూలు రంగులు వేయించుకునేందుకు మంగళగిరికి వచ్చేవారు. అలా మంగళగిరి దిన దినప్రవర్ధమానంగా నూలు అద్దకానికి ఒక ప్రత్యేక కేంద్రంగా మారింది.

1942-47 వరకు అనే చేతితో వడికిన నూలుకు చెంగావి, కెంపు, లాకి, చాక్లెట్‌బ్లూ, నలుపు రంగులను చేతితో అద్దేవారు. వాటిని కచ్చా రంగులనే వారు, అవి రంగు వెలిసేవి. 1946-47లలో జర్మనీ దేశం నుండి పక్కా రంగులు వచ్చాయి. ఆ రంగులు పోయేవి కావు. ఆ రంగులు వేసిన చీరలకు "మంగళ గిరి పట్టుబడి చీరలు"గా పేరొచ్చింది. ఇక్కడి రంగు పనివారి (డైయర్స్) చొరవ, ఉత్సాహం, శ్రమ వల్ల డైయింగ్ పని కొత్త పుంతలు త్రొక్కి, మంగళగిరి చేనేత పరిశ్రమకు ఎనలేని పేరు ప్రతిష్టలు వచ్చి, స్థానికంగా పరిశ్రమ స్థిరపడేందుకు దోహదం చేసింది. రాష్ట్రం నలుమూలల నుండి అద్దకం ఆర్డర్లు వచ్చేవి.



ఇక్కడ డైయింగ్ షెడ్లు ప్రారంభమైన రోజులలో శ్రీయుతులు ఆత్మకూరు భద్రయ్య, అవ్వారు మైలారు, గోలి పుల్లయ్య, కంభాల యల్లమంద, కంభాల కోటయ్య, చినకాకాని శ్రీరాములు, పచ్చారపు వెంకటేశ్వర్లు, నేరెళ్ళ సుబ్బారావు లాంటి డైయర్లు తమ నిపుణతతో, ప్రతిభతో "హాంకీ యారన్"కు వేసిన రంగులు ఎంతో మన్నికగా వుండి మంగళగిరికి ఎనలేని పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి.

డైయింగ్ యూనిట్లదారులు మరికొందరు - శ్రీయుతులు వెనిగంళ్ళ తాతయ్య, గోలి గోపాలరావు, వూట్ల ద్వారకా కృష్ణ, మునగాల వెంకయ్య, రావెల వెంకటేశ్వర్లు, ఉడుతా వీరాస్వామి, కొల్లి నరసింహస్వామి, అందె కోటేశ్వరరావు, కాటబత్తుల కృష్ణమ్మ, మున్సబు సుబ్బారావు, దామర్ల ఉమామహేశ్వరరావు. శ్రీ అవ్వారు మైలారు స్వయంగా ఒక మంచి డైయరే కాక, స్వంత డైయింగ్ యూనిట్‌ను కూడా స్థాపించారు.

## డైయింగ్ వర్కర్స్ యూనియన్ :

డైయింగ్ వర్కర్ల సంక్షేమం కోసం యూనియన్ స్థాపించబడి శ్రీయుతులు ఎమ్.ఎల్. నరసింహారావు, బొంతల వెంకటేశ్వర్లు, మునగాల సాంబశివరావు మొ॥వారు పనివారల జీతభత్యాలు, సౌకర్యాలు మెరుగుపర్చటం కోసం కృషిచేశారు.

## సహకార సంఘాలు

మంగళగిరి మొదటి నుండి చేనేత సహకార రంగంలో ప్రాముఖ్యత వహిస్తూనే వుంది. శ్రీ దామర్ల రమాకాంతరావు రాష్ట్ర చేనేత సహకార సంఘానికి వ్యవస్థాపక కార్యదర్శిగా నుండి రాష్ట్రస్థాయిలో సహకార రంగంలో చేనేత అభివృద్ధి చెందేందుకు విశిష్ట కృషి చేశారు.
1978లో ఎక్కువ మంది చేనేత కార్మికులను సహకార రంగ పరిధిలోనికి తెచ్చేందుకు యిక్కడ సుమారు 14 చేనేత సహకార సంఘాలు ఉద్భవించాయి. 1979లో "ప్రాజెక్టు ప్యాకేజి స్కీము" క్రింద కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మగ్గాలిచ్చి "హ్యాండ్‌లూం టెరికాటన్" నేయించారు. నిర్వహణాలోపం, ఆర్థిక వనరుల కొరతల వల్ల ఆ ప్రయోగం విఫలమై ఆ పథకం రద్దయింది. 1882-83 నాటికి చేనేత సహకార సంఘాలకు ఆదరణ లేక మూతపడగా, 14 సంఘాలను కలిపి నాలుగు సంఘాలుగా చేశారు. కాని ఆ 14 సంఘాల అప్పులు కేవలం 4 సంఘాలపై పడటంతో, అవి ఆర్థికంగా కోలుకోలేక కేవలం 200 మగ్గాలపై మాత్రమే పనిచూపగల్గుతున్నాయి. "ప్రాజెక్టు ప్యాకేజి స్కీము" క్రింద ది. 14-2-2002న మంగళగిరిలో "వీవర్స్ ట్రైనింగ్ సెంటర్" ప్రారంభమైంది. ఐదు మగ్గాలపై నెలకు 25 మందికి అధునాతన డిజైన్లు, 'జాకార్డు నేత', 'జిందాని నేత' కార్మికులకు నేర్పుతున్నారు.

## మాస్టర్ వీవర్స్ అసోసియేషన్

1949లో సుమారు 40 మంది మాస్టర్ వీవర్లు సభ్యులుగా యీ సంస్థ ఏర్పడి, యీ ప్రాంత చేనేత రంగ అభివృద్ధికి క్రియాశీలంగా, పటిష్టంగా కొనసాగింది.

1958 ప్రాంతాల్లో నుండి "లాభ నష్టాలు లేని" ప్రాతిపదికగా తమ సభ్యులకు రంగులు, రసాయనాలు సరఫరా చేశారు. ఈ సంస్థకు యీనాటికి సుమారు 60లక్షల రూపాయల విలువైన ఆస్తులు వున్నాయి.

1994 నుండి యీనాటి వరకు మాస్టర్ వీవర్సు అసోసియేషన్‌కు శ్రీయుతులు బిట్రా సుబ్బారావు ప్రెసిడెంటు, దామర్ల పూర్ణయ్య వైస్-ప్రెసిడెంట్, రావెల శివ సత్యనారాయణ సెక్రటరి, నందం సాంబశివరావు జాయింటు సెక్రటరి, కొల్లి వెంకటేశ్వరరావు ట్రెజరర్‌గాను మరి యితర 10 మంది కార్యవర్గ సభ్యులు బాధ్యత వహిస్తున్నారు.

## చేనేత "కార్మికులా" - "కళాకారులా" ?

తరతరాలుగా తమ నైపుణ్యాన్ని పెంచుకుంటూ, అద్భుతమైన ప్రజ్ఞతో, యంత్రాల పోటీకి నిలబడగలిగిన చేనేత వారల పనిని సునిశితంగా పరిశీలిస్తే వీరి నేర్పరితనం ఆశ్చర్యం కలిగించక మానదు. ఎల్లోర శిల్పాలను, అజంతా చిత్రాలను యిప్పటికీ జీవింపచేసిన కళాకారుల కోవలోకే వచ్చే వీరు కార్మికులు కాదు. ముమ్మాటికీ కళాకారులే! అలా గుర్తించ గలిగిన కళాహృదయులకు వీరు కళాకారులు. లేకపోతే వీరు కేవలం యంత్రంలా పనిచేసుకుపోయే కూలీలు.

## జాతీయ అవార్డులు

1966-67లో ఆల్ఇండియా టెక్స్టైల్ బోర్డువారు చేనేత కార్మికులు శ్రీ దివి కృష్ణ, శ్రీ రాచాబత్తుల నరసింహారావుల ప్రతిభను గుర్తించి జాతీయ అవార్డు ప్రదానం చేయటం మంగళగిరి కార్మికులకు జాతీయస్థాయి గుర్తింపే!

## కీలక పదవులు అధిష్టించిన ప్రముఖులు

చేనేతకు మూలాధారమైన నూలును సహకార రంగంలో ఉత్పత్తి జరిగి, సక్రమంగా సరఫరా కాగలందులకు శ్రీ దామర్ల రమాకాంతరావు విశేష కృషి చేసి వివిధ మిల్లులకు అనేక హోదాలలో బాధ్యతలు నిర్వర్తించారు. శ్రీ గోలి గోపాలరావు, శ్రీ దామర్ల ఉమామహేశ్వర రావు, శ్రీ బిట్రా వీరనారాయణ నూలు మిల్లులకు డైరెక్టర్లుగా బాధ్యతలు వహించినారు. శ్రీ గోలి వీరాంజనేయులు నూలుమిల్లులకు వైస్-ఛైర్మన్గాను, ఆప్కో పర్సన్ ఇన్ఛార్జిగాను, టెక్స్టైల్ డెవలప్మెంటు కార్పొరేషన్ ఛైర్మన్ పదవులనలంకరించారు. శ్రీ రావెల చంద్రశేఖరరావు "ఆప్కో" డైరక్టరుగా పదవీ బాధ్యతలు నిర్వహించియున్నారు.

## నేతన్నలకు పసిడి వెలుగులు

1980 దశకంలో జరిగిన రెండు పెనుమార్పులు మంగళగిరి చేనేత కుటుంబాలకు బంగారు వెలుగుల నిచ్చాయి. స్థానికంగా చేనేత పరిశ్రమ కుంటుపడటంతో తప్పనిసరి పరిస్థితుల్లో వృత్తి మారి వారు బంగారం పనిలోకి వెళ్ళటం ప్రారంభించారు. నేతలో కళాత్మకత, సృజనాత్మకత కలబోసే వీరు ఆ పనిలో వెంటనే యిమిడిపోయారు. ఎక్కువ చొరవగల కొందరు బంగారం పనివారి స్థాయి నుండి యజమానులుగా ఎదిగి, తాము పట్టిందల్లా

బంగారమై కోటికి పడగలెత్తారు. ఈనాటికి మంగళగిరి నుండి సుమారు 10 వేల మంది బంగారం పనిలోకి వెళ్తుండటంతో పట్టణంలోని నిరుద్యోగ సమస్య కొంత మేరకు తీరింది.

"మంగళగిరి డ్రెస్ మెటీరియల్" యీనాటికి కోట్లాది రూపాయల వ్యాపారం యిక్కడ జరుగుతోంది. సంవత్సరం పొడుగునా కార్మికులకు ఉపాధి కలుగటమేగాక, మాస్టర్ వీవర్లు సిరులను పండిస్తున్నారు.

"బంగారం", "డ్రెస్ మెటీరియల్" రంగాలు – పనివారలకు ఉపాధి, పెట్టుబడిదారులకు లాభాలు తెచ్చి పెడుతుండటంతో యీ పట్టణ ఆర్థిక పరిస్థితి కొంత మేరకు మెరుగుపడింది.

## చేనేత మ్యూజియం

పురాతన కాలం నుండీ మంగళగిరి ఒక గొప్ప చేనేత కేంద్రం. ఆ నాటి నుండి యీ నాటి వరకు చేనేత పరిశ్రమలో వాడే పనిముట్లు ఎన్నో రూపాలను సంతరించుకుంటూ, అధునాతన పరికరాలు అందుబాటులోనికి వచ్చినవి. పాత తరాలుపయోగించిన చేనేత పరికరాలు, అలనాటి చేనేత నాయకులు చిత్రపటాలు, వివిధ రకాల చేనేత వస్త్రాలు, డిజైన్లను ప్రదర్శించే ఒక చేనేత మ్యూజియాన్ని ఏర్పాటు చేయవలసి వుంటుంది.

ఇది చేనేత సంస్కృతి పరిరక్షణకే కాకుండా ఈ పట్టణాన్ని సందర్శించే యాత్రికులకు కూడా ఒక ప్రత్యేక ఆకర్షణగా వుండి టూరిజం అభివృద్ధికి దోహదం చేస్తుంది.



## సిరులు కురిపిస్తున్న మంగళగిరి డ్రస్ మెటీరియల్

మంగళగిరి చేనేత పరిశ్రమ 1985లో సరికొత్త మలుపు తిరిగింది. 'నిజాం బోర్డరు' చీరలు రంగప్రవేశం చేసి సిరులు కురిపించాయి. ఆ తరువాత డ్రస్ మెటీరియల్ ప్రవేశంతో మాస్టర్ వీవర్ల దశ తిరిగింది. కేంద్ర సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో బొంబాయిలో నిర్వహించిన జాతీయ వస్త్రప్రదర్శనలో మన రాష్ట్రం కూడ పాలుపంచుకున్నది. కేంద్ర సాంస్కృతిక సలహాదారు శ్రీమతి పపుల్ జయకర్ ఆదేశాల మేరకు 'వీవర్సు సర్వీసు సెంటర్'లో ఉప సంచాలకులుగా పనిచేస్తున్న మంగళగిరి స్థానికులైన శ్రీ జంజనం కుటుంబ రెడ్డయ్య తన మేధస్సును ఉపయోగించి విలక్షణమైన 'చిగురంచు'లేకుండా చీరలు తయారు చేయించి వాటిని జాతీయ వస్త్ర ప్రదర్శనలో వుంచారు. ఆ చీరలను శ్రీ చింతక్రింది రాధాకృష్ణకు చెందిన ప్రత్యేక మగ్గాలపై నేయించారు.

**శ్రీమతి సోనియా ప్రశంస :**

ఆ వస్త్ర ప్రదర్శనకు వీక్షించిన శ్రీమతి సోనియా గాంధి యీ చీరల అందచందాలను చూచి అచ్చెరువొందారు. ఆమె కోర్కె మేరకు శ్రీ కుటుంబ రెడ్డియ్య 'ఆమ్‌రస్' (మామిడి రసం) రంగు చీరను నేయించారు. శ్రీమతి సోనియా గాంధీకి అందజేశారు. ఈ పరిణామంతో దేశ రాజధానిలోని ఉన్నత వర్గాలకు చెందిన గృహిణులు యీ తరహా చీరల పట్ల ఆకర్షితులయ్యారు. మంగళగిరి పేరు మార్మోగింది. దేశవ్యాప్త గుర్తింపు లభించింది. ఈ చీరలకు 'నిజాం బోర్డరు చీరలు' అని నామకరణం చేశారు.

1985-86లో వడుగు, పేకలకు వేర్వేరు రంగులనుపయోగించి పంజాబీ డ్రస్సులకుపయోగించే వస్త్రాలను శ్రీ కుటుంబ రెడ్డియ్య రూపొందించారు. వాటికి సిల్కు, తళుకులు తెప్పించారు. బొంబాయి, మద్రాసు, ఢిల్లీ, కలకత్తా వంటి మహానగరాలలో ప్రాచుర్యం కల్పించారు. ఈ నేపథ్యంలో డ్రెస్ మెటీరియల్ తయారీ, అమ్మకాలు ఉధృతమయ్యాయి. రాష్ట్ర రాజధానిలో శ్రీ తమ్మిశెట్టి రామకృష్ణ ఎగుమతి వ్యాపారాన్ని నిర్వహించినట్లు, శ్రీ తమ్మిశెట్టి లక్ష్మణరావు ఆయనకు మార్కెటింగ్‌లో అపారంగా సహకరించినట్లు చెబుతుంటారు. చాలా మంది డ్రెస్ మెటీరియల్ వ్యాపారాన్ని ప్రారంభించారు. దీనిని మరింత విస్తృతం చేశారు. దీంతో ఒకప్పుడు కళ తప్పిన స్థానిక చేనేత పరిశ్రమకు ఊపిరి లభించినట్లయింది. చేనేత దీర్ఘకాల మనుగడకు సోపానమేర్పడింది.

డ్రెస్ మెటీరియల్‌తో పట్టణ కీర్తి ప్రతిష్టలు దశదిశలా వ్యాపించాయి. చేనేత వ్యాపారులు, కార్మికులు తమ ప్రతిభను చూపే అవకాశం లభించింది. డ్రెస్ మెటీరియల్ పట్టణ చేనేత కీర్తి కిరీటంలో కలికితురాయిలా భాసిస్తోంది. అనేక మందిని సంపన్నులుగా మార్చింది. పట్టణ సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడింది.

# పరిశ్రమలు

పారిశ్రామికంగా చూస్తే గతంలో యీ ప్రాంతంలో పలు పరిశ్రమలు వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించి. కోట్లాది రూపాయల విలువైన ఉత్పత్తులను సాధించేవి. క్రిష్ణా సిమెంట్ కంపెనీ, ప్యారీ కంపెనీ, షావాలెస్ కంపెనీ, ఆంధ్రా ఫెర్టిలైజర్సు, డాల్డా కంపెనీ, ఈస్టుకోస్టు ఫ్లోర్‌మిల్స్, స్పెన్సర్స్ కంపెనీ, రెనో రబ్బరు, స్టీలు రోలింగ్ మిల్లులు వంటివి గతంలో గ్రాండ్ ట్రంకురోడ్ యిరువైపులా నెలకొనియుండి యీ ప్రాంతం పారిశ్రామికంగా వెలిగింది. ఐతే పరిస్థితుల ప్రభావం వల్ల అవన్నీ కాలగర్భంలో కలిసిపోయి చరిత్రగా మాత్రమే మిగిలాయి. మంగళగిరికి ప్రస్తుతం ప్రత్యేకత ఏమీ లేదు.

ప్రభుత్వ అండదండలతో పట్టణ శివారు ప్రాంతంలో వెలసిన ఇండస్ట్రీయల్ ఎస్టేటులో కొన్ని చిన్నతరహా పరిశ్రమలు నడుస్తున్నాయి.

పట్టణంలో పూర్వకాలం నుండి వున్న రైస్, ఆయిల్ మిల్లులు, క్రమంగా కనుమరుగయ్యాయి. నివాస స్థలాలుగా రూపాంతరం చెందాయి. సాంప్రదాయికంగా ప్రజల అవసరాలు తీర్చిన ఆముదం మిల్లులు కూడ అంతర్ధానమయ్యాయి.

పట్టణంలోని 'రాంకో' కంపెనీ ప్రముఖ వ్యాపార సంస్థగా ఎగుమతి కార్యకలాపాలు సాగించింది. సంస్థ విస్తరణలో భాగంగా యీ కంపెనీని బైపాస్ రోడ్డుకు తరలించారు.

'కోకకోల' బాట్లింగ్ యూనిట్ స్థానికులకు ఉపాధి కల్పించకపోయినప్పటికి, ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేటుధరలు పెరిగి ప్రజలు అపారంగా లబ్దిపొందారు.

గత అనుభవాల దృష్ట్యా పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రాకపోవటం, సహజ వనరులు లేమి, ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటం వంటి కారణాల రీత్యా యీ ప్రాంతం పారిశ్రామికముగా అభివృద్ధి లేదు.

### కొండయ్యగారి 'రాంకో'



స్థానిక పారిశ్రామికవేత్త శ్రీ మోతుకూరు మాలకొండయ్య నిడమర్రు రోడ్డులో 1974 సం॥లో రాజగోపాల్ ఆయిల్ మిల్లు ప్రారంభించారు. తౌడు నుండి నూనె తీసే యీ పరిశ్రమ 'రాంకో'గా పిలువబడి అభివృద్ధి చెందుతూ వచ్చి మంగళగిరిలో నిలదొక్కుకున్న ఒక పరిశ్రమగా పేరు సంపాదించింది. వివిధ కారణాల వల్ల ఆ సంస్థను బైపాస్ రోడ్డుకు తరలించారు.

బైపాస్ రోడ్డు వద్ద శ్రీ కొండయ్య నేతృత్వంలో 'శశిశ్రీ ఎలక్ట్రానిక్స్' పేరున ఒక లిమిటెడ్ కంపెనీ 1999లో ప్రారంభించారు. ఈ పరిశ్రమలో తౌడు నుండి, సోయాబీన్ గింజల నుండి ముడి నూనెను తీసి, వంట నూనెల రిఫైనరీలకు అమ్ముతారు. ఆ రిఫైనరీలలో యీ నూనెను శుద్ధి చేసి మార్కెటింగ్ చేస్తారు.

ఆరు ఎకరాల విస్తీర్ణంలో నెలకొని వున్న నాలుగుకోట్ల విలువైన యీ పరిశ్రమ సంవత్సరానికి 50 కోట్ల రూపాయల వ్యాపారం చేస్తోంది. శ్రీ మాలకొండయ్య యీ కంపెనీకి ఛైర్మన్ / మేనేజింగ్ డైరెక్టరుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

శ్రీ కొండయ్యగారి కుమారులైన శ్రీ సాంబశివరావు డైరెక్టరు హోదాలో పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యువ పారిశ్రామికవేత్త అయిన శ్రీ సాంబశివరావు యీ ప్రాంతంలో పరిశ్రమల నిర్వహణపై వున్న అపోహలను కొట్టివేస్తారు. దాదాపు వంద మంది కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్న తమ పరిశ్రమలో కార్మిక సంఘంలేదని, యింతకు ముందు యీ ప్రాంతంలో నడచిన పరిశ్రమలు యాజమాన్యాల పర్యవేక్షణ సరిగా లేని కారణంగా మూతపడినాయని నమ్ముతారు. ఎలాంటి కార్మిక సమస్యలు లేకుండా పరిశ్రమను నడిపిస్తున్న వీరు యీ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించగోరే పారిశ్రామిక వేత్తలకు ఆదర్శం, ఆశాకిరణం.



## క్రిష్ణా సిమెంట్ వర్క్స్

20 టన్నుల వార్షిక ఉత్పత్తితో 1939లో ఏ.సి.సి. క్రిష్ణా సిమెంట్ వర్క్స్ ప్రారంభమైంది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో యీ ప్లాంటు నుండి ఎక్కువ సిమెంటు ఉపయోగించబడినది. రోజుకు 750 టన్నుల ఉత్పత్తి స్థాయికి 1000 మంది పనివారలతో ఎదిగింది. పాత పద్ధతిలో, పాత యంత్రాలపై ఉత్పత్తి చేయలేక, ఆధునీకరించటం యిష్టంలేక ఎ.సి.సి. యాజమాన్యం 1989లో



'హేమరాజ్ మహావీర్ పోద్దార్ అనే సంస్థకు అమ్మివేశారు. తిరిగి 12-5-1993న యాజమాన్యం క్రిష్ణా సిమెంట్ వర్క్స్‌కు మారింది. వారు 17 రోజులకే 29.5.1993న లాకౌట్ ప్రకటించారు

. కార్మికులు వీధిన పడ్డారు. మంగళగిరి గ్రామ స్థాయిలో వున్న రోజులలో అన్ని సౌకర్యాలు గల కె.సి. వర్క్స్ టౌన్ షిప్ జనసందోహంతో కళకళలాడి యిప్పుడు విషాద ఘట్టంలోకి మారింది. యిన్నాళ్లూ ఎంతో గర్వంగా నిలబడి అక్కడి పారిశ్రామిక గత వైభవ చిహ్నంగా వున్న పొగగొట్టాలు 2004 ఫిబ్రవరి నాటికి నేలమట్టమై, నామరూపాలు లేకుండా పోయాయి.

## టైర్ల ఫ్యాక్టరీ- ఎలక్షన్ల ఫ్యాక్టరీ!

ఎపిఎస్ఆర్టీసి మరియు డన్‌లప్ కంపెనీల భాగస్వామ్యంతో 1970వ దశకంలో రూ. 30 కోట్ల పెట్టుబడితో నిర్మించ తలపెట్టిన టైర్ల ఫ్యాక్టరి కేవలం ఎలక్షన్ స్లోగన్ గానే మిగిలిపోయింది. దీనివలన 100 ఎకరాల వ్యవసాయ భూమి నిరుపయోగంగా వుండి పోయింది. ఎర్రచెరువు, నల్లచెరువు నిరుపయోగంగా మారాయి.



అప్పట్లో యీ ప్రాంత ప్రజలు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కొండంత ఆశతో ఎదురు చూశారు. పట్టణం కూడా సర్వతోముఖంగా అభివృద్ధి చెందుతుందని అన్ని వర్గాల ప్రజలు ఆశపడ్డారు. టైర్ల ఫ్యాక్టరీ బోర్డు పెట్టి, సైట్ ఇంజనీరు ఆఫీసు కూడా మంగళగిరిలో పెట్టారు. కాని 1977లో జనతాపార్టీ అధికారంలో వున్న రోజుల్లో అప్పటి కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ జార్జి ఫెర్నాండెజ్ మంగళగిరిలో జరిగిన ఒక బహిరంగ సభలో యిక్కడ టైర్ల ఫ్యాక్టరీ అనవసరమని, స్థానికులకు ఉపాధి అవకాశాలు దానివల్ల రావని కుండబద్దలు కొట్టి చెప్పారు. 1989లో జరిగిన ఎన్నికల సందర్భంలో ఆ టైర్ల ఫ్యాక్టరీ స్థలానికి ఎదురుగా పొలాల్లో జరిగిన ఒక ఎలక్షన్ ప్రచార సభలో శ్రీ ఎన్.టి. రామారావు యిదిగో టైర్లఫ్యాక్టరీకి అనుమతి లేఖ అని ఒక కాగితం చూపటం కూడా జరిగింది. దానికి ముందూ వెనుక జరిగిన చాలా ఎన్నికలలో టైర్ల ఫ్యాక్టరీ తెస్తామని రాజకీయ పార్టీలు ప్రమాణాలు చేసి విఫలమవ్వటంతో యీ ప్రాంత ప్రజలు అది టైర్ల ఫ్యాక్టరీ కాదు-ఎలక్షన్ల ఫ్యాక్టరీ మాత్రమేననే నిజాన్ని గ్రహించి దాని విషయం మర్చిపోయారు. ❋

# కార్మిక రంగం

ఈ ప్రాంతం పూర్వం వ్యవసాయాధారిత గ్రామాల సమూహంగా వుండేది. ఎక్కువ మంది ప్రజలు వ్యవసాయ, చేతి వృత్తుల మీద ఆధారపడి జీవించేవారు. 1939లో యీ ప్రాంతంలో క్రిష్ణా సిమెంటు వర్క్సు పేరున ఏ.సి.సి. సిమెంటు వారి పరిశ్రమ స్థాపన జరిగింది. దాంతో మగళగిరి ప్రాంతంలో పరిశ్రమలకు శ్రీకారం జరిగి పారిశ్రామిక కార్మికులు ఏర్పడినారు. ఆ తరువాత వివిధ భారీ, చిన్నతరహా పరిశ్రమలు ప్రారంభమైనాయి. దీంతో వ్యవసాయ కూలీలు, పారిశ్రామిక కార్మికులు రెండు వర్గాలుగా విడివడినారు.

ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మినహా ఏ యితర ప్రకృతి సిద్ధమైన వనరులు లేవు,.ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు యితర రాజకీయ, సాంఘిక, ఆర్థిక కారణాల వల్ల పరిశ్రమలు ఒక్కొక్కటి మూతపడుతూ వచ్చాయి. వేలాది మహిళలకు జీవనోపాధి కల్పిస్తూ వచ్చిన పొగాకు గ్రేడింగు రంగంలో యాంత్రికీకరణ జరిగి కార్మికులతో అవసరాలు తగ్గిపోయాయి. కాలక్రమేణా పరిశ్రమలు అంతర్థానమై వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు దిగజారాయి.

మంగళగిరి పట్టణంలోని అసంఘటిత కార్మిక రంగంలో సుమారు 600 వందల భవన నిర్మాణ కార్మికులు, 200 ముఠాపనివారు, 400 మంది రిక్షా కార్మికులు, వేయి మంది ఆటో కార్మికులు వున్నట్లు అంచనా. యువకులు ఆటో నడపటాన్ని ఉపాధిగా ఎంచుకుని లబ్ధి పొందుతున్నారు.

ఇక్కడ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు, సెంటర్ ఫర్ ట్రేడ్ యూనియన్స్, భారతీయ మజ్దూర్ సంఘ్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్,, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ మొ॥ కార్మిక సంఘాలు కార్మికులను సంఘటిత పరుస్తున్నాయి.

పాత తరంలో శ్రీయుతులు బెల్లంకొండ వీరయ్య, నూతక్కి రంగారావు, పాతర్ల నాగయ్య జియం. యన్. వి. ప్రసాదు, వేములపల్లి శ్రీకృష్ణ, ఆకుల శివరామ కృష్ణయ్య, కంటే కామయ్య, కంటే రంగారావు, రంగనాయకులు, చిలువూరి చింతయ్య, కరెంటు నారాయణ, నూతక్కి యోహాను, యం.యల్. నరసింహారావు, బొంతల వెంకటేశ్వర్లు మొ॥ వారు వివిధ కార్మిక సంఘాలకు నాయకత్వం వహించారు.

ఈ తరంలో శ్రీయుతులు అందే నరసింహారావు, పరుచూరి వెంకటేశ్వరరావు, జె.వి. రాఘవులు, కంటే నాగేశ్వరరావు, శాయి ప్రసాదు, సుందరరావు యాదవ్, మొ॥ వారు కార్మిక లోకానికి సేవలందిస్తున్నారు.

## పొగాకు గ్రేడింగ్ :

గుంటూరు జిల్లా పొగాకు పంటకు ప్రసిద్ధంకాగా, మంగళగిరి పొగాకు గ్రేడింగుకు ఒక ముఖ్యమైన కేంద్రంగా వర్ధిల్లింది. ట్రంకురోడ్‌తో మెరుగైన రవాణా సౌకర్యాలు ఉండటంతో మంగళగిరి-గుంటూరుల మధ్య బహుళ జాతి కంపెనీలతో పాటు ఎన్నో దేశీయ సంస్థలు కూడా 1972వరకు గ్రేడింగ్ వ్యాపారం పెద్ద మొత్తంలో జరుగుతూ, వేలాది మంది స్త్రీ కార్మికులు ఉపాధి పొందేవారు. మంగళగిరిలో ఐ.యల్.టి.డి. కంపెనీ, బ్రిటీష్ ఇండియా టుబాకో కంపెనీ (బి.ఐ.టి) మొ॥ పెద్ద సంస్థలు వుంటుండేవి. యంత్రాలు యీ పనిలోకి రావటంతో యీ సంస్థలు యిక్కడ ఆ పనిని మనుషులతో చేయించటంపోయి, 1980 ప్రాంతాలలోపూర్తిగా ఆ కంపెనీలు యిక్కడ నుండి కనుమరుగైనాయి. ప్రస్తుతం ఎర్రబాలెం, నవులూరు ప్రాంతాలలో సుమారు 4-5 వందల మంది స్త్రీలు మాత్రమే యీ గ్రేడింగ్ పనులు చేస్తున్నారు.

## శ్రీ నూతక్కి వెంకట రంగారావు



20-10-1917వ తేదీన చిలువూరు గ్రామంలో జన్మించిన నూతక్కి వెంకట రంగారావు గారు 1942లో మంగళగిరిలో అడుగు పెట్టేనాటికి యిక్కడ కమ్యూనిస్టు పార్టీలేదు. వీరు అక్కడి యువకులను, కులవృత్తులవారిని సంఘటిత పరుస్తూ కమ్యూనిస్టు పార్టీకి పునాది వేశారు. మంగళగిరిలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించిన ఘనత వీరిదే! అప్పట్లో రజకులకు వృత్తి కోసం అలాగే రజకుల, కుమ్మరుల, యాదవుల కులవృత్తి సమస్యలపై రంగారావు గారు పాటుపడుతూ వారిని ఒక తాటి మీదకు తెచ్చారు.

1943-44 ప్రాంతంలో కె.సి.వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్‌ను రంగారావు గారు ప్రారంభించి ప్రెసిడెంటుగా వుండగా, దావులూరి నరశింహం గారు సెక్రటరీగా వున్నారు. కొన్ని దశాబ్దాలు వీరు ఆ యూనియన్‌లో ప్రముఖపాత్ర పోషించారు. బిల్డింగ్ వర్కర్స్, షాపు గుమాస్తాలు మొదలగు సంఘాల వెనుక వీరు వుండి నడిపించేవారు. 1955లో మంగళగిరి శాసనసభ సీటుకు పోటీచేసి పరాజితులయ్యారు.

వీరి ఆధ్వర్యంలోనే - శ్రీయుతులు వూరే సుబ్బారావు, వూరే కోటేశ్వరరావు, రాఘవరపు కోటేశ్వరరావు, రాచకొండ వెంకటరత్నం, రాచకొండ సుబ్బారావు, బొడ్డు నారాయణ, కొడాలి వెంకటక్రిష్ణయ్య కమ్యూనిస్టులుగా మారారట. కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైన రోజులలో కొడాలి వెంకట కృష్ణయ్య ఫౌండ్రీ నుండే పార్టీ రహస్య కార్యకలాపాలు జరిపించారు. 1990 నుండి క్రియా శీలక రాజకీయాలకు దూరంగా మానికొండ గ్రామంలో గడుపుతున్నారు.

## పరిశ్రమల మూతకు కమ్యూనిస్టులు కారణం కాదు!

కొన్ని దశాబ్దాలుగా పట్టణ కార్మిక వర్గం పై కమ్యూనిస్టుల పట్టు కొనసాగింది. ప్రస్తుతం కూడా కొంతవరకు కొనసాగుతోంది. పట్టణం పారిశ్రామికంగా అభివృద్ధి చెందకపోవటానికి, వున్న పరిశ్రమలు మూసివేయటానికి కమ్యూనిస్టు పార్టీలు కార్మిక రంగం పేరున అవలంబించిన దుందుడుకు విధానాలే కారణమని ప్రచారంలోకి వచ్చింది. తాడేపల్లి ప్రాంతంలో సిమెంటు, ఇ.ఐ.డి. ప్యారీ, షావాలెస్, రీ రోలింగ్, తవుడు నుండి నూనె తీసే లాంటి అనేక పరిశ్రమలు మూతబడ్డాయని, ఈ పరిశ్రమల మూతకు ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు కార్మిక ఉద్యమాలను నడపడమే కారణమని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, కార్మికులు తాము చేసే శ్రమకు తగిన ప్రతిఫలం ఇవ్వమంటూ పోరాడతారు తప్ప తమ జీవనాధారమైన సంస్థల మూసివేతకు ఏ కార్మికుడూ పాల్పడడని వామపక్ష నేతల వాదన. మంగళగిరి ప్రాంతంలో కమ్యూనిస్టుల పోరాటాల వల్లే ఫ్యాక్టరీలు మూతబడ్డాయని ప్రచారం చేసేవారు దేశంలో మూడు లక్షల చిన్న పరిశ్రమలు మూతబడ్డాయని, అలా మూతపడిన పరిశ్రమలున్న ప్రాంతాల్లో కమ్యూనిస్టులు లేరన్న సంగతిని గుర్తించాలని వామపక్ష నేతలు చెపుతుంటారు.

తాడేపల్లి సిమెంటు ఫ్యాక్టరీ మూసివేతను పరిశీలిస్తే 70 ఏళ్ల క్రితం ప్రారంభించిన అప్పటి యంత్రాలన్ని పనిచేసే శక్తి కోల్పోయి, కొత్త యంత్రాల పోటీకి తగ్గట్టుగా ఉత్పత్తి చేయలేకపోతున్నాయని, వెనుకబడ్డ ప్రాంతంలో ఫ్యాక్టరీ పెడితే ప్రభుత్వం నుంచి సబ్సిడీలు రావడం, అదనపు సౌలభ్యాలు ఉంటాయని, ఇక్కడి భూములను అమ్ముకొని కోట్లు మిగుల్చుకోవచ్చనే ఆలోచనతో యాజమాన్యం ఫాక్టరీని మూసివేసిందని కార్మిక నాయకుల వివరణ. తామెప్పుడూ కార్మిక సంక్షేమం కోసమే పనిచేశామని, ప్యారీ కంపెనీ, ఈస్టుకోస్టు ఫ్లోర్‌మిల్, మూసివేయటానికి కారణం వారి ఉత్పత్తులకు మార్కెట్ పడిపోవటం, భూముల విలువలు పెరిగి ఉత్పత్తి చేయటం కంటే ఆస్తుల విలువను అనుభవించటం మేలని యాజమాన్యాలు భావించటం కారణాలని, తమను రాజకీయంగా దెబ్బతీసే ఉద్దేశ్యంతో యితర పక్షాలు దుష్ప్రచారానికి ఒడిగడుతున్నాయని కూడా కమ్యూనిస్టులు చెబుతుంటారు. వాస్తవాలు ఏవైనప్పటికీ మంగళగిరి ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందకపోగా, ఉన్న పరిశ్రమలు మూసివేయడంతో కార్మికులు నిరుద్యోగులుగా మారి, ఆకలి చావులకు గురవుతూ భవిష్యత్తుపై ఆశలేక క్రుంగిపోతున్నారు. ❋

# వ్యాపారం

మంగళగిరి చేనేత కేంద్రం కావటంతో ఆది నుండి చీరల వ్యాపారం అప్రతిహతంగా సాగుతూ వస్తోంది. వేలాది మందికి జీవనోపాధిని కల్పిస్తోంది. ఇటీవలి కాలంలో యిక్కడ స్వర్ణాభరణాల వ్యాపారం వూపందుకున్నది. తక్కువ సమయంలో ఎక్కువ సంపాదనకు ఆస్కారముండటంతో యువత ఎక్కువగా యీ రంగంవైపు మొగ్గు చూపుతున్నారు. ఆభరణాల వ్యాపారాన్ని క్రమంగా రాష్ట్రమంతటా విస్తరిస్తున్నారు. భవన నిర్మాణాలు అధికం కావటంతో సిమెంటు, కలప, యినుము, వ్యాపారాలు గణనీయంగా పుంజుకున్నాయి.

గూడు రిక్షాల, మినీ లారీల తయారీకి మంగళగిరి ఒకప్పుడు పెట్టిందిపేరు. ఐతే యిటీవల ఈ పరిశ్రమ పేరుకు మాత్రమే మిగిలింది.

గుంటూరు-విజయవాడ-తెనాలి పట్టణాలకు అతి చేరువలో వుండటం వ్యాపార రంగంలో మంగళగిరి ఎదుగుదలకు ప్రతిబంధకంగా పరిణమించింది. ఈ మూడు పట్టణాలకు విస్తృత రవాణా సౌకర్యాలుండటంతో వ్యక్తిగత కొనుగోళ్ళకు ప్రజలు అక్కడకు వెళ్లటం అలవాటుగా మారింది. స్థానిక మార్కెట్‌లో ప్రజలు ఎక్కువగా నిత్యావసరాలను మాత్రమే కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్ పరిధి అల్పం కావటంతో కొన్ని వ్యాపారాలలో తీవ్రమైన పోటీ ఎల్లప్పుడూ వుంటూ వస్తోంది. దీంతో పలువురు వ్యాపారులు ఆర్థిక లావాదేవీలను ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఎంచుకున్నారు.

మంగళగిరిలో పాతికేళ్ల క్రితం ఆరవ స్పెషల్ పోలీసు బెటాలియన్ నెలకొల్పటంతో వందలాది పోలీసు కుటుంబాలు తరలివచ్చాయి. దీంతో కొంత కాలం పాటు వ్యాపారాలు కళకళలాడాయి. ఆ పోలీసు సిబ్బందికి బెటాలియన్ లోనే గృహాలతో సహా సకల వసతులు అందుబాటులోకి రావటంతో వారు క్రమంగా స్థానిక మార్కెట్‌కు దూరమవుతున్నారు.

2003లో పట్టణానికి కృష్ణాజలాలు తరలి రావటంతో యిండ్ల నిర్మాణాలు పెరిగాయి. ఈ ప్రాంతంలో జీవన వ్యయం తక్కువ కావటంతో పదవీ విరమణచేసిన ఉద్యోగులు, గుంటూరు, విజయవాడల్లో పనిచేసే చిరుద్యోగులు యీ పట్టణ పరిసరాల్లో స్థిరనివాసం ఏర్పరచుకునేందుకు మొగ్గు చూపుతుండటంతో వ్యాపార పరిధి విస్తృతమవుతోంది.

## ఆయిల్ మిల్లులు

ఇంతకు ముందు  యిక్కడ 10-12 రోటరి ఆయిల్ మిల్లులు వుండేవి. వాటిలో ధనలక్ష్మి, గజలక్ష్మి, కనకయ్యగారి మిల్లు, గోపాలకృష్ణ, వెంకటేశ్వర మదలగు కొన్ని మిల్లులు.
పన్నుల పెరుగుదల, స్థానికంగా పంటలు తగ్గటం, నిపుణులైన కార్మికుల కొరత  వల్ల యిక్కడ యీ పరిశ్రమ దెబ్బతింది. ఒక రకంగా చెప్పాలంటే యీ పరిశ్రమ దాదాపు అంతరించింది. ప్రస్తుతానికి హేమలతా ప్రొడ్యూసర్స్ పేరున ఒకేఒక ఆయిల్ మిల్ నడుస్తోంది.

## ఆముదం ఫ్యాక్టరీలు

సుమారు 70సం॥ల క్రిందట నిడుముక్కల ఆదిశేషు, పారేపల్లి వారి ఆముదం మిల్లులు యిక్కడ వుండేవి. ఆ తరువాత చెక్కా చెన్నయ్య, నిడుమక్కల శేషగిరి పుల్లారావు, నిడుముక్కల వెంకటేశ్వరరావు తదితరులు ప్రారంభించారు.

పూర్వకాలంలో నూతక్కి, మెల్లంపూడి, చిర్రావూరు, తాడేపల్లి ప్రాంతాలలో ఆముదం పంట సమృద్ధిగా పండేది. ఎడ్ల బండ్ల వాడకాలు ఎక్కువగా వున్న రోజుల్లో బండి చక్రాలకు కందెనగాను, ప్రజలు తల నూనెక్రింద, దీపారాధనకు  పసిపిల్లలకు వాడేవారు. కాలక్రమేణా ప్రజల సాంస్కృతిక ఆరోగ్య అలవాట్లు మారటం వల్ల ఆముదంకు డిమాండు పడిపోయింది.

## కబేళా - పశుమాంస వ్యాపారం

ఇంతకు ముందు 'కబేళా' 5వ వార్డులో వుండేది. పశువుల్ని కోసి తద్వారా వచ్చిన వ్యర్థపదార్థాల్ని అక్కడే పారవేయటం వలన పారిశుధ్యం లోపించి దుర్వాసన  వ్యాపించి ప్రజలు ఎంతో అసౌకర్యానికి గురైనారు. ప్రజల నుండి ప్రజా ప్రతినిధుల నుండి వచ్చిన వ్యతిరేకతకు తలొగ్గి, శ్రీ మురుగుడు హనుమంతరావు మున్సిపల్ చైర్మన్‌గా వున్న కాలంలో 'కబేళా'ను  మార్చారు. మంగళగిరిలో పశువుల్ని వధించేందుకు ప్రత్యేక నిపుణత కల పనివారలుండటం, యిక్కడి మాంసానికి ప్రత్యేక రుచి వుండటం వలన  కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పేరుంది. అలాగే యిక్కడి పశువుల చర్మానికి మంచి పేరువుండి కలకత్తా, బాంబే మార్కెట్లలో మంచి గిరాకీ ఏర్పడింది.

## పొగాకు గ్రేడింగ్

మంగళగిరిలో పొగాకు వ్యాపారులు రైతుల వద్దకొని గ్రేడింగ్ చేసి - గుంటూరు కంపెనీలకు పంపేవారు. అక్కడ దానికి ప్రిజర్వేటివ్‌లు కలిపి ఎగుమతులు చేసేవారు. 1948 ప్రాంతాలలో శ్రీయుతులు చింతక్రింది కనకయ్య, జొన్నాదుల రామకృష్ణులు,

రావూరి రామకోటయ్య, 1958 నుండి తమ్మిశెట్టి రామకృష్ణ, 1975 నుండి పలగాని కోటేశ్వరరావు, 1978 లంకా సుబ్బారావు, మొ॥ వారు వ్యాపారాలు నిర్వహించగా చింతక్రింది కనకయ్య గారు విదేశీ వ్యాపారాలు కూడా నిర్వహించారు.

స్థానిక పొగాకు కంపెనీలతోపాటు, విదేశీ కంపెనీలు మంగళగిరిలో గ్రేడింగ్ నిర్వహించే రోజులలో 5-6 వేల మంది స్త్రీలు గ్రేడింగ్ పని ద్వారా ఉపాధి పొందుతుండేవారు.

## బంగారం వ్యాపారం

1980 దశకంలో స్థానికంగా చేనేత పరిశ్రమ కుంటుపడగా వేలాది మంది చేనేత పనివారలు బంగారం పనిచేయుటకు విజయవాడకు వలసపోవటం జరిగింది. విజయవాడ నగరంలో బంగారం పని వారిలో 90 శాతం మంది మంగళగిరి వారే కావటం విశేషం. మంగళగిరి సంబంధించిన బంగారం పనివారలు పట్టణంలో 5 వేల మంది, విజయవాడ వెళ్ళి మరో 5 వేల మంది పనిచేస్తు మొత్తం 10 వేల మంది వున్నారు. ఇక్కడ గోల్డు ఫ్యాన్సీరకాలు, ముఖ్యంగా అలంకరణకు ఉపయోగించే కమ్మలు, బుట్టలు, ముక్క పుడకలు, మంగళ సూత్రాలు, ఉంగరాలు, క్రొత్త డిజైన్లలో చేస్తారు. ఒరిస్సా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి అవుతాయి. చేనేత కార్మికులు వృత్తి రీత్యా కళాకారులు. కళకు సంబంధించిన వృత్తి బంగారు పని అవటంతో చేనేత నుండి బంగారం పనికి మారి ఆ పనిని యిక్కడ అభివృద్ధి చేశారు.

ఉంగరాలు, ముక్కుపుడకలు, చెవుల బుట్టలు కుటీర పరిశ్రమ క్రింద బంగారం పనిచేస్తున్నారు. ఒక వేయి మంది స్త్రీలు యిండ్ల వద్ద పురుషులకు సహకరిస్తూ జీవనోపాధి పొందుచున్నారు. అనధికార లెక్కల ప్రకారం మంగళగిరిలో నెలకు సుమారు రెండుకోట్ల రూపాయలు బంగారం వ్యాపారం జరుగుచున్నట్లు చెబుతుంటారు. చేనేత పరిశ్రమలోను, బంగారం పనిలోను పనివారలు సమానంగా వుంటారని తెలుస్తోంది. ❋

## 100 సంవత్సరాల స్వీటు షాపు

మెయిన్ బజారులోని వడ్లపూడి సెంటర్‌లో గల నల్లగొండ వారి మిఠాయి దుకాణం గత 100 సం॥లుగా ప్రజాదరణతో నిరంతరంగా ఈ వ్యాపారాన్ని విజయవంతంగా కొనసాగిస్తోంది. మొదట ఈ షాపును శ్రీ నల్లగొండ గోవిందు గారు, వారి తర్వాత శ్రీ నల్లగొండ లక్ష్మయ్య, వారి తర్వాత శ్రీ నల్లగొండ సాంబశివరావు నిర్వహించారు. ప్రస్తుతం వారి వారసులుగా 4వ తరంవారైన శ్రీ నల్లగొండ మల్లికార్జునరావు నిర్వహిస్తున్నారు.

# సహకారం

## మంగళగిరి మార్కెటింగ్ సొసైటీ

మంగళగిరిలో సహకార రంగానికి 1946లోనే పునాది పడింది. ఆ సంవత్సరంలో 'మంగళగిరి ఫార్మర్స్ అండ్ ప్రొడ్యూసర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ' ప్రారంభమైంది. మొదట ఒక లక్ష ఐదు వేల రూపాయలు మూలధనాన్ని సమకూర్చుకొని ఈ సంఘం కార్య కలాపాలను ప్రారంభించింది.

ఈ సహకార సంఘం ప్రారంభమైన నాటికి 'ఇనుము'ను పర్మిట్లపై యిస్తుండేవారు. రైతు అవసరాలైన బండి చక్రాల పట్టాలు, పలుగులు, పారలు మొ॥ యినుప పనిముట్లు యీ సంఘం ద్వారా సమకూరేవి.

శ్రీయుతులు పోసాని ప్రకాశరావు, అన్నే సంజీవయ్య, ఆవుతు నారాయణస్వామి (ఉండవల్లి మున్సబు) మొ॥ వారు యీ సొసైటీ కార్యకలాపాలలో క్రియాశీలంగా పాల్గొంటుండేవారు. వారి కృషి ఫలితంగా యీ సంస్థ మంగళగిరి ప్రాంత రైతుల అవసరాలు నిరంతరంగా తీర్చుతూ వచ్చింది.

తరువాత కాలంలో యీ సొసైటి "మంగళగిరి మార్కెటింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ"గా రూపాంతరం చెందింది. శ్రీయుతులు అన్నె సంజీవయ్య, సింహాద్రి రంగారెడ్డి, దొడ్డా నరసింహారావు, శరణు పకీరయ్య మొ॥ పెద్దలు యీ సంస్థ నిర్వహణలో పాలుపంచుకొన్నారు. వారి నిర్వహణలో సంస్థకు సొంత స్థలం కొనుగోలు చేశారు. ప్రభుత్వ ఆర్థిక సహకారంతో భవనాలు నిర్మించారు.

రైసు మిల్లు నిర్మాణం చేశారు. పంచదార, ఎరువులు, వస్త్రములు తయారీదారుల వద్ద కొనుగోలు చేసి సరసమైన, కంట్రోలు ధరలకు వాటిని ప్రజలకు అందించేవారు. సంవత్సరానికి 25-30 లక్షల రూ॥ల టర్నోవరు చేసి, ప్రభుత్వ, ప్రజల మన్ననలను పొందారు.

ప్రభుత్వ విధానాలు, రాజకీయ కారణాల వల్ల 2001 సం॥లో యీ సొసైటీకి చెందిన విలువైన ఆస్తుల్ని మంగళగిరి మార్కెటింగ్ యార్డుకు బదలాయింపు చేశారు.

## కో-ఆపరేటివ్ బ్యాంకు

గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు శాఖ మంగళగిరిలో విజయవంతంగా పనిచేస్తోంది. ఈ బ్యాంకుకు రూ. 6 కోట్ల డిపాజిట్లు వున్నాయి. 10 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 10 కోట్ల రూ॥లకు పైబడి వివిధ రకాల రుణాలు పట్టణంలోని కో-ఆపరేటివ్ బ్యాంకు యిచ్చి వుంది

## ఇతర సహకార సంఘాలు

గుంటూరు జిల్లా మార్కెటింగ్ సొసైటి బ్రాంచి కాకుండా, యింకా పట్టణ ప్రాథమిక సహకార సంఘం, మంగళగిరి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, మున్సిపల్ ఎంప్లాయీస్, సి.కె. హైస్కూలు, ఓరియంటల్ హైస్కూలు, పి.డబ్ల్యు.డి. వర్క్‌షాపు ఉద్యోగుల పరపతి సంఘాలు పనిచేస్తున్నాయి.

## మార్కెటింగ్ యార్డ్

మంగళగిరిలో ప్రభుత్వ మార్కెట్ యార్డు 1940వ దశకం నుండే పనిచేస్తున్నది. రైతుల ఉత్పత్తులు, అమ్మకాలలో యీ ప్రాంతంలో సేవ చేస్తున్నది.

ఎన్నో దశాబ్దాలు అద్దె ప్రాంగణంలో వుంటూ వచ్చిన యీ యార్డు 2002 సం॥లో మంగళగిరి మార్కెటింగ్ సొసైటి యొక్క భవనాలను కొనుగోలు చేసింది.

వివిధ దశలలో అభివృద్ధి చెందుతూ, 2003 నాటికి సుమారు రూ. 40 కోట్ల లావాదేవీలు చేయగలిగి, గ్రేడ్-1 మార్కెట్ కమిటీగా ఉన్నతి పొందింది.

గతంలో శ్రీ మున్నంగి గోపిరెడ్డి యీ యార్డు అధ్యక్ష పదవిని చేపట్టారు. 2000-03 ప్రాంతంలో శ్రీ ఆలూరి నాగయ్య అధ్యక్ష పదవిని నిర్వహించారు. వీరి పదవీకాలంలో సుమారు కోటి రూపాయలకు పైగా విలువగల ఆస్తులను కొనుగోలు చేసి, టర్నోవరు పెంచారు.

1992-93 ప్రాంతాలలో యీ యార్డు నుండి తాడికొండ పరిధిని విడదీశారు. ప్రస్తుతం 2 ఎకరాల ప్రాంగణంలో గిడ్డంగులు, అరటికాయల యార్డు మొ॥ సౌకర్యాలున్నాయి.

పాలకవర్గం నియమించబడక పోవటంతో, 2004 అక్టోబరు నాటికి జిల్లా కలెక్టరు పర్యవేక్షణలో పనిచేస్తోంది. ❋

# న్యాయం

గ్రామ పెద్ద అయిన మున్సబుకు కేసులను న్యాయ విచారణ జరిపి శిక్షలు నిర్ణయించే అధికారం 1816 సం॥లో చేసిన చట్ట ప్రకారం వుండేది.

కొన్ని కేసులను మినహాయించి – రూ. 10కి మించని సివిల్ దావాలను పరిశీలించేందుకు, గ్రామ పంచాయతీని సమావేశపరిచే అధికారం, చిన్న చిన్న క్రిమినల్ కేసులను విచారించి శిక్షలు వేసేందుకు అధికారం వుండేది.

గ్రామ మున్సబు చేతిలో గ్రామ ప్రభుత్వం, న్యాయ నిర్ణయాలను అమలు చేసే బాధ్యత గ్రామపంచాయతీలకూ వుండేది. 1862 నుండి మన రాష్ట్ర హైకోర్టు మద్రాసు నగరంలో వుండేది. 1900 సం॥లో న్యాయ వ్యవస్థలో సివిల్, క్రిమినల్ పరిధులను విడదీశారు. సివిల్ కేసుల అధికారంగల జిల్లా జడ్జి మచిలీపట్నంలోను, ఆయన క్రింద జిల్లా మున్సిఫ్ గుంటూరులోను, మంగళగిరి గ్రామస్థాయిలో మున్సబు సివిల్ కేసులను పరిష్కరించేవారు. క్రిమినల్ కేసుల అధికారంగల – జిల్లా జడ్జి మరియు జిల్లా మేజిస్ట్రేట్ హోదాలో జిల్లా కలెక్టరు మచిలీపట్నంలోను, సబ్–కలెక్టర్ గుంటూరులోను వుండేవారు. డిప్యూటీ తహశీల్‌దారు మరియు గ్రామ మున్సబు మంగళగిరిలో వుండేవారు. గ్రామస్థాయిలో మున్సబు – దౌర్జన్యము చేయుట, దుర్భాషలాడుట వంటి చిన్న నేరాలను విచారించి, గ్రామ సత్రంలో 12 గంటలపాటు జైలుచేయటం, 6 గంటలు 'బండకొయ్య' వేయటం వంటి శిక్షలు విధించేవారు. గ్రామ మున్సబుకు వుంటూ వచ్చిన సివిల్ కేసుల పరిధిని 1950లో గ్రామ పంచాయతీలకు బదిలీచేశారు.

1958 వరకు జ్యూడిషియరి, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థలు రెండూ కలిసి వుండేవి. అప్పట్లో మంగళగిరి సబ్–తాలుకా హోదాలో గుంటూరు తాలుకా పరిధిలో వుండేది. మంగళగిరి సబ్–తాలుకా డిప్యూటి తహశీల్‌దారు 2వ క్లాసు మేజిస్ట్రేటుగా కూడా వ్యవహరించేవారు. 1966లో ఇక్కడ 2వ క్లాసు మేజిస్ట్రేటు కోర్టు ఏర్పడింది. క్రిమినల్ కేసులు మాత్రమే చూసేవారు. 1980 వరకు కౌలుదారీ కేసులను డిప్యూటీ తహసీల్దార్ చూసేవారు. వాటిని ఆ తరువాత సివిల్ కోర్టుపరిధిలోకి తెచ్చారు. మొదటి తరగతి మేజిస్ట్రేటు కోర్టు ఆ తర్వాతి కాలంలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కమ్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టుగా రూపాంతరం చెందింది. 1991లో కేసులు పెరగడం వల్ల రెండవ కోర్టు ఏర్పడటంతో అప్పటి నుండి సివిల్, క్రిమినల్ కేసులను విడివిడిగా రెండు కోర్టుల్లో విచారిస్తున్నారు. 1999లో రెవిన్యూ కాంప్లెక్సులోని 75 సెంట్ల స్థలంలో కోర్టుకు సొంత భవనాలు, న్యాయాధికారులకు నివాస గృహాలు ఏర్పడినవి.

ఈ కోర్టుల పరిధిలో మంగళగిరి, తాడేపల్లి, తుళ్ళూరు, తాడికొండ మండలాలు వున్నాయి. సివిల్ కేసులైతే లక్ష రూపాయల విలువకు మించనవి, క్రిమినల్ కేసులు అయితే సెషన్ కేసులు తప్ప మిగిలిన అన్నింటిని విచారిస్తున్నారు. 1981లో యిక్కడ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరును నియమించారు. మొదట శ్రీ లంకా నాగేశ్వరరావు, తరువాత శ్రీ బషీర్ అహ్మద్, శ్రీమతి సి. భ్రమరాంబ ఆ పదవులు నిర్వర్తించారు. ప్రస్తుతం శ్రీ లంకా శివరామప్రసాద్ ఆ హోదాలో వున్నారు. 1985లో ఈ కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియమించారు. ప్రస్తుతం కుమారి శైలజ ఆ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 1997లో లోక్అదాలత్‌లను ప్రారంభించారు. లీగల్ మెంబర్‌గా శ్రీ బషీర్‌అహ్మద్, సోషల్ మెంబర్‌గా శ్రీమతి నన్నపనేని లక్ష్మి కొనసాగుతున్నారు. లీగల్ ఎయిడ్ కమిటీకి న్యాయవాదిగా శ్రీ పొట్లూరి శరత్‌చంద్రప్రసాద్ నియమితులయ్యారు.

## న్యాయవాదులు


శ్రీ నాగేశ్వరరావు

1965లో శ్రీ లంకా నాగేశ్వరరావు పట్టణంలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. పూర్తికాలపు న్యాయవాదులుగా వుంటున్న వారిలో వీరే ప్రప్రథములు.

1969లో శ్రీ బి. అనంతకృష్ణారావు, 1971లో శ్రీ బషీర్ అహ్మద్ ఇక్కడకు వచ్చారు. 1983లో సుమారు 15-20 మంది న్యాయవాదులతో బార్ అసోసియేషన్ ఏర్పడింది. ప్రస్తుతం సుమారు 60 మంది న్యాయవాదులు ఈ కోర్టుల్లో వృత్తిని కొనసాగిస్తున్నారు. సబ్-కోర్టు ఏర్పాటు చేయవలసిందిగా కక్షిదారులు, న్యాయవాదులు గత పది సంవత్సరాలుగా విజ్ఞప్తి చేస్తున్నారు. గుంటూరులో ప్రస్తుతం వున్న కోర్టులలో 45% కేసులు మంగళగిరి పరిధిలోనివే. ఇక్కడ సబ్‌కోర్టు ఏర్పరిస్తే కక్షిదారులకు సౌకర్యంగా వుండడమే కాకుండా గుంటూరులోని కోర్టులపై వత్తిడి కూడా తగ్గుతుంది. ✵

### ' సిరికి పుట్టింటివారు, హరికి అత్తింటివారు '

"మేము సిరికి బుట్టింటివారము, హరికి నత్తింటివారము" అని తరతరాలుగా మంగళగిరి గ్రామ పద్మశాలీయ బహూత్తమ సేవా సంఘం వారు నృసింహస్వామి వారి కల్యాణ మహోత్సవమునకు మట్టెలు, మంగళసూత్రం, తలంబ్రాలు, ఉత్తర జంధ్యములు సమర్పించే ఆచారం వుంది. 1915లో అప్పటి ధర్మకర్త యీ ఆచారానికి విరుద్ధముగా ప్రవర్తించగా మనస్థాపము చెందిన పద్మశాలీయులు గుంటూరు అదనపు జిల్లా మునసబు కోర్టులో కేసు దాఖలు చేశారు. 8.8.1916న పద్మశాలీయులకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అప్పటినుండి యిప్పటివరకు నిరాటంకంగా వారి ఆచారం కొనసాగుతోంది.

# విద్య

## చింతక్రింది కనకయ్య హైస్కూలు



హైస్కూలు స్థాయి విద్య మంగళగిరిలో అందుబాటులో లేకపోవటంతో 1944లో అప్పటి జిల్లా బోర్డు సభ్యులైన శ్రీ దామర్ల వెంకట భావన్నారాయణ చొరవతో జిల్లా బోర్డు ప్రెసిడెంట్ శ్రీ పాములపాటి వెంకటకృష్ణయ్య ఒక విద్యాసంస్థను ప్రారంభించేందుకు సహాయం అందించారు. ఇది మంగళగిరిలో విద్యారంగానికి కీలక మలుపు. ముఖ్య దాతగా శ్రీ చింతక్రింది కనకయ్య రూ. 26 వేలు, శ్రీ ప్రెగడ అంజయ్య సోదరులు రూ. 4 వేలు, శ్రీ వెనిగంళ్ళ తాతయ్య గారు రూ. 4 వేలు, శ్రీ దామర్ల వెంకట భావనారాయణ రూ. 3వేలు, శ్రీ జంజనం రామస్వామి రూ. 2వేలు, శ్రీ వుడుతా వీరాస్వామి, శ్రీ గోలి కోటయ్య గారలు రూ. 2,000/- లు విరాళాలిచ్చారు. ముఖ్యదాత పేరున చింతక్రింది కనకయ్య హైస్కూలు కమిటీని సేవాసంస్థల చట్టం క్రింద నెం. 18/1944 గా రిజిస్టరు చేశారు.

ఆ కమిటీకి వ్యవస్థాపక అధ్యక్షులుగా శ్రీ చింతక్రింది కనకయ్య, ఉపాధ్యక్షులుగా శ్రీ వెనిగంళ్ళ తాతయ్య, కార్యదర్శి / కరస్పాండెంటుగా శ్రీ తాడిపర్తి శ్రీకంఠం, కార్యవర్గ సభ్యులుగా – శ్రీయుతులు ప్రెగడ బాలనాగు, దామర్ల వెంకటభావనారాయణ, దామర్ల చినపుల్లయ్య, జంజనం రామస్వామి, జంజనం సుబ్బయ్య, వెనిగంళ్ళ నరశింహం, వుడతా వీరాస్వామి, జంజనం వీరాస్వామి, రామనాథం మల్లయ్య, గోలి తాండ్రయ్య, యిసునూరి కోటిరత్నం, దామర్ల రమాకాంతరావు బాధ్యతలు వహించినారు.

జిల్లా బోర్డు వారు తమ ఆధీనంలో గల ఒక పాఠశాలను యీ కమిటీ వారికి అప్పగించారు. ఈ హైస్కూలు మొదట పాత మంగళగిరిలో కల్యాణమంటపం వున్న స్థలంలో ప్రారంభమైంది. ఆ తరువాత ప్రస్తుత ఆవరణలోనికి మార్చు చేశారు. ది. 29-8-1944న అప్పటి విద్యాశాఖ డైరెక్టరు సర్ ఆర్ యం. స్టాటం ఈ హైస్కూలును ప్రారంభించారు. ఈ విద్యా సంస్థ గొప్ప వటవృక్షంగా పెరిగి – వేలాది మందికి విద్యను అందిస్తూ ఈ ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తోంది. 1947-48 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్ఎల్సి మొదటి బ్యాచి విద్యార్థులు ఆ సంస్థ నుండి బయటకు వచ్చారు.

1972-73 సం॥లో యీ హైస్కూలు జూనియర్ కాలేజి స్థాయికి ఎదిగింది.

## డిగ్రీ కాలేజి

1977లో సికె విద్యాసంస్థల సారధ్యంలో డిగ్రీ కాలేజి మంగళగిరిలో ప్రారంభం కావటంతో మంగళగిరి విద్యారంగంలో 1944 తరువాత పెనుమార్పు జరిగింది. పేద విద్యార్థులు, ముఖ్యంగా ఆడపిల్లలు డిగ్రీ స్థాయిలో విద్య సముపార్జనకు మార్గం సుగమమైంది.




మంగళగిరిలో డిగ్రీ కాలేజి ఏర్పరచుటకు ప్రముఖ పాత్ర వహించిన వారిలో శ్రీవేములపల్లి శ్రీకృష్ణ, శ్రీ శిరందాసు లక్ష్మీనారాయణ ముఖ్యులు. వారి చొరవతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కార్పస్ ఫండ్ లేకుండానే యీ డిగ్రీ కాలేజికి అనుమతి యిచ్చారు. వెనిగళ్ళ తాతయ్య జంజనం మంగళాద్రి డిగ్రీ కళాశాలగా నామకరణం చేశారు. ది. 30-8-1977న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు ప్రారంభోత్సవం చేశారు. ఆ తరువాత 1996లో విటిజెఎం & ఐవిటిఆర్ డిగ్రీ కాలేజిగా పేరు మార్చారు. ఈ కళాశాల 2002 సంవత్సరంలో రజతోత్సవాలను వైభవముగా జరుపుకున్నది.

**గరల్స్ హైస్కూలు :** ఈ కమిటీ వారు ఆడపిల్లలు హైస్కూలు విద్యను మరింత సౌకర్యంగా పొందగలిగేందుకు 1982 సం॥లో చింతక్రింది కనకయ్య గరల్స్ హైస్కూలును లోకల్ ఫండ్ సత్రంలో ప్రారంభించారు.

ఈ సంస్థలోని చాలమంది కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు సి.కె. హైస్కూలులో చదివి అభివృద్ధిలోనికి వచ్చినవారే! ప్రస్తుతం సి.కె. హైస్కూలు కమిటీకి అధ్యక్షులుగా శ్రీ తాడివర్తి రామమోహనరావు, సెక్రటరీ/కరస్పాండెంటుగా శ్రీ ప్రెగడ ఆది సత్యనారాయణ బాధ్యతలు వహిస్తున్నారు. డిగ్రీ కాలేజి గవర్నింగ్ బాడికి అధ్యక్షులుగా శ్రీ జంజనం మంగళాద్రి, కరస్పాండెంటుగా డా॥ గోలి రామమోహనరావు వ్యవహరిస్తున్నారు.

### మెగాస్టార్ మంగళగిరి విద్యార్థే

సినిమా హీరోగా అసంఖ్యాక ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొని 'మెగా స్టార్'గా పేరొందిన చిరంజీవి (కొణిదెల శివశంకర ప్రసాద్) పట్టణంలో 6వ తరగతి చదువుకున్నారు. ఆయన తండ్రి శ్రీ వెంకట్రావు అప్పట్లో మంగళగిరిలో ప్రొహిబిషన్ శాఖ కార్యాలయంలో పనిచేసేవారు.

డిగ్రీ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా శ్రీ అందె రామమోహనరావు, సికె జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్‌గా శ్రీ యం. విజయమోహనరావు, సికె బాలికల హైస్కూలు ఇన్‌ఛార్జి హెడ్‌మిస్ట్రెస్‌గా శ్రీమతి రమాదేవి పనిచేస్తున్నారు. ఈ విద్యాసంస్థలన్నింటిలోను కలిపి సుమారు 4 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు

### [1]క్రైస్తవ మిషనరి పాఠశాల

1871 సంIIలో మహిళా మిషనరి సంస్థలు ప్రారంభమయ్యాయి. 1883లో కుమారి అన్నా కుగ్లర్, ఎం.డి., అనే మహిళా వైద్యురాలు గుంటూరులో సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఆ సంస్థ తరపున 1883లో గుంటూరులో రెండు గరల్స్ స్కూల్సు, మరొకటి మంగళగిరిలోను ప్రారంభించారు.

## 'నిర్మల' విద్యా సంస్థలు

మంగళగిరి పట్టణంలో "కాటకిస్టు సిస్టర్స్ ఆఫ్ సెయింట్ ఆన్" అనే సంస్థ వారు 1982 జూన్ 12న నిర్మల కాన్వెంటును ప్రారంభించారు. దీంతో ఇంగ్లీషు మీడియం విద్య మంచి మలుపు తిరిగింది. ఈ సంస్థ దినదినాభివృద్ధి చెందుతూ "నిర్మల ఇంగ్లీషు మీడియం హైస్కూలు''గా రూపాంతరం చెందింది. 1991 మార్చిలో 10వ తరగతి మొదటి బ్యాచి పూర్తయింది.




1994 జూన్‌లో జూనియర్ కళాశాల స్థాయిని పొందింది. నిర్మల విద్యాసంస్థలు 1650 మంది విద్యార్థులతో అలరారుతూ విద్యా పరిమళాలు వెదజల్లుతున్నాయి.

10 ఎకరాల విశాలమైన ప్రశాంత ప్రాంగణంలో నెలకొనివున్న యీ సంస్థలు క్రీడలకు, లలితకళలకు విశేష ప్రాధాన్యతనిస్తున్నాయి. హైస్కూలు అభివృద్ధికి సిస్టరు జాన్‌పాల్ పునాదివేయగా ప్రస్తుతం సిస్టరు మార్గరేట్ సంస్థ గౌరవాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకొని వెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. జూనియర్ కాలేజికి సిస్టర్ శౌరీలు ప్రిన్సిపాల్‌గా వున్నారు.

## ఓరియంటల్ హైస్కూలు

సంస్కృత విద్య ప్రాచుర్యానికి కూడ మంగళగిరి దోహదకారి అయింది. 1962లో "తత్వానంద శిల్పాశ్రమ కమిటి" వారు "శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య" పేరిట యిక్కడకు సమీపంలోని నిడమర్రు గ్రామంలో సంస్కృత పాఠశాలను ప్రారంభించారు. సంస్కృతాన్ని విస్తరింపజేశారు. ఆ తరువాత పరిణామాలలో ఆ పాఠశాలను పట్టణంలోని దేవస్థాన సత్రములోనికి మార్చి యిప్పటికీ విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

## మున్సిపాలిటి నిర్వహణలో 18 పాఠశాలలు

మంగళగిరి పురపాలక సంఘ అధీనంలోని మొత్తం 18 పాఠశాలలో 4,200 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వాటిలో ఒక హైస్కూలు, 6 ప్రాథమికోన్నత, 11 ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలన్నీ సొంత భవనాల్లోనే ఉన్నాయి.

## ఉర్దూ / అరబిక్ విద్య

పట్టణంలో ముస్లిములు గణనీయమైన సంఖ్యలో నున్నందున 'ఉర్దూ' వ్యాప్తి జరుగుతోంది. మున్సిపాలిటీ నిర్వహణలో 9వ వార్డులో బాలికలకు, 26వ వార్డులో బాలురకు ఉర్దూ పాఠశాలలు నిర్వహించబడుతున్నాయి. జామాతే ఇస్లామి హింది ఆధ్వర్యంలో 26వ వార్డులో ఒక పాఠశాల, గ్రంథాలయము, అంజుమన్ సంస్థవారి ఆధ్వర్యంలో 9, 22, 24 వార్డులలో ప్రాథమిక పాఠశాల నడుపబడుతున్నాయి.

## [2]సెకండరీ ఎడ్యుకేషన్

1850వ సంవత్సరం వరకు సెకండరీ ఎడ్యుకేషన్ ప్రారంభించేందుకు సరైన చర్యలు మద్రాసు ప్రెసిడెన్సీలో తీసుకొనబడలేదు.

ఈ పరిస్థితులనధిగమించి అదే సంవత్సరంలో మంగళగిరిలో తాలూకా స్కూలు ప్రారంభమైంది. ఆ తరువాత 1859లో మరొక తాలూకా స్కూలును 29 మంది విద్యార్థులతో గుంటూరులో ప్రారంభించారు.

## జూనియర్ కళాశాలలు

పట్టణంలో ఇంటర్‌మీడియట్ విద్యావ్యాప్తికి జూనియర్ కళాశాలలు తమ వంతు కర్తవ్యం నిర్వహిస్తున్నాయి. శ్రీ చింతక్రింది కనకయ్య జూనియర్ కళాశాల గత మూడు దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందజేస్తోంది. నిర్మల జూనియర్ కళాశాల 1994 నుండి అత్యున్నత ప్రమాణాలతో ఇంటర్ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నది. వి.జె. జూనియర్ కళాశాల అనతికాలంలోనే సత్ఫలితాలు సాధించి ప్రజల మన్ననలను చూరగొని ప్రగతి పథంలో పయనిస్తోంది. నూతనంగా నలంద ఒకేషనల్ జూనియర్ కాలేజి ప్రారంభమైనది.

## పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ.టి.ఐ.)

మంగళగిరి పట్టణంలో సాంకేతిక విద్యకు పునాది వేసిన ఘనత శ్రీ జంజనం మంగళాద్రికి దక్కింది. 1980 సం॥లో "జంజనం మంగళాద్రి ఇండస్ట్రీయల్ ట్రైనింగ్ సెంటర్" అవతరణతో ఎందరో విద్యార్థులు సాంకేతిక విద్యను గడించేందుకు వీలుచిక్కింది.

ఇందులో ఫిట్టరు, ఎలక్ట్రీషియను, డీజిల్ మెకానిక్ ట్రేడులలో ప్రస్తుతం శిక్షణ యివ్వబడుతోంది. ఈ సంస్థకు వ్యవస్థాపక కరస్పాండెంటు శ్రీ జంజనం మంగళాద్రి. ప్రస్తుతం కరస్పాండెంట్‌గా శ్రీ కె. పాపారావు సేవలందిస్తున్నారు.

## శ్రీ జంజనం మంగళాద్రి

నిరుపేద చేనేత కుటుంబంలో జన్మించిన శ్రీ జంజనం మంగళాద్రి స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి పట్టణంలోని పద్మశాలీయ ప్రముఖునిగా పేరుగాంచారు. 1977లో డిగ్రీ కళాశాల ఆవిర్భావానికి కృషి చేశారు. సాంకేతిక విద్యను అభివృద్ధి చేసేందుకు ఉద్యుక్తులై 1980లో "పారిశ్రామిక శిక్షణా సంస్థ" (ఐ.టి.ఐ.) స్థాపించారు. మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌కు సుమారు దశాబ్దకాలం అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించి సంఘ అభివృద్ధికి కృషి చేశారు. 1981-86 మధ్య కాలంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసి ప్రజల సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారు.

## ఫార్మశీ కాలేజి

మంగళగిరిలో నిర్మల విద్యా సంస్థల ఆవరణలో వారి యాజమాన్యంలోనే ఫార్మశి విద్యకు ప్రత్యేక కాలేజి 2004-05 విద్యా సంవత్సరంలో ప్రారంభమైంది. 'నిర్మల కాలేజి ఆఫ్ ఫార్మశి" ది. 8-9-2004న ప్రారంభోత్సవం జరిగింది.

## విద్యాసుగంధాలు వెదజల్లుతున్న నాగార్జున వర్శిటీ




మంగళగిరికి సుమారు 5 కి॥మీ॥ దూరంలో 1976 సెప్టెంబరులో నాగార్జున విశ్వ విద్యాలయం అవతరించింది. గత మూడు దశాబ్దాలుగా విద్యారంగ పురోగతికి దోహద పడుతోంది. కోస్తా జిల్లాల్లోని విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యాన్ని అందు కోవటంలో సఫల మైంది. ఇటీవల దీనిపేరును "ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం"గా మార్పుచేశారు. ఈ విశ్వవిద్యాలయం పరిధిలో సుమారు 220 అనుబంధ కళాశాలలున్నాయి. ప్రస్తుతం దాదాపు 48 పి.జి.కోర్సుల్లో శిక్షణనిస్తున్నారు. వాటిలో 38 కోర్సులు విశ్వవిద్యాలయ ప్రాంగణంలోనే వున్నాయి. పి.జి. కోర్సులను అభివృద్ధి చేసేందుకు కృష్ణాజిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా ఒంగోలులలో పి.జి. కేంద్రాలను నెలకొల్పారు. కాలానుగుణ్యమైన సాంకేతిక విద్యా వ్యాప్తికోసం యీ విశ్వవిద్యాలయం విశేషంగా కృషి చేస్తోంది. మొత్తం 220 మందికి పైగా బోధనా సిబ్బంది 1800 మంది విద్యార్థులు వున్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు కూడ విజయవంతంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ పేర నెలకొల్పిన అతి పెద్ద గ్రంథాలయంలో సుమారు లక్షకు పైగా అమూల్యమైన పుస్తకాలు విజ్ఞాన కాంతులను విరజిమ్ముతున్నాయి. 'ఉడా' భాగస్వామ్యంతో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో "క్యాంపస్ వైడ్ నెట్‌వర్కు, నెట్‌వర్కు సెక్యూరిటీ" ముఖ్యమంత్రి డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి 8-8-2004న ప్రారంభించారు. దీనివల్ల క్యాంపస్‌లోని కంప్యూటర్లన్నీ అనుసంధానమై, డేటాను అత్యంత వేగంతో పంపేందుకు సౌలభ్యం కలిగింది.


ఆచార్య
వేణుగోపాలరెడ్డి

విశ్వవిద్యాలయ తొలి "కులపతి"గా ప్రొఫెసర్ వి. బాలయ్య దాని అభివృద్ధికి విశేష సేవలందించారు. ప్రస్తుత వైస్-ఛాన్సలర్ ఆచార్య యల్. వేణుగోపాలరెడ్డి వినూత్న సంస్కరణలు చేపట్టి విశ్వవిద్యాలయ కీర్తి ప్రతిష్టలను యినుమడింపజేస్తున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. లూథర్ దాస్ కూడ తన బాధ్యతలను అంకితభావంతో నిర్వహిస్తున్నారు.

## యన్. ఆర్. ఐ. మెడికల్ కాలేజి

మంగళగిరి సమీపాన గుంటూరు, కృష్ణా జిల్లాలకు చెందిన ప్రవాసాంధ్రులు 50 ఎకరాల ప్రాంగణంలో రూ. 50 కోట్ల ప్రాజెక్టు "యన్.ఆర్.ఐ. అకాడమీ ఆఫ్ సైన్సెస్" క్రింద జనరల్ ఆస్పత్రి, మెడికల్ కాలేజి, నర్సింగ్ స్కూలును ఏర్పాటుచేశారు. మెడికల్ కాలేజి 150 సీట్లతో 2003-04 సంవత్సరంలో మొదటి బ్యాచి ప్రారంభమైంది. యన్.ఆర్.ఐ. అకాడమీ నిర్వహణలో డా॥ మంతెన నరసరాజు ముఖ్యపాత్ర వహిస్తున్నారు. డా॥ అంజిరెడ్డి 'డీన్'పదవిని నూతనంగా చేపట్టారు.

## శ్రీ చింతక్రింది కనకయ్య



మంగళగిరి చేనేత కుటుంబంలో జన్మించిన శ్రీ చింతక్రింది కనకయ్య రాజకీయ, వ్యాపార రంగాలలో రాణించి రాష్ట్రస్థాయిలో కీర్తి ప్రతిష్టలను సముపార్జించారు.

1932లోనే వీరు రైసుమిల్లరుగా వున్నారు. పొగాకు, వేరుశనగపప్పు వ్యాపారాలలో అప్పట్లోనే విదేశీ లావాదేవీలు నడిపి సంపన్న వంతులయ్యారు. నలుమూలలా వీరిపేరు మారుమోగి పోయింది. 'సిరిసంపదలు' చిత్రంలోని వేలంపాట సన్నివేశములో "చింతక్రింది కనకయ్యగారి పాట..." అని వాడటం ఆయన పలుకుబడికి అద్దం పడుతోంది. ఆ రోజుల్లో జిల్లా మొత్తం మీద పాతిక కార్లు మాత్రమే వుండగా, వీరు రెండు కార్లలో తిరిగేవారు. పంచాయతి అధ్యక్షునిగా సుమారు ఒక దశాబ్దం మంగళగిరికి విశిష్ట సేవలందించారు. తాలూకా బోర్డు సభ్యునిగా కూడా వ్యవహరించారు. అప్పట్లో జిల్లా రాజకీయాలలో రాణించారు. 1939 సం॥లో శ్రీ తాడిపర్తి శ్రీకంఠంతో కలిసి శ్రీ కనకయ్య ఒక వితంతు వివాహాన్ని జరిపించినట్లు తెలుస్తున్నది. విద్యపై నున్న మమకారంతో 1944లో ఆనాటి ప్రముఖుల సహకారంతో తన పేరిట ఒక హైస్కూలును ప్రారంభింపజేసి శాశ్వత యశస్సును సొంతం చేసుకున్నారు. ✵

1. హిస్టరి ఆఫ్ గుంటూరు డిస్ట్రిక్ట్, 1600-1947 విష్ణుభొట్ల సత్యనారాయణ, గుంటూరు. (పేజి 138),

2. A.P. Dist. Gazeteers - Guntur, Page 276

# వైద్యం

రోజు రోజుకు వైద్య సేవలు విస్తరిస్తున్న మంగళగిరిలో పేద కుటుంబాల వారు సరైన ఆర్థిక స్థోమత లేక అనారోగ్యంగా జీవిస్తున్నారు. సాధారణంగా పోషకాహారలోపం, రక్తహీనతల వల్ల ఎక్కువ మంది స్త్రీలు, పిల్లలు అనారోగ్యాల పాలవుతుంటారు. క్షయ వ్యాధి లక్షణాలు, జీర్ణకోశ వ్యాధులు, ఎయిడ్స్ లక్షణాలుగల వారు గణనీయమైన సంఖ్యలో వున్నారు. అలాగే అపరిశుభ్రత, అనారోగ్య ఆహారపు అలవాట్ల వల్ల ఎక్కువ మంది తరచుగా వ్యాధులకు పాల్పడుతుంటారు. ఇక్కడి ప్రజలు క్రమంగా ఆరోగ్య విషయాలపై అవగాహన కలిగి స్పెషలిస్టుల సేవలను కూడ తరచుగా వినియోగించుకుంటున్నారు.

అయితే రోడ్డు ప్రమాదాలతో ప్రాణాపాయ స్థితిలోనున్న వారికి అత్యవసర వైద్య సదుపాయాలు, మెదడు వాపు వ్యాధి వాక్సిన్‌లు, స్కానింగులు, హెచ్.ఐ.వి. నిర్ధారణకు సంపూర్ణ పరీక్షా సౌకర్యం అందుబాటులో లేవు.

సేవా సంస్థలు యీ ప్రాంతంలో ఉచితవైద్య శిబిరాలు తరచుగా నిర్వహిస్తుండటం వల్ల ప్రత్యేక వైద్యుల సేవలు తాత్కాలికంగా అందుబాటులోనికి వస్తున్నాయి. గత 10-15 సంవత్సరాలుగా ఆధునిక వైద్య పరికరాల ప్రభావంతో యిక్కడి వైద్య సేవలలో మార్పు వచ్చింది. కొమ్మారెడ్డి సేవా సమితివారు "అంబులెన్సు" ఏర్పరచటంతో ప్రాణాపాయ స్థితిలోని రోగులను తక్షణమే తరలించి వారికి వైద్య సేవలనందించేందుకు వీలుకలుగుతోంది.

## వైద్య సేవల అభివృద్ధి

కాకతీయ రాజుల పాలనలో మంగళగిరికి దగ్గరలోని 'మందడం' గ్రామంలో ప్రశూతి, వైద్య శాలలు నడపబడినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది.

1885 సంవత్సరంలో గుంటూరులోని లూథరన్ మిషన్‌కు 'అనాయన్ కుగ్లర్' మెడికల్ మిషనరిగా నియమితులైరు. తరువాత 1885-87ల మధ్య వారి ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాలోనే మొదటి డిస్పెన్సరి మంగళగిరి వద్ద ప్రారంభమైంది.

1909 సంవత్సరంలో లోకల్ బోర్డు వారు మంగళగిరిలో ఒక డిస్పెన్సరీ ప్రారంభించారు. జిల్లా బోర్డు యాజమాన్యంలో వుంటూ వచ్చిన డిస్పెన్సరీ 1960లో ప్రభుత్వ ఆస్పత్రిగా మారింది. అది 4 పడకలుండి, ప్రసవ కేసులకు ఉపయోగపడుతూ, సంవత్సరానికి రూ.

2 వేల బడ్జెట్ కేటాయింపు వుండేది. ఆ ఆస్పత్రికి వైద్య విద్యలో పట్టభద్రుడైన మొట్టమొదటి వైద్యునిగా డాక్టరు కె.బి. స్వామి వచ్చారు. అర్హత పొందిన మంత్రసానిగా శ్రీమతి రాఘవమ్మ ఆస్పత్రిలో వుంటూ, ఇళ్ళకు వెళ్లి కాన్పులు కూడ చేసేవారు.

1969-70 సంవత్సరంలో కుటుంబ నియంత్రణ పథకం క్రింద కేటాయించబడిన నిధులతో యీ ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపరిచారు. ప్రజల స్వచ్ఛంధ విరాళాలతో ఒక శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు సుబ్రహ్మణ్యం, నాయుడమ్మ గారలు నిబద్ధతతో సాధారణ వైద్యమేగాక ఆపరేషన్లు కూడా విశేషంగా నిర్వహించి యీ ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిపోయారు.

అప్పటి నుండి ఈ ఆస్పత్రి వివిధ దశల్లో అభివృద్ధి చెందుతూ వచ్చింది. 1992 సంవత్సరంలో టి.టి.డి. కళ్యాణమండపం దగ్గర నూతన భవనాలను నిర్మించి, అక్కడికి ప్రభుత్వ ఆస్పత్రిని మార్చటం జరిగింది.

## ప్రైవేటు వైద్య రంగం

1930 దశకంలో మంగళగిరి ఒక గ్రామంగా వున్న రోజులలో వైద్య విద్యార్హత కలిగి వైద్యవృత్తిలో ప్రవేశించిన మొదటి వైద్యులు శ్రీ కొల్లూరు ఆంజనేయులు. 1945 ప్రాంతంలో ఎల్.ఐ.యం. వైద్య విద్యార్హత కలిగిన మరొక వైద్యులు "డాక్టరు ఆరాధ్య" వైద్య సేవలందించారు. వారి వద్ద ప్రముఖ కమ్యూనిస్టు నాయకులు శ్రీ బొడ్డు నారాయణ పనిచేసారు.

డా॥ అట్లూరి గోపాలకృష్ణమూర్తి 1948లో యిక్కడ ప్రైవేటు ప్రాక్టీసు ప్రారంభించారు. యం.బి.బి.యస్. డిగ్రీ కలిగిన యిక్కడి వైద్యులలో వీరు మొదటివారు. కొన్నాళ్ళు సింగ్ డాక్టరుగారు, డా॥ రామసీతగారు యిక్కడ సేవలందించారు.

డా॥ కె.బి.స్వామి 1963లో ప్రైవేటుగా సేవలను అందించటం ప్రారంభించారు. 1968 ప్రాంతాలలో డా॥ యం.యస్.యన్. కోటేశ్వరరావు, డా॥ గోలి సుబ్బారావు వైద్యం ప్రారంభించగా, డా॥ కోటేశ్వరరావు ఆ తరువాత రాజకీయ ప్రవేశంచేసి రాష్ట్ర మంత్రిగా ఎదిగారు. ఈ ప్రాంతంలో ప్రైవేటు రంగంలో వైద్యులు క్రమేపీ పెరుగుతూ యీ నాటికి 10-12 నర్సింగ్ హోంలు వున్నాయి. కంటి, పంటి, చెవి-ముక్కు-గొంతు మొదలగు ప్రత్యేక వైద్య నిపుణులు కూడా క్రమంగా యిక్కడ నిలద్రొక్కుకుంటున్నారు.

మంగళగిరి-విజయవాడ బైపాస్‌రోడ్‌లో సౌమ్య అపోలో ఆస్పత్రి 2000 సం॥లో

ప్రారంభించబడి సూపర్ స్పెషాలిటీ సేవలు యీ ప్రాంత ప్రజలకు అందుబాటులోనికి తెచ్చింది. 2003 సం॥లో చినకాకాని వద్ద యన్.ఆర్.ఐ. ఆస్పత్రి నిర్మితమై ఉన్నతస్థాయి వైద్యసేవలు యీ ప్రాంత ప్రజలకు మరింత చేరువలోనికి వచ్చాయి.

స్థానికులైన డా॥ కాంద్రు శివరామకృష్ణ కంటి వైద్యంలో మూడు దశాబ్దాలుగా విజయవాడలో వైద్యం చేస్తూ యిక్కడ కూడా సేవలను విస్తరించారు. అలాగే స్థానికులైన డా॥ గోలి నాగశయనరావు హైదరాబాద్‌లో గుండె చికిత్సలో పేరొంది, యీ ప్రాంత ప్రజలకు ఆదరంగా వైద్యం చేస్తున్నారు.

మంగళగిరిలో ప్రైవేటు వైద్యరంగంలో స్థిరపడిన కొందరి పేర్లు ఉదహరిస్తున్నాను.

1. డా॥ ఎ.ఎన్.యు.యం. ప్రసాద్ 2. డా॥ బి. సీతా రామిరెడ్డి 3. డా॥ ఎ. సత్యనారాయణరెడ్డి 4. డా॥ ఎ. సూర్యాజీరావు 5. డా॥ కె.వి.ఎస్. సాయి ప్రసాద్ 6. డా॥ జి. రామమోహనరావు 7. డా॥ యం. సాంబశివరావు 8. డా॥ టి. బాల వెంకటరావు 9. డా॥ పి. సూర్యకాంతం 10. డా॥ కె. సత్యనారాయణరావు 11. డా॥ యం.బి.ఎస్.వి. ప్రసాద్ 12. డా॥ సిహెచ్. కె.వి. ప్రసాద్ 13. డా॥ పి. ఆదినారాయణ 14. డా॥ టి. మురళీ వెంకటేశ్వరరావు 15. డా॥ టి. శ్రీనివాసమూర్తి 16. డా॥ కె. నాగేశ్వరరావు 17. డా॥ కె. రవీంద్ర 18. డా॥ యం. భారతీదేవి 19. డా॥ పి. గిరిజ 20. డా॥ సిహెచ్. చంద్రావతి 21. డా॥ కె. భవానీ 22. డా॥ ఎ. జయలక్ష్మి 23. డా॥ కె.బి. స్వామి మంగళగిరిలో యూనివర్శిటీ హాస్పటల్‌లో పనిచేసిన డా॥ జయకర్‌బాబు ప్రస్తుతం విజయవాడలోని మెడికల్ యూనివర్శిటీకి రిజిస్ట్రారుగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## డా॥ అట్లూరి గోపాలకృష్ణమూర్తి (తొలి యం.బి.బి.యస్.)

డాక్టరు అట్లూరి గోపాలకృష్ణమూర్తి మంగళగిరిలో వైద్యసేవలు అందించిన యం.బి.బి.యస్. డాక్టర్లలో మొదటివారు. 1943-47 వరకు మిలటరీలో పనిచేసిన వీరు 1948లో యిక్కడ ప్రాక్టీస్ ప్రారంభించారు. ఫీజుల విషయంలో ఉదారత చూపేవారు. 1950 ప్రాంతాల్లోనే రోగులకు స్కిన్ గ్రాఫ్టింగ్ చేసిన ఘనత వీరికుంది. 27 సం॥లు అలుపెరగకుండా వైద్య సేవలు చేసి 1975లో వీరు ఈ రంగం నుండి విరమించుకున్నారు. ఈనాటికీ వారు ఎంతో ఆరోగ్యం గాను, ఉల్లాసంగాను తన ఫాంహౌస్‌లో భార్యా సమేతంగా శేషజీవితం కొనసాగిస్తున్నారు.



## 740 ఏండ్ల నాటి ప్రసూతి వైద్యశాల

కాకతీయరాజులు "శైవ మతా"నికి మంచి ప్రోత్సాహం యివ్వటం వలన "గోళకీ"లని పిలువబడే శైవ మతాలు వెలిశాయి. గణపతి దేవ చక్రవర్తి (క్రీ॥శ॥ 1190–1260) ఆంధ్రలో మూడు ప్రధాన గోళకీలను ఏర్పరచారు. వాటిలో "మందడం" గ్రామంలోనిది ఒకటి. రాణి రుద్రమ దేవి క్రీ॥శ॥ 1264లో వెలగపూడి, మందడం గ్రామాలను ఆ గోళకీ మఠానికి అగ్రహారంగా యిచ్చారు.

అగ్రహారపు ఆదాయంలో కొంతభాగం మందడం గ్రామంలోని "ప్రశూతిశాల, వైద్యశాల" నిర్వహణకు వినియోగించబడేది. సుమారు 740 సం॥ల క్రిందటే స్త్రీల ఆరోగ్యావసరాలు గుర్తించిన రాణి రుద్రమదేవి స్త్రీలకు ప్రసూతి వైద్యశాలను ఏర్పరిచి, పోషించారు.

అప్పటి నుండి ఎన్నో శతాబ్దాలు గడిచి, వైద్య సౌకర్యాలు మెరుగుపడినాయని భావిస్తున్న యీ కాలంలో యింకనూ కొన్ని గ్రామాలలోని స్త్రీలు సరైన ప్రసూతి వైద్యానికి నోచుకొనక పోవటం ఆలోచించవలసిన విషయం!

### టి.బి. శానిటోరియం

మంగళగిరిని రాష్ట్ర ప్రజలకు సుపరిచితం చేసిన అంశాలలో టి.బి. శానిటోరియం (క్షయ ఆసుపత్రి) ఒకటి. గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలలోని ప్రజల అవసరాల నిమిత్తం యిది ప్రారంభమైంది. సంక్షేమ నిధులు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల గ్రాంటులతో గుంటూరు జిల్లా టి.బి. సంఘం వారిచే నిర్మితమై నిర్వహణ కొరకు ప్రభుత్వానికి అప్పగించడం జరిగింది. ఆసుపత్రిని 1958 సం॥లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ ఆస్పత్రి వాస్తవ రూపం దాల్చటానికి అప్పటి శాసనసభ్యుడు శ్రీ మేకా కోటిరెడ్డి, శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య చేసిన కృషి ఎనలేనిది.

ఇక్కడి ప్రత్యేక వాతావరణ పరిస్థితులు, ఆరోగ్యకరమైన కొండగాలి క్షయ వ్యాధిగ్రస్తులకు ఎంతో వూరట కలిగేలా వుండేవి.

మొదట 180 పడకల సౌకర్యంతో క్షయ ఆసుపత్రి ప్రారంభమైంది. తరువాత "ఐసోలేషన్" వార్డు, ఐ.యల్.టి.డి. కంపెనీ, రాష్ట్ర టి.బి. అసోసియేషన్ కలిసి 40 పడకలు అభివృద్ధి చేయటం జరిగింది. కారంచేడు గ్రామానికి చెందిన శ్రీ వై. రామనాథ్ బాబు యిచ్చిన

విరాళంతో 14 పడకల "పిల్లల వార్డు", రాష్ట్ర టి.బి. అసోసియేషన్ వారి విరాళంతో ఆరుపడకల స్పెషల్ వార్డు ప్రారంభమైనాయి. ఇతర సౌకర్యాలతోపాటు "రొమ్ము"కు శస్త్ర చికిత్సలు కూడ యీ ఆస్పత్రిలో జరుగుతుండేవి.

క్షయ వ్యాధిగ్రస్తులు యింటివద్దనే వుండి వైద్యం ద్వారా స్వస్థత పొందే స్థాయికి వైద్యరంగం అభివృద్ధి చెంది రోగులు ఆస్పత్రిలో చేరటం తగ్గింది. దాంతో ఆస్పత్రి ప్రాముఖ్యం తగ్గిపోయింది. ప్రభుత్వం వారు ఈ ఆస్పత్రి పరిధిలోని మూడు జిల్లాల జనరల్ ఆస్పత్రులకు ఇక్కడి పడకలను కేటాయించటంతో యిది మూతపడినట్లైంది.

## ఎన్నారై హాస్పటల్




మంగళగిరి దక్షిణాన శివారు ప్రాంతంలో 50 ఎకరాల ప్రాంగణంలో నెలకొల్పిన ఎన్.ఆర్.ఐ. మెడికల్ కాలేజి, జనరల్ హాస్పటల్ దిన దిన ప్రవర్ధమాన మవుతున్నాయి. అమెరికాకు చెందిన ప్రవాస భారతీయ వైద్యులు లాభాపేక్ష లేకుండా పేదలకు సైతం అత్యుత్తమ అధునాతన వైద్య సేవలను అందుబాటులోనికి తీసుకురావాలన్న మహదాశయంతో 2003లో "ఎన్.ఆర్.ఐ. అకాడమీ ఆవ్ సైన్సెస్" సంస్థను ప్రారంభించారు. తొలుత 300 పడకలతో ప్రారంభమైన యీ ఆస్పత్రి ఏడాదిలోనే 450 పడకలకు విస్తరించి, 12 వైద్య విభాగాలతో విలసిల్లుతోంది. వచ్చే మూడేళ్లలో దశల వారీగా దీనిని అధునాతన వసతులతో 750 పడకల స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దేందుకు యీ సంస్థ సంకల్పించింది.

అతి త్వరలోనే సి.టి. స్కాన్, కాథ్ ల్యాబ్, సి-ఆర్మ్‌లను నెలకొల్పనున్నారు. పేదలందరికి అందుబాటులో వుండే విధంగా నామమాత్రపు ఫీజులతో విస్తృత వైద్యసేవలు అందజేస్తున్నారు. రోగనిరోధకాల ప్రాముఖ్యత గురించి కూడ ప్రజలను జాగృతం చేస్తున్నారు.

డా॥ మంతెన నరసరాజు ముఖ్య నిర్వాహక పాత్ర వహిస్తున్నారు. డా॥ కె. అంజిరెడ్డి యీ సంస్థలకు 'డీన్'గా బాధ్యతలు చేపట్టారు.

యూనివర్శిటీ హాస్పటల్

విజయవాడలోని ఎన్.టి.ఆర్. వైద్య, ఆరోగ్య యూనివర్శిటీ వారి క్యాంపస్ కాలేజి సిద్దార్థ మెడికల్ కాలేజి. వారికి 1986లో మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి గుర్తింపు అవసరమైంది. మంగళగిరిలోని టి.బి. శానిటోరియం స్థలంలో 200 ఎకరాలు సేకరించి గుర్తింపుకు అవసరమైన ఆస్పత్రిని ప్రారంభించారు. ఏడాదికి 30 లక్షల రూపాయల మందుల బడ్జెట్‌తో ఈ ఆస్పత్రిని ప్రారంభించారు. వివిధ విభాగాలలో స్పెషలిస్టులు, లాబ్ టెక్నీషియన్లు, 10 మంది డాక్టర్లు, 25 నర్సులు, 45 మంది యితర ఉద్యోగులతో కూడిన ఈ ప్రాంగణం నిజంగా మంగళగిరి ప్రాంతానికి ఒక వరం అనుకున్నారు. కానీ ఈ ఆస్పత్రికి రవాణా సౌకర్యాలు లేకపోవటంతో ప్రజలకు సన్నిహితం కాలేకపోయింది. దీంతో మంగళగిరి యు.జి.హెచ్. నిర్లక్ష్యానికి గురైంది. హెల్త్ యూనివర్శిటీకి ఐదు కిలోమీటర్లలోపే ఆస్పత్రులు ఉండాలన్న నిబంధన పెట్టారు. దీంతో మంగళగిరి ఆస్పత్రి దూరంలో వుండి తమకు ఉపయోగం లేదని తెలుసుకున్న ఆరోగ్య విశ్వ విద్యాలయం అధికారులు మంగళగిరి యు.జి.హెచ్.ను వదిలేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ ప్రభుత్వాస్పత్రిలోని కొన్ని వార్డుల్ని విజయవాడ జనరల్ హాస్పటల్‌కు తరలించారు. దీంతో ఎంతో అట్టహాసంగా ప్రారంభించబడిన యూనివర్సిటీ జనరల్ హాస్పటల్ నామ మాత్రంగా నడుస్తోంది. దీన్ని ఎయిడ్స్ కేంద్రంగా తీర్చిదిద్దుతామని అప్పటి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డా॥ అరుణ చెప్పారు. ఎంతో ఆరోగ్యకరమైన వాతావరణం, ఎంతో విలువైన, విశాలమైన యీ స్థలంలో యీ ప్రాంత అభివృద్ధికి, అవసరాలకు ఉపయోగపడే వైద్యరంగ ప్రాజెక్టు ఏదన్నా ప్రారంభిస్తే బాగుంటుంది.

## క్యాన్సర్ ఆస్పత్రి

శ్రీ యార్లగడ్డ వెంకన్న చౌదరి మెడికల్ ఫౌండేషన్ వారు నందమూరి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిని 1986 ప్రాంతంలో చినకాకాని గ్రామ పరిధిలో నిర్మించారు. శ్రీ యార్లగడ్డ వెంకన్న చౌదరి ఈ ఆస్పత్రికి రూ. 30 లక్షల విరాళం సమకూర్చారు.

ఈ కాన్సర్ ఆస్పత్రికి ముంబాయి బాబా ఆటమిక్ రీసెర్చి సెంటరు వారి గుర్తింపు ఉంది, మెడికల్ యూనివర్శిటీ ఆధీనంలో నడుస్తోంది. ఎన్నో సంవత్సరాలు నిర్మాణం పూర్తి కాకుండా వుండి 1997 ప్రాంతంలో మాత్రమే రోగుల సేవలకు యీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చింది. ప్రజలకు యీ ఆస్పత్రి సేవలు మరింతగా అందేందుకు ప్రభుత్వం సౌకర్యాలను మెరుగుపర్చవలసి వుంది.

## విస్తరిస్తున్న ఎయిడ్స్ మహమ్మారి



ప్రపంచాన్ని ఒణికిస్తూ, ప్రజల ఆరోగ్య, ఆర్థిక, సాంఘిక, కుటుంబ విషయాలపై తీవ్ర ప్రభావం కలిగిస్తున్న "ఎయిడ్స్" మంగళగిరిలో వేళ్ళూనుకున్నది. గుంటూరు జిల్లాలో గణనీయమైన సంఖ్యలో ఎయిడ్స్ బాధితులుండగా, మంగళగిరి యీ విషయంలో ''టాప్ టెన్''లోనే వుంది.

పుణ్యక్షేత్రమైన మంగళగిరి పట్టణంలో కొండమెట్ల ప్రక్కనే దశాబ్దాలుగా ''వ్యభిచారక్షేత్రం'' నిర్విరామంగా నిర్వహించ బడుతోంది. కొందరు రాజకీయ దళారుల అండదండలతో నిరాటంకంగా నడుస్తోంది. ఈ కేంద్రం ఎయిడ్స్ లక్షణాలను వ్యాప్తి చేస్తోంది. సరైన సామాజిక, ఆరోగ్య స్పృహలేని కొందరు ఈ వ్యాధి ప్రబలేందుకు దోహదపడుతున్నారు. కళ్ళెదుట కళకళలాడుతూ తిరిగిన కుటుంబాలు యింటి పెద్ద మరణించటంతో దిక్కులేనివిగా మారుచున్నాయి. ప్రజలు, పత్రికలు ఘోషిస్తున్నా ఆ సమస్య పరిష్కార దిశగా పూర్తిస్థాయిలో ప్రయత్నించిన అధికారిగాని, ప్రజా ప్రతినిధిగానిలేరు. ✵

## చేనేత మ్యూజియం

చేనేత మ్యూజియం స్థాపనకు చేయూత నివ్వండి

తరతరాల మన చేనేత ఉపకరణాలు, చేనేత అభివృద్ధి చేసిన వ్యక్తుల చిత్రపటాలు ప్రదర్శించే "చేనేత మ్యూజియం"ను 'పట్టణ వికాస మండలి' స్థాపించేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తోంది. పురాతన చేనేత ఉపకరణాలు యివ్వదలచిన వారు, ఇతర సహాయ సహకారాలు అందించదలచిన వ్యక్తులు, సంస్థలు సంప్రదించదలరు.

పట్టణ వికాస మండలి, మంగళగిరి

# రవాణా

మంగళగిరి పురాతన కాలమునుండే రవాణా మార్గాలు మెండుగా వున్న ప్రాంతంగా కన్పిస్తోంది. విజయనగర సామ్రాజ్యములో యిది ఒక పట్టణముగా నుండి చేనేత వ్యాపారము కేంద్రంగా వుంది. అంతేకాకుండా గోల్కొండ సుల్తాను 'ఇబ్రహీం కుతుబ్ షా' 1579లో కొండవీడును జయించినపుడు కొండపల్లి నుండి సేనలను యీ ప్రాంతము మీద నుండి నడిపించారు. ఈ రెండు చారిత్రాత్మక సంఘటనల దృష్ట్యా ఈ ప్రాంతం రవాణా మార్గాలు అధికంగా వున్న ప్రాంతంగా చెప్పవచ్చు.

1680 సం॥ తర్వాత ఈ ప్రాంతం ట్రంకురోడ్డుగా మార్పు చెందింది. 1947 నుండి మద్రాసు-కలకత్తా జాతీయ రహదారి నెం.5గా పిలువబడుతున్న మార్గంలోనే మంగళగిరి నెలకొని వుంది.

అలాగే తాడేపల్లి నుండి బళ్ళారి మీటరు గేజి రైలు మార్గము 1890లో ప్రారంభం కాగా, ఆనాటి నుండే రైలు రవాణా మంగళగిరికి అందుబాటులోకి వచ్చింది.

పాతకాలంలో స్థానిక అవసరాలకు గుర్రపు బండ్లు అందుబాటులో వుండి, ఆ తరువాత రిక్షాలు ఆ స్థానాన్ని ఆక్రమించాయి. అనంతరం బస్సు సౌకర్యాలు విస్తృతమై ప్రస్తుతం వందలాది ఆటోలు నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు, వివిధ పట్టణాలకు మంగళగిరి నుండి రవాణా సౌకర్యం ఏర్పడింది.

వివిధ రవాణా మార్గాలు యీ ప్రాంత ప్రజలకు ఎన్నో దశాబ్దాల నుండే అందుబాటులో వుండటం వలన పుణ్యక్షేత్రం, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెంది, ప్రజలకు విద్య, నాగరికత అందుబాటులోకి వచ్చాయి.

## జాతీయ రహదారి

మద్రాసు-కలకత్తా జాతీయ రహదారి మంగళగిరి పట్టణాన్ని తాకుతూ వెళ్తోంది.

మద్రాసులోని ఈస్టిండియా కంపెనీ ముఖ్య అధికారి "స్ట్రేన్‌షాం మాస్టర్" వ్యాపార నిమిత్తం మచిలీపట్నం నుండి మద్రాసు తిరిగి వెళ్లు మార్గమధ్యంలో 1679 మార్చి 22న మంగళగిరిలో బసచేశాడు. ఆయన బయలుదేరి వెళ్ళిన మార్గం కొన్ని మార్పులు చేర్పులతో గ్రాండ్ ట్రంక్ రోడ్ అయింది. దానిని గ్రేట్ నార్తరన్ రోడ్ అనేవారు. 1870-71లలో యీ మార్గంలో మెటల్ రోడ్డు వేయబడింది. 1947 నుండి యిది నేషనల్ హైవే నెం.

5గా వాసికెక్కింది. ఈ మార్గంలోనే మంగళగిరి వుండటంతో మొదటి నుండి జాతీయ స్రవంతిలో వుంటూ వస్తోంది.

జాతీయరహదారి పట్టణానికి పడమరవైపున వుంటూ వచ్చింది. ఆ తరువాత బై-పాస్ రోడ్డు పట్టణానికి తూర్పు చివరన అవతరించింది. దాంతో బైపాస్ రోడ్డు జాతీయరహదారిగా మారింది. పట్టణంలో వాహనాల రద్దీ తగ్గింది. బైపాస్ రోడ్డు యిరుప్రక్కలనున్న పొలాల ధరలు పెరిగాయి.

కేంద్ర ప్రభుత్వము వారి 'ప్రధాని స్వర్ణ చతుర్భుజి' పథకం క్రింద యీ జాతీయ రహదారిని 4 లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేసి 18-3-2003న జాతికి అంకితం చేశారు. అప్పటిదాక రెండు లైన్ల యీ రోడ్డు మీద ఎన్నో ప్రమాదాలు జరిగాయి. 4 లైన్ల రోడ్డు వన్-వే ట్రాఫిక్ చేయటవలన ప్రమాదాలు తగ్గటమే కాకుండా ప్రయాణం సుఖవంతమై, త్వరితంగా వెళ్లేందుకు వీలు పడుతోంది.

## రైల్వే ఓవర్ బ్రిడ్జి

మంగళగిరి-విజయవాడల మధ్య, పట్టణానికి చివరగా రైల్వేలైను వుంది. అక్కడ ట్రంకురోడ్డు పై రైల్ లెవల్ క్రాసింగు వుండేది. రైలు వచ్చినపుడలా ట్రాఫిక్ జటిలమయ్యేది. వాహనదారులు ఎన్నో యిబ్బందులకు గురవుతుండేవారు. లెవెల్ క్రాసింగు వద్ద ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేయాలని ఎన్నో దశాబ్దాలపాటు మంగళగిరి ప్రజలు కోరుతూ వచ్చారు. ఎట్టికేలకు సమస్య తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం అక్కడ 1976-77లో రైల్-ఓవర్-బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభించి 1980 సంIIలో పూర్తి చేసింది. దాంతో జాతీయ రహదారిపైన మంగళగిరి వద్ద ఉన్న సమస్య తొలగి ప్రయాణాలు సులభమయ్యాయి.

## పెదవడ్లపూడి ఓవర్ బ్రిడ్జి

మంగళగరి మండలం పెదవడ్లపూడి వద్ద రైల్వే లెవెల్ క్రాసింగు వుంది. అది రైళ్ల రాకపోకల నిమిత్తం రోజుకు తరుచుగా మూయబడుచూ, మంగళగిరి-తెనాలి మధ్య ప్రయాణాలకు అంతరాయం కలిగిస్తుంటుంది. సుమారు రూ. 6 కోట్ల 80 లక్షల ఖర్చుతో రాష్ట్ర ప్రభుత్వం, రైల్వే శాఖ సంయుక్తంగా రైల్ ఓవర్ బ్రజ్జి నిర్మించ తలపెట్టగా 2003 జనవరి 10వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు శంఖుస్థాపన చేశారు. ఈ నిర్మాణం 2004 సంవత్సరాంతంలోగా పూర్తి కావచ్చు. ఈ బ్రిడ్జి ప్రారంభమైతే మంగళగిరి - తెనాలి రోడ్డు మార్గం చాల సౌకర్యవంతంగా మారుతుంది.

రైల్వే స్టేషను

మంగళగిరి రైల్వే స్టేషను మొదట తాడేపల్లి-బళ్ళారి మీటర్ గేజి రైలు మార్గంపై వుండగా, ప్రస్తుతం క్రిష్ణాకెనాల్-గుంటూరు బ్రాంచి బ్రాడ్‌గేజి సింగిల్ లైను మార్గంపై వున్నది. తాడేపల్లి-బళ్ళారి రైలు మార్గం నిర్మితమై 15-6-1890న తాడేపల్లి-కంభంల మధ్య ప్రారంభమవటంతో మంగళగిరి ప్రజలకు రైలు మార్గం అందుబాటులోకి వచ్చింది. ఆ రైలు మార్గం "సదరన్ మరాఠా రైల్వే కంపెనీ" ఆధ్వర్యంలో వుండేది. కృష్ణానదిపై మొదటి రైలు వంతెన రూపుదిద్దుకుని, 15-7-1897న విజయవాడకు రైలు ప్రయాణం ప్రారంభమైంది. ఆ తర్వాత "మద్రాస్ అండ్ సదరన్ మరాఠా రైల్వే" వారు యీ ప్రాంత రైల్వే మార్గాన్ని నిర్వహించారు.

సదరన్ రైల్వే క్రింద వుంటూ వచ్చిన యీ రైల్వేస్టేషను, 2-10-1966 నుండి సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో చేరింది. 1956 నుండి విజయవాడ డివిజన్ క్రింద వుంటూ 1-4-2003న క్రొత్తగా ఏర్పడిన గుంటూరు డివిజన్‌లో అంతర్భాగ మైంది. ఈ స్టేషను సముద్ర మట్టానికి 30.54 మీటర్ల ఎత్తున వుంది. 18 బోగీలకు సరిపోను మాత్రమే వుంటుండిన (లో లెవెల్) ప్లాట్‌ఫారమును 21బోగీలకు సరిపోను అభివృద్ధి చేశారు.




ప్రతిరోజు వందలాది విద్యార్థులు, ఉద్యోగులు యీ స్టేషన్ నుండి ఎక్కువగా విజయవాడ, గుంటూరులకు వెళ్తున్నారు. చేనేత వ్యాపారులు దూరప్రాంతాలకు యిక్కడి నుండి ప్రయాణ్ చేస్తుంటారు. గుంటూరు-విజయవాడ రైల్వే లైను విద్యుద్దీకరణ 1-5-1989న పూర్తయింది. 1966వ సంవత్సరంలో జరిగిన "విశాఖ ఉక్కు ఫ్యాక్టరి ఉద్యమం" కాలంలో యీ స్టేషను ఉద్యమ కారులచే తీవ్ర విధ్వంసానికి గురైంది. ఆ తరువాత కొన్నాళ్లకు యధాస్థితి పొందింది.

ఈ రైల్వే స్టేషనుగుండా పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు వెళ్ళుచున్నప్పటికీ, కేవలం మూడు మాత్రమే ఆగుచున్నాయి. మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు, వాటిలో బెర్తులు కేటాయింపును ప్రజలు కోరుచున్నారు. ఈ స్టేషనులో లోలెవెల్ ప్లాట్ ఫారం ప్రయాణీకులకు ఎంతో యిబ్బంది కలిగించే అంశం. విజయవాడ-గుంటూరు-తెనాలి మధ్య వున్న సింగిల్ లైనును డబుల్ లైనుగా అభివృద్ధి చేసి, లోకల్ ట్రైనులు నడపాలన్న యీ ప్రాంత ప్రజల కోరిక నెరవేరితే, మంగళగిరి రైల్వే స్టేషనుకు ప్రాముఖ్యత పెరుగుతుంది.

ఆర్టీసి బస్‌స్టాండ్

విజయవాడ-గుంటూరుల మధ్య ట్రంకురోడ్డుపై మంగళగిరి ఉన్నప్పటికీ, రవాణా సాధనాలు యీ ప్రాంతంలో అంతంత మాత్రంగానే వుండేవి. 1960 ప్రాంతాలలో ముఖ్యమైన ప్రయాణ సాధనం ఆర్టీసి బస్సే. అప్పట్లో మంగళగిరి- విజయవాడల మధ్య బస్ ఛార్జి పెద్దలకు 40 పైసలు, పిల్లలకు 20 పైసలుండేది. ప్రక్కనున్న ప్రాంతాలకు 'బుజ్జులు'గారి ప్రైవేటు బస్సు మంగళగిరి-విజయవాడల మధ్య సిమెంటు కంపెనీ మీదుగా తిరుగుతూ వుండేది.

మంగళగిరి బస్టాండు సమితి ఆఫీసు ఎదుట రోడ్డుపైనే వుండేది. ఆ తరువాత 1977 ప్రాంతంలో ట్రంకు రోడ్డుపైనే నిడమర్రు రోడ్డు ప్రక్కన కనీస సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. అంతకు ముందు విజయవాడ నుండి ఆర్టీసి సిటీబస్సులు తాడేపల్లి, డోలాస్ నగర్ వరకు తిరిగేవి. ఆ తర్వాత వాటిని మంగళగిరి వరకు పొడిగించారు. అన్ని సౌకర్యాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ వారి బస్ స్టేషన్ మంగళగిరిలో 26-5-1992న గవర్నమెంటు ఆస్పత్రి ఆవరణలో సుమారు 1.30 ఎకరాల విస్తీర్ణంలో ప్రారంభమైంది. ఈ బస్‌స్టేషన్ నుండి అన్ని మండలాలకు బస్సులు నడుస్తున్నాయి. ఈ బస్‌స్టేషన్‌కు అనుబంధంగా ఎర్రచెరువు ప్రాంతంలో 10 ఎకరాల విస్తీర్ణంలో "బస్ డిపోను 15-6-1993న ప్రారంభించారు. సుమారు 400 మంది ఉద్యోగులు కలిగిన యీ బస్‌స్టేషన్ నుండి సుమారు 60 సర్వీసులు రోజుకు 20 వేల కి॥మీ॥ తిరుగుతున్నాయి. రోజు వారీగా సుమారు రు. 1.2 లక్షల ఆదాయం వస్తోంది.



రాను రాను ప్రజల అవసరాలు, అభిరుచులు మారటంతో ఆటోల సంఖ్య లెక్కకు మించి పెరిగింది. దీంతో ప్రజలు బస్సు ఎక్కటం తగ్గించివేశారు. మంగళగిరి-విజయవాడల మధ్య రాత్రింబగళ్ళు తిరిగిన సర్వీసులు కనుమరుగవుతున్నాయి. ఎన్నో దశాబ్దాలు ప్రజల జీవితాలతో ఆర్టీసికి వున్న ముడి విడిపోయి-కేవలం ఫ్రీపాసులు, కన్‌సెషన్ పాసుల వారు, యింకా ప్రభుత్వ ప్రయాణ సాధనాలపైన మమకారం తెంచుకోలేకపోతున్న కొందరు ప్రజలు మాత్రమే యిక్కడ నుండి బస్సులు ఎక్కుతున్నారు.

### 'మంగుళూరు' స్టేషన్ 'మంగళగిరి'లో

రైల్వేశాఖలో 'మంగళగిరి'కి ''యం.ఏ.జి.'' (MAG) అని, 'మంగుళూరు'కు "యం.ఏ.క్యూ" (MAQ) అనే కోడ్‌లు వున్నాయి.

రైల్వేలో మంగళగిరి నరసింహస్వామి భక్తులొకరు ఉన్నతాధికారిగా ఉండే వారట. రైల్వే వారు 'మంగుళూరు' స్టేషను బిల్డింగు, ప్లాట్ ఫారం అభివృద్ధి చేసే సందర్భంలో ఆ అధికారి యీ రెండు స్టేషన్ల కోడ్‌లకు ఉన్న సామీప్యాన్ని ఆసరాగా తీసికొని, మంగుళూరుకు బదులు మంగళగిరి స్టేషన్‌ను అభివృద్ధి చేసారట.

నేటికి యీ పట్టణ స్థాయి, రైల్వే ప్రయాణీకుల సంఖ్య, ఆదాయాలను బట్టి - రైల్వే వారి సాధారణ ప్రామాణీకాల ప్రకారం ప్లాట్ ఫారంపై కప్పు 126 చ॥మీటర్లు వుంటే చాలు. కాని వాస్తవానికి ప్లాట్ ఫారముపై ఆనాడే నిర్మించిన పైకప్పు వైశాల్యం 2,128 చ॥ మీటర్లుగా వుంది. వుండవలసి కనీస స్థాయి కంటే మంగళగిరి రైల్వే ప్లాట్‌ఫారం పైకప్పు "ఎన్నో రెట్లు" వుండటం గమనార్హం. ఈ కథనానికి సరైన ఆధారాలు లేకపోయినప్పటికి యీ స్టేషన్ను చూస్తే నమ్మబుద్ధి వేస్తుంది.

## ఆటోనగర్

మంగళగిరి పట్టణంలో రోడ్‌పైన లారీలు నిలిపి రిపేర్లు చేయటం వల్ల కాలుష్యం పెరగటమే కాక ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నది. ఆ అసౌకర్యాన్ని నివారించటం కోసం, రవాణారంగానికి చెందిన వృత్తిదారుల సౌకర్యం కోసం ఆటోనగర్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎన్నో సంవత్సరాల నుండి ఉంటోంది.

ఆటోనగర్ ఏర్పాటు గురించి ఆటోనగర్ టెక్నీషియన్ అసోసియేషన్ ఎన్నో వత్తిడులు చేయడంతో 2002 సం॥లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఫలితంగా "ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన సంస్థ" కదిలి, ప్రాథమిక సర్వే నిమిత్తం ఆటోనగర్‌లో ప్లాట్లు కొనే వారి డిమాండ్‌ను పరిశీలించటం ప్రారంభించింది. 500 మందికి పైగా వృత్తిదారులు డిపాజిట్లను చెల్లించటంతో ఆటోనగర్‌కు గల డిమాండ్‌ను ప్రభుత్వం గుర్తించింది.

ఎర్రచెరువు, నల్ల చెరువులలో టైర్ల ఫ్యాక్టరీ కోసం గతంలో కేటాయించిన భూమిని పరిశ్రమల మౌలిక సదుపాయల సంస్థ వారు 19-12-2002న స్వాధీనం చేసుకున్నారు. రోడ్లు మొ॥ ప్రాథమిక సౌకర్యాలకు పోను ఆ స్థలంలో మిగిలిన 85 ఎకరాలలో 800 ప్లాట్లు వేసి కేటాయింపులు జరిపేందుకు ప్రాథమిక నిర్ణయం జరిగింది. ❋

# వ్యవసాయం

మంగళగిరి పూర్వకాలంలో వ్యవసాయాధారిత గ్రామం. బ్రిటీష్‌వారు 1893లో ప్రచురించిన "మద్రాసు గ్లోసరి" ప్రకారం మంగళగిరి గ్రామ ఆయకట్టు క్రింద 2 వేల ఎకరాల వ్యవసాయ భూమి వుండేదని సమాచారం. రాను రాను పంట పొలాలు అదృశ్యమై పట్టణ పరిధిలో వ్యవసాయం దాదాపుగా లేకుండా పోయింది.

1858-59 సం॥లలో మంగళగిరి పట్టణానికి దక్షిణాన ఎర్రచెరువు-నల్లచెరువు అనే జంట చెరువులుండేవి. వాటి క్రింద వందలాది ఎకరాల వ్యవసాయ భూమి సాగులో వుండేది. 1977లో ప్రభుత్వం వారు టైర్ల ఫ్యాక్టరి నిర్మాణం కోసం ఆ చెరువులను కేటాయించటంతో వ్యవసాయం ఆగిపోయింది.

మంగళగిరి మండల, నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు అన్ని వ్యవసాయాధారిత గ్రామాలే. మంగళగిరికి ఉత్తరం, తూర్పు భాగాలలో డెల్టాభూమి వుంది. ఈ డెల్టాలో వాణిజ్య పంటలు చెరకు, పసుపు, కంద, మిర్చి, అరటి, కరివేపాకు, వరి మొ॥ పండుతాయి.

పట్టణానికి పడమర భాగాన కొంత నల్లరేగడి భూములు, ఎర్రనేలలు వర్షాధారంగా వున్నాయి. ప్రత్తి, మిర్చి, పొగాకు, వేరుశెనగ, ఉల్లి, కంది, మినుము, పెసర, కూరగాయలతో వీటిలో ముఖ్యపంటలు. నిడమర్రు, బేతపూడి, కురగల్లు, పెదవడ్లపూడి గ్రామాలలో పూలతోటలు సాగుచేయబడి - మల్లెలు, కాగడాలు, జాజి, గులాబి, బంతి, కనకాంబరాలు ఎగుమతి అవుతూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్నాయి.

వెంకటపాలెం, పెదవడ్లపూడి, నూతక్కి గ్రామాలలో జామ, సపోట, నిమ్మ తోటలు పెంచుతున్నారు. కుంచనపల్లి, ప్రాతూరు, గుండిమెడ గ్రామాలు ఆకు కూరలకు ప్రసిద్ధి.

డెల్టా ప్రాంతం మినహా మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని భూములలో ఎత్తిపోతల పథకాలు, బోర్లు, హైలెవెల్ ఛానల్, గుంటూరు ఛానల్ ద్వారా పంటలు పండిస్తున్నారు.

మంగళగిరి రైల్వే లైనుకు పడమరవైపున 4 వందల ఎకరాల వ్యవసాయ భూమి రెండు దశాబ్ధాల క్రితం టౌన్‌షిప్ కోసం కేటాయించారు. దాంతో వ్యవసాయ భూమి తగ్గిపోయింది.

పేదలకు యిండ్ల స్థలాలు కేటాయించేందుకు, ప్రభుత్వ స్థలాలలోని ఆక్రమణ దారులకు పునరావాసం కల్పించేందుకు ఎన్నో వ్యవసాయ భూములు యిండ్ల స్థలాలుగా పంపిణీ అయ్యాయి.

మంగళగిరి మండలంలో పండించని పంటలు లేవని చెబుతారు. ఆహారధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనెగింజలు, సుగంధ ద్రవ్యాలు, వాణిజ్య పంటలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతోటలు, పూలతోటలు, సాగుచేస్తున్నారు. వందకు పైగా రకాలు పండుతున్నాయి. కృష్ణా

పశ్చిమ కాలువ, హైలెవెల్ ఛానల్, గుంటూరు ఛానెల్‌ల ద్వారా సాగునీటి సరఫరా వుంది. కొన్ని గ్రామాలలో సేద్యం చేస్తున్నారు. ఎత్తిపోతల బావులు పథకాలు, గొట్టపు బావుల ద్వారా కూడా సుమారు 3,500 హెక్టార్ల మాగాణిలోను, 5000 ఎకరాల మెట్టలోను వరిపంట వేస్తున్నారు. 4,500 హెక్టార్లలో ప్రత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, కూరగాయలు పండిస్తున్నారు. ఎత్తిపోతల క్రింద మరో 4,000 ఎకరాలు సాగవుతున్నాయి.

మంగళగిరి మండలంలో సుమారు 60 శాతం నల్లరేగడి భూమి, 20 శాతం ఎర్రనేలలు, 20 శాతం కృష్ణానదీ తీర ఒండ్రు నేలలు వున్నాయి.

మురుగుపారుదల సరిగా లేక కొండవీటివాగు వరదలవల్ల పొలాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

## గుంటూరు ఛానల్

మంగళగిరి మండలంలో వ్యవసాయానికి ప్రధానమైన నీటివనరుల్లో "గుంటూరు ఛానల్" ఒకటి. కృష్ణానది వరద గట్టులో తీయబడి ఉండవల్లి వాగు నుండి ప్రారంభమయి సుమారు 47 కి॥మీ॥ ప్రవహిస్తూ సుమారు 27 వేల యకరాల ఆయకట్టుకు నీరందిస్తుంది. మండలంలోని ఆత్మకూరు, మంగళగిరి, చినకాకాని, కాజ, నంబూరు గ్రామాల గుండా ప్రవహిస్తోంది. 1975లో ప్రారంభమైన యీ ఛానల్ తరువాత యీ ప్రాంతంలో పంటలు అభివృద్ధి చెంది, వ్యవసాయ భూముల విలువ కూడా బాగా పెరిగింది.

మంగళగిరి మండలంలో వ్యవసాయానికి గుంటూరు ఛానల్ వరప్రసాదంగా మారింది.

## కరివేపాకు

మంగళగిరి మండలంలోని "పెదవడ్లపూడి" గ్రామం గతంలో "వడ్లపూడి నారింజ"తో చరిత్రకెక్కితే, యీనాడు "కరివేపాకు"తో మరో చరిత్ర సృష్టిస్తోంది. సుమారుగా 25 సంవత్సరాల క్రితం యీ కరివేప సువాసనలు వడ్లపూడి పొలాల్లో ప్రారంభమై, దేశవిదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగి యీ గ్రామం పేరు అన్నిచోట్ల వ్యాపించింది. ఈ ఘనత ప్రస్తుత జిల్లాపరిషత్ ఛైర్మన్ శ్రీ పాతూరి నాగభూషణం కుటుంబందే అని చెబుతారు.

ఒకసారి ''కరివేప'' మొక్కను నాటితే సంవత్సరానికి మూడు కోతలుగా దిగుబడులనివ్వటమేకాకుండా, తక్కువ పెట్టుబడితో, తక్కువ శ్రమతో పంటనిస్తుంది.

సుమారు 250 ఎకరాల్లో సాగుచేయబడుతున్న యీ కరివేపాకు పంటవల్ల ఎకరానికి సంవత్సరానికి పాతికవేల రూపాయలు కనీసం ఆదాయం వస్తుంది. మన రాష్ట్రంలో యింత భారీగా ఎక్కడా కరివేప సాగులేదు.

## కొండవీటివాగు

మంగళగిరి మండలంలోని, కురగల్లు, నీరుకొండ, నిడమర్రు, యర్రబాలెం, కిష్ణాయపాలెం, ఐనవోలు, పెనుమాక, ఉండవల్లి గ్రామాలగుండా ప్రవహించే కొండవీటివాగు అసలు పేరు "పుల్లేరు". కొండవీటి కొండల్లో పుట్టి ఉండవల్లి వద్ద కృష్ణానదిలో కలిసి అంతమయ్యే దీని పేరు 'కొండవీటి" వాగు అని వాడుకలోకి వచ్చింది. విజయవాడ థర్మల్ స్టేషన్ 1979లో ప్రారంభమైంది. థర్మల్ స్టేషన్ ప్రారంభానికి ముందు ప్రకాశం బ్యారేజి వద్ద నీటి నిల్వ 8 అడుగుల ఎత్తులో వుంటూ వుంటే – ఆ తరువాత విద్యుత్పత్తి అవసరం కోసం ఆ మట్టాన్ని 12 అడుగులకు పెంచారు. 1979 నుండి విటిపిఎస్ వల్ల పంట పొలాలకు యీ ప్రాంతంలో ముప్పు ప్రారంభమయింది.

ఆ నీటి మట్టం పెరగటం వలన కొండవీటి వాగులో ఎప్పుడూ నీరు నిల్వ వుంది వాగులో పూడిక తీసే వీలు లేకపోతోంది. కృష్ణానదికి వరదలు వచ్చినపుడు నీరు వెనక్కి తన్ని సుమారు 16 వేల ఎకరాల వ్యవసాయ భూములు ముంపుకు గురవుతాయి. కోట్లాది రూపాయలు నష్టం వస్తోంది.

అయితే కొండవీటి వాగులో అన్ని కాలాల్లోను నీరు నిల్వ వుండటం వల్ల అది ఒక రిజర్వాయరుగా ఉపయోగపడి, కృష్ణాయపాలెం, యరత్రాలెం, నవులూరు, కురగల్లు, నీరుకొండ గ్రామాలలో ఎత్తిపోతల పథకాల ద్వారా సుమారు 9 వేల ఎకరాల భూములకు సౌకర్యంగా వుంది.

వరద ఉధృతంగా వున్న సమయంలో నీటి మట్టాన్ని తగ్గించేందుకు విటిపిఎస్‌తో ఒప్పందం కుదరగా, అధి రెండు సంవత్సరాలు మాత్రమే అమలు జరిగింది. ఇరిగేషన్ శాఖ వారితో ఒప్పందంతో వాగులో నీరెక్కువైనపుడు ఆ నీటిని కృష్ణా వెస్టన్ మెయిన్ కెనాల్‌లోకి పంపుతుంటే నిజాంపట్నం పొలాలు మునుగుతున్నాయి. సీతానగరం కొండను తొలిచి అండర్ గ్రౌండు టన్నెల్ ద్వారా కృష్ణలోకి నీరు పంపాలని ఆలోచిస్తే కొండను తొలిచే క్రమంలో జరిగే బ్లాస్టింగ్ ప్రక్రియలో ప్రకాశం బ్యారేజికి ముప్పు కలిగితే అసలుకే ఎసరు వస్తుందని భయం. తాడేపల్లి రైల్వేబ్రిడ్జి వద్ద షట్టర్లు నిర్మించి నీటిని సీతానగరం వైపుకు మళ్ళించాలని సూచన వస్తే – క్రొత్తగా మళ్ళింపు వల్ల వచ్చే నీటి ఒత్తిడికి తమ బ్రిడ్జీలు తట్టుకోలేవని రైల్వే శాఖ వారి అభ్యంతరాలు.

ఈ కొండవీటి వాగు వల్ల వస్తున్న ముంపు నుండి పంట పొలాలను రక్షించేందుకు రాజకీయ పక్షాలు, అధికార యంత్రాంగం వివిధ సందర్భాలలో వివిధ సూచనలు చేశాయి. వివిధ చర్యలు చేపట్టాయి. కాని అన్ని విధాల అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం బయటకురాక, రైతులు వెతల కొనసాగుతూనే వుండి కొండవీటివాగు మంగళగిరి మండల పడమటి ప్రాంత రైతులకు కొన్ని సందర్భాలలో "దుఃఖదాయని"గా వుంటోంది. ❋

# కృష్ణా జలాలు
## ఫలించిన చిరకాల స్వప్నం



ఐదు శతాబ్దాల క్రిందటే విజయనగర ప్రభువుల పాలనలో పట్టణ హోదా ననుభవించిన ''మంగళగిరి'' దాహార్తి తీర్చుకునేందుకు తరాల తరబడి కలవరించింది. మంగళగిరి పట్టణంలో వున్న వందలాది నీటి బావుల్లో లభించేది "ఉప్పు" నీరే! వేళ్ల మీద లెక్కించదగిన సంఖ్యలోనే త్రాగునీటి బావులిక్కడున్నాయి. బట్టీ బావి, శివాలయం బావి, దేవాలయం పెద్ద బావి, బస్టాండు బావి, పాత మంగళగిరి మున్సబుగారి బావి మొదలగునవి చెప్పుకోదగ్గవి. 'పీపా'ల ద్వారా సరఫరా అయ్యే మంచినీటిని కొందరు కొనుగోలు చేయుటం జరుగుతుండేది. మంచినీటి అమ్మకాన్ని కొన్ని కుటుంబాలు జీవనోపాధిగా స్వీకరించేవారు.

మంగళగిరిలో మంచినీటిజల పాతాళాన్ని స్ఫురింపచేసేంత లోతుగా వుండటంతో ఆడపిల్లలు బావిలోంచి నీళ్లు తోడి, యింటికి చేరవేసి చాలా కష్టాలు పడవలసి వచ్చేది. దీంతో అప్పట్లో ఆడపిల్లలకు యిక్కడకు సంబంధం చేయాలంటే యితర ప్రాంతాల వారు యిష్టపడేవారు కాదు.

### గ్రామస్థాయిలో ప్రయత్నాలు

కృష్ణాజలాల్ని పట్టణానికి రప్పించేందుకు తొలినాళ్లలో రూపొందించిన పథకాలేవీ కార్యరూపం దాల్చలేదు. 1964లో "నేషనల్ రూరల్ వాటర్ సప్లై అండ్ శానిటేషన్ ప్రోగ్రాం" క్రింద గుంటూరు జిల్లాలో రూ. 20 లక్షల విలువైన పథకాలను తయారుచేశారు. మంగళగిరి, తాడేపల్లి, యర్రబాలెం, పెనుమాక, ఉండవల్లి గ్రామాలను సంయుక్తంగా యీ పథకం క్రింద చేర్చారు. ఈ పథకానికి కేంద్రం 50 శాతం నిధులు సమకూర్చేందుకు అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం, మిగిలిన 25 శాతం ఖర్చును స్థానిక సంస్థలు భరించే విధంగా నిర్ణయించినారు.

1964 నవంబరు 6వ తేదీన అప్పటి కేంద్ర మంత్రి శ్రీ యస్.కె.డే, రాష్ట్ర మంత్రి డా॥ యం.యన్. లక్ష్మీనరసయ్య యీ పథకానికి శంకుస్థాపన చేశారు. అప్పట్లో శ్రీ ఉడతా వీరాస్వామి పంచాయతీ అధ్యక్షులుగాను, శ్రీ పఠాన్ మహబూబ్‌ఖాన్ ఉపాధ్యక్షులు గాను ఉన్నారు.

"మంగళగిరి పంచాయతీ మంచినీటి పథకం" పేరుతో ప్రారంభమైన యీ ప్రయత్నం – యితర గ్రామ పంచాయతీలు తమ వాటా నిధులను యివ్వలేక పోవటంతో అర్ధాంతరంగా నిలిచిపోయింది.

## అంచెలంచెలుగా మంచినీరు



1969 అక్టోబరు 1న మంగళగిరి "పురపాలక సంఘం"గా అవతరించింది. శ్రీ గోలి గోపాలరావు తొలి కౌన్సిల్ (1971-76)కు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన విశేష కృషి చేసి మంగళగిరి పట్టణ దప్పిక తీర్చి "అపర భగీరథుడ"య్యారు. తెనాలి రోడ్‌లో గుంటూరు ఛానల్ వద్ద "పైలట్ వాటర్ స్కీము" క్రింద బోర్లు వేసి, 1975లో పట్టణానికి మంచినీరు రప్పించటంలో ఆనాటి కౌన్సిల్ సఫలమైంది. పానకాల స్వామి కొండ దిగువ భాగంలో స్టోరేజి ట్యాంకు నిర్మించి పట్టణానికి మంచినీటి సరఫరా ప్రారంభించారు. అప్పటి శాసనసభ్యులు శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ తోడ్పాటునందించారు.

రెండవ కౌన్సిల్ (1981-86)కు అధ్యక్షునిగా వ్యవహరించిన శ్రీ సుఖమంచి వెంకట కోటేశ్వరరావు యీ పథకాన్ని మరింత విస్తరింపజేశారు. 1983లో ప్రభుత్వం సమకూర్చిన రూ. 15 లక్షల నిధులతో రెండవ ట్యాంకును నిర్మించి కొత్తపేట, గండాలయపేట, ఇందిరానగర్ తదితర ప్రాంతాలకు మంచినీటి వసతి కల్పించారు.

మూడవ కౌన్సిల్ (1987-92)కు సారధ్యం వహించిన శ్రీ మురుగుడు హనుమంతరావు యీ పథకాన్ని ప్రజల ముంగిటకు చేర్చారు. మూడవ స్టోరేజి ట్యాంకును నిర్మింపజేసి, అన్ని వార్డులకు, యిండ్లకు పంపు కనక్షన్లు మంజూరు చేయించి ప్రజల అభినందన లందుకున్నారు. నాలుగవ కౌన్సిల్ (1995-2000)కు నేతృత్వం వహించిన శ్రీ గోలి వీరాంజనేయులు 'రైడర్ లైను' వేసి పాత మంగళగిరికి నీటి సరఫరాను మెరుగుపరిచారు.

## 1999లో పునాదిరాయి



శ్రీ గోలి వీరాంజనేయులు నిరంతరం తపించి అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబుచే ''కృష్ణాజలాల పథకాని''కి 1999 జులై 2న శంకుస్థాపన చేయించి, యీ ప్రక్రియను ఓ కొలిక్కి తీసుకువచ్చారు. ప్రభుత్వం జి.ఓ.నెం. 308 ద్వారా యీ పథకానికి పాలనాపరమైన అనుమతిని మంజూరు చేసింది. 'హడ్కో' రుణం 70 శాతం (రూ. 270.20 లక్షలు), పురపాలక సంఘం వాటాగా 30 శాతం (రు. 115.80 లక్షలు) భరించే విధంగా యీ పథకం జీవం పోసుకుంది.

శ్రీమతి కాండ్రు కమల మొదటి మహిళా ఛైర్‌పర్సన్‌గా 2000 సం॥లో 5వ కౌన్సిల్ అధికారం చేపట్టటంతో కృష్ణా జలాల పథకం దశ తిరిగింది. శ్రీమతి కమల యీ పథకాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి, తెగువతో, సమయస్ఫూర్తితో వ్యవహరించి పాలన, రాజకీయపరమైన అడ్డంకులను అధిగమించారు. 2001 నవంబరు 10న పథకం పనులను ప్రారంభింపజేశారు. అప్పటి లోక్‌సభ సభ్యులు డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, శాసనసభ్యులు శ్రీ మురుగుడు హనుమంతరావు, మాజీ మంత్రి డా॥ యం.యస్.యస్. కోటేశ్వరరావు ప్రభుత్వం వద్ద తమ అధికార హోదా, పలుకుబడులనుపయోగించి కౌన్సిల్‌తో సమన్వయం సాధించి సకాలంలో ప్రభుత్వపరంగా అనుమతులు, నిధులు రప్పించటంలో సఫలీ కృతులయ్యారు. పట్టణ ప్రజల భవిష్య అవసరాలను దృష్టిలో వుంచుకొని మరో పాతికేళ్లపాటు త్రాగునీటి అవసరాలను తీర్చే విధంగా యీ పథకం రూపుదిద్దుకుంది.

వివిధ రాజకీయ, ప్రజా సంఘాల చొరవతో ప్రజలు కూడ యీ పథకానికి తమ వంతు నిధులు రు. 40 లక్షలు మేర సమకూర్చారు. హ్యాపీ క్లబ్ అధినేత శ్రీ అంబటి మధుమోహన్ కృష్ణ అత్యధికంగా లక్ష రూపాయలు విరాళమిచ్చి ఔదార్యం చాటుకున్నారు. ప్రభుత్వం వివిధ గ్రాంటుల రూపంలో రు. 28.88 లక్షలు సమకూర్చింది.



2002 మే 4వతేదీన అప్పటి పురపాలక శాఖామాత్యులు శ్రీ ఫరూఖ్ కృష్ణా జలాల ప్రాజెక్టును సందర్శించి ''ట్రయల్ రన్'' నిర్వహించటంతో కృష్ణాజలాల సరఫరాకు రంగం సిద్ధమైంది. అదే నెల 30 తేదీన చైర్‌పర్సన్ శ్రీమతి కాండ్రు కమల పథకానికి సంబంధించిన మోటార్లు "స్విచ్ ఆన్" చేసి తొలిసారిగా స్టోరేజి ట్యాంకులకు నీటిని విడుదల చేశారు. ఆ మర్నాడు శాసనసభ్యుడు శ్రీ హనుమంతరావు ట్యాంకుల నుండి పట్టణంలోకి నీటిని విడుదలచేశారు.

జనవరి 10, 2003న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు యిక్కడకు



విచ్చేసి ''ఫిల్టరేషన్ ప్లాంటు''ను లాంచనంగా ప్రారంభించటంతో కృష్ణా జలాల పథకం అమలు లోనికి వచ్చింది. దీంతో ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ఘనత శ్రీమతి కాండ్రు కమల నాయకత్వంలోని ఐదవ మున్సిపల్ కౌన్సిల్‌కు దక్కింది. మండల రెవిన్యూ కార్యాలయ ఆవరణలోని క్రొత్త హైలెవెల్ స్టోరేజి ట్యాంకు 8 లక్షల లీటర్ల సామర్ధ్యం కల్గి పట్టణ ప్రాంత ప్రజల విస్తృత త్రాగునీటి అవసరాల కోసం నిర్దేశించబడింది.

దశాబ్దాల స్వప్నాలు సాకారం కావటంతో పట్టణ ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. శతాబ్దాల మంగళగిరి చరిత్రలోనే మేలి మలుపైన "కృష్ణాజలాలపథకం" వల్ల యీ పట్టణ సాంఘిక, ఆర్థిక స్థితిగతులు గణనీయంగా మారేందుకు బీజం పడినట్లయింది. ❋

# యోగ

## శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర యోగి



శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు స్థానిక సి.కె. జూనియర్ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. వీరు "వేంకటేశ్వర యోగి"గా లబ్ద ప్రతిష్టులయ్యారు. 1994 సంవత్సరం ఆగస్టు 10వ తేదీన మంగళగిరిలో 16 మంది అధ్యాపకులకు శిబిరాన్ని ప్రారంభించటం ద్వారా వీరు యోగ శిక్షణకు శ్రీకారం చుట్టారు. "శ్రీ వేంకటేశ్వర యోగసేవా కేంద్రాన్ని నెలకొల్పి తానే ప్రధాన యోగాచార్యులుగా యిప్పటి వరకు రాష్ట్రం నలుమూలలా 20 సేవాకేంద్రాలను ప్రారంభించారు. గత పది సంవత్సరాలుగా వీరి ఆధ్వర్యంలో 500 శిక్షణా శిబిరాల ద్వారా సుమారు 50 వేల మంది యోగ సాధన చేసారు. మంగళగిరిలో సుమారు 60 శిబిరాలు నిర్వహించారు.

## శ్రీ వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం

ఈ యోగ కేంద్రం సేవా సంస్థగా రిజిష్టరు అయింది. ఈ సంస్థకు శ్రీయుతులు కూరపాటి సాంబశివరావు, రావూరి నరసింహారావు, యం. విజయమోహనరావు, పుట్టా శ్రీనివాసరావు, జొన్నాదుల గురుమోహనరావు బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థ దినదినాభివృద్ధి చెందేలా నిరంతర కృషి చేస్తున్నారు.

శ్రీ వేంకటేశ్వర యోగి తన వ్యాసాలను "యోగసౌరభం" అనే పుస్తక రూపంలో సంకలనం చేశారు. హైదరాబాద్ దూరదర్శన కేంద్రం ద్వారా, ఆకాశవాణి విజయవాడ కేంద్రం ద్వారా యోగ ప్రచార కార్యక్రమాలు యిస్తున్నారు.

2002 సం॥లో రూ. 15 లక్షల వ్యయంతో 'యోగశాల' నిర్మాణం జరిగింది. ఈ కేంద్రం తరపున "యోగ సౌరభం" మాసపత్రిక ప్రచురితమవుతున్నది. 2004 సం॥లో వివేకానంద విద్యాలయం పేరిట ఒక పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థులకు సాధారణ విద్యతో పాటు యోగ కూడా నేర్పిస్తున్నారు. ఈ పాఠశాల కమిటీకి గౌరవాధ్యక్షులుగా శ్రీ మురికిపూడి

మాధవరావు సేవలందిస్తున్నారు. శ్రీ దామర్ల నాగేశ్వరరావు ప్రిన్సిపాల్‌గా పాఠశాల నిర్వాహణ బాధ్యతలు చేపట్టారు. వికలాంగుల సేవ-సమాచార కేంద్రం శ్రీ వేమూరి బాబూరావుచే నిర్వహించబడుతున్నది. శ్రీ వెంకటేశ్వర యోగ సేవాకేంద్రం విస్తరణలో శ్రీ కొల్లి నాగేశ్వరరావు విశిష్ఠ పాత్ర వహిస్తున్నారు.

## శ్రీ పడమట రాధాకృష్ణయోగి

శ్రీ పడమట రాధాకృష్ణ మంగళగిరికి చెందినవారు. వారు 2000 సం॥లో యోగశిక్షణ రంగంలోకి అడుగుపెట్టారు. వారి నేతృత్వంలో "రాధాకృష్ణ యోగ సేవా కేంద్రం" మంగళగిరి కేంద్రంగా పనిచేస్తూ, జిల్లాలో యోగసాధన గురించి ప్రచారం చేస్తోంది.

గుంటూరు జిల్లాలోని తాడికొండ, సత్తెనపల్లి, మంగళగిరి మండలాల పరిధిలోగల గ్రామాలలో యోగశిక్షణ శిబిరాలను నిర్వహించారు. వీరు నిర్వహించిన శిబిరాల ద్వారా వందలాది ప్రజలు యోగ శిక్షణ పొందారు.

జిల్లా కేంద్రంలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు మరి యితర సిబ్బందికి యోగ శిక్షణ నిచ్చారు. మంగళగిరి సబ్-జైలులో ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు.

శ్రీ రాధాకృష్ణయోగి ఉచితంగా యోగ శిక్షణనందిస్తూ, సామాజిక సేవలో పాలు పంచుకుంటున్నారు. ✵

## త్వరలో ప్రచురణ

**"బాలల మన మంగళగిరి"** పుస్తకమును ప్రచురించి సరళంగాను, క్లుప్తంగాను మంగళగిరి చరిత్ర-సంస్కృతిని విద్యార్థులకు పరిచయం చేయదలిచాము.

ఈ పుస్తకమును విద్యార్థులకు ఉచితంగా పంపిణీజేయు ఆలోచన చేస్తున్నాం. ప్రచురణకు సహాయము చేయదలచిన వ్యక్తులు / సంస్థలు సంప్రదించదగలరు.

– పట్టణ వికాస మండలి, మంగళగిరి

# మతం


మంగళగిరి ప్రాంతం భిన్న మతాలకు వేదికగా కొనసాగుతోంది. వివిధ మత సంస్కృతులను క్లుప్తంగా ప్రస్తావిస్తున్నాను

## బౌద్ధం



ఈ ప్రాంతంలో క్రీస్తు పూర్వం 400 సం॥ నుండి కీ॥శ॥ 600 వరకు బౌద్ధ మతం వర్ధిల్లినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. [1]ఇక్కడకు దగ్గరలోని నిడమర్రు గ్రామంలో 1880 సం॥లో నాలుగు బుద్ధ విగ్రహాలు బయటపడినాయి. అమరావతి యీ ప్రాంతంలోని ముఖ్య బౌద్ధ క్షేత్రం. శ్రీ రేఖా కృష్ణార్జనరావు యీ ప్రాంతంలో బౌద్ధ సంఘం నిర్వహిస్తున్నారు.

## జైనం



విజయవాడలో 'నడుంచి వాసడి' అనే ముఖ్య జైనపీఠం కీ॥శ॥ 624లో స్థాపించబడింది. ఇక్కడకు దగ్గరలో "హ్రీంకార తీర్థ్" అనే పెద్ద జైన దేవాలయం సుమారు రూ. 10 కోట్ల ఖర్చుతో నిర్మితమై, యాత్రీకులను ఆకర్షిస్తోంది.

# ఇస్లాం

[2]ముస్లిం రాజుల పాలనలో ఇస్లాం మతం యిక్కడ వ్రేళ్లూనుకుంది. 1881 జనభా లెక్కల నాటికి మంగళగిరిలో 448 మంది వుండగా, యీ నాటికి ముస్లిం జనాభా 10 వేలకు పైగా వుంది.

ఈ ప్రాంత ముస్లింలు చిన్న చిన్న వృత్తులలో వుండి, ఆర్థికంగా వెనుకబడి వున్నారు. ఈ మధ్య కాలంలో ఎక్కువ మంది విద్యనభ్యసిస్తున్నారు. సాంఘికంగా ఎటువంటి ఘర్షణలకు తావివ్వకుండా అన్ని వర్గాలతోను వీరు కలివిడిగా వుంటారు.

వీరు రాజకీయంగా అన్ని పార్టీలలోను ప్రాతినిధ్యం కలిగి వుండి వివిధ పదవులు చేబడుతున్నారు. పంచాయతి కాలంలో శ్రీ మహబూబ్ ఖాన్ ఉపాధ్యక్షునిగాను, శ్రీ షేక్ ఖాజా సభ్యునిగాను వున్నారు.

మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రతిసారి యిద్దరు, ముగ్గురు ముస్లింలు కౌన్సిలర్లుగా ప్రాతినిధ్యం పొందు తున్నారు. శ్రీ షేక్ అహ్మదాలి. శ్రీ మహబూబ్ బేగ్, శ్రీ షేక్ సలీం వైస్-ఛైర్మన్లుగా పదవులు నిర్వహించారు. జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుని పదవిని శ్రీ యం.డి. ఇబ్రహీం నిర్వహించారు. పట్టణ ఎన్నికలలో ముస్లింలు తమదైన ప్రభావాన్ని చూపుతుంటారు.

## మసీదులు



పాత మంగళగిరి 'మక్కా మశీదు', శాసనస్థంబం వీధిలోని 'షాహిమశీదు' ఎంతో ప్రాచీనమై, రాజుల కాలంలో నిర్మించబడినవిగా చెప్పబడుతోంది. పాత బస్టాండు వద్ద 'జామియా మశీదు', ఈద్గా వద్ద 'ఈద్గా' మసీదుతోబాటు రత్నాల చెరువు, బాపనయ్య నగర్‌లలో కూడా మసీదులున్నాయి.

## జామియా మసీదు

పాత బస్టాండు వద్దగల జామియా మశీదు సుమారు 120 సం॥ క్రిందట తాటాకు పాకలో ప్రారంభమై యీనాటికి రెండు అంతస్థులతో, 75 అడుగుల

# క్రైస్తవం

గుంటూరు లూథరన్ మిషనుకు చెందిన 'అనాయన్ కుగ్లర్' మంగళగిరిలో 1883లో గరల్సు స్కూలును, జిల్లాలోనే మొట్టమొదటి మెడికల్ డిస్పెన్సరిని 1885-87ల ప్రాంతంలో ప్రారంభించి విద్య, ఆరోగ్య సేవలందించారు. సాల్వేషన్ ఆర్మి మిషనరి వారు సీతానగరం క్రిమినల్ సెటిల్మెంటులోని ప్రజలకు 1913 నుండి 20 ఏళ్ళపాటు సేవలు చేశారు. ఈ ప్రాంతంలో కరువు కాటకాలు సంభవించినపుడు క్రైస్తవ మిషనరీలు పేదలను ఆదుకున్నారు.

1881 జనాభా లెక్కల ప్రకారం మంగళగిరిలో క్రైస్తవులు లేరు[3]. కాని వివిధ క్రైస్తవ మిషనరీలు అందించిన సేవలకు ప్రభావితులై, యిప్పటికి యీ పట్టణంలో 10 వేలకు పైగా క్రైస్తవ మత విశ్వాసపరులు ఉన్నారు. ఈ ప్రాంత క్రైస్తవులు ఎక్కువ మంది దళిత వర్గాలకు చెందివుండటంతో వారిని దళితులు - క్రైస్తవులుగా విడదీసి చూడటం కష్టం.

ఈ ప్రాంతంలో వివిధ క్రైస్తవ సంస్థల ఆధ్వర్యంలో తరచుగా ప్రార్థన కూటములు జరుగు తుంటాయి. చర్చిలలో ప్రజలు ఆదివారం ప్రార్థనలలో విరివిగా పాల్గొంటారు. ఈస్టర్, క్రిస్టమస్, గుడ్‌ఫ్రైడే పర్వదినాలలో అన్ని మతస్థులను కలుపుకొంటూ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఇతర మతస్థులతో ఘర్షణ లేకుండా, శాంతియుతంగా వుంటారు.

## [4]క్రైస్తవుడైన మొదటి బ్రాహ్మణుడు మంగళగిరి నివాసియే

**మంగళగిరికి చెందిన "మంగళగిరి ఆనందరాయరు" నియోగి బ్రాహ్మణ కులస్థుడు. ఆత్రేయగోత్రుడు, తిమ్మయామాత్యుని కుమారుడు. భారతదేశంలో లండన్ మిషనరీ సొసైటీ ద్వారా 1760 ప్రాంతంలో క్రైస్తవ మతం తీసికొనిన మొదటి బ్రాహ్మణునిగా యితను చరిత్రకెక్కారు. 'వేదాంత రసాయనము' అను ఏసుక్రీస్తు చరిత్ర ప్రబంధాన్ని రచించి మంగళగిరి ఆనందకవిగా పేరొందారు.**

మినార్‌తో,15 వందల మంది ప్రార్థన చేసుకోగలిగే సౌకర్యంతో వుంది. పట్టణంలోని అందమైన కట్టడాలలో ఒకటిగా రూ. 8 లక్షల ఖర్చుతో తీర్చిదిద్దబడింది. ఈ అభివృద్ధికి శ్రీ జలీల్, శ్రీ యిగ్బాల్ ఎంతో శ్రమించినట్లు తెలుస్తున్నది.

## ఈద్గా

రంజాన్, బక్రీదు పర్వదినాలలో వేలాది మంది ముస్లింలు నమాజు చేసుకొనే 'ఈద్గా' 1872లో నిర్మితమైనట్లు తెలుస్తోంది. యస్.యం.యూసూబ్ సాహెబ్ గారి కుటుంబ సభ్యుల సహకారంతో యీనాటికి 76 సెంట్ల స్థలంగా విస్తరించి, మరింత సౌకర్యవంతమైంది.

## అంజుమన్

ముస్లింల మత సంస్థల నిర్వహణను, సేవా కార్యక్రమాలను "అంజుమన్-యి-హిమాయతుల్ యిస్లాం" నిర్వహిస్తుంటుంది. 1958 వరకు శ్రీ యస్.యం. యూసుబ్ సాహెబ్ మొదలగు పెద్దలచే యీ కార్యక్రమాలు నిర్వహించబడేవి. 1958లో యీ అంజుమన్ సంస్థ ప్రారంభమైనా, 1976 నుండి మాత్రమే నిర్మాణాత్మకంగా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నట్లు తెలుస్తోంది. అప్పటినుండి యిప్పటి వరకు 10 కార్యవర్గాలచే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టబడి, సంస్థకు ఆదాయ వనరులు పెరగి, మసీదులు అభివృద్ధి చెందాయి. వీరి ఆదాయంలో సగభాగం వివిధ సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తూ, పేద ముస్లింల అభివృద్ధికి చేయూత నిస్తున్నారు.

అంజుమన్ సంస్థకు వివిధ కాలల్లో శ్రీయుతులు యస్.ఏ. జలీల్, యం.డి. ఇగ్బాల్, యం.డి. ఇబ్రహీం, యస్.ఏ. రహీం, అబ్దుల్ జబ్బార్, షేక్ ఖాజా, అలీ భాషా ఖాన్, రన్ హుశ్మేన్, సయ్యద్ మహబూబ్ జాని, షేక్ భాషు, షేక్ ఖాజా, రాజా హుస్సేన్, ఆలిజాని ఖాన్, షేక్ మౌలాలి, షేక్ హసన్ అహ్మద్ అధ్యక్ష, కార్యదర్శుల హోదాలలో సంస్థ అభివృద్ధికి తోడ్పడినారు.

పాతతరం ముస్లిం పెద్దలలో శ్రీయుతులు షెహర్ మహమ్మద్ సాహెబ్, యస్.యం. యూసుబ్ సాహెబ్, మహబూబ్ బేగ్, మీరా సాహెబ్, ఖాదర్ బేగ్, జె.యం. ఇబ్రహీం, యం.ఏ. అజీజ్ సాహెబ్, యూసూబ్ బేగ్ మొ॥వారు కొందరు. సీనియర్ న్యాయవాది శ్రీ బషీర్ అహమ్మద్ నేటి ముస్లిం పెద్దలలో ఒకరు.

## చర్చిలు

పాత మంగళగిరిలో లూథరన్ చర్చి 1943లో ప్రారంభమైన పురాతన చర్చి. బాప్టిస్టు చర్చి 1976లో ప్రారంభమైంది.

రోమన్ కేథలిక్ మిషనుకు సంబంధించిన - పార్కురోడ్డులోని చర్చి 1950 దశకంలో ప్రారంభమై, 2002లో అభివృద్ధి చెందింది. ఇందు పాఠశాల నిరంతరంగా కొన సాగుతూ వస్తోంది. పాత మంగళగిరి ఆర్.సి.యం. చర్చి 1979లో ప్రారంభమైంది. నిర్మల విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఒక చర్చి నిర్వహించబడుతోంది.

## లూథరన్ టౌన్ చర్చి



మశీదు వీధిలోని పెంకుటింట్లో 'ఆడపిల్లల బడి' నడుపబడుచూ ఆదివారం ప్రార్థనలకుపయోగబడేది. శ్రీ జొన్నకూటి దయా మేస్టారు యీ సంస్థకు విశేష సేవలు చేశారు. దీనిని 1987లో విశాలమైన భవనంలో "సెయింట్ పాల్ లూథరన్ చర్చి'గా ప్రారంభించారు. 1996లో నిర్మించబడిన ఎత్తైన టవరు యీ చర్చిని పట్టణంలోని సుందరమైన కట్టడములలో నొకటిగా మార్చింది.

## గుడ్‌షెపర్డ్ సిస్టర్సు

రోమన్ కేథలిక్ మిషన్ వారి "గుడ్ షెఫర్డ్ సిస్టర్స్" సంస్థ ఐ.యల్.టి.డి. కంపెనీ ప్రక్కన 1965లో ప్రారంభమైంది.

1967-75ల మధ్య యీ ప్రాంతపు మొట్టమొదటి ఇంగ్లీషు మీడియం స్కూలును నడిపిన చరిత్ర వీరికి వుంది. 1975 నుండి పీడిత ప్రజలకు చేయూతనిస్తూ, "ఆడవాళ్ళ హక్కుల సంఘం" నిర్వహిస్తూ, ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారు.

జె.యం.జె. సంస్థ వారి ప్రావిన్షలేటు 'స్నేహాలయ' పేరున క్రొత్త బ్యాంకు కాలని ప్రక్కన విశాలమైన ప్రాంగణంలో ఒక సంస్థ నెలకొల్పారు.

## పాతతరం పెద్దలు

పాతతరం క్రైస్తవ పెద్దలలో రెవరెండ్ కొలికపూడి సైమన్, మాతంగీ జార్జి, రెవరెండ్ మోపర్తి సామ్యూల్‌రాజు, రెవరెండ్ రాయదేవసహాయం, రెవరెండ్ కిన్ సింగర్, బ్రదర్ బి. క్రిష్టఫర్, బ్రదర్ నెహమ్యా, గాజులవర్తి జక్రయ్య, చిలకా ఆశీర్వాదం, రెవరెండో జోసఫ్

గారలు చెప్పుకోదగిన కొందరు.

## రెవరెండ్ డా॥ చిలకా ఆశీర్వాదం




మంగళగిరి చింతక్రింది కనకయ్య విద్యాసంస్థలలో ఉపాధ్యాయునిగా సేవలందించి శ్రీ ఆశీర్వాదం పదవీవిరమణ చేసి యున్నారు. ఎన్నో దశాబ్దాలుగా సువార్తను వీరు ప్రచారం చేస్తున్నారు. వీరు ఆస్ట్రేలియాలోని బైబిల్ కాలేజి నుండి "డాక్టర్ ఆఫ్ డివినిటి'' పట్టాను పొందినారు. మంగళగిరిలో క్రైస్తవులలో బైబిల్‌లో డాక్టరేట్ పొందిన ఘనత శ్రీ ఆశీర్వాదం గారికే దక్కింది.

## పాస్టర్స్ అసోసియేషన్

మంగళగిరి నియోజకవర్గ పాస్టర్ల సంఘం 150 మంది పోస్టర్లను సభ్యులుగా కలిగివుండి, రెండేళ్ళుగా యీ ప్రాంతంలో సేవలందిస్తున్నది. ప్రస్తుతం రెవరెండ్ కె. రవికుమార్ అధ్యక్షులుగాను, పాస్టర్ పి. తిమోతి ప్రధాన కార్యదర్శిగానుబాధ్యతలు వహిస్తున్న యీ సంఘం సామాజిక సేవా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తోంది.

# హిందూమతం



మంగళగిరి ఎన్నో శతాబ్దాలుగా పేరొందిన పుణ్యక్షేతం. ఈ క్షేత్ర పాలకుడు ఆంజనేయ స్వామి. గ్రామ దేవత పోలేరమ్మ. ఇక్కడి ప్రజలలో ఎక్కువమంది హిందువులు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, పానకాలస్వామి దేవాలయాలే కాకుండా ఎన్నో యితర

దేవాలయాలు వున్నాయి.

## శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం

మంగళగిరి పట్టణములోని పురాతన దేవాలయములలో యిది ఒకటి. ఈ దేవాలయం శిధిలం కాగా, పునర్నిర్మించేందుకై 1984 సం॥లో పూర్తిగా నేలమట్టం చేయబడి గుంటూరుకు చెందిన గడియారం సావిత్రమ్మగారి రూ. 10లక్షల విరాళంతో ముఖమంటపం, ధ్వజస్థంభం మొ॥నవి నిర్మితమయ్యాయి. 2004 సం॥ జూన్ నెలలో ప్రారంభం జరిగింది.

## శ్రీ గంగా భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయం

శివాలయముగా పిలువబడే యీ దేవాలయం పురాతనమైనది[5]. ఈ దేవాలయ ప్రస్తావన కనుపర్తి అబ్బయామాత్యుడు రచించి శ్రీ నరసింహస్వామికి అంకితమిచ్చిన "అనిరుద్ధ చరిత్రము"లో ప్రస్తావించబడినది. మాఘమాసంలో సప్తమి నుండి అమావాస్య వరకు ఈ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. 1918లో శ్రీ సకలా వీరయ్య పాకయాజి, పున్నమ్మగారలు ఈ ఆలయ ద్వారాన్ని పునరుద్ధరించారు.

## శ్రీ సీతారామస్వామి కోవెల

పాతమంగళగిరిలో ఆంజనేయస్వామిని అగస్త్య మహర్షి ప్రతిష్ఠించారని ప్రతీతి. శంఖుచక్రాలుగల ఆంజనేయస్వామి విగ్రహం యిక్కడ చూడవచ్చు. సీతారామస్వామి కోవెల ప్రాంగణంలో యీ విగ్రహం వుంది.

శ్రీ నంబూరు కేశవయ్య సీతారామస్వామి కోవెల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీమతి నంబూరు పద్మావతమ్మ సుమారు 7 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించి 29-6-2002న విగ్రహాల పునః ప్రతిష్ఠ చేయించారు. ఈ గుడిలో శ్రీరామనవమి వేడకలు ఘనంగా జరుగుతాయి.



దసరా, సంక్రాంతి పర్వదినాలలో నిర్వహించే పారువేట (గిరి ప్రదక్షిణం) ఉత్సవంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామితోపాటు శ్రీ సీతారామస్వామి వారు కూడా పాల్గొంటారు.

## శ్రీ భావనారుషి స్వామివారు

మంగళగిరి హిందూ మతస్తులలో ఎక్కువ మంది పద్మసాలి కులస్థులు. వీరి వంశమూల పురుషుడైన శ్రీ భావనారుషిని యిక్కడ విశేషంగా పూజిస్తారు. పాత మంగళగిరిలో శ్రీ భావనారుషి స్వామి వారి దేవాలయాలు వున్నాయి. ప్రతి సంవత్సరం మాఘమాసం (ఫిబ్రవరి) లో భావనారుషి కళ్యాణ ఉత్సవాన్ని పట్టణంలో వైభవంగా జరుపుతారు. ✵

### 108 దివ్య తిరుపతులలో మంగళగిరి లేదా?

భారత దేశంలో ప్రసిద్ధి చెందిన వైష్ణవ క్షేత్రములు 108 ఉన్నాయి. వాటిని 'దివ్య తిరుపతులు' అని పిలుస్తారు. ఇవి సామాన్యముగ వైష్ణవమతస్థులందరకును ముఖ్యముగ రామానుజీయ మతస్థులకు దివ్య క్షేత్రములై యున్నవి. చాలా సందర్భాల్లో మంగళగిరి దివ్య తిరుపతులలో ఒకటిగా స్థానం పొందింది. [6] కవి కనుపర్తి అబ్బయామాత్యుడు మంగళగిరి నరసింహ స్వామికి అంకితమిచ్చిన [1]'అనిరుద్ధ చరిత్రము' కావ్యంలో కూడా మంగళగిరి దివ్య తిరుపతులలో ఒకటని చెప్పబడి ఉంది. అలాగే దేవస్థానములోని శాసనము 35వ లైనులో కూడ మంగళగిరి దివ్య తిరుపతి అని వ్రాయబడినది. కాని ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థ ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ వారు ప్రచురించిన 'శాసన పద కోశం' లోని 108 దివ్య తిరుపతుల పేర్లలో మంగళగిరి క్షేత్రం లేదు. తిరుపతిలోని తిరుమల తిరుపతి దేవస్థాన పురావస్తు ప్రదర్శనశాలలో 108 దివ్య తిరుపతుల ఛాయాచిత్రాలు, వివరాలు వుంచారు. ఆ పేర్లలో మంగళగిరి లేదు. దీనిని బట్టి మంగళగిరి దివ్య తిరుపతులలో ఒకటి కాదని తెలియవస్తోంది.

1. Page 367, - A Manual of the Kistna District in the Presidency of Madras(1883.) - Gordon Mackenzie; Asian Educational Services (1990), Madras

2 & 3 - Page No. 380 ----Do------

4 – Page No. 65, Printing in India, Dr. J. Mangamma & తెలుగులో అచ్చయిన తొలిపుస్తకాలు(1746–1856),డా॥ జోళపాలెం మంగమ్మ,పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం

6 – అనిరుద్ధ చరిత్రము, ఎమెస్కో ప్రచురణ సంప్రదాయసాహితి–21, పేజి నెం. 65–66

# నాస్తికోద్యమం

మంగళగిరి ప్రసిద్ధ వైష్ణవ పుణ్య క్షేత్రం మాత్రమేగాక నాస్తిక ఉద్యమానికి కేంద్ర బిందువు కూడ! 1975వ సంవత్సరంలో శ్రీ బొడ్డు రామకృష్ణగారు తాడికొండ సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేసి మంగళగిరి చేరుకున్నారు. నిడమర్రు రోడ్డులోని బాపూజీ నగర్ వద్ద "ప్రగతి విద్యావనం" అనే రెసిడెన్షియల్ పాఠశాల ప్రారంభించారు. దీంతో లోకాయుత భౌతిక వాద ప్రచారానికి శ్రీకారం జరిగింది.

వీరి ప్రచారం నచ్చనివారు 1977వ సంవత్సరంలో ఆ పాఠశాలను దగ్ధం చేశారు. అయితే శ్రీ రామకృష్ణ దానిని పునర్నిర్మించారు. 1977 నవంబరు 17న వచ్చిన పెనుతుఫానుకు స్కూలు మొత్తం నేల మట్టమై, యిద్దరు విద్యార్థులు, యిద్దరు ఉపాధ్యాయులు దుర్మరణం చెందటం ఒక విషాద ఘట్టం. శ్రీరామకృష్ణ ఆ పరిస్థితి నుండి తేరుకొని - మంగళగిరి రైల్వేస్టేషన్‌కు దగ్గర గల ప్యారీ కంపెనీ క్వార్టర్సులోనికి మకాము మార్చి, "చార్వాక విద్యాపీఠం" అనే పేరుతో పాఠశాలను కొనసాగించారు. పట్టువదలని భౌతికవాద విరోధులు ఇక్కడ కూడా పాఠశాల పాకలను తగులబెట్టి ఆస్తినష్టం కలిగించారు. సరైన వసతులు, వనరులు లేక పోయినా ఎన్నో ఒడుదుడుకులతో చార్వాక కేంద్రంలో నాస్తిక భావప్రచారాన్ని, భౌతికవాద పునాదితో విద్యాబోధనను కొనసాగించారు. 1987లో నిడమర్రు రోడ్డులోని బేతపూడి గ్రామ పరిధిలో రెండు ఎకరాల విశాల ప్రాంగణంలోకి చార్వాక విద్యా పీఠాన్ని మార్చారు.



తెలుగు మాధ్యమంగా దేశీయ విద్యను ప్రోత్సహించడం, మత అంశాలకు చోటు లేకుండా భాష, చరిత్ర విషయాలను బోధించటం, అంతేగాకుండా మత చాందస వాదము జోలికి పోకుండా, విద్యార్థులను భౌతిక వాద దృక్పథం గల భావి భారత పౌరులుగా తీర్చిదిద్దటం, సమసమాజ నిర్మాణం జరిగేలా చూడటం వంటివి వీరి ముఖ్య ఉద్దేశాలు.

ఈ విద్యాకేంద్రం వారు ప్రత్యామ్నాయ విద్యావిధానం క్రింద సిలబస్ తయారుచేసి, 9వ తరగతి వరకు తెలుగు మీడియం పుస్తకాలను ప్రచురించారు. విద్యార్థులు ఇవ్వకలిగినంత సొమ్ము తీసుకొని అభిమానుల సహాయ సహకారాలతో యీ రెసిడెన్షియల్ పాఠశాల నడుపుతున్నారు.

వివిధ సందర్భాలలో, వివిధ విషయాలపై బహిరంగ సభలు, గోష్ఠులు, నిర్వహించారు. 1992వ సంవత్సరం నుండి క్రమం తప్పకుండా ప్రతి ఫిబ్రవరిలో "నాస్తిక మేళా" నిర్వహిస్తున్నారు. ప్రతి సంవత్సరం మే నెలలో 10 రోజులపాటు తాత్విక శిక్షణా తరగతులు ఏర్పాటుచేస్తున్నారు. కులాంతర, మతాంతర వివాహాలు వందల సంఖ్యలో యిక్కడ జరిగాయి. 1977 నుండి 'లోకాయుత' ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ఈ ఉద్యమ సాహిత్యాన్ని ముద్రిస్తున్నారు.

చార్వాక ఆశ్రమంలో అందరినీ ఆకర్షించేలా వేమన, సామినేని ముద్దు నరసింహం, త్రిపురనేని రామస్వామి, జ్యోతిరావు ఫూలే, సావిత్రీబాయి ఫూలే, అంబేద్కర్, పెరియార్ రామస్వామి, గౌతమ బుద్ధుడు మొదలగు వారి విగ్రహాలు వున్నాయి.

ఈ చార్వాక ఆశ్రమం దేశంలో నాస్తిక ఉద్యమ నిర్వహణ కేంద్రాలలో ప్రముఖ మైనదిగా చెప్పవచ్చు. ఎన్నో ప్రజా ఉద్యమాలు నీరుగారి పోతున్నా, సాంఘిక ఉద్యమాలు ప్రజాదరణ కొరవడి నిస్తేజంగా మారుతున్నప్పటికి - యీ ఆశ్రమం ఎప్పటికప్పుడు తన ఉనికిని నిలుపుకుంటూ తన కార్యక్రమాలను కొనసాగించగలగటం గొప్ప విషయమే.



ఈ చార్వాక విద్యాపీఠానికి సృష్టికర్త, లయకర్త అయిన శ్రీ రామకృష్ణ తన జీవితాన్ని, శక్తియుక్తుల్ని మనసా, వాచా యీ ఉద్యమానికి ధారపోస్తున్నారు. వారేగాక వారి భార్య శ్రీమతి గృహలక్ష్మి, వారి కుమారులు శ్రీ సుధాకర్, శ్రీ చార్వాక కూడా పూర్తి కాలపు సేవలందిస్తున్నారు.

## డా॥ ఏ.టి. కొవూర్ పర్యటన

1977వ సంవత్సరంలో శ్రీలంకకు చెందిన డా॥ కొవూర్, తమిళనాడుకు చెందిన డా॥ స్వామినాథన్‌లు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలలో పర్యటించి భౌతికవాద ప్రచారం, మూఢనమ్మకాలపై ప్రదర్శనలు యిచ్చి యీ ఉద్యమం రాష్ట్రంలో విశేష ఆదరణ పొందేలా చేశారు. మంగళగిరిలో నాస్తిక మహాసభను నిర్వహించారు.

ఆ సమయంలో మంగళగిరిలో రావూరి రామకోటయ్య గారి పొగాకు కంపెనీ ఆవరణలో బహిరంగసభ జరిగింది. ఆ సభలో డా॥ కొవ్వూర్ ఉపన్యాసం ప్రజల్ని ఉత్తేజ పర్చింది. డా॥ స్వామినాథన్ – సమాజంలో మతం పేరిట మూఢనమ్మకాల ప్రచారం గురించి, జరిగే మోసపు చర్యలను గురించి ప్రజలకు వివరించారు. అరచేతిలో "విభూది"ని, కడుపులో నుండి లింగాకృతిని అందరి ముందు బయటకు తీశారు. ఆ సభ విజయవంతం కావటంతో యీ ప్రాంతంలో నాస్తిక ఉద్యమం ఊపందుకున్నది.

## నాస్తిక మహాసభలు

1979వ సంవత్సరంలో నాస్తిక మహాసభలు మంగళగిరిలో ప్రస్తుత గరల్స్ హైస్కూలు ఆవరణలో జరిగాయి. మూడు రోజులు జరిగిన ఆ మహాసభలు యీ ప్రాంతంలో ఎందరో యువకుల్ని యీ వాదం వైపు నడిపించాయి. మత చాంధసవాదులు యీ పరిణామాన్ని ప్రతిఘటించారు. చివరి రోజున కొందరు హిందూ మతాభిమానులు నాస్తిక వాదాన్ని చీల్చి చెండాడి, మతవాదం గొప్పతనాన్ని నిలబెట్టే ఉద్దేశ్యంతో చర్చకు సవాళ్ళు చేయటం జరిగింది. అందుకు నిర్వాహకులు అంగీకరించారు. హిందూ మతాభిమానులు "శ్రీ ప్రమోద చైతన్య స్వామి" వారిని తమ ప్రతినిధిగా చర్చలో నిలిపారు.

ఆ చర్చలో హేతువాద ఉద్యమ పటుత్వంతో ఆ స్వామివారు ఏకీభవించారు. దీంతో ఆగ్రహించిన హిందువులు తమ ప్రతినిధి అయిన స్వామీజీపై తిరుగుబాటు చేశారు. ఎట్టకేలకు మహాసభ నిర్వాహకులే ఆయనకు అవమానం జరగకుండా కాపాడారు. ఆనాటి సంఘటన యీ ప్రాంతంలో హేతువాద ఉద్యమ ప్రచారానికి విశేషంగా తోడ్పడిందని చెప్పాలి. ❋


# పర్యాటక సమాచార కేంద్రం

పట్టణాన్ని సందర్శించే యాత్రికులకు యీ పట్టణ ప్రాముఖ్యతను వివరించుటే కాకుండా, స్థానిక చేనేత ఉత్పత్తులను పరిచయం చేయదలిచాము. ఈ సమాచార కేంద్ర స్థాపనకు, నిర్వహణకు సహాయ సహకారములు అందించదలచిన వ్యక్తులు, సంస్థలు సంప్రదించగలరు

– పట్టణ వికాస మండలి, మంగళగిరి

# దళితులు

మన రాష్ట్రంలో, ముఖ్యంగా యీ జిల్లాలో దళితులు ఆత్మగౌరవంతో తలెత్తుకు తిరిగే ప్రాంతాల్లో మంగళగిరిని ముఖ్యంగా చెప్పవచ్చు. ఈ ప్రాంత దళితుల పరిస్థితి చాల మెరుగ్గా కన్పిస్తుంది. వామపక్షాల ఉద్యమాల స్ఫూర్తివల్లగాని, విద్యా సౌకర్యాలవల్లగాని, రాజకీయ చైతన్యంవలనగాని, యీ ప్రాంతంలో దళితులు వివిధ రంగాలలో రాణింపు పొందారు.

స్వాతంత్ర్యానికి ముందే మంగళగిరిలో విద్యావకాశాలు మెరుగ్గా వుండటంతో అన్ని వర్గాలతోపాటుగా దళితులు సైతం విద్యాధికులయ్యారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, వ్యాపార, వాణిజ్య పారిశ్రామిక తదితర రంగాలలో దళితులకు ప్రాతినిధ్యం వుంది.

విద్యతో ఉన్నత సివిల్ సర్వీసు స్థాయికెదిగిన వ్యక్తిగా బాప్టిస్టు పేటకు చెందిన శ్రీ బుల్లా సుబ్బారావు వున్నారు. ఇంకా మరెందరో విద్యావేత్తలుగాను, ప్రభుత్వ ఉన్నతోద్యోగాల్లోను, యిక్కడి దళితులు ఎదిగారు. మరి కొందరు విదేశాలలో ఉన్నత పదవులలో స్థిరపడినారు.

పట్టణంలోని రాజకీయ రంగాన్ని ప్రభావితం చేయగల సంఖ్యలో దళితులున్నారు. మున్సిపల్ 25,27,28 వార్డులు దళితులకు ప్రత్యేకంగా కేటాయించబడివున్నాయి. 12, 19, 26 వార్డులలో కూడా దళితులు ఎక్కువ మంది వున్నారు.

రాజకీయ, అధికార రంగాల ప్రస్తావనకొస్తే - 35 సం॥ల క్రితమే మంగళగిరి గ్రామ మొదటి పౌరునిగా (పంచాయతి అధ్యక్షులు) శ్రీ బుల్లా శ్రీనివాసరావు గౌరవాన్ని పొందారు. అదే కాలంలో శ్రీ బుల్లా బుచ్చయ్య పంచాయతీ సభ్యునిగాను, వ్యాపారవేత్తగా రాణించారు. శ్రీ కొంకా వెంకటరత్నం కూడా పంచాయతి సభ్యుని పదవినలంకరించారు.

దశాబ్దాలుగా దళిత చైతన్యం యిక్కడ వెల్లివిరుస్తుండగా మరెందరో విద్యావంతులవుతూ, ఉద్యోగాలలోను, వృత్తులలోను విజయాల్ని సాధిస్తున్నారు. మంగళగిరి బార్ అసోసియేషన్‌లో నమోదైన న్యాయవాదులలో ఎక్కువ మంది దళితులవటం యీ ప్రాంత దళితుల ప్రగతికి మరో సూచికగా పేర్కొనవచ్చు.

## ఉద్యమాలు

మంగళగిరి ప్రాంతంలో సమస్యలపై దళితులు స్పందించే తీరు కూడ తీవ్రంగా వుంటుంది. స్థానిక సమస్యలపైనే కాకుండా యితర ప్రాంతాల దళితుల సమస్యలపై కూడ యిక్కడివారు ఉద్యమిస్తుంటారు.

### నీరుకొండ ఘటన

మంగళగిరి మండలం "నీరుకొండ" గ్రామంలో దళితులపై జరిగిన దాడి రాష్ట్రాన్ని కుదిపేసింది. ఆనాటికి అధికారంలో వుండిన తెలుగుదేశం పార్టీ నాయకులపై ఆరోపణలు వచ్చాయి. దాంతో ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావు, ప్రధాని రాజీవ్ గాంధి యీ ప్రాంతాన్ని దర్శించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆ ఘటనల వల్ల ఏర్పడిన "నీరుకొండ శిబిరం" పట్టణ 27వ వార్డులో భాగమైంది.

1978లో "కారంచేడు"లో దళితులపై జరిగిన హత్యాకాండ యిక్కడి దళితులలో చైతన్యం రగిలిస్తే నీరుకొండ ఘటన ఉద్యమ స్ఫూర్తిని పెంచింది. అనంతరం 1991 సం॥పు "చుండూరు" ఘటనతో దళిత ఉద్యమం యిక్కడ పాదుకున్నది.

దళిత నాయకులు శ్రీయుతులు శెట్టి కన్నమరాజా, కత్తి పద్మారావు, డా॥ చంద్రన్, కోనాడ సూర్యప్రకాశరావు, ఘంటా అరుణకుమార్, వామనదాసు, గోగతోటి లాజరస్, వై.కే., కె.జి. సత్యమూర్తి, గద్దర్ వంటి ప్రముఖులు యిక్కడకు వచ్చి స్థానిక దళితులలో ఆత్మస్థైర్యాన్ని పెంచారు. 'కంచికచర్ల' దళిత యువకుడు "కోటేసు" ఘటన నుండి యీనాటి వరకు జరిగిన వివిధ ఉద్యమాల ఫలితంగా యీ ప్రాంతంలో అనేక మంది దళితనాయకులు ఉద్భవించారు. శ్రీయుతులు రేమళ్ళ చిట్టిబాబు, కలకోటి సాంబయ్య, కోట లక్ష్మయ్య, పిల్లి గోపాలరావు, కంచర్ల ప్రకాశరావు, గుజ్జర్లపూడి జాన్‌బాబు, ప్రత్తిపాటి మల్లేశ్వరరావు, దిడ్ల సత్యానందం, ఏ.వై. ప్రభుదాస్, బుల్లా రాజారావు, పోలుమట్ల ప్రేంకుమార్, వెలగాపాటి విలియం, "ఆర్టీసీ" పుల్లారావు, 'టెలిఫోన్' రాజారావు, బి.సి.హెచ్. కేశవులు, ఆనంద విజయకుమార్ తదితరులు వారిలో కొందరు.

## శ్రీ పిల్లి గోపాలరావు

1965 ప్రాంతాల్లో డబుల్ ఎం.ఏ. డిగ్రీలు పొందిన విద్యాధికులైన శ్రీ పిల్లి గోపాలరావు జిల్లాస్థాయి, ప్రభుత్వ ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేశారు. దళితులను ప్రభావితం చేశారు. ప్రైవేటుగా విద్యనందిస్తూ, రాజకీయ రంగ ప్రవేశం చేసి మున్సిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై ప్రజా సమస్యలపైన పోరాడారు.

## శ్రీ జి.యం.యన్.వి. ప్రసాద్

మంగళగిరి పట్టణానికి చెందిన శ్రీ జి.యం.యస్.వి. ప్రసాద్ వామపక్ష ఉద్యమాలలో ప్రముఖ వ్యక్తిగా ఎదిగారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మిక సంఘంలో రాష్ట్రస్థాయి పదవులు నిర్వహించారు. అనంతరం 1994లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో మంగళగిరి ప్రక్కనే ఉన్న తాడికొండ నుండి శాసనసభ్యునిగా సి.పి.ఐ. అభ్యర్థిగా విజయం సాధించారు.

## శ్రీ బుల్లా శ్రీనివాసరావు

మంగళగిరి పట్టణంలో పాతతరం వ్యాపార ప్రముఖులలోను, రాజకీయ ప్రముఖులలోను వీరు ఒకరు. వీరికి అప్పటి మంత్రివర్యులైన విజయవాడకు చెందిన శ్రీ వేముల కూర్మయ్యతో చాలా దగ్గర సంబంధాలుండేవి. సుమారు 100 ఎకరాల వ్యవసాయ భూములు కలిగివుండేవారు. ఈ ప్రాంతంలో "బోన్‌మిల్లు" తెనాలిరోడ్డులో వీరికి వుండేది. ట్రాన్స్‌పోర్టు రంగంలో - నూతక్కి - తుళ్ళూరు బస్సులు, లారీలు వీరికి వుండేవి. 1966 సం॥లో అప్పట్లో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన "శ్రీనివాస మహల్" సినిమాహాలులో వీరు ముఖ్య భాగస్తులుగా వుండేవారు. రాజకీయ రంగంలో దళిత ప్రతినిధి గానే కాక, పూరి మొత్తం మీద వీరికి రాజకీయంగా పట్టువుండేది. 1969లో మంగళగిరి పురపాలక సంఘం మార్పుచెందే నాటికి వీరు పంచాయతి ప్రెసిడెంటు. ఒక దళిత ప్రతినిధి ఆనాడే మంగళగిరికి ప్రథమ పౌరునిగా గౌరవం పొందారు. వీరు జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తి.

## శ్రీ కలకోటి సాంబయ్య

మంగళగిరిలో దళితులకు నాయకత్వం వహిస్తున్న శ్రీ సాంబయ్య మున్సిపల్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగివున్నారు. వ్యాపారం చేస్తున్న వీరు స్థానికంగా బలమైన రాజకీయ వర్గాన్ని కలిగివుండి కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులు నిర్వహిస్తూ వస్తున్నారు.

## అంబేద్కర్ సెంటర్



పట్టణంలో ప్రముఖ కూడలి స్థలంగా రాజ్యాంగ నిర్మాత డాక్టరు అంబేద్కర్ విగ్రహ సెంటర్ వెలుగొందుతోంది. పాతకాలంలో మిద్దె సెంటరు సభలు - సమావేశాలకుపయోగించేవారు. ప్రస్తుతం బహిరంగ సభలకు, కళారూపాల ప్రదర్శనకు అంబేద్కర్ సెంటర్ సౌకర్యంగా మారింది. ఈ విగ్రహాన్ని 1988 సం॥లో ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ యన్టీఆర్ ఆవిష్కరించారు. 1995లో యీ విగ్రహాన్ని పునరుద్ధరించి, మెరుగుపరిచారు.

## తొలి కాంస్య విగ్రహం



మంగళగిరి ప్రాంత దళిత చైతన్యానికి మరో నిదర్శనంగా దివంగత మాజీ ఉపప్రధాని శ్రీ జగ్జీవన్‌రాం విగ్రహం యిక్కడ కన్పిస్తుంది. ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట ప్రతిష్ఠాకరంగా దీనిని ఏర్పాటుచేశారు. పట్టణంలోని తొలి కాంస్య విగ్రహంగా యిది చరిత్రలో నమోదైంది. శ్రీ బుల్లా సుబ్బారావు సహాయ సహకారాలతో 2002 ఏప్రిల్ 24న రాష్ట్ర మంత్రులు, దళిత ప్రముఖుల సమక్షంలో యీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ✵

# పత్రికలు

ప్రజాస్వామ్యంలో "నాలుగవ ఎస్టేటు"గా చెప్పబడే 'పత్రికా రంగం' మంగళగిరి పట్టణంలో ఎంతో మెళకువగా వుండి ప్రజా జీవితానికి, పరిపాలనకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు అందించటంలోను, పాలకుల తప్పుఒప్పులను ఎత్తి చూపటంలోను ఎంతో కృషి చేస్తోంది. ప్రముఖ దినపత్రికలకు, టెలివిజన్ ఛానళ్ళకు అన్నిటికి యిక్కడ ప్రతినిధులున్నారు.

పాత తరంలో శ్రీయుతులు దగ్గుపాటి సీతారామయ్య, కాళంగి వెంకటరత్నం, మొగలిచర్ల వెంకటప్పయ్యశర్మ, శ్రీ చిమ్మన నాగభూషణం ముఖ్యులుగా, తరువాత తరంలో శ్రీయుతులు కొలికపూడి నెయిల్, గుజ్జర్లపూడి జాన్ బాబు, శిందే లక్ష్మోజి రావు, కె. వీరా రెడ్డి, కాళంగి పురుషోత్తమప్రసాద్ (చిన్ని), ఏ. రాజా హుస్సేన్ కొందరు. గత 10 సంవత్సరాలుగా పత్రికా ప్రతినిధులు "ప్రెస్ క్లబ్" నిర్వహిస్తున్నారు. 2000 సం॥ నుండి మండల పరిషత్ షాపింగ్‌కాంప్లెక్స్‌లో అన్ని సౌకర్యాలతో ప్రెస్‌క్లబ్ కార్యాలయం కొనసాగుతోంది.



ప్రస్తుతం శ్రీయుతులు శిరందాసు కృష్ణప్రసాద్ (ఈనాడు - టౌన్), దేవరకొండ సురేష్ (ఈనాడు - రూరల్), కొలికపూడి రూఫస్ (వార్త), వానపల్లి బ్రహ్మానాయుడు (ఆంధ్రజ్యోతి), సింహాద్రి శ్రీనివాసరెడ్డి (ఆంధ్రభూమి/డక్కన్‌క్రానికల్), కూరపాటి మురళిరాజు (విశాలాంధ్ర), మంచికలపూడి శిరిబాబు (ప్రజాశక్తి), బాపనపల్లి శ్రీనివాసరావు (ఆంధ్రప్రభ) మంగళగిరిలో పత్రికా ప్రతినిధులుగా సేవలందిస్తున్నారు.

ఎలక్ట్రానిక్ మీడియాకు ప్రతినిధులుగా - శ్రీయుతులు శిరందాసు శ్రీనివాసరావు (సిటికేబుల్, మాటీవి), చెన్నా అజయ్‌కుమార్ (సిబార్), గోరంట్ల లక్ష్మీనారాయణ (టివి-9), శిరందాసు కృష్ణప్రసాద్ (ఈటీవి) పనిచేస్తున్నారు.

మంగళగిరికి చెందిన మరి కొందరు శ్రీయుతులు ఆకురాతి శేషాచలం విజయవాడలో 'జనత' దినపత్రికలో సీనియర్ సబ్-ఎడిటరుగాను, టి. కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక

ప్రతినిధిగా హైదరాబాద్‌లోను, శిరందాసు నాగార్జున అనంతపురంలో 'వార్త' ఎడిషన్ ఇన్‌ఛార్జిగాను, చిన్నం శ్రీనివాస్, విశాఖపట్నంలో 'వార్త' ఎడిషన్ ఇన్‌ఛార్జిగాను, అవ్వారు శ్రీనివాసరావు గుంటూరు 'ఆంధ్రజ్యోతి' సబ్-ఎడిటర్‌గాను, కొలికపూడి నెయిల్ హైదరాబాద్ 'ఆంధ్రప్రభ'లో సీనియర్ సబ్ ఎడిటరుగాను, గోరంట్ల పూర్ణచంద్రరావు ఆంధ్రజ్యోతి ప్రతినిధిగా ఆచార్య నాగార్జున యూనివర్శిటి పరిధిలోను, వేమూరి రత్నప్రసాద్ తాడేపల్లి ఆంధ్రజ్యోతి ప్రతినిధిగాను, గోలి శీతారామయ్య ప్రజావాణి మాసపత్రికకు వర్కింగ్ ఎడిటర్‌గాను బాధ్యతలు నిర్వర్తిస్తుండటం విశేషం.

'విజిలెన్సు' అనే పత్రిక శ్రీ బుల్లా రాజారావు వ్యవస్థాపక సంపాదకులుగాను, శ్రీ కుక్కమళ్ల జయరాజ్ సంపాదకులుగాను స్థానికంగా గత దశాబ్దంగా ప్రచురితమవుతోంది. శ్రీ పాతర్ల రమేష్ 'తెలుగుతల్లి' మాసపత్రికకు ఎడిటర్‌గా వున్నారు. శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్రం తరఫున 'యోగసౌరభం' మాసపత్రిక ప్రచురించబడుచూ శ్రీ వెంకటేశ్వర యోగి వ్యవస్థాపక సంపాదకులుగాను, శ్రీ దామర్ల నాగేశ్వరరావు సంపాదకులుగాను వ్యవహరిస్తున్నారు.

ఈ పత్రికా రంగ ప్రతినిధులు మంగళగిరి పట్టణ అభివృద్ధిలో మైలురాళ్ళయిన - కృష్ణాజలాల పథకం, పానకాలస్వామి ఘాట్‌రోడ్డు ప్రాజెక్టులు రూపుదిద్దుకోవడంలో విశేషమైన కృషిచేశారు. ప్రస్తుతం గాలిగోపురం పూర్వవైభవం పోకుండా బాగుచేసే విషయంలోను, పెద్ద కోనేరును పునరుద్ధరించే విషయంలోను కృషిచేస్తున్నారు.

ఈ పట్టణంలో ఎన్నో దశాబ్దాలపాటు న్యూస్‌పేపర్ ఏజెంటుగా శ్రీ నీలి నరసింహారావు సేవలందించగా, మరొకరు శ్రీ వహాబ్ యీ రంగంలో తన సేవలను కొనసాగిస్తున్నారు.

## శ్రీ చిమ్మన నాగభూషణం



శ్రీ చిమ్మన నాగభూషణ్ 1962 సం॥లో "విశాలాంధ్ర" దినపత్రికకు విలేఖరిగా నియామకం పొందారు. వీరి రాజకీయ జీవితం 1944-45లో ప్రారంభమయినది. వీరితోపాటు అప్పట్లో ఆంధ్రప్రభకు శ్రీదగ్గుపాటి సీతారామయ్య, ఆంధ్రపత్రికకు శ్రీకాళంగి వెంకటరత్నం, ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు శ్రీ మొగిలిచర్ల వెంకటప్పయ్య శర్మ యిక్కడ విలేఖరులుగా వుండేవారు.

అలా 1962లో విలేఖరిగా ప్రారంభమైన వారి జీవితం 2000 సం॥ వరకు 38 సం॥లు నిరంతరం కొనసాగింది. వృద్ధాప్యంతో వారు ఆ వృత్తి నుండి తప్పుకున్నారు. వీరి శైలి ఎంతో పదునుగాను, నిశితంగాను వుండేది. ❋

# సాహిత్యం

మంగళగిరి పుణ్యక్షేత్రమున శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి పూజించ బడుచున్నారు. పూర్వకాలము నుండి ఎందరో కవులు యీ క్షేత్ర మహత్యమును గురించి, యిచ్చట దైవమును గూర్చి ఎంతో సాహిత్యాన్ని రచించటం జరిగింది. అంతే కాకుండా ఎన్నో ప్రముఖ కావ్యాలు యీ దైవానికి అంకితం చేయబడినాయి.

## [1]అనిరుద్ధ చరితం :

నరసింహస్వామికి భక్తుడు కనుపర్తి అబ్బాయామాత్యడు. తల్లితండ్రులు రాయన్న, నరసమ్మ, కౌండిన్య గోత్రము. ఈ కవి 1730 ప్రాంతాలలో గుంటూరు ప్రాంతంలో జీవించిన వాడు. తన ఇష్టదైవమైన మంగళాద్రి నృసింహుడు కనుపర్తి అబ్బయామాత్యుని కలలో కనిపించి, ఆయన చేసిన సూచన మేరకు ఐదు ఆశ్వాసాలుగల "అనిరుద్ధ చరితం" అనే శృంగార ప్రబంధాన్ని రచించాడు. దానిని ఆయనకే అంకితం చేశాడు. తాను శ్రీమంగళాచల నృసింహ కృపాప్రసాద సంప్రాప్త విద్యావైభవ సంపన్నుడనని కవి తెలుపు కున్నాడు. మంగళాద్రీశుని ఉపాసనాఫలంగా కవితాపారిజాతాన్ని సంపాదించుకున్నాడు.
మంగళాద్రీశుని వైభవం, క్షేత్ర మహత్మ్యాన్ని గురించి 9 పద్యాలలో కవి సంక్షేపంగా వర్ణించాడు.

## [2]కవిరాజు మనోరంజనం

కనుపర్తి అబ్బయామాత్యుడు కవిరాజు మనోరంజనమనే పురూరవశ్చరిత్రను రచించి గోపాలదేవునికి అంకితం చేశాడు. అయినా మంగళగిరి నృసింహస్తుతితోనే గ్రంధారంభం చేశాడు.

"శ్రీకెంగేల వెలుంగు తమ్మికి, చెవింజెల్వొందు చెంగల్వకున్
వ్యాకోచస్థితి సామ్యమైయొసగగా నర్కేందు బింబాక్షి
వీక్షా కారుణ్య రసాప్తి దత్ప్రియకు వేడ్కల్సేయు లీలా నృసిం
హకారోజ్వలు మంగళాద్రిపతి నిష్టావాప్తికై కొల్చెదన్" (1-1)

ఈ ప్రబంధము రాజు పురూరవుడు-ఊర్వశిల ప్రేమాయణమునకు సంబంధించినది.

## [3] పరమయోగి విలాసము

గ్రంథకర్త తిమ్మభూపాలుడు విజయనగర రాజ్యమున ప్రధాన దుర్గమగు కొండవీటి దుర్గాధిపతి. శ్రీ వైష్ణవ మతాచార్యులగు పన్నిద్దరాళ్వార్ల చరిత్ర. తాళ్ళపాక తిరువెంగళ నాధుని పరమయోగ విలాసము వంటిది. "పరమయోగి విలాసము"ను నరసింహస్వామికి అంకితం ఇచ్చారు.

## [4]భగవద్గీతా శాస్త్రము

కొండూరి జగ్గరాయ కవి ధనంజయ గోత్రమునకు చెందిన క్షత్రియుడు. సంస్కృతములోని 'భగవద్గీత'ను తెలుగులో పద్యరూపమున "భగవద్గీతా శాస్త్రము" అనుపేర వ్రాసి మంగళగిరి నరసింహస్వామికి అంకితమిచ్చెను.

## శృంగార ధమము

దివి రమణ కవి మందడం నివాసి. క్రీ॥శ॥ 1760-70 ప్రాంతాలలో "శృంగార ధమము" అనే గ్రంథాన్ని వ్రాసి మంగళగిరి లక్ష్మీనరసింహస్వామికి అంకితమిచ్చారు.

## పద్మశాలి వంశప్రశస్తి

ఈ గ్రంథమును మంగళగిరి దేవస్థాన ఆచార్యులైన శ్రీ కందాళ రంగాచార్యులు 1918 సం॥లో రచించినారు. 1939 సం॥లో పాత మంగళగిరి బహుత్తమ సంఘ సహాయముతో ముద్రించిరి. మరల 1999లో శ్రీ గోలి సూర్యనారాయణ ప్రచురించారు.

గుంటూరు జిల్లా కోర్టులో 1915లో జరిగిన వ్యాజ్యములో పద్మశాలీలు "సిరికి పుట్టింటివారు - హరికి అత్తంటివారు" అను విషయ నిరూపణకు చేసిన పరిశోధన ఫలితము ఈ గ్రంథములో నున్నది.

ఈ గ్రంథము శ్రీ లక్ష్మీ నరసింహస్వామికి అంకితమివ్వబడింది.

## క్షేత్ర మహాత్మ్యాలు

ఈ క్షేత్ర మహాత్మ్యాలు, యీ దేవునిపై రచించబడిన కొన్ని శతకాలను యీ క్రింద ప్రస్తావిస్తున్నాను.

1. మంగళగిరి క్షేత్ర మహత్మ్యము - శ్రీ కొడాలి వెంకటరత్నం చౌదరి
2. మంగళగిరి మహత్మ్యము - శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి
3. శ్రీ మంగళగిరి క్షేత్ర చరిత్ర (1965) - శ్రీ నుదురుపాటి వెంకటరమణ శర్మ, శ్రీ నందిరాజు చలపతిరావు
4. మంగళగిరి మహత్మ్యము (1947) - శ్రీ నందిరాజు చలపతిరావు
5. శ్రీపానకాల లక్ష్మీనరసింహస్వామి వారి శ్రీ తోతాచల మహత్మ్యము - శ్రీ నంబూరి సంజీవి 1898 ప్రాంతంలో కాపీ వ్రాసినారు. 2000 సం॥లో ప్రచురించారు.
6. మంగళాద్రి క్షేత్ర మహత్మ్యము(1911) - శ్రీ వింజమూరు వీరరాఘవాచార్యులు
7. మంగళగిరి క్షేత్ర మహత్మ్యము - శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులు (1842 - 1915)
8. మంగళగిరి శ్రీ పానకాల లక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్ర మహత్యము దేవస్థాన ప్రచురణ (2004)

# శతకములు

## [5] మంగళాద్రి నృసింహ శతకం (1790)

మంగళగిరి నృసింహస్వామిని స్తుతిస్తూ తాడేపల్లి పానకాలరాయ కవి "మంగళాద్రి నృసింహా" అనే మకుటంతో కందపద్యాలలో ఈ శతకం రచించారు. పానకాలరాయ కవి నృసింహస్వామిపై తనకు గల భక్తిని వ్యక్తీకరించాడు.

"చిలువలదొర పానుపుపయి
కలుముల జవరాలు నిందు కౌగిటిలోనన్
విలసిల్లు నీదు చలువం
బలరగ సేవింతు మంగళాద్రి నృసింహా"

2. మంగళాద్రి నృసింహ శతకం శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవి.

| | | |
|---|---|---|
| 3. నృసింహ శతకము | శేషప్పకవి | 1750 |
| 4. నరసింహ శతకము | కరపాలెం సింగనామాత్యుడు | 1760 |
| 5. లక్ష్మీ నృసింహ శతకము | పాటూరి లక్ష్మీనృసింహకవి | 1850 |

## [6] శ్రీలక్ష్మీనరసింహోదాహరణం

"ఇదిగో స్వామి గ్రహింపు బిందియలతో నీ బెల్లపుం బానకం
బు దయాక్షీర తరంగవార్ధి! ప్రభువా! ముక్త్యంగనానాథ! ని
త్య దశానూన దయావతార! ఉదరస్థ ప్రాణిసంరక్ష! వా
స్వదనా! తార్క్ష్యహయన! మంగళగిరి స్వామీ! జగన్నాయకా! "

అని సంబోధన విభక్తిలో మంగళగిరి నరసింహస్వామి వర్ణింపబడినాడు.

## [7] నృసింహ గాయత్రి

"ఓమ్ నృసింహాయ విద్మహే వజ్రనఖాయ ధీమహి!
తన్నస్సింహః ప్రచోదయాత్"

## [8] వేదాంత రసాయనము (ఏసుక్రీస్తు చరిత్ర ప్రబంధము)

మంగళగిరికి చెందిన "మంగళగిరి ఆనందకవి" "వేదాంత రసాయనము" అను ఏసుక్రస్తు చరిత్ర ప్రబంధాన్ని 1780-90 సంవత్సరముల మధ్య రచించారు. ఈ కావ్యములో నాలుగ అశ్వాసములున్నాయి. మల్లరాన, జ్ఞానబోధల మధ్య సంభాషణ రూపంలో వుంది. వేదవ్యాసుని వేదాంత పద్ధతిని అధ్యయనంచేసి, అదే నమూనాలో క్రైస్తవ మత గ్రంధసారాన్ని, ముఖ్యంగా కొత్త నిబంధన సారాన్ని "వేందాంత రసాయనము"లో వీరు ఇమిడ్చారు. క్రీస్తు చరిత్ర, క్రైస్తవ మత సాంప్రదాయాలు యిందు వర్ణించబడి వుంది. భారత, భాగవతాలలోని కొన్ని ఘట్టాలను ఇందులో పోల్చారు.

వేదాంత రసాయన గ్రంథాన్ని శ్రీ ఆనందకవి ఫ్రెంచివారి తరఫున మచిలీపట్టణాన్ని పాలించిన నిడుమామిళ్ల దాసప్పకు అంకితమిచ్చారు.

1882, 1926లలో ప్రచురించబడిన ఈ గ్రంథాన్ని తిరిగి 1969లో నెల్లూరు సెయింట్ జాన్ ప్రెస్‌వారు ముద్రించినట్లు తెలుస్తోంది.

## [9]శ్రీ అందే నారాయణ స్వామి

మంగళగిరిలో పుట్టి పెరిగి పేరొందిన సామాజిక రచయిత శ్రీ అందే నారాయణ స్వామి. వీరు 1908లో జన్మించి, 1982లో మరణించారు. ఈయనకు సాహిత్య రంగంలోనే గాక చిత్రలేఖనం, సంగీతంలో కూడా ప్రవేశం వుంది.

స్వాతంత్ర్యం ముందునుండి ఆ తరువాత కూడా రచనలు చేశారు. "వ్యత్యాసాలు" (1940) అనే తొలి కథాసంపుటి, "స్నేహితుడు" (1956), "ఉపాసనాబలం" (1957), "కారుణ్యం" (1958) అనే నాలుగు కథా సంపుటాలను వెలువరించారు. వీరి నవలలు కష్టసుఖాలు, ఇద్దరు తల్లులు. వీరి కథలు భారతి, ఆంధ్ర సమాచార పత్రిక, ఆనందవాణి, తెలుగు స్వతంత్ర మొ॥ పత్రికలలో ప్రచురితమయ్యాయి.



ఈయనకు ముందు ఏ రచయిత తన కుల వృత్తికి సంబంధించిన కథా రచనలను చేయలేదు. చేనేత వృత్తితో బాగా పరిచయం వుండటం వలన చేనేత వృత్తికి సంబంధించిన కథలను బాగా వ్రాయ గలిగారు. అందువలన తెలుగు సాహిత్యంలో అందే నారాయణ స్వామి "తొలి వృత్తి కథా రచయిత'' గౌరవానికి పాత్రులవుతారు.

శ్రమజీవులు,రైతుకూలీలు, స్త్రీలు, అణగారిన కులాలు, పీడితుల పక్షాన నిలిచి కథలు వ్రాశారు. ఈ వర్గాలకు సామాజిక న్యాయం కావాలని ఎలుగెత్తి నినదించారు. మానవతా విలువల అభివృద్ధిని వీరి కథలు కాంక్షిస్తాయి. సమాజంలోని అన్ని రకాల అసమానతలు నశించి, ఉత్తమ సమాజం నెలకొనాలని సందేశమిస్తాయి.

[10] "స్వాతంత్ర్యానంతరం స్వాతంత్ర్య ఫలితాలను ప్రశ్నిస్తూ అసంఖ్యాకంగా కథలు వచ్చాయి. నేటికి వస్తున్నాయి. ఇలాంటి కథల్లో మొదటిది అందే నారాయణస్వామిగారి 'శిల్పి' (1956) . వలస పాలకులు భారతదేశంలో మొదటి దెబ్బకొట్టింది సాలెల కడుపు మీదనే. స్వతంత్రం వచ్చి దశాబ్దం గడిచిపోయినా వాళ్ళ జీవితాల్లో మార్పు రాకపోవడాన్ని ప్రశ్నించింది

'శిల్పి' కథ. "ఇప్పుడు సొంత ప్రభుత్వం వచ్చి మాత్రం యేం చేసింది? ఖద్దరు వస్త్రాలతో ప్రారంభమైన స్వరాజ్యోద్యమం తీరా స్వరాజ్యం వచ్చిన తర్వాత నేతగాళ్లకు తినడానికి తిండిలేకుండా పోయింది" అన్నది శిల్పి కథ చేసిన విమర్శ". [1](ఒక శతాబ్ది జీవిత కథాబ్ది "విశాలాంధ్ర తెలుగు కథ" ఆదివారం 'వార్త', – 29.12.2002.)

1950 దశకంలో మద్రాసు చేనేత సత్యాగ్రహానికి ముందు రాష్ట్రంలో వున్న ఆర్థిక పరిస్థితుల్ని, ప్రత్యేకించి చేనేత కుటుంబాలలో వున్న విషాద స్థితిగతుల్ని "పడుగు పేకల మధ్య బడుగులు" అన్న కథానికలో అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించారు. ఆనాటి సమకాలీన పరిస్థితుల్ని సమర్థవంతంగా దర్పణం పట్టగలిగిన, చేయితిరిగిన కథారచయిత. సదా గుర్తు చేసికోదగిన ఉదాత్త భావాలున్న ఉత్తమ కథారచయిత. శ్రీ అందే కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ఈయన "ఆంధ్ర మొపాసా" అని ప్రశంసించారు. ✵

---

1. పేజి 202-205, తెలుగుసాహిత్యంలో నృసింహ వృత్తాంతం, డా॥ కండ్లకుంట నరసింహమూర్తి, జనగాం.
2. పేజి 217, ---- డిటో -----
3. Page No. 2377-78, Descriptive Catalogue of Manuscripts Vol.IX D.Nos. 2041 - 2273.
4. Page No. 1876, Descriptive Catalogue of Manuscripts Vol. V, R.Nos. 716-812.
5. పేజి. 273-274, తెలుగు సాహిత్యంలో నృసింహవృత్తాంతం, 'డా॥ కండ్లకుంట నరసింహమూర్తి, జనగాం
6. పేజి. 345, తెలుగు సాహిత్యంలో నృసింహవృత్తాంతం, 'డా॥ కండ్లకుంట నరసింహమూర్తి, జనగాం
7. పేజి. 43, తెలుగు సాహిత్యంలో నృసింహవృత్తాంతం, 'డా॥ కండ్లకుంట నరసింహమూర్తి, జనగాం
8. Page No. 2485, Descriptive Catalogue of Manuscripts Vol. IX, D.Nos. 2041-2273
9. తెలుగు కథకులు-కథనరీతులు-3, శ్రీ పెనుగొండ లక్ష్మీనారాయణ, విశాలాంధ్ర ప్రచురణ.
10. పేజి నెం. 22, 23, 'వార్త ఆదివారం పుస్తకం 29-12-2002, 'ఒక శతాబ్ది జీవిత కథాబ్ది 'విశాలాంధ్ర తెలుగు కథ'.

# చిత్రకారులు

మంగళగిరి పట్టణంలో పేరొందిన చిత్రకారులు ఎందరో వున్నారు. వారిలో శ్రీ జి. సత్యం, శ్రీ అందె బాబా ప్రసాద్, శ్రీ చలపతిరావు, శ్రీ బట్టు హరిబాబు కొందరు.

## రవి వర్మ



వీరు భారత దేశంలోనే పేరొందిన పురాతన కాలం నాటి చిత్రకారులు. రవి వర్మ కర్నాటక రాష్ట్రం మైసూరు మహారాజు ఆస్థానంలోని కళాకారుడు ఈయన మొదటగా హిందూ దేవతామూర్తులకు ప్రస్తుతం రూపం కలిగిస్తూ చిత్రాలు గీశారు.

వీరు 1899లో చిత్రించిన "హిరణ్యకశిపుని వధ'' చిత్రం మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వున్నది. దానిని ఎవరు యీ దేవాలయానికి బహుకరించినది తెలియదు. ఆ చిత్రం మహోన్నతంగా చిత్రీకరించబడి, దేవస్థానపు విలువైన సంపదలో నొకటిగా వుంది. ఇది మంగళగిరి ఆంధ్రాబ్యాంకు లాకరులో భద్రపరచబడి వుంది.

## శ్రీ జంజనం కుటుంబ రెడ్డియ్య

శ్రీ జంజనం కుటుంబ రెడ్డియ్య మంగళగిరిలో పుట్టి పెరిగారు. చింతక్రింద కనకయ్య హైస్కూలులో 1951-57 సం॥లలో విద్యాభ్యాసం చేశారు. చిత్రకళలో 5 సం॥ల కోర్సును పూర్తిచేశారు. వృత్తి, ప్రవృత్తి రెంటి రీత్యా వీరు కళాకారునిగా వున్నారు.



కేంద్ర జౌళిశాఖ ''వీవర్సు ట్రైనింగు సెంటర్''లో ఆర్టు డిజైనరుగా ఉద్యోగంలో ప్రవేశించి, డిప్యూటి డైరెక్టరు స్థాయికి ఎదిగి 1994లో స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.

"ఫ్రెస్కో పెయింటింగ్"లో వీరికి ప్రత్యేక నిపుణత వుంది. ఇటలీకి చెందిన "కోమో" అనే చిత్రకారుని ఆహ్వానంపై అక్కడికి వెళ్ళి సిల్కు వస్త్రంపై కలంకారి ముద్రణ ప్రక్రియను నేర్పించి వచ్చారు. లండనులోని "విక్టోరియా అండ్ ఆల్బర్టు మ్యూజియం"లో 18వ శతాబ్ధి



నాటి మచిలీపట్నం కలంకారి వస్త్రాలను భద్రపరిచారు. ఆ మ్యూజియం వారి ఆహ్వానంపై లండనకు వెళ్ళి, 2 వందల సంవత్సరాల నాటి కలంకారి డిజైన్లలో ఒకటైన "ట్రీ ఆఫ్ లైఫ్" నమూనా గీసికొని వచ్చారు. ఆ కళా వైభవాన్ని పునరుజ్జీవింపచేస్తూ – 50 అడుగుల పెద్ద వస్త్రంపై "ట్రీ ఆఫ్ లైపు" డిజైన్‌ను తిరిగి వీరు చిత్రీకరిస్తున్నారు.

తెలుగు మహాసభల సందర్భంగా "ఓరుగల్లు ప్రతాపరుద్రుని సభా దృశ్యం"ను వీరు చిత్రీకరించి ప్రదర్శించారు. ఆ చిత్రం ఆనాటి ముఖ్యమంత్రి శ్రీ యన్.టి. రామారావు ప్రశంసలకు పాత్రమయింది. వీరు చిత్రించిన ఎన్నో చిత్రాలు, తయారుచేసిన వస్త్ర డిజైనులు కళా ప్రదర్శనలలోను, వస్త్ర ప్రదర్శనలలోను దేశ విదేశాలలో ప్రదర్శించబడి కళాభిమానుల, విమర్శకుల ప్రశంసలు చూరగొన్నాయి.

## శ్రీ అందే బాబా ప్రసాద్

మంగళగిరికి చెందిన వీరు 'ఆప్కో'లో సహాయ మార్కెటింగ్ అధికారిగా పనిచేసి స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. వీరు ఇంక్‌పెన్‌తో చిత్రాలు గీస్తుంటారు. దీనిలో వారు సిద్ధహస్తులు. వీరి చిత్రకళ నైరూప్య రేఖా చిత్రాల తరగతికి చెందుతుంది. పెన్సిల్ స్కెచ్ పోర్ట్రైట్‌లు వీరు చిత్రీకరించారు. వీరి చిత్రాలు ఎక్కువగా గ్రామీణ జీవన నేపథ్యానికి అద్దంపడుతూ వుంటాయి. 1968లో నాగపూర్‌లో నిర్వహించిన సౌత్‌సెంట్రల్ కల్చరల్ ఎగ్జిభిషన్‌లో రాష్ట్రానికి చెందిన మూడు చిత్రాలతో సహా మొత్తం 70 చిత్రాలు ప్రదర్శిం చారు. వాటిల్లో వీరి చిత్రం ఒకటి చోటు చేసుకున్నది. 2002 అమరావతి ఉత్సవ్‌లో వీరి చిత్రాలు ప్రదర్శించారు.

## కొలికపూడి సెల్వరాజ్

శ్రీ కొలికిపూడి సెల్వరాజ్ మంగళగిరి స్థానికులు. వీరిది చిత్రకారుల కుటుంబం. వీరి సోదరులు న్యూటన్, నెయిల్, రవి కూడా చిత్రకారులు / కార్టూనిస్టులే. వీరు విద్యార్థి దశలోనే చిత్రకారునిగా ఎన్నో ప్రశంసలు పొందారు. మొదట కార్టూనిస్టుగా వృత్తి ప్రారంభించిన వీరు 1986లో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో చిత్రకారునిగా చేరి యీనాటికీ కొనసాగుతున్నారు. పత్రికలలో ప్రచురించబడే కథలు, నవలలకు శ్రీ సెల్వరాజ్ వేసే చిత్రాలు రచయితల మనోభావాలను అద్దంపడుతూ ఆ రచనలను ఆసాంతం చదివేలా పాఠకులను ఉత్సాహ పరుస్తాయి.

❋

# నాటకం

కళారూపాల ద్వారా తమ భావాలను ప్రచారం చేసే కమ్యూనిస్టు పార్టీలు బలంగావున్న మంగళగిరి ప్రాంతంలో సహజంగానే కళాకారులుద్భవించారు. స్వాతంత్ర్యానికి పూర్వమే యిక్కడ నాటకరంగానికి ప్రాధాన్యత పెరిగింది.

నిడుముక్కల ఆదిశేషుగారి థియేటర్, రావూరి రామకోటయ్యగారి పొగాకు కంపెనీ ఆవరణ, కంకణాల వెంకటసుబ్బయ్యగారి ఆవరణ, పంచాయతి సమితి ప్రాంగణం, గాలిగోపురం ఎదుట వేదిక, మిద్దె సెంటర్ తదితర కూడలి ప్రాంతాల్లో కళ, సాంస్కృతిక ప్రదర్శనలు విరివిగా జరిగేవి.

1930-40 దశకాల్లో పౌరాణిక, జానపద నాటకాలకు ఆదరణ వుండేది. సర్వోదయ నాట్యమండలి, శ్రీ మార్కండేయ నాట్యమండలి, ప్రజా నాట్యమండలి, అభ్యుదయ నాట్యమండలి యిక్కడి నాటక రంగానికి పునాదులు వేసాయి. ఆ తరువాత అభ్యుదయ నట సమాఖ్య, కట్టా నాగేశ్వరరావు మెమోరియల్ కల్చరల్ అసోసియేషన్, సంఘం ఆర్ట్స్ థియేటర్స్, నవసర కళా నాట్య సమితి, ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్, వాసవీ కళానికేతన్, మార్కండేయ వీవర్స్ కల్చరల్ అసోసియేషన్, భావనారుషి వీవర్స్ కల్చరల్ అసోసియేషన్, స్నేహ ఆర్ట్స్ క్రియేషన్స్, బాలభక్త మార్కండేయ నాట్యమండలి, నన్నయ నాట్యమండలి, నవోదయ నాట్యమండలి, శ్రీరామ నాట్యమండలి, మోడరన్ ఆర్ట్స్, ఆంధ్ర క్రైస్తవ నాట్యమండలి, సి.కె. విద్యాసంస్థల ఎంప్లాయీస్ కల్చరల్ అసోసియేషన్ తదితర సంస్థలు నాటక రంగానికి సేవలందించిన వాటిలో వున్నాయి.

## కళాకారులు

మంగళగిరి ప్రాంతంలో బహుళ ప్రజాదరణ పొందిన పౌరాణిక, జానపద నాటకాలలో హరిశ్చంద్ర, చింతామణి, కనకతార, రామాంజనేయ యుద్ధం, రాయభారం, బ్రహ్మంగారి చరిత్ర, గయోపాఖ్యానం తదితర నాటకాలున్నాయి.

వీటిని ప్రదర్శించిన కళాకారులలో శ్రీయుతులు వెనిగంళ్ల పూర్ణచంద్రరావు, శిరందాసు సాంబయ్య, పాలడుగు సాంబయ్య, వేమూరి మోహనరావు, శిరందాసు వెంకటరత్నం, బొడ్డు నారాయణ, మురుగుడు చిన వీరరాఘవులు, విన్నకోట శ్రీరాములు, యన్. చెన్నయ్య, యస్. దేవదానం, కటికల రామారావు, గొట్టిపాటి వెంకటేశ్వరరావు, దోనేపూడి సత్యం,

వెంగళ కోటేశ్వరరావు, వెంగళ మాధవరావు, కొరిటాల శివరాం, జొన్నాదుల నరసింహారావు, పి. యోగానందం తదితరులున్నారు.

ఈ ప్రాంతంలో ప్రదర్శించిన సాంఘికాలలో తెలుగుతల్లి, మాభూమి, పాలేరు, శాంతిసందేశం, రిక్షావాడు, పోతుగడ్డ, కప్పలు, ఎన్జీవో, లంకెల బిందెలు, వెంకన్న కాపురం, ఈ మంటలార్పండి, ఉలిపికట్టె, ఛైర్మన్, శిధిలశిల్పం, సూరీడు మొదలగునవి ప్రధానమైనవిగా వున్నాయి.

ఈ ప్రధానమైన నాటకాలు, నాటికలలో నటించినవారిలో శ్రీయుతులు దొడ్డాకుల రంగారావు, కమతం హనుమంతరావు, కట్టా నాగేశ్వరరావు, బిట్రా వెంకట నారాయణ, సంగాపు రామకోటేశ్వరరావు, దామర్ల రమాకాంతరావు, అందె నరసింహారావు, దామర్ల పూర్ణయ్య, కంటె కామయ్య, కంటె రంగారావు, గోపయ్య, కిలారు పాపారావు, దట్టెం నరసింహమూర్తి, చిమ్మన రాజలింగం, కుంచాల కోటేశ్వరరావు, కట్టా అంజిబాబు, విన్నకోట ఉమామహేశ్వరరావు, ఎన్. ఆర్. సుశీలరావు, యనమదుల ఉదయభాస్కరరావు, కె.పి. రోజీరావు, భాగవతుల భార్గవమూర్తి, బొడ్డు విద్యాసాగర్, పి. కృష్ణమూర్తి, కేదారలింగం, సందుపట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులున్నారు.

## నటీమణులు

పాత రోజుల్లో ముఖానికి రంగేసుకొని వేదికలెక్కటం మహిళలకు గౌరవం కాదంటున్న పరిస్థితులలో మహిళలు సైతం తమలోని కళాతృష్ణను ప్రదర్శించవచ్చునని రుజువు చేసిన సాహస నటీమణులుగా శ్రీమతి రాఘవరపు సావిత్రి, శ్రీమతి చింతల చెరువు వైకుంఠేశ్వరిలు చరిత్ర కెక్కారు. శ్రీమతి సావిత్రి ఆనాటి కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా, కళాకారులుగా వున్న రాఘవరపు కోటేశ్వరరావుగారి సతీమణి, శ్రీమతి వైకుంఠేశ్వరి ఆనాటి ప్రముఖ హార్మోనిస్టు పరదేశిగారి సతీమణి.

## దర్శక ప్రముఖులు

ఈ ప్రాంతానికి చెంది నాటక, నాటికలను రక్తికట్టించేలా దర్శకత్వం వహించిన ప్రముఖులలో శ్రీయుతులు గట్టెం వీరాస్వామి, అన్నపరెడ్డి శివరామిరెడ్డి, కవుతరపు భావనారుషి, వెనిగండ్ల సాంబశివరావు, దట్టెం నరసింహమూర్తి, కట్టా నాగేశ్వరరావు, అందె నరసింహారావు, ఎం. శేఖర్, కట్టా అంజిబాబు, బొడ్డు విద్యాసాగర్, కూర్మాల సుబ్బారావు తదితరులున్నారు.

నేపథ్య సంగీతం

కళాప్రదర్శనలకు నేపథ్య సంగీతాన్ని అందించిన హార్మోనిస్టులు, గాయకులు, తదితర వాయిద్య కళాకారులలో శ్రీయుతులు సయ్యద్ హుస్సేన్, తబలా వెంకన్న, విన్నకోట శ్రీరాములు, పంచుమర్తి ముత్యాలరావు, అందె నారాయణస్వామి, సి.హెచ్. పరదేశి, షేక్ అక్బర్ సాహెబ్, రుద్రు వెంకట్రామయ్య, టి. అర్జునరావు, మునగాల వెంకట చలపతిరావు, దానబోయిన వెంకటేశ్వర్లు, అత్యాల క్రిస్టాఫర్, పారెళ్ళ రత్తయ్య, కంచర్ల కాశయ్య తదితరులున్నారు.

## రచయితలు

మంగళగిరి పట్టణానికి చెంది, రాష్ట్రస్థాయిలో పేరుపొందిన నాటక రచయితలలో శ్రీ కొలికపూడి న్యూటన్ వున్నారు. వీరు రచించిన శిథిలశిల్పం, మనోమాంగల్యం నాటకాలు, సూరీడు, దండమయా విశ్వంభర మొదలగు నాటికలు రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందాయి. పాత తరంలో శ్రీ వెనిగంళ్ళ సాంబశివరావు, శ్రీ అందె నరసింహారావు రచయితలుగా పేరొందారు. వర్ధమాన రచయితలుగా శ్రీయుతులు సందుపట్ల భూపతి, అల్లక తాతారావు, మెరుగుపాల రాజా తదితరులున్నారు. ❋

**మంగళగిరి చరిత్ర - సంస్కృతి**

పట్టణ వికాసమండలి పట్టణ చరిత్రను, సంస్కృతిని పరిరక్షించేందుకు పనిచేస్తుంది. ఆ విషయాలపై ఉత్సాహమున్న వ్యక్తుల, సంస్థల సహాయ సహకారములను కోరుచున్నాము.

– పట్టణ వికాస మండలి, మంగళగిరి.

# సినిమా

మంగళగిరికి, తెలుగు చలన చిత్ర రంగానికి విడదీయలేని అనుబంధమున్నది. పలు సినిమాలు ఇక్కడ షూటింగ్ జరుపుకున్నాయి. పేరెన్నికగన్న అనేక మంది సినీప్రముఖులు మంగళగిరిని సందర్శించారు. ఈ గడ్డపై జన్మించిన అనేక మంది సినీపరిశ్రమకు విశిష్ట సేవలందిస్తున్నారు. మంగళగిరిలో స్వాతంత్ర్యానికి పూర్వమే సినిమాథియేటర్లు ఉండేవి. తొలుత 1930వ దశకంలో చేనేత కాలనీ సమీపాన 'ఆంజనేయ పిక్చర్ ప్యాలెస్' అనే థియేటర్ ఉండేది. ఆ తర్వాత ఇప్పటి టిప్పర్ల బజారు దగ్గర టూరింగ్ టాకీస్‌లు వుండేవి. కాలక్రమేణా ఆ థియేటర్లు కనుమరుగయ్యాయి.

అనంతరం 1949లో విజయలక్ష్మి టాకీస్ పేరిట ఒక థియేటర్‌ను నిర్మించారు. దానిని 'పాతహాల్' అని పిలిచేవారు. అక్కినేని నాగేశ్వరరావు నటించిన 'సీతారామ జననం' ప్రారంభ చిత్రంగా ప్రదర్శితమైంది. 1977 నవంబర్ 19న సంభవించిన భయంకరమైన తుఫానుకు ఈ హాలు పూర్తిగా నేలమట్టం కాగా, ఆ తర్వాత అదే ప్రదేశంలో "అన్నపూర్ణ డీలక్స్" పేరిట క్రొత్త సినిమా థియేటర్‌ను 1980 అక్టోబరు 10న ప్రారంభించారు. తొలి చిత్రం 'సీతారాములు' ఈ సినిమాలో కృష్ణంరాజు, జయప్రద ప్రధాన తారాగణం.

### షూటింగ్ జరుపుకున్న చిత్రాలు

ఈ ప్రాంతంలో ఎన్నో చిత్రాల ఔట్‌డోర్ షూటింగులు జరిపారు. వాటిలో 1. సర్కార్ ఎక్స్‌ప్రెస్ (1968), 2. పుత్తడి బొమ్మ (1974) ( రిలీజ్ కాలేదు). 3. వెలుగు బాటలు (1975) (రిలీజ్ కాలేదు) 4. దేవుడు చేసిన బొమ్మలు (1976) 5. సావాసగాళ్ళు (1977) 6. పట్నవాసం (1978) 7. ప్రేమ మందిరం (1981) 8. పల్నాటి సింహం (1985) 9. ఇదా ప్రపంచం (1987) 10. రక్తతర్పణం (1992) 11. బావ-బావమరిది (1993).

1959 జూన్ 29న గోపాలకృష్ణా టాకీస్ ప్రారంభమైంది. అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి జంటగా నటించిన 'మాంగల్య బలం' తొలిచిత్రం. ఈ థియేటర్‌కు శ్రీ జి. శ్రీరామమూర్తి గత 30 సంIIలుగా మేనేజర్‌గా కొనసాగుతున్నారు. ఇదొక రికార్డు.

1966 ఏప్రిల్ 22న శ్రీనివాసమహల్ అవతరించింది. అప్పట్లో సుమారు అయిదు లక్షల రూపాయల ఖర్చుతో అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. ప్రారంభ చిత్రంగా 'జమిందార్'ను ప్రదర్శించారు.

1966 జూన్ 10న శ్రీ వేంకటేశ్వర టాకీస్ ప్రారంభమైంది. సుమారు మూడు లక్షల రూపాయల ఖర్చుతో నిర్మించారు. తొలి సినిమా 'ఆత్మగౌరవం'.

1988 జూలై 20న విజయడీలక్స్ వెలసింది. తొలి చిత్రం 'వివాహ భోజనంబు'.

2003 ఏప్రిల్ 25న ఊర్వశి థియేటర్ ప్రారంభమైంది. ఇది పట్నంలో మొట్టమొదటి ఎయిర్ కండిషను, డి.టి.ఎస్ గల థియేటర్. దీనిలో తొలి సినిమా 'అమ్మ, నాన్న, ఓ తమిళ అమ్మాయి'.

## పంపిణీ రంగం :

శ్రీ ఉడతా వీరాస్వామి 1960వ దశకంలోనే సినీ పంపిణీ సంస్థ (నిర్మలా ఫిలింస్)ను నెలకొల్పారు. మాస్టర్ కిలాడీ, గండర గండడు మొదలైన చిత్రాలను పంపిణీ చేశారు. శ్రీ నాగుల్‌మీరా గత పది సంవత్సరాలుగా గుంటూరులో నాగుల్‌ఫిలింస్ పేరిట చలనచిత్ర పంపిణీ సంస్థను నిర్వహిస్తున్నారు. పలు విజయవంతమైన చిత్రాలను పంపిణీ చేశారు. శ్రీ వింజమూరి శ్రీకృష్ణ రాజేంద్రప్రసాద్ గుంటూరులో వినయ కుమార్ ఫిలింస్ పేరిట ఓ పంపిణీ సంస్థను ప్రారంభించారు.

## నిర్మాణ రంగం :

శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య అప్పట్లో శ్రీ ఎన్.టి.ఆర్.తో కలసి ఎన్.ఎ.టి. పతాకంపై "పిచ్చిపుల్లయ్య" సినిమా తీశారు.

శ్రీ జంజనం సుబ్బారావు ఇటీవల నిర్మాతగా మారారు. 'యాక్షన్ నెంబర్ 1' (2002), 'సత్తా' (2004) అనే చిత్రాలను నిర్మించారు.

## రచనా పర్వం :

పాత్రికేయుడు శ్రీ కొలికపూడి రవి అందించిన కథ-మాటలతో 'రమణ' అనే సినిమా రూపొందింది. 'ధనలక్ష్మి ఐ లవ్‌యూ', 'ఒట్టు ఈ అమ్మాయెవరో తెలియదు' అనే సినిమాలకు సంభాషణలను సమకూర్చారు.

## సినీ పత్రికారంగం

శ్రీ అవ్వారి గిరిమోహనరావు సినీ పత్రికారంగంలో అడుగుపెట్టారు. 'సినీస్టార్' పేరిట ఒక అందమైన సినీవారపత్రికను హైదరాబాద్‌లో కొంతకాలం నడిపారు.

## మంగళగిరిలో శేష జీవితం గడిపిన శ్రీ గోపాలం

'చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా...' అనే పాటకు బాణీని కూర్చటమే గాకుండా రంగుల రాట్నం, బంగారు పంజరం, కరుణామయుడు వంటి సినిమాలకు మధుర సంగీతం అందించిన వారిలో ఒకరైన సంగీత కళాకారుడు శ్రీ బి. గోపాలం మంగళగిరిలో నివాసం ఏర్పరుచుకొని 22-9-2004న తుదిశ్వాస విడిచారు. ఈయన గాయకునిగా కూడా రాణించారు.

## తొలి సినిమా హాల్

మంగళగిరి గ్రామంగా వున్న రోజుల్లోనే ప్రజలు సినిమా వినోదం పొందగలిగారు. స్వాతంత్ర్యం రాక పూర్వమే, 1930 దశకంలో శ్రీ నిడుముక్కల ఆదిశేషు యిక్కడ మొదటి సినిమా థియేటర్ కట్టి చరిత్రకెక్కారు. సుమారు రు. 25 వేల ఖర్చుతో “శ్రీ ఆంజనేయ పిక్చర్ ప్యాలెస్” పేరున వారు మొదటి సినిమా హాలును నిర్మించారు. అప్పట్లోనే “బాల్కని క్లాసు” వుండేది. ఆ థియేటర్‌లో మొదట శ్రీ చిత్తూరి నాగయ్యగారి ''భక్తపోతన'', బాల నాగమ్మ సినిమాలు ప్రదర్శించబడినాయి. సినిమా ప్రచారం కోసం తడికలకు పోస్టర్లు అంటించి వూరేగించే వారు. సినిమా ప్రారంభానికి ముందు హాలు దగ్గర డప్పులు మోగించి ప్రేక్షకుల నాకర్షించేవారు. రోజుకు ఒక ఆట మాత్రమే వుండేది.



టిక్కెట్టు రేట్లు 'నేల'కు అణా - కాని, 'బెంచి'కి బేడ, 'బాల్కని' పావల వుండేవి. ఆటకు మొత్తం రాబడి రూ. 20 నుండి 40 వరకు ఉండేది.

1940-41 ప్రాంతాల్లో శ్రీ ఆదిశేషు దానిని అమ్మివేయగా, 'మారుతి టాకీస్'గా పేరు మార్చారు. ఆ రోజుల్లో సంవత్సరంలో 2 నుండి 6 నెలల పాటు మద్రాసు నుండి వచ్చి కొందరు సరస్వతి, రీగల్ టాకీసు పేరిట టూరింగ్ థియేటర్లు నడుపుతుండేవారు. అవి టిప్పర్ల రోడ్డుకు పాత ట్రంకు రోడ్డుకు మధ్య స్థలంలో వుండేవి. శ్రీ నిడుముక్కల ఆదిశేషు కుమారులు శ్రీ శేషగిరి పుల్లారావు ఈ సమాచారాన్ని అందించారు.

## ఫిలిం ఫాన్స్ అసోసియేషన్

1967 సం॥లో శ్రీ బట్టు హరిబాబు సారధ్యంలో "మంగళగిరి ఫిలిం ఫాన్స్ అండ్ ఫైనార్ట్స్ అసోసియేషన్" ప్రారంభమైంది.

1968 సం॥లో రాష్ట్ర అవార్డుల కార్యక్రమానికి మంగళగిరి ఫిలింఫాన్స్ అసోసియేషన్ ఆతిధ్యాన్నిచ్చింది. సినీ ప్రముఖులే గాక 11 మంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొన్న అవార్డుల కార్యక్రమాన్ని శ్రీనివాసమహల్‌లో వైభవంగా జరిపారు. ఉత్తమ నటునిగా యన్.టి. రామారావు, ఉత్తమ నటిగా జమున, యితరులు విజయనిర్మల, వాణిశ్రీ, పద్మనాభం, చంద్రమోహన్, రాజనాల, బాలయ్య, బేబి రోజారమణి లకు కూడా అవార్డులు ప్రదానం చేశారు.

చాలా సంవత్సరాలు వివిధ కార్యక్రమాలను నిర్వహించిన యీ సంస్థకు శ్రీయుతులు అంకం బుద్దయ్య, గోలి గోపాలరావు, పసుమర్తి మాధవరావు, రేటూరి ఆనందరావు, డా॥ యంయస్‌యస్ కోటేశ్వరరావు, కట్టా అంజిబాబు, పి. ఆనందరావు, డి. కృష్ణమూర్తి, యం. శేఖర్ మొదలగు ఎందరో పట్టణ ప్రముఖులు అండగా నిలిచారు.

## సినిమా ఫొటోగ్రాఫర్ - శ్రీ కామరాజు సత్యనారాయణ

మంగళగిరికి చెందిన శ్రీ కామరాజు సత్యనారాయణ జ్యోతి స్టూడియో ఖాన్ గారి వద్ద ఫోటోగ్రఫీలో ఓనమాలు దిద్దారు. రవీంద్ర స్టుడియో సుబ్బారావు గారి వద్ద పాఠాల్ని నేర్చుకున్నారు.

1972లో మద్రాసు రైలెక్కి - మొదట ఒక ఒరియా సినిమాకు, ఆ తర్వాత 'నిజం' తెలుగు సినిమాకు స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా వీరు సినిమా జీవితం ప్రారంభించారు. 1972 నుండి 1995 వరకు మద్రాసులోను, 1998 వరకు హైదరాబాద్‌లోను సినిమా రంగంలో కొనసాగారు. ప్రముఖ దర్శకులైన కె. విశ్వనాథ్ గారి 19 సినిమాలకు, 'వంశీ' గారి 20 సినిమాలకు, కోదండరామిరెడ్డి, క్రాంతికుమార్, దాసరి నారాయణరావు గారల సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా పనిచేశారు. సుమారు 26 సం॥లు 200 సినిమాలకు స్టిల్ ఫోటోగ్రాఫర్‌గా సేవలందించిన వీరు 1998లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి 2001లో కోలుకొని యిక్కడే జీవితాన్ని గడుపుతున్నారు.

## మొదటి ఎ.సి. థియేటర్ "ఊర్వశి"

2003సం॥లో అధునాతనమైన డి.టి.ఎస్., ఎయిర్ కండిషన్ సౌకర్యాలతో "ఊర్వశి థియేటర్" ప్రారంభం కావడంతో మంగళగిరి సినిమా థియేటర్ల చరిత్రలో ఒక నవ శకం ఆరంభమైంది. సినిమా హాళ్ళు నిలయంగా మార పట్టణ ప్రేక్షకులకు అసౌకర్యాలకు దంతో విసిగిపోయిన ఊరట లభించింది. శాసన సభ్యులు మురుగుడు హను మంతరావుగారి పర్యవేక్షణలో నిర్మిత మైన ఊర్వశి ఎయిర్ కండిషన్డ్ థియేటర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో కుటుంబ సమేతంగా సినిమాలను చూచి ఆనందించాలనుకునే వర్గాలకు ఒక అమూల్య కానుక.




## డైరెక్టర్ - శ్రీ ప్రగడ రవీంద్ర బాబు

మంగళగిరిలో పుట్టిపెరిగి సినిమా రంగంలో తమ అదృష్టాన్ని వెతుక్కుంటూ మద్రాసు వెళ్ళిన కొందరిలో శ్రీ ప్రగడ రవీంద్ర ఒకరు. 1975 నుండి 1997 వరకు సుమారు 70 సినిమాలకు వివిధ స్థాయిలలో దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ప్రముఖ దర్శకులు శ్రీ ఇ.వి.వి. సత్యనారాయణ, శ్రీ వి. మధుసూదనరావు, శ్రీ కె. హేమాంబరధర రావు, శ్రీ విజయబాపినీడు మొదలగు వారి సారధ్యంలో పనిచేశారు. భానుచందర్, రఘువరన్, తులసి నటించిన 'రేచుక్క', భానుచందర్, శోభన నటించిన "దాగుడు మూతలు" సినిమాలకు స్వయంగా దర్శకత్వం వహించారు. ప్రస్తుతం స్థానికంగా వ్యాపారంలో స్థిరపడ్డారు.

సీనియర్ దర్శకుడు శ్రీ తాపి చాణక్య వద్ద 'విధివిలాసం' (కృష్ణ, విజయనిర్మల) చిత్రానికి శ్రీ చెర్వు విశ్వనాథం (విస్సు) సహాయ దర్శకునిగా పనిచేశారు.. ❋

# మాజీ సైనికులు

దేశ సరిహద్దుల రక్షణలో తమ జీవితాలను వెచ్చించిన మాజీ సైనికులు మంగళగిరి ప్రాంతంలో చెప్పుకొనదగిన సంఖ్యలో వున్నారు. వారి సంక్షేమం కోసం, యుద్ధంలో 0మరణించిన సైనికుల భార్యల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో రాయితీలను, సౌకర్యాలను కల్పించారు.

## ఎక్స్-సర్వీసెస్ లీగ్

మాజీ సైనికుల, వారి కుటుంబాల సేవలకోసం ఎక్స్-సర్వీసెస్ లీగ్ దేశమంతటా తమ శాఖల ద్వారా పనిచేస్తోంది. మంగళగిరిలో ఎక్స్ సర్వీసెస్‌లీగ్ సేవలు అవసరమైన మేరకు వ్యక్తుల, స్వచ్ఛంద సేవల ద్వారా అందుతున్నాయి. ఈ సభ్యులకు - క్యాంటిన్ అర్హత పత్రాలు, ఆడపిల్లల వివాహాలకు ఎలవెన్సు, వృత్తులు,వ్యాపారాలు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బ్యాంకు లోన్లు, మెడికల్ క్లయిములు, వ్యవసాయ-నివాస భూముల కేటాయింపు మొ॥ విషయాలలో సలహాలు సూచనలతోపాటు పెన్షన్‌కు సంబంధించిన వ్యవహారాలు కూడా పరిష్కరమవుతాయి.

మంగళగిరి ఎక్స్-సర్వీసెస్ లీగ్‌కు శ్రీ పణిదపు లక్ష్మయ్య (రిటైర్డు సుబేదారు), శ్రీ ఎ. జగన్నాధరావు (రిటైర్డు హవల్దారు) అధ్యక్ష, కార్యదర్శులుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ వి.ఆర్.కె. చారి (రిటైర్డు మేజర్) సలహాలు, సూచనలిస్తున్నారు.

మాజీ సైనికులెంతమందో వివిధ ఉద్యోగాలలోను, వృత్తి-వ్యాపారాలలో పునరావాసం పొందుతున్నారు. వారిలో కొందరి గురించి క్లుప్తంగా పరిచయం చేస్తున్నాను.

## కెప్టెన్ కె.జి. ప్రకాశం

వీరు ఎక్స్-సర్వీసెస్ లీగ్‌లో ముఖ్యపాత్ర వహించి, మాజీ సైనికులను, వారి కుటుంబాలను యీ గొడుగు క్రిందకు తీసికొని వచ్చారు. అంతేగాకుండా ఎందరికో పెన్షన్ల మంజూరులో యిబ్బందులు తొలగించి వారికి అవి అందేందుకు విశేషంగా శ్రమించారు. వారు

జీవితాంతం మాజీ సైనికుల సమస్యలపై పనిచేసి, యీ ప్రాంత ప్రజలకు గుర్తుండిపోయారు.

## డా॥ అట్లూరి గోపాలకృష్ణమూర్తి

1943లో వైద్యవిద్య పూర్తికాగానే మిలటరీ షార్టు ఎమర్జన్సీ కమీషన్‌లో ప్రవేశించారు. 1947 వరకు మెడికల్ యూనిట్‌లో వైద్య సేవలను అందించారు. రెండవప్రపంచ యుద్ధంలో కలకత్తా, చిట్టకాంగ్, రంగూన్, బర్మాలలో పనిచేశారు. ఆ తరువాత మంగళగిరిలో ఎన్నో దశాబ్దాలు వైద్యసేవలు అందించారు. ప్రస్తుతం విశ్రాంతిగా గడుపుచున్నారు.

## మేజర్ చారి

మేజర్ హోదాలో రిటైరయిన శ్రీ వి.ఆర్.కె. చారి, 8 సం॥లపాటు జిల్లా సైనిక సంక్షేమాధికారిగా మాజీ సైనికులకు విస్తృతమైన సేవలందించారు.



స్వతహాగా సేవారంగంపై మక్కువగల మేజర్ చారి, పట్టణ ఆఫీసర్సు క్లబ్‌లో ముఖ్యపాత్ర వహించి ఓ.యన్.జి.సి. వారి సహకారంతో పెద్దకొనేరును పున రుద్ధరించే ప్రయత్నం చేశారు. పుష్కరాల సందర్భంగా మంగళగిరిని దర్శించిన యాత్రికులకు ప్రాథమిక సౌకర్యాలు స్వయంగా కల్పించి అధికారుల, ప్రజల మన్ననలు పొందారు.

శ్రీ పణిదపు లక్ష్మయ్య ఎక్స్-సర్వీసెస్ లీగ్‌లో ముఖ్యపాత్రను వహిస్తుందుటేకాక, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్సు విషయంలో సేవలకు కొనసాగిస్తున్నారు. మున్సిపల్ కౌన్సిలర్‌గాను ప్రజలకు సేవలందించారు.

అలాగే శ్రీ బి. భాస్కరరావు రైల్వే శాఖలో పునరావాసం పొంది, పదవీకాలం పూర్తిచేశారు. సమాజంలో ఎక్కడ ఎవరు సహాయం అడిగినా వీరు కాదనరు. ❋

# సామాజిక సేవ

మంగళగిరి పుణ్యక్షేత్రంలో 'మాధవ' సేవకే కాకుండా 'మానవ' సేవకు కూడ తమ జీవితాలను అంకితంచేసి తరించిన ధన్యజీవులెందరో వున్నారు. అటువంటి వారిలో నిరతాన్నదాత్రి బాలాంబగారు, కారుమంచి వెంకటసుబ్బయ్యగారు, సంధ్యాల నరసింహా చార్యులు, కళావంతురాలు జానకమ్మ మొ॥వారు చరిత్ర పుటల్లో తమ పేర్లను సువర్ణాక్షరాలతో లిఖించుకున్నారు.

మంగళగిరి అభివృద్ధికి ఎందరో మహానుభావులు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను సేవలందించి వితరణ శీలులుగా భాసిల్లుతున్నారు. కాలక్రమేణా ప్రజలకు మనస్ఫూర్తిగా సేవలందించేవారు కరవవుతున్నారు. గతంలో యిక్కడ దాతలు నిర్మించిన ధర్మసత్రాలు మొ॥ ఆస్తులను కొందరు వ్యక్తులు సొంత ఆస్తులుగా మలచుకుంటున్నారు. ఇలాంటి పరిణామాలతో దాతృత్వ గుణమున్న వారు సైతం నిరాశతో ప్రజాసేవకు ముందుకురాని పరిస్థితులు నెలకొంటున్నాయి.

కొందరు వ్యక్తులు, కొన్ని సంస్థల వారు అడపాతడపా తమ పరిధిలో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. సామాజిక సేవకు ముందుకు వస్తున్న వారిని అనుమానంగా చూడటం అలవాటుగా మారింది. ప్రజాసేవ పేరిట రాజకీయంగా పావులు కదపటం ప్రస్తుతం నడుస్తున్న చరిత్ర. ఈ నేపథ్యంలో ఆత్మ తృప్తి కోసం సామాజిక సేవకు ముందుకు వస్తున్న వారిని ప్రజలు ప్రోత్సహించవలసిన అవసరం వుంది. ఈ సందర్భంలో కొందరి సేవలను మననం చేసుకుందాం.

వివిధ సేవా కార్యక్రమాల పేరున విరాళాలు వసూలు చేయటం జరుగుతూ వస్తోంది. కొన్ని సందర్భాలలో ఆ వసూళ్లు దుర్వినియోగమై దాతల మనస్సు చివుక్కు మంటుంది. ఆ సొమ్ము సద్వినియోగమైతే ఆ దాతలకు అలౌకికమైన ఆనందం కలిగి మరిన్ని కార్యక్రమాలకు చేయూతనిస్తారు. ఇలాంటి సందర్భాలు రెంటిని యిక్కడ ఉదహరిస్తాను.

శ్రీ దామర్ల రమాకాంతరావు వీవర్సు కాలనీలో బలహీన వర్గాల ప్రజల యిండ్లు 100 వున్నాయి. అక్కడి ప్రాథమికోన్నత పాఠశాలకు సరైన వసతులు లేక విద్యార్థులు అసౌకర్యాలకు గురవుతుండేవారు. ఏడు తరగతి గదులు నిర్మించే బృహత్తర కార్యాన్ని 1980వ సం॥లో మంగళగిరి చేనేత సహకార సంఘ అప్పటి అధ్యక్షులు శ్రీ నీలి భద్రయ్య నిర్వహించారు. సుమారు రూ. 75 వేలు చందాల రూపంలో రాగా ఆ మొత్తాన్ని వెచ్చించి పక్కా భవనాలను

నిర్మించారు. ఈ కార్యక్రమం పూర్తికాగానే శ్రీ భద్రయ్య ఆ భవన ఫొటో, దాతల పేర్లతోపాటు పూర్తి ఖర్చుల వివరాలతో కూడిన కరపత్రాన్ని ప్రచురించి ప్రజలకు పంచారు. దానితో ఆ కార్యక్రమం పూర్తి పారదర్శకత సంతరించుకుంది.

అలాగే మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి వేలాది రూపాయల విలువైన తన భార్య బంగారు నగలను సింహాలవేడ (నంద్యాల) నరసింహాచార్యులుగారు సమర్పించారు. వారు యీ దేవాలయ ట్రస్టీగా బాధ్యతలు వహించినపుడు దేవాల ఆదాయంగా వచ్చే ధాన్యాన్ని నిలువచేసే కొట్లు దేవస్థానంకు నిర్మింపచేసారు. ఆనాడు చేసిన ఆ నిర్మాణపు ఖర్చులు పైసలతో సహా వారు వ్రాసి భద్రం చేశారు. అవి యీనాటికీ వారి వారసుల వద్ద వున్నాయి. ప్రస్తుతం యీ తరహా అంకితభావం వున్న వ్యక్తులకోసం సెర్చిలైట్లు వేసి వెదకవలసి రావటం నిజంగా బాధాకరం.

## శ్రీ కారుమంచి వెంకటసుబ్బయ్య



శ్రీ కారుమంచి వెంకట సుబ్బయ్యగారు కృష్ణాయపాలెం వ్యవసాయ కుటుంబానికి చెందినవారు. వీధి బడివరకే చదివారు. ఆయన పొలాలను కొలుచుటలోను, సర్వే చేయుటలోను దిట్ట. ఎవరిదన్నా పొలం కొలిస్తే పేచీ అనేది వచ్చేదికాదట. అలా కొలతలు చేసినపుడు డబ్బులు యిస్తే వాటిని ఆ వూళ్ళలోని గ్రంథాలయాల వంటి ప్రజాహిత కార్యక్రమాలకు చందాగా అక్కడ యిచ్చివేశేవారట.ఆయనకు మొదటి నుండి సాంఘిక సేవ అంటే మక్కువ. ఎరువులు, ట్రాన్స్‌పోర్టు, బొగ్గు వ్యాపారం చేసేవారు. ఈయన ట్రంకురోడ్డు పైన చినకాకాని, నంబూరుల దగ్గర ఆర్‌సిసి శ్లాబులో బస్ షెల్టర్లు, వాటి ప్రక్కనే బావులు ఏర్పాటు చేశారు.

ఆయన మంగళగిరి సమితి ప్రెసిడెంటుగా 1958-61 సం॥లో పదవి నిర్వహించే రోజులలో తన పరిధిలోని గ్రామాలలో ఓ బావి గాని, స్కూలు గాని ఏదో ఒకటి తన పేరున ఏర్పరిచారు. తాను ఆయాగ్రామాలకు వెళ్ళినపుడు ప్రజలు ఏవైనా సమస్యలు చెబితే - ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా స్వంత సొమ్ముతో ఆ అవసరాలు వెంటనే తీర్చేవారు.

ఏదన్నా నిర్మాణం ప్రజలకోసం  చేస్తున్నామని ఎవరన్నా వస్తే చాలు-5 పుట్లసున్నం, 5 వందల రూపాయల నగదు యిచ్చేవారు. అలా చాలా సంస్థలకు నిర్మాణం నిమిత్తం విశేషంగా సహాయం చేశారు. దేవస్థాన కళ్యాణం జరిగే స్థలం ప్రక్కగా స్వంత ఖర్చుతో ఓపెన్ ఆడిటోరియాన్ని నిర్మిం చారు. దానిని కారుమంచి వెంకట సుబ్బయ్య ఓపెన్ ఆడిటోరియం అంటారు. నవులూరు రైల్వే గేటు ప్రక్కన తన స్వంత ఖర్చు రూ. 20,000/- తో పశువుల ఆస్పత్రిని, డాక్టరు నివాసగృహాన్ని 1951లో కట్టించారు. డాన్‌బోస్కో స్కూలు వారికి 3 యకరాల స్థలానికి మూడువైపుల ప్రహరీగోడ కట్టించి, లోపలి ప్రక్క బావి త్రవ్వించి రిజిస్ట్రేషన్ ఖర్చులు కూడా భరించి దానంగా యిచ్చారు.

ఆయన కేవలం కళాభిమానే కాదు, కళాపోషకులు కూడా! ఎక్కడ నాటకాలు ప్రదర్శించబడినా టిక్కెట్ కొని మాత్రమే వెళ్లేవారు. అప్పటి విజయలక్ష్మి టాకీస్ (ప్రస్తుత అన్నపూర్ణ థియేటర్)లో నాగభూషణం “రక్తకన్నీరు” ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శనకు ఆయన వెళ్ళగా కాంట్రాక్టరు చెల్లించాల్సిన 4 వేల రూపాయలు చెల్లించలేదని తెలిసింది. వెంకటసుబ్బయ్య గారు నాటకం తర్వాత తాను ఆ డబ్బు ఇస్తానని హామీ యిచ్చి ఆ ప్రదర్శన పూర్తి చేయించారు. ఆ ప్రకారంగానే నాగభూషణం గారిని ఆయన యింటికి ఆ అర్ధరాత్రి తీసికొని వెళ్ళి డబ్బు చెల్లించారు. సుబ్బయ్య గారి విశాలహృదయానికి ముగ్ధుడై యీసారి మీరు మంగళగిరిలో ఏర్పాటు చేస్తే ఉచితంగా రక్తకన్నీరు నాటకం ఆడతానని నాగభూషణం మాట యిచ్చారట. ఆయన తర్వాత దానాల విషయంలో అంత విశాల హృదయం చూపినవారు ఎవరూ లేదు. మంగళగిరి చరిత్రలో గొప్ప సేవకులుగా ఆయన నిలిచి పోయారు.

## వితరణశీలి జానకమ్మ

పూర్వం దేవాలయాలలో ప్రాతః సంధ్యాకాలల్లో జరిగే పూజా సమయంలో దేవుని ఎదుట ‘కుంభ హారతి పట్టి నృత్యగానాదులతో అలరింపజేసేందుకు భోగం వారనబడే స్త్రీలుండే వారు. దేవస్థానం వారు వారికి మాన్యపు భూములనిచ్చేవారు. ఆ వ్యవస్థలో భాగంగా మంగళగిరి శ్రీ నరసింహస్వామి దేవాలయంలో పాతరోజులలో జానకమ్మ అనే కళావంతురాలు వుండేవారట. దేవుని సేవతోపాటు  ఆవిడ ప్రజోపయోగమైన ఎన్నో కార్యక్రమాలు చేశారని నూతలపాటి అప్పారావు గారి జ్ఞాపకాల నుండి తెలియవచ్చింది. ప్రస్తుతం చింతక్రింది కనకయ్య గరల్స్ హైస్కూల్ ఉన్న పాత లోకల్ ఫండ్ సత్రాన్ని, పాతమంగళగిరిలో ఒక సత్రాన్ని కట్టించారట. ప్రస్తుత పాత బస్‌స్టాండ్ లోని బావి ఆవిడ త్రవ్వించారు.  పల్లెల నుండి బండ్ల మీద వచ్చే వారు అక్కడ చెట్ల నీడన బండి ఆపి ఆ బావి నీళ్ళతో సేద తీర్చుకునేవారట. అలాగే పెద్దకోనేరు ప్రాంతంలో శ్రీ పచ్చళ్ళ సుబ్రమణ్యం గారి ఇంటి ఎదురుగా ఉండే బావి కూడా ఆమె త్రవ్వించారట

నిరతాన్నదాత్రి కైవారం బాలాంబ

బాలాంబగారు యిక్కడ నిర్వహించిన అన్నదానము మహావైభవము, అపూర్వము. సుమారు 50 సంవత్సరాల పాటు నిరాటంకముగా నిత్యాన్నదానము జరిగినది. దేశం నలుమూలల నుండి యీ పుణ్యక్షేత్రానికి ఆ కాలంలో వచ్చిన వారు నరసింహస్వామిని దర్శించి, బాలాంబ అన్న సత్రములో తృప్తిగా భోజనము చేసి వెళ్ళేవారు.

బాలంబ నృసింహోపాసకురాలు, తపస్వి, ఆమె 1850 దశకంలో అంగలకుదురు గ్రామములో దేవులపల్లి సుబ్బన్న, వెంకమాంబలకు జన్మించినది. ఆమె భర్త కైవారం సుబ్బన్న.



వివాహమైన కొద్ది కాలానికే ఆమె భర్త మరణించగా, నృసింహస్వామి భక్తురాలుగా మారినది. కొండపైన మూడు సంవత్సరాలు ప్రాణాలను లెక్కచేయకుండా, తపస్సు చేసినప్పుడు నృశింహస్వామి ఒక బాలుని రూపంలో వచ్చి అన్నదానం చేయమని చెప్పగా - కుల, మత ప్రసక్తి లేకుండా అన్ని వేళల్లోను ఎవరు వచ్చి అన్నమడిగినా పెట్టుట మొదలు పెట్టారని చెబుతుంటారు. బాలాంబ గారికి చుట్టు ప్రక్కల గ్రామాలలోని ప్రజలు స్వచ్ఛంధంగా బియ్యం, కూరగాయలు ఎద్దుల బండ్లలో వేసికొని తీసికొని వచ్చేవారు. అప్పట్లో ప్రజలకు భక్తి, విశ్వాసాలు మెండుగా వుండేవి. తాము యిచ్చిన సరుకులు సద్వినియోగపడటం వల్ల వారికి చాలా తృప్తిగా వుండేది. ఆమె చేసే మంచి పనిని చూచి ఓర్వలేని వారు కొందరు అబాండాలు మోపి చివరకి కొండపైకి వెళ్ళి దైవాన్ని దర్శించే వీలు కూడ లేకుండా కట్టడి చేసేసరికి, మనసు విరిగి ఒక రోజురాత్రిపూట పెద్దకోనేరులో దూకి ఆత్మహత్యా ప్రయత్నం చేయుటం జరిగింది. అయితే ఉదయానికి ఆమె కొనేరులోని ఆంజనేయస్వామి గుడి వద్ద సజీవురాలిగానే పడి వుంది.

జగద్గురువులు నృసింహ భారతీస్వాములు మంగళగిరికి రాగా, ఆయనను సందర్శించిన బాలాంబను గౌరవించి ఆయన ఆమె భక్తి గురించి కీర్తించగా ఆమెను అప్రదిష్టపాలు చేయాలనే తలంపుతో వున్నవారందరు ఆమె గొప్పతనాన్ని గుర్తించారు. ఆమె అన్నదానాన్ని ప్రారంభించి సుమారు 50 సంవత్సరాలపాటు నిర్విఘ్నంగా కొనసాగించింది. ఈమె మల్లాది సుబ్బదాసు గారి శిష్యురాలు. సుబ్బదాసు గారు గాలిగోపురం పైన కలశాలను ప్రతిష్టించిరి.

బాలాంబ గారు సుమారు 90 సంవత్సరాలు జీవించి 12-8-1944న మరణించినారు. ఆమె “నిరతాన్న దాత్రి”గా శాశ్వత కీర్తి పొందారు. రాష్ట్రమంతటా కీర్తి ప్రతిష్టలు విస్తరించిన శ్రీ బాలాంబ మంగళగిరి కీర్తి కిరీటంలో ఒక కలికితురాయి.

**బాలాంబ సత్రం**

బాలాంబ గారు మంగళగిరి అన్నపూర్ణ సత్రం ట్రస్ట్ పేరున 12-1-1926న స్థలం కొన్నారు. పెద్ద కోనేరు పడమర ప్రక్కన యిప్పటికీ ఆమె గుర్తుగా బాలాంబ సత్రము ఉన్నది. ఆమె అనంతరము ఆమె వారసులు అప్పులపాలై ఆస్తులు పోగా, ట్రస్టు పేరున రిజిస్టరు కాబడిన 0సత్రము పెదకోనేటి వీధి డో.నెం. 1-1406-ఏ, మున్సిపల్ ఎసెస్‌మెంట్ నెం. 2432గా నుండి మున్సిపల్ పన్ను రాయతీలు పొందుతూ మిగిలి వున్నది.

## హిమోఫీలియా సొసైటి

హిమోఫిలియో వ్యాధి అనేది రక్తం గడ్డకట్టటంలో వచ్చే యిబ్బందులు.
దీనిలో ఒక రకమైన వ్యాధి ప్రతి పది వేల మంది మగపిల్లలలో ఒక్కరికి, రెండవ రకం ప్రతి 40 వేల మందిలో ఒకరికి వస్తుంది. దీనికి శాశ్వత నివారణ లేదు, కాని తాత్కాలిక పరిష్కారం ఉంది. ఈ వైద్యం చాలా ఖర్చుతో కూడినది. సగటున 20 వేల రూపాయల నుండి ఒక లక్ష వరకు కూడా ఖర్చు అవుతుంది. హిమోఫిలియా సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ. ఇది జాతీయ, అంతర్జాతీయ హీమోఫీలియా ఫెడరేషన్లకు అనుబంధ సంస్థ.
దీనిని విజయవాడ ఛాప్టరు 1993లో స్థాపించబడి, రిజిష్టరు ఆఫీసు మంగళగిరిలో ఏర్పాటు చేయబడింది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నల్గొండ, ఖమ్మం, ఉభయ గోదావరి జిల్లాలలోని సుమారు 300 మంది హీమోఫిలియా రోగులకు వీరు ఉచిత సేవలు చేస్తున్నారు.
రక్తస్రావం ఆపేందుకు అత్యవసరంగా చేయవలసిన ఇంజక్షన్ ఖరీదు సుమారు 2 నుండి 4 వేల ఖరీదు ఉంటుంది. ఈ వ్యాధి నిర్ధారణకు ఖర్చు సుమారు 900 రూ॥ అవుతుంది. అంతర్జాతీయ, జాతీయ ఫెడరేషన్‌ల సహాయంతో పేదలకు ఉచితంగాను, సబ్సిడీ ధరలకు ఈ

సొసైటీ అందించటం చేస్తున్నది.

1993లో 7గురు రోగులకు సేవచేయటంతో మొదలై యీ నాటికి సుమారు 300 మందికి సేవ చేసే స్థాయికి ఎదిగిన ఈ సంస్థ రోగుల వ్యాయామం కొరకు 30 వేల రూ॥ల ఖర్చుతో ఫిజియోథెరపీ రూం, 50,000 రూ॥ ఖర్చుతో రోగ నిర్ధారణకు లేబరేటరీ ఏర్పరిచారు. ఈ సంస్థకు కార్యదర్శిగా స్థానిక ఆర్థోపెడిక్ డా॥ మాగంటి ప్రసాదు ఉంటున్నారు. విజయవాడకు చెందిన డా॥ ఆర్. వెంకటేశ్వరరావు గారు అధ్యక్షులు గాను, శ్రీ జె. విశ్వనాథరావు కోశాధికారిగాను సేవచేస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్‌లో 5 ఛాప్టర్లు నెలకొల్పబడగా విజయవాడ ఛాప్టరు ఎంతో ఉత్సాహంగా డా॥ మాంగంటి ప్రసాద్ నేతృత్వంలో విజయవంతంగా సేవలందిస్తున్నది. గత 10 సం॥లుగా సుమారు 1000 మంది ఫోలియో ఉన్న విద్యార్థులకు మంగళగిరి డాన్‌బాస్కో సంస్థ సహకారంతో ఆపరేషన్ల్ ఉచితంగా చేశారు. ఎన్నో దశాబ్దాలుగా ఎముకల శస్త్ర వైద్యులుగా సేవలందిస్తున్న డా॥ మాగంటి ప్రసాద్‌గారి నేతృత్వంలో హిమోఫీలియా రోగుల సేవలకు మంగళగిరి కేంద్రమై వైద్యరంగంలో మంగళగిరి పేరు రాష్ట్ర స్థాయిలో వెలుగొందుతోంది..

## కొమ్మారెడ్డి సేవా సమితి

పట్టణంలోని కొమ్మారెడ్డి సేవా సమితి విలక్షణ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నాని స్వీట్స్ అధినేత శ్రీ కొమ్మారెడ్డి నాని యీ సంస్థకు ముఖ్య కార్యనిర్వహాకులుగా వ్యవహరిస్తున్నారు. పట్టణ పరిధిలోని స్మశాన వాటికల దుస్థితికి వీరు స్పందించారు. స్మశానాలను రక్షిత ప్రదేశా లుగా తీర్చిదిద్ది, కనీస సౌకర్యా లను మెరుగుపరుస్తున్నారు. స్మశానాల వద్ద బోర్లు వేయించారు. ప్రహరీ గోడ లను నిర్మించి ఆక్రమణలకు శాశ్వతంగా తెరదించారు. వీటిలో చెప్పుకోదగినవి వీవర్సు కాలనీ, పాత మంగళగిరి స్మశానవాటికలు.




పట్టణ, పరిసర ప్రాంతాలలో సుమారు 10 బోర్లు వేయించి త్రాగునీటి వసతి కల్పించారు. కొమ్మారెడ్డి సేవా సమితి ఒక "అంబులెన్సు"ను ఏర్పాటు చేసింది. సకాలంలో స్పందించి క్షతగాత్రుల ప్రాణాలు నిలిచేందుకు దోహదపడుతోంది. వికలాంగులైన విద్యార్థినీ, విద్యార్థులకు, పేదలకు మూడు చక్రాల వాహనాలు ఉచితంగా అందించి, వారి విద్య, వృత్తులు కొనసాగించేందుకు కూడా దోహదపడుచున్నారు. పట్టణానికి చుట్టు ప్రక్కల వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో అనాథ

బాల బాలికల సంరక్షణ కోసం వివిధ శరణాలయాలు పనిచేస్తున్నాయి. వాటిలో శ్రీకృష్ణ ఆనంద ఆశ్రమము, మిషన్ ఆప్ జాయ్ అనాధ బాలల ఆశ్రమము, గుడ్‌షెఫర్డ్ సిస్టర్సు అనాధ బాలికల కేంద్రం, డాన్ బాస్కో ప్రేమ్ నివాస్, చెప్పుకోదగినవి కొన్ని.

**వృద్ధాశ్రమాలు :** నులకపేట వద్ద మాతా చైతన్య జీ ఆశ్రమంలోను, చార్వాక కేంద్రంలోను, కాజ వద్ద "వాత్సల్య వృద్ధాశ్రమాలు యీ ప్రాంతంలో నడుపబడుచున్నాయి.

## డాన్ బాస్కో ప్రేమ్ నివాస్ :

మంగళగిరి నుండి విజయవాడ వైపున రైల్ ఓవర్ బ్రిడ్జి చివరన ఈ సేవా సంస్థ నెలకొని వుంది. ఈ సంస్థ పూరి పేరు 'డాన్ బాస్కో ప్రేమ నివాస్". హైదరాబాద్ కేంద్రంగా వున్న "సెల్సియన్స్ ఆఫ్ డాన్ బాస్కో" అనే సంస్థ ఆధ్వర్యంలో యీ కేంద్రంలో 1976 నుండి అనాధలు, అంగవికలురైన పిల్లలకు ఆదరణ, ప్రేమ పంచబడుతున్నాయి.



ఫాదర్ చిన్నప్ప యీ ''ప్రేమ గృహా''నికి పునాదులు వేశారు. ఈ 28 సం॥లలో ఎందరో దాతల హృదయ స్పందనల వలన యీనాటికి సుమారు 15 ఎకరాల విశాల ప్రాంగణంలో ఒకటి నుండి 10 వరకు పాఠశాల, ఫిజియోథెరఫీ కేంద్రం, కృత్తిమ పాదాల తయారీ కేంద్రం, సంగీత సాధన కేంద్రం ఉన్నాయి. ఇక్కడి పాఠశాలలో సుమారు 750 మంది విద్యారులుండగా, ప్రస్తుతం 86 మంది అనాధ అంగవికలురైన పిల్లలకు ఆశ్రయం కల్పించబడింది. సంవత్సరానికి సుమారు 10 లక్షల బడ్జెట్‌గల యీ ప్రేమ నివాస్‌కు ప్రస్తుతం ఫాదర్ బాలరాజ్ డైరక్టరుగాను, ఫాదర్ జయపాల్ అసిస్టెంటు డైరక్టరుగాను నడిపిస్తున్నారు ఎన్నో సేవా సంస్థలు, సేవా తత్పరులు, ఎన్నో రంగాలలో యీ పట్టణంలో సేవలందించారు. అందిస్తూనే వున్నారు. స్థల భావంలో వారందరి సేవలు ప్రత్యేకంగా యిక్కడ ప్రస్తావించటంలేదు.

### మథర్ థెరిసా సందర్శన

విశ్వ ప్రేమమయి మదర్ థెరిసా 1982 డిశంబరు నెలలో నోబెల్ బహుమతి స్వీకరించారు. ఆ వెంటనే మంగళగిరిలోని డాన్‌బాస్కో ప్రేమ్ నివాస్‌ను ఆమె సందర్శించి అక్కడి పిల్లలకు ప్రేమానురాగాలను పంచారు. మదర్ థెరిసా పాదధూళి సోకిన ప్రేమ్ నివాస్ ఆనాటి నుండి మరింతగా వెలుగులు విరజిమ్ముతూ, సేవారంగంలో ధృవతారగా వెలుగొందుతోంది. ✵

# క్రీడలు

మంగళగిరి గ్రామస్థాయిలో వున్నప్పుడు క్రీడారంగంలో వైభవాన్ని చవిచూసింది. 'బాల్ బ్యాడ్మింటన్' క్రీడలో జాతీయస్థాయి కీర్తి ప్రతిష్ఠలు పొందిన, యీ వూరిలో వందలాది క్రీడాకారులు, వేలాది అభిమానులు వుండేవారు. బాల్ బాడ్మింటన్ తరువాత బేస్‌బాల్, వాలీబాల్, కబాడి మొ॥ ఆటలకు ప్రాధాన్యత వుండేది. ఈ ప్రాంతంలో వందలాది మంది యువకులు క్రికెట్, వాలీబాల్ మొ॥ క్రీడలు ఆడుతున్నారు. స్థలాభావం వల్ల ఈ విషయాలను క్లుప్తంగా యివ్వటం జరిగింది.

గ్రామ స్థాయి నుండి పట్టణానికి ఎదిగిన మంగళగిరిలో సరైన ఆటస్థలాలు దాదాపు లేవనే చెప్పాలి. పట్టణ పురపాలక సంఘం క్రీడారంగం అభివృద్ధికి పాటుపడటంలేదు. చింతక్రింది కనకయ్య విద్యాసంస్థలకు ఎర్రచెరువు ప్రాంతంలో క్రీడాస్థలం వున్నది. దానిని గత సంవత్సరం నుండి మాత్రమే అభివృద్ధి చేయటం ప్రారంభించారు. నిర్మల హైస్కూలుకు ఎంతో విశాలమైన క్రీడాస్థలం వుంది.

## బాల్‌బ్యాడ్మింటన్

1930 ప్రాంతాల్లో "మార్కండేయ యంగ్ మెన్స్ అసోసియేషన్" 400 మంది సభ్యులతో వుండేది. దానిని శ్రీ దామర్ల మార్కండేయులు, శ్రీ దామర్ల రోశిమరావు నిర్వహించేవారు. చింతక్రింది కనకయ్య, మున్సబు అంజయ్య, ఆరాధ్య డాక్టరుగారలు యితోధికంగా పోషిస్తుండేవారు. ఆ సంస్థ సభ్యులు "బాల్ బాడ్మింటన్" ఆటను మొదట్లో నిడుముక్కల ఆదిశేషుగారి సినిమాహాలు స్థలంలోను, ఆ తరువాత కాంగ్రెస్ గ్రౌండ్, గుడి ప్రక్కన, కొండమెట్ల ప్రక్కన ఆడుతుండేవారు. ప్రస్తుతం క్రికెట్‌కు గల మోజు ఆ కాలంలో బాల్‌బ్యాట్మింటన్ యిక్కడుండేది. చిన్నా పెద్దా వయో భేదం లేకుండా దానిని ఆడుతుండేవారు. గుంటూరు జిల్లాలో యీ ఆటకు మంగళగిరి కేంద్ర బిందువుగా వుండేది.

ఆనాటి బాల్ బాడ్మింటన్ ఆటగాళ్లలో శ్రీయుతులు దామర్ల భావనారాయణ, జంజనం ప్రకాశరావు, యనమదల వెంకట్లు, దామర్ల రోశిమరావు, దామర్ల మార్కండేయులు, దామర్ల పెదకనకం, చిన్న కనకం, వుడతా ధర్మయ్య, వుడతా వీరాస్వామి, వుడతా వెంకట కృష్ణారావు, ప్రగడ ఆది సత్యనారాయణ, ప్రగడ ప్రభాకరరావు, వుడతా రాధాకృష్ణమూర్తి, ఉద్దంటి ఏసు, మున్సబు సుబ్బారావు, కొలనుకొండ శాస్త్రి సోదరులు, చంద్రాచారి, తాతగారు, ఉద్దంటి జాను, యనమదల పెదబసవయ్య, చిన బసవయ్య, అవ్వారు

చలపతిరావు, చింతక్రింది వరదయ్య, దామర్ల కోటేశ్వరరావు, దామర్ల వీరాంజనేయులు, వరిమి భానుమూర్తి, బిట్రా సూర్యనారాయణ, వాశిరెడ్డి సుబ్బారావు, దామర్ల ఉమామహేశ్వరరావు, మొగలిచర్ల శివయ్య చెప్పుకోతగ్గ కొందరు.

1953-60ల మధ్య మంగళగిరి విద్యార్థులు వరుసగా ఏడుసార్లు ఈ ఆటలో జిల్లా ఛాంపియన్ షిప్‌ను గెలుచుకున్నారు. క్రొత్త తరంలో శ్రీ పోతన హనుమంతరావు జాతీయస్థాయికి ఎదిగి, రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు.

## టెన్నిస్

మంగళగిరి పార్కు రోడ్డులో రైలుపట్టాల వద్ద పారేపల్లి వారి తోట వుండేది. ఆ తోటలో వారి కుటుంబం తరఫున "టెన్నిసు కోర్టు" వుండేది. శ్రీ పారేపల్లి జనార్ధనరావు, శ్రీ పారేపల్లి నాగేంద్రరావు వారి కాలంలో టెన్నిస్ ఆటలో నిష్ణాతులు.

కిష్టా సిమెంటు కంపెనీ అధికారులుగా వుండే ఆంగ్లేయులు దొరలు యిక్కడకు వచ్చి పారేపల్లి వారి టెన్నిస్ కోర్టులో ఆడేవారు.

## షటిల్ బాడ్మింటన్

ఈ ఆటలో పట్టణానికి చెందిన చాల తక్కువ మంది మాత్రమే ప్రావీణ్యత సాధించారు. శ్రీ అన్నే ప్రభాకరరావు, శ్రీ అన్నే మధుసూదనరావు వారిలో కొందరు. శ్రీ మధుసూదనరావు స్పోర్ట్సు కోటాలో ఉద్యోగం పొంది ప్రస్తుతం సెంట్రల్ ఎక్సైజు అసిస్టెంటు కమీషనర్ హోదాలో వున్నారు..

## వస్తాదులు, వెయిట్ లిఫ్టర్లు

పాతకాలంలో శ్రీ వాసా అంజయ్య, శ్రీ అల్లీ బేగ్ ఇక్కడ పేరున్న వస్తాదులు. చాలా మంది వస్తాదుల్ని శ్రీ చెక్కా చెన్నయ్య, శ్రీ కాళంగి వెంకటరత్నం పోషించేవారట. 1954 ప్రాంతంలో శ్రీ బాబు పహిల్వాన్ వుండేవారు. ఆ తరువాతి కాలంలో పేరొందిన శ్రీ షేక్ గౌస్ రైల్వే ఉద్యోగి. వీరు 1967 నుండి 1975 వరకు పార్కు రోడ్‌లో వ్యాయామశాల నిర్వహించి కుస్తీలు, బరువుల్ని ఎత్తటం, బాడి బిల్డింగు నేర్పించి ఎందరో యువకుల్ని తయారుచేశారు.

ఆ తరువాత 1983-84లలో శ్రీ శేషగిరిరావు మాస్టారు, శ్రీ గుమ్మడి పుల్లేశ్వరరావులు యీ రంగాన్ని అభివృద్ధి చేశారు. శ్రీ వెంకట రమణ, శ్రీ షేక్ సంధానిలు ఈ రంగంలో కృషిచేస్తున్నారు.

## శ్రీ దామర్ల భావనారాయణ

మంగళగిరి గత వైభవ చిహ్నాలలో "బాల్ బాడ్మింటన్" ఆట కూడ ఒకటి. 1930 సం॥ నుండి ఒక అర్ధ శతాబ్దం పాటు యిక్కడ వెలుగొందిన యీ ఆట, మంగళగిరికి ఒక జాతీయ ఛాంపియన్‌ను కానుకగా యిచ్చింది. ఆయనే శ్రీ దామర్ల భావనారాయణ. 1941లో తన 11వ ఏట బ్యాట్‌ను పట్టుకున్న శ్రీ భావనారాయణ వెనక్కి తిరిగి చూడలేదు. ఏకంగా 10సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించారు.



1955, 1959, 1960, 1961, 1962, 1965 నుండి 1970 వరకు 6 సంవత్స రాలు వరుసగాను, 1972, 1973, 1974, 1975 జరిగిన జాతీయ పోటీల్లో "ఆంధ్ర టీమ్"ను గెలిపించిన ఘనత వీరిది.

శ్రీ దామర్ల భావనారాయణ జూనియర్ ఆటగానిగ దాదాపు 14 యేళ్ళు రాణించి సుమారు 400 టోర్నమెంట్లలలో పాల్గొన్నారు. సీనియర్ ఆటగానిగా 1958 నుండి సుమారు 100 టోర్నమెంట్లు ఆడారు. వీరు "రైట్ బ్యాక్" (కుడివెనుక) స్థానంలో ఆడేవారు. 1975లో ఆఖరి నేషనల్స్ ఆడి ఆట నుండి విరమించుకున్నారు.

క్రీడాకారుల కోటాలో ఆర్టీసిలో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. వీరు ప్రస్తుతం చీరాలలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నారు.

## శ్రీ పోతన హనుమంతరావు



మంగళగిరి చింతక్రింది కనకయ్య విద్యాసంస్థల విద్యార్థి శ్రీ పోతన హనమంతరావు స్పోర్ట్సు కోటాలో రైల్వేలో చేరారు. ప్రస్తుతం ముంబాయి రైల్వే డివిజనల్ ఆఫీసులో ఆఫీసు సూపరింటెండెంట్‌గా పదవీ బాధ్యతలు నెరవేరుస్తున్నారు. వీరు బాల్‌బ్యాడ్మింటన్ ఆటలో మంగళగిరి నుండి జాతీయ ఛాంపియన్‌గా నిలిచిన వారిలో రెండవ వారు.

1977లో ఆంధ్రా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు తరఫున జాతీయ

## కబాడి

మంగళగిరి 6వ స్పెషల్ పోలీస్ బెటాలియన్ ఆటగాళ్ళు 'కబడీ' ఆటలో రాష్ట్రస్థాయి గుర్తింపు పొందారు. ఎన్నో రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచారు.

## శ్రీ గుమ్మడి పుల్లేశ్వరరావు

మంగళగిరికి చెందిన శ్రీ గుమ్మడి పుల్లేశ్వరరావు చేనేత సేవా కేంద్రం (విజయవాడ)లో ఉద్యోగం చేస్తున్నారు. 1983-84 సం॥లో జిమ్‌ను యిక్కడ ప్రారంభించి సేవాభావంతో గత 20 సం॥లుగా వెయిట్ లిఫ్టింగు, పవర్ లిఫ్టింగు, బాడీ బిల్డింగ్‌లలో వందలాది మందికి శిక్షణ యిస్తున్నారు.

వీరు - 1986లో బాడీ బిల్డింగ్‌లో దక్షిణ భారత స్థాయిలో 4వ స్థానం సంపాదించారు. రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో 1978లో ద్వితీయస్థానం, 1987లో తృతీయ స్థానం పొందారు. ఎన్నో బహుమతులు, సన్మానాలు అందుకున్నారు..1993 సం॥ నుండి జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్‌కు ప్రెసిడెంటు/సెక్రటరీ హోదాల్లో కొనసాగుతున్నారు. అలాగే 1996 నుండి రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఉంటున్నారు. 1986, 1991, 1994, 2002 సం॥లలో జిల్లా స్థాయి బాడీ బిల్డింగు, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను మంగళగిరిలో నిర్వహించారు.

## జాతీయ వాలీబాల్ పోటీలు



2003 జాతీయ జూనియర్ వాలీబాల్ పోటీలకు మంగళగిరి మండలంలోని పెదవడ్లపూడి గ్రామం వేదికైంది. 2001 జనవరి 10న అప్పటి ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు పోటీలను ప్రారంభించారు. జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ పాతూరి నాగభూషణం చొరవతో జరిగిన ఈ పోటీలు మంగళగిరి ప్రాంతంలో క్రీడాస్ఫూర్తిని పెంచాయి.

ఛాంపియన్‌గా నిలిచారు. 1978లో ఆంధ్రాయూనివర్శిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించి, తమిళనాడులో జరిగిన అఖిలభారత అంతర్ విశ్వవిద్యాలయాల ఛాంపియన్ షిప్‌లో మొదటి స్థానం సంపాదించి పెట్టారు. 1980లో జాతీయ జట్టులో స్థానం సంపాదించారు. ఐదు సార్లు సింగపూర్, థాయిలాండ్, మలేషియా, జర్మని, నేపాల్, దుబాయి, షార్జాలలో ఆడారు. సింగపూర్‌లో ఆసియా ఫెడరేషన్ కప్ గెలిచారు.

ఇండియన్ రైల్వేటీములో నేషనల్స్ ఆడి 9 సార్లు గెలిచి రికార్డు సృష్టించారు. 1997 నుండి బాల్‌బాడ్మింటన్ జాతీయ ఫెడరేషన్ రిఫరీ బోర్డులో సభ్యునిగాను, ఇండియన్ రైల్వే రిఫరీగాను వుంటున్నారు. 1990లో నాన్-ఒలింపిక్ గేమ్సులో భారతదేశం తరపున పాల్గొని నాన్-ఒలింపిక్ గోల్డుమెడల్ గెలిచారు. 1998 నుండి పశ్చిమ రైల్వే బాల్‌బాడ్మింటన్ టీముకు "కోచ్"గాను, మహారాష్ట్ర సెలక్షన్ కమిటీ మెంబరు, చీఫ్ కోచ్ మరియు చీఫ్ రిఫరిగా సేవలందిస్తున్నారు. తానీస్థాయికి చేరేందుకు విజయవాడకు చెందిన సీతయ్య (తమ్మా శ్రీరామ శాస్త్రి) గారే మూలకారణం అని చెపుతారు. తాను ఎక్కడ ఆడినా "మంగళగిరి హనుమంతరావు" అని పిలుస్తారని ఎంతో గర్వంతో చెబుతుంటారు.

## అంతర్జాతీయస్థాయికి ఎదిగిన శ్రీ సంధాని

స్థానికులైన శ్రీ షేక్ సంధాని "పవర్ లిఫ్టింగు"లో కేవలం 5 సంవత్సరాలలోనే అంతర్జాతీయ స్థాయికి ఎదిగారు. స్థానికంగా వున్న 'మంగళగిరి యూత్ జిమ్ అండ్ ఫిట్‌నెస్ సెంటర్"లో



1999లో బాడీ బిల్డింగులో శిక్షణ పొందటం ప్రారంభించారు. బాడీ బిల్డింగు జిల్లాస్థాయి పోటీలో సుమారు 15 సార్లు గెలుపొందారు. గత నాలుగు సంవత్సరాలుగా జిల్లాస్థాయి ఛాంపియన్ షిప్ సాధిస్తున్నారు. 2004లో రాజస్థాన్‌లో జరిగిన బెంచ్ ప్రెస్ పవర్ లిఫ్టింగ్ జాతీయ పోటీలలో బంగారు పతకాన్ని సాధించారు. అనంతరం అదే సంవత్సరం 2004 ఆగస్టు నెలలో జంషెడ్‌పూర్‌లో జరిగిన 'ఏషియన్ బెంచ్ ప్రెస్ పవర్ లిఫ్టింగ్" పోటీలలో పాల్గొని రజిత పతకం గెలుచుకున్నారు.

శ్రీ సంధాని కొద్దికాలంలోనే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో ఛాంపియన్‌గా ఎదగటం వెనుక ఆయనకు శిక్షణనిస్తున్న జాతీయ వెయిట్ లిఫ్టర్ శ్రీ కె. విజయభాస్కర్ కృషి ఎంతైనా ఉంది. శ్రీ సంధాని భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి మంగళగిరి కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుమూలలా వ్యాప్తి చేస్తారనే ఆశాభావాన్ని స్థానిక క్రీడాకారులు వెలిబుచ్చుతున్నారు. ✵



కృష్ణాజలాల
వెబ్‌పేజ్
ప్రారంభిస్తున్న
శ్రీ ఉమ్మారెడ్డి



కృష్ణాజలాల
వెబ్‌పేజ్
పరిశీలిస్తున్న
శ్రీమతి కమల



గాలిగోపురం
మరమ్మత్తులపై
దేవాదాయ శాఖ
మంత్రితో
సమావేశం

ఘాట్ రోడ్
వెబ్‌పేజ్
ప్రారంభిస్తున్న
శ్రీ పాతూరి






టూరిజం
సెంటర్ పై
సెమినార్

కారుమంచి
వెంకటసుబ్బయ్య
కళావేదిక
పునరుద్ధరణ





## గ్రంథకర్త పరిచయం

| | |
|---|---|
| పేరు | : మాదిరాజు గోవర్ధనరావు |
| తల్లిదండ్రులు | : అనసూయమ్మ, వెంకటేశ్వరరావు గారలు |
| జననం | : మంగళగిరి, 50 ఏండ్ల క్రిందట |
| విద్యాబ్యాసం | : చింతక్రింది కనకయ్య హైస్కూలు, మంగళగిరి<br>కామర్స్ డిగ్రీ - గుంటూరు హిందూ కాలేజి<br>లా డిగ్రీ - సి.ఆర్. రెడ్డి లా కాలేజి, ఏలూరు |
| ఉద్యోగం | : విజయవాడ రైల్వే డివిజనల్ ఆఫీసు, 24 సం॥లుగా |
| భార్య | : సావిత్రి - ఉపాధ్యాయురాలు |
| పిల్లలు | : అబ్బాయి 'హర్ష' ఇంజనీరింగ్ గ్రాడ్యుయేటు<br>అమ్మాయి 'హరిత' ఇంటర్మీడియట్ కోర్సు |
| ఇష్టాలు | : పుస్తకాలు, స్నేహితులు |
| ఇతరములు | : 9ఏళ్ళు వినియోగదారుల ఉద్యమంలో కృషి<br>ప్రస్తుత స్థానిక అభివృద్ధి పనులలో పాల్గొనటం<br>ప్రజాప్రతినిధులతో సత్సంబందాలు నెరపటం |
| ధ్యేయం | : ప్రశాంత జీవనం, ఆత్మ తృప్తికై ప్రజా సంబంధాలు నెరపటం |